
వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 13 సంచిక : 6 హైదరాబాద్ 167 జూన్ 2015 పేజీలు : 68 రు. 20

- మోడీ ఏడాది పాలన - నాలుగు వ్యాసాలు
- తెరాస విధానాల దిశ చూపిన ప్లీనరీ
- ఆర్‌టిసి కార్మికుల సమ్మె అనుభవాలు
- మళ్లీ సాల్వాజుడుం, మరెంత విధ్వంసం?
- రీజెన్సీ సెరామిక్స్‌లో మేడే పోరాటం
- సాయిబాబాపై కొనసాగుతున్న నిర్బంధం
- బాల్టిమోర్ నల్లజాతి ధర్మాగ్రహం




పేజీలు: 748
వెల: రు. 300

కెవిఆర్
సామాజిక వ్యాసాలు

ప్రచురణ

కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ

డా. ఎస్. రామకృష్ణ
శాంతి నర్సింగ్‌హోమ్, నిర్మలా కాన్వెంట్ ఎదురుగా
పటమట, విజయవాడ - 520 010
ఫోన్ : 9849083137



పేజీలు: 192
వెల: రు. 150

సంకెళ్ల సవ్వడి
ఒక మావోయిస్టు ఖైదీ జైలు అనుభవాలు

అరుణ్ ఫరేరా

తెలుగు అనువాదం: ఎన్. వేణుగోపాల్

మలుపు ప్రచురణ
2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 09866559868

పై పుస్తకాల ప్రతులకు:
వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్ / ఫోన్ : 040-66843495 Email : veekshanam2003@gmail.com

ISSN 2231-6892

167

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జూన్ 2015
సంపుటి : 13
సంచిక : 6

ఎడిటోరియల్ కలెక్టివ్ : **బి.ఎస్. రాజు, ఎ. నర్సింహారెడ్డి, బి. రామకృష్ణ, ఎం. నర్సింహ, వై. భాస్కర్, కె. బాల్‌రెడ్డి, ఎ. రాజేంద్రబాబు, వై. రామచంద్రం, ఎన్. వేణుగోపాల్**

వ్యవస్థాపక సంపాదకులు:	సంపాదకులు:	కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్:	కంపోజింగ్:	సబ్ ఎడిటర్ :	ఆఫీస్ అసిస్టెంట్ :
వి. హనుమంతరావు	**ఎన్. వేణుగోపాల్**	**వై. రామచంద్రం**	**సి. రాజశేఖర్**	**ఎ. మల్లేశ్**	**ఎస్. వెంకటేష్**

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎస్.తిరుపతి; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్.

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; ప్రకాశం – కర్ణ హేమసుందర రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

‘వీక్షణం’ పేరిట ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై ‘veekshanam’ అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

పాఠకుల వీక్షణం

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2015 ఏప్రిల్ నెలలో వచ్చిన విరాళాలు - ఎ. రాజేంద్రబాబు, హైదరాబాద్ - రు. 3000; జి.ఎస్. వాసు, హైదరాబాద్ - రు. 10,000; ముత్తన్నగారి సంపద, (భూంపెల్లి) మెదక్ - రు. 500; ఉద్యోగ క్రాంతి హైదరాబాద్ రు. 2000; సంహిత, వరంగల్ - రు. 500; చెన్నుపాటి రామకృష్ణ, నందిగామ - రు. 10,000. మిత్రులందరికీ కృతజ్ఞతలు. - సం.

వీక్షణంలో గత నాలుగు సంచికల్లో రంగనాయకమ్మ రాసిన హిజ్రాల సమస్యపై వ్యాసం చదివాను. కొంత గందరగోళం, అసహ్యం, జుగుప్స, హిజ్రాల ఎడల వ్యతిరేక భావం, హోమో పశుతుల్యులు, మగ పశుతుల్యులు అని తిట్లు, హక్కుల సంఘాలపై దాడి ఇవే కనిపించాయి. హిజ్రాలు సామాజికంగా అణచివేయబడిన, వెలివేయబడిన, నిరాదరణకు గురైన సామాజిక వర్గం. వారి పుట్టుకకు సైన్స్ పరమైన కారణాలున్నాయి. నకిలీ హిజ్రాలుండవచ్చు. అంతమాత్రాన దాడి అక్కరలేదు. హిజ్రాల పుట్టుకను నిరోధించడానికి సైన్స్ అభివృద్ధి చెందవలసి ఉంది. రంగనాయకమ్మ కలం ఎగతాళి, హేళనలో అగ్రభాగాన ఉంటుంది. ఇదే అంశంపై మే సంచికలోని కల్పన కన్నబిరాన్ వ్యాసం శాస్త్రీయంగా ప్రజాస్వామికంగా ఉంది. రాజ్యాంగ హక్కులలో భాగంగా ఉంది. మానవీయ కోణంలో ఉంది. సుప్రీంకోర్టు, హైకోర్టులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, హిజ్రాల ఆవేదన బాధలు కన్నీళ్లు మనం అర్థం చేసుకోవలసి ఉంది. కల్పన కన్నబిరాన్‌కు అభినందనలు.

– తుంపాల శ్రీరామమూర్తి
గాజువాక–విశాఖపట్నం

వీక్షణంలో రంగనాయకమ్మ రాసిన 'హిజ్రా సమస్య' వ్యాసంపై కల్పన కన్నబిరాన్ రాసిన ఉత్తరం ఆద్యంతం నిర్హేతుక నిందలతోనూ, కుట్రతోనూ, బాధ్యతా రహితంగానూ ఉంది. నాలుగో భాగం చదవకుండానే నిందలకు పూనుకోవడం బాధ్యతారహితం. సంబంధిత డాక్టర్లతో చేసిన సంభాషణ సాధారణ సంభాషణ కిందకు రాదు. ఆ సంభాషణల్లో వారు వాళ్లను చాలా ముఖ్యమైన ప్రశ్నలే అడిగారు. సరైన ఆధారాలను ఇవ్వలేదనడం నిర్లక్ష్యంతో కూడిన నింద. చివరకంటా చదివే సహనం లేకుండా, అసహనంతో నిండిన వీధి గుంపుల ధోరణి కల్పన కన్నబిరాన్‌లోనే కనబడుతున్నది. సమాజంలో – అసహజ జీవిత విధానాన్ని ఎంచుకోవడం తప్పు, దానికి కారణాలు ఎన్నైనా ఉండొచ్చు గానివ్వండి. సమాజంపట్ల బాధ్యత, ప్రేమ ఉన్నవాళ్లు వాటిని విశ్లేషిస్తూ నివారణా మార్గాలు సూచిస్తుంటారు. రంగనాయకమ్మ అలాగే చేశారు. వారి వ్యాసంలో ఎక్కడా హిజ్రాలపై అసహన ద్వేషాన్ని ప్రదర్శించ లేదు. అసహన ద్వేషం అనడం మరో నింద. 'ఒక కమ్యూనిటీని నిందాపూరితమైన ముద్రలకు గురిచేస్తూ...' అని కల్పన కన్నబిరాన్ రాశారు. ఏ కమ్యూనిటీని నిందించారు వారు? 'ఒక రచయితకు వ్యతిరేకంగా చేసిన నిర్హేతుకమైన దాడి' అనీ రాశారు. కాని ఆ వ్యాసంలో ఆ రచయిత(త్రి)ని ఒక్కమాట కూడా అనలేదు. 'దాడి' అనే పదాన్ని ఉపయోగిస్తూ ఆ రచయితకు రంగనాయకమ్మ పట్ల వ్యతిరేకతను పెంపొందించాలనే కుట్ర పన్నారు కల్పన కన్నబిరాన్. 'ఆమె వాదన ఫలితంగా సెక్సువల్ మైనారిటీలు మరింత అభద్రతకు గురయ్యే అవకాశం ఉంది' అని కూడా రాశారు. వారు ఆ వ్యాసంలో ఎవరి మీదా వాదనకు దిగలేదు. సమస్యను విశ్లేషించారు. అంతే. సమస్యకు పరిష్కారం చూపిస్తే, ఆ సమస్యలో ఉన్నవారు, ఎవరైనా అభద్రతకు గురి అవుతారా? వక్రంగా అర్థం చేసుకున్నారు కల్పన కన్నబిరాన్. ఎంతో సున్నితమైన అంశాన్ని చాలా బాధ్యతగా విశ్లేషణచేసి పరిష్కారం చూపిన రంగనాయకమ్మని 'అసహనపు సంప్రదాయ వాదపు వీధి గుంపుల భాష' అనడం కల్పన కన్నబిరాన్ అజ్ఞానానికి నిదర్శనం. ఎవరు స్పృశించని సమస్యపై రాసిన వ్యాసాన్ని ప్రచురించి, పాఠకులకు ఆ సమస్యపై పూర్తి స్పష్టతను కలుగజేసే అవకాశాన్ని తీసుకుని, వీక్షణం తన బాధ్యతను చక్కగానే నెరవేర్చింది.

– ప్రీతమ్
ఖమ్మం

వీక్షణం 'మే' సంచికలో కల్పన కన్నబిరాన్ అనే పాఠకురాలు, సంపాదక నిర్ణయం పైన వెలిబుచ్చిన దురాగ్రహం చదివాక, 'ఫెమినిస్ట్ తాలిబనిజం' అంటూ ఒక ధోరణి ఇప్పుడిప్పుడే తలెత్తుతోందని అర్థమవుతోంది. ఈ పాఠకురాలు, 'నైతికత', 'రాజ్యాంగ స్ఫూర్తి' అంటూ మాట్లాడుతోంది. 'హిజ్రా సమస్య' మీద రాసిన రంగనాయకమ్మ వ్యాసాన్ని ఎందుకు ప్రచురించారని, ఆ పాఠకురాలు అన్నదంటే, ఆమెకు, 'భావ ప్రకటనా స్వేచ్ఛ' అంటే ఎంత ఏవగింపో అర్థమవుతోంది. పైగా, 'వీక్షణం' ప్రతీ సంచికలోనూ, 'విషయ సూచిక' పేజీలో, సంపాదక వర్గం ఇస్తున్న ప్రకటనకు కల్పన కళ్లు మూసుకున్నట్టున్నది. ఆ ప్రకటన ఇదీ: 'వీక్షణంలో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజా పక్ష రాజకీయార్థిక సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చి దిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.' – ఇంత స్పష్టంగా, ఒక పత్రిక తన ఎడిటోరియల్ పాలసీని ప్రకటిస్తే, ఆ పత్రిక మీద ఒంటికాలు మీద ఎగరడం ఏ రకమైన 'రాజ్యాంగ స్ఫూర్తి'? ఏ రకమైన 'నైతికత'? రంగనాయకమ్మ వ్యాసం పూర్తిగా చదవాలనే కనీస సహనం లేకుండా, కల్పన చేసిన వ్యాఖ్యానాలు, ఆమె మాటల్లోనే చెప్పాలంటే, 'అసహనంతో నిండిన వీధి గుంపుల ధోరణి'తో ఉన్నాయి; కాకపోతే, 'సెక్సువల్ మైనారిటీ హక్కులు' అనే ముసుగుతో. ఎవరికైనా, మరొకరు వ్యక్తం చేసే అభిప్రాయాలతో – అవి ఎంత సాంప్రదాయకమైనవైనా – ఏకీభావం లేకపోతే, ఏం చేయాలి? తమ ప్రతి విమర్శ చేయాలి. అంతే గానీ, సాహిత్య పోలీసుల్లా, 'అలా రాయడం ఏమిటీ, ఇలా ప్రచురించడం ఏమిటీ' అని దౌర్జన్యంగా మాట్లాడడమా? ఆ రచన ఎలా తప్పో, తార్కికంగా వివరించి, పాఠకులను చైతన్యవంతం చేయడం వారి కర్తవ్యం. రంగనాయకమ్మ, 'సాధారణ సంభాషణల ఆధారంగా రాసిందే తప్ప సరైన ఆధారాలను ఇవ్వలేదు' అన్న కల్పన వాదన అర్థ రహితం. 'ఒక హిజ్రా ఆత్మకథ' నుంచి సంఘటనల్ని విస్తృతంగా ప్రస్తావించడం, ముగ్గురు డాక్టర్లతోనూ, ఒక సైకియాట్రిస్టుతోనూ చర్చించడం, ఇతర వ్యాసాల గురించి చెప్పడం – ఇవన్నీ ఆధారాలు కాక వీటిని ఏమనాలో చెప్పండి! స్వలింగ సంపర్కం గురించి విమర్శనాత్మకంగా ప్రశ్నలు లేవనెత్తితే, దాన్ని 'హోమోఫోబియా' అని కల్పన ఆరోపించడానికి కారణం, ఆమెలో ఉన్న 'హోమోమానియా' అని ఎందుకు అనుకోకూడదు? నిస్సహాయ స్థితిలో ఉన్న కమ్యూనిటీకి వ్యతిరేకంగా రంగనాయకమ్మ దాడి చేసిందన్న కల్పన వాదనలో పస లేదని, వ్యాసం చివరి భాగంలో రంగనాయకమ్మ చూపించిన పరిష్కార మార్గాలు రుజువు చేస్తాయి. 'రాజ్యాంగ స్ఫూర్తి', 'రాజ్యాంగ నైతికత' వంటి ఆడంబర పద జాలం గుప్పించి, 'ఈ వ్యాసాన్ని ప్రచురించకూడదు' అని దబాయించడం కొత్త రకం పోలీసింగు. ఇది మానుకుని, అవతలి పక్షం అభిప్రాయాలను తార్కికంగా ఎదుర్కోవడం సాధారణ నైతికత ఉన్న వాళ్లు చేయాల్సిన పని!

– కస్తూరి రావిపాటి
ఈమెయిల్ ద్వారా...

మే నెల వీక్షణంలో రంగనాయకమ్మ 'హిజ్రా సమస్య' వ్యాసం మీద వచ్చిన కల్పన కన్నబిరాన్ స్పందన చూశాను. బూర్జువా ప్రభుత్వాల ముందుకు ఏ సమస్య వచ్చినా, అవి పట్టించుకున్నట్లే కనబడతాయి. వాటికి తాత్కాలిక ఉపశమనాల ఊసే తప్ప, నిజమైన శాశ్వత పరిష్కారాల వైపు కన్నెత్తి చూడవు. ఉదాహరణకి, వేశ్యల సమస్యకి పరిష్కారం, లైసెన్సులివ్వడమే. ఆ సమస్యకి అదే పరిష్కారం. అంతే కానీ, సమస్య మూలాల గురించి పట్టించుకోవు. ఆ తాత్కాలిక ఉపశమనాలు కూడా అంతంత మాత్రమే. 'అసహన సందర్భానికి వ్యతిరేకంగా పోరాడే' వాళ్లు, రంగనాయకమ్మ సూచించే పరిష్కారాలని చదవడానికి

(మిగతా 62వ పేజీలో...)

వీక్షణం

చట్టం తన పని తాను చేసుకుపోతుంది!

చాల సాధారణమైన వాస్తవ వ్యాఖ్యలను కూడ హాస్యాస్పదంగా, అనుమానాస్పదంగా మార్చిన ఘనత మన సమాజానికే దక్కుతుంది. అలా మారిన మామూలు వ్యాఖ్యలలో ఒకటి 'చట్టం తనపని తాను చేసుకుపోతుంది' అనేది. చూడగానే అన్యాయంగా, అక్రమంగా కనబడే ఘటనల విషయంలో న్యాయం ఏదని, చట్టం ఏమి చేస్తుందని ప్రశ్న వచ్చినప్పుడల్లా రాజకీయ నాయకులు, వ్యవస్థా నిర్వాహకులు చెప్పే జవాబు ఇది. తప్పించుకోవడానికి వాడుకునే గొడుగు ఇది. నిజానికి చట్టం అనేది నిర్జీవ వస్తువు. ప్రాణం లేని కాగితం మీది మాట. అది ఆలోచన, విచక్షణ, నిర్ణయాధికారం ఉన్న మనిషి కాదు. దాన్ని ఆ అవకాశాలున్న మనిషి ఏ రకంగానైనా వాడుకోవచ్చు. ఆ మనిషి ఒక వర్గానికీ, కులానికీ, మతానికీ, ప్రాంతానికీ చెందుతాడు గనుక, నిర్దిష్ట ప్రయోజనాలుంటాయి గనుక చట్టాన్ని అందుకే వాడుకుంటాడు. అంటే 'చట్టం తనపని తాను చేసుకుపోతుంది' అనే మాట నిజానికి 'చట్టాన్ని మాకు అనుకూలంగా మార్చుకుంటాం' అని అధికారవర్గాల ధీమాగా మారిపోయింది. ఆ ధీమాకు స్పష్టమైన నిదర్శనమే సల్మాన్ ఖాన్ కేసులో, రామలింగరాజు కేసులో, జయలలిత కేసులో న్యాయస్థానాలు వ్యవహరించిన తీరు.

తాగి కారు నడుపుతూ రోడ్డు పక్క బేకరీ ముందు పడుకున్న ఐదుగురు వ్యక్తుల మీదికి కారు ఎక్కించి ఒకరిని చంపిన సినిమానటుడు సల్మాన్ ఖాన్ మీద తక్కుతూ తారుతూ పదమూడు సంవత్సరాల పాటు విచారణ జరిగింది. చివరికి మే 6న బొంబాయి సెషన్స్ కోర్టు ఐదు సంవత్సరాల శిక్ష విధించి, న్యాయం చేసిందనుకుంటే, కొన్ని గంటల లోపలే హైకోర్టు అప్పీలుకు అనుమతించింది. నేరస్తుడికి బెయిల్ ఇచ్చి విడుదల చేసింది. శిక్షను సమీక్షించడానికి ఆమోదించింది.

అంతకు ముందు, దేశంలోని బడా కార్పొరేట్ మోసాలలో ఒకటైన సత్యం కంప్యూటర్స్ కేసులో, మదుపుదారులను, కంపెనీని, ప్రభుత్వాన్ని మోసగించి రు. 7000 కోట్లు కైంకర్యం చేసినందుకు, హైదరాబాద్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు రామలింగరాజును నేరస్తుడిగా గుర్తించి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. నెల తిరగకుండానే పై కోర్టు ఆ శిక్షను తాత్కాలికంగా పక్కనపెట్టి, నేరస్తులను విడుదల చేసి, సమీక్షకు అనుమతించింది.

అంతకన్న ఘోరమైన ఉదాహరణ జయలలిత కేసు. దాదాపు రు. 67 కోట్ల వరకు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని జయలలితపై 1996లో ప్రారంభమైన కేసులో పద్నాలుగు సంవత్సరాల తర్వాత 2014 సెప్టెంబర్‌లో బెంగళూరు స్పెషల్ కోర్టు నాలుగు సంవత్సరాల శిక్ష విధించింది. ఆ శిక్షతో ముఖ్యమంత్రి పదవిని వదులుకోవలసి వచ్చిన జయలలిత అప్పీల్‌ను విచారించిన కర్ణాటక హైకోర్టు జడ్జి సి ఆర్ కుమార స్వామి ఎనిమిది నెలల లోపే ఆ శిక్షను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చాడు. శిక్షను కొట్టివేయడం మాత్రమే కాదు, తనను అడగని విషయాలు కూడ తీర్పులో రాస్తూ, ఆదాయానికి మించి ఆస్తులు 10 శాతం వరకూ ఉండవచ్చునని సుప్రీం కోర్టు అన్నదని, 20 శాతం కూడ ఉండవచ్చునని ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వులున్నాయని అన్నాడు. జయలలిత ఆదాయాన్ని, ఆస్తులను కాకి లెక్కలు వేసి, ఆ పరిమితి లోపలే ఉన్నాయని తీర్పు ఇచ్చి ఆమెను నిర్దోషిగా ప్రకటించాడు.

ఇవేవో విడి విడి ఘటనలు కావు, ఎక్కడో చెదురుమదురుగా జరిగినవి కావు. భారత న్యాయవ్యవస్థ స్వభావమే ఇది. సంపన్నులకు, అగ్రవర్ణాలకు, రాజకీయవేత్తలకు అనుకూలమైన న్యాయవ్యవస్థ ఇది. అప్పుడప్పుడు ఈ స్వభావాన్ని దాచుకొని, తనకు తాను సాధికారత ఇచ్చుకోవడానికి మంచి మాటో, మంచి తీర్పో ప్రకటించవచ్చు. ఎట్లాగూ అవి అమలులోకి రావు. చట్టం తనపని తాను చేసుకుపోతూనే ఉంటుంది.

చత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో శిశు వైద్యుడుగా, ప్రజారోగ్య నిపుణుడిగా, పౌరహక్కుల నాయకుడిగా ఉన్న డా బినాయక్ సేన్‌ను రాజద్రోహ నేరం ఆరోపించి 2007 మేలో అరెస్టు చేశారు. ఆ నేరారోపణకు ఎటువంటి ఆధారాలు లేకపోయినా ఆయన బెయిల్ దరఖాస్తులను సెషన్స్ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు పదేపదే నిరాకరించాయి. చివరికి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో రెండు సంవత్సరాల తర్వాత సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాని ఏడాది తిరగకుండానే రాయపూర్ అడిషనల్ సెషన్స్ కోర్టు ఆయన రాజద్రోహానికి పాల్పడ్డాడని నిర్ధారిస్తూ యావజ్జీవ శిక్ష విధించింది. మరొక రెండు సంవత్సరాలు జైలులో గడిపిన తర్వాత గాని శిక్షపై సమీక్షకు అనుమతిస్తూ ఆయనను బెయిల్‌పై విడుదల చేయలేదు. ఇక చుండూరు హంతకులను, హాషింపురా హంతకులను నిర్దోషులుగా విడిచిపెట్టిన ఉదంతాలు ఇటీవలి జ్ఞాపకాలే. ఢిల్లీ విశ్వవిద్యాలయ కళాశాలలో ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబాను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం కింద 2014 మే 9న అరెస్టు చేశారు. పోలియో పీడితుడిగా నడుము నుంచి కింది భాగం పనిచెయ్యని వ్యక్తి, మరొకరి సహాయం లేకుండా కదలలేని వ్యక్తి, ఢిల్లీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వ్యక్తి ఎక్కడికో పారిపోతాడనే అవకాశమే లేదు. నిర్బంధంలో ఉంచవలసిన అవసరమే లేదు. కాని కక్షగట్టిన ప్రభుత్వం, ఆ కక్షను అమలు చేస్తున్న న్యాయస్థానాలు ఆయనకు బెయిల్ ఇవ్వడానికి కూడ ఏడాదిగా నిరాకరిస్తున్నాయి. నేరస్తులకు క్షణాల మీద బెయిళ్లు, కేసు కొట్టివేతలు, విడుదలలు. అమాయకులకు ఏళ్ల తరబడి నిర్బంధాలు, బెయిల్ నిరాకరణలు, చిత్రహింసలు. ఇదీ ఈ దేశంలో చట్టం తనపని తాను చేసుకుపోతున్న తీరు.

నిజంగానే భారత సమాజంలో చట్టం తనపని తాను చేసుకుపోతూనే ఉంది. కాకపోతే చట్టం ఏ పని, ఎవరి పని చేస్తున్నదో తెలియవలసిన వాళ్లకు ఇంకా పూర్తిగా తెలియడం లేదు. ఆ పని పాలకులను, పీడకులను, విధ్వంసకులను నిర్దోషులుగా ప్రకటించడం, వదిలిపెట్టడం, సకల సౌకర్యాలు కల్పించడం. ప్రశ్నించేవారిని, ఎదిరించే వారిని, చైతన్యం కలిగించేవారిని పాలకవర్గాలు చిత్రహింసలు పెడుతుంటే, వేధిస్తుంటే, చంపుతుంటే, నిష్కారణంగా నిర్బంధాల పాలు చేస్తుంటే మౌనంగా ఉండడం. ఇదీ చట్టం పని. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

ప్రజాకర్షక నినాదాలూ ప్రజావ్యతిరేక చర్యలూ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి, తెలంగాణ రాష్ట్ర సమితి పాలన ప్రారంభమై ఒక సంవత్సరం నిండింది. ఈ ప్రభుత్వాన్ని, దాని విధానాల పనితీరును విశ్లేషించడానికి, అంచనా కట్టడానికి ఇంకా సమయం రాలేదని, వేచి చూడాలని ఇన్నాళ్లుగా అంటున్నవారు ఇప్పటికైనా ఆ సమయం వచ్చిందని గుర్తించక తప్పదు. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారానికి రాకముందు ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్వహించినందువల్ల దానికి ఇవ్వవలసిన గౌరవం ఇస్తూనే, అధికారపక్షంగా దాని విధానాలను, ఆచరణను నిర్మొహమాటంగా పరిశీలించవలసి ఉంది. ఈ సంవత్సరం పాలనలో తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రజాకర్షక విధానాలు, నినాదాలు ప్రకటించింది. ఆ మాటకొస్తే గత ఆరు దశాబ్దాలలో ప్రజాకర్షక విధానాలనూ, నినాదాలనూ ప్రకటించని రాజకీయ పక్షమేదైనా ఉందా? సమస్య ఏమి చెపుతున్నారనేది కాదు, ఏమి చేస్తున్నారనేది. రూపానికీ సారానికీ సంబంధం ఏమిటనేది. బహుళ జాతి సంస్థల ప్రయోజనాలకు ఎర్రతివాచీ పరవడం, ఆంధ్ర పెట్టుబడిదారులతో సహా దేశదేశాల సంపన్నులకు ఆహ్వానాలు పలకడం, విద్యార్థుల మీద, రైతుల మీద, కార్మికుల మీద లాఠీచార్జిలు, తప్పుడు కేసుల నుంచి ఆలేరు ఎన్ కౌంటర్ దాకా రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చడం, ఉద్యోగ కల్పనలో విపరీతమైన తాత్సారం, ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణ మాటే ఎత్తకపోవడం, రైతుల ఆత్మహత్యల పట్ల నిర్లిప్తత వంటి స్పష్టమైన ప్రజావ్యతిరేక చర్యల గురించి కూడ కాసేపు పక్కన పెట్టవచ్చు. కాని మిషన్ కాకతీయ, వాటర్ గ్రిడ్, దళితులకు భూమి, పేదలకు ఇళ్లు వంటి ఆకర్షణీయమైన, ప్రజానుకూలంగా కనిపిస్తున్న కార్యక్రమాల అసలు సారం ఏమిటి? నిజంగా ఈ నాలుగు పనులూ ప్రజలకు అత్యవసరమైనవే. తెలంగాణ ప్రజల ఆకాంక్షలే. కాని ఇవి నినాదాలుగా మిగిలిపోతున్నాయా, వాస్తవరూపం ధరిస్తున్నాయా? ఆచరణలోకి వస్తున్నట్టు చేస్తున్న హడావిడిలో నిజంగా జరుగుతున్నదేమిటి? మిషన్ కాకతీయ ప్రకటిత లక్ష్యమైన చెరువుల పునరుద్ధరణ జరగాలనీ, మళ్లీ తెలంగాణ గ్రామాలు పచ్చదనంతో వెల్లివిరియాలనీ, ప్రతి ఇంటికీ తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ విజయవంతం కావాలనీ, భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలన్నిటికీ తలా మూడు ఎకరాల భూమి దక్కాలనీ, నిరాశ్రితులైన పేదలందరికీ ఇళ్లు దక్కాలనీ కోరుకోని వారుండరు. కాని చెరువుల్లోకి నీరు తెచ్చే వాగులన్నీ ఇంకిపోయేలా కొండలు తవ్వేసి, అడవులు కొట్టేసి, ఇసుక కొల్లగొట్టి, ఆరగాణిలో భవన నిర్మాణాలకు అనుమతిస్తూ చెరువుల పునరుద్ధరణ సాధ్యం కాదు. ఆ పనులు కూడ కూలి దొరకని నిరుపేదలకు కాక, తవ్వే యంత్రాలు కొనుక్కున్న పెద్దలకే కట్టబెట్టాలన్నప్పుడు జరిగేది ప్రజానుకూల చర్య కాదు. ప్రతి నోటికీ గుక్కెడు నీరు ఇవ్వాలన్న ఆదర్శం అద్భుతమైనదే, కాని అందుకు జిందాల్ ల గుత్తాధిపత్యానికి దాసోహం అనగూడదు. దళితులకు భూమి, పేదలకు ఇళ్లు వారిని మభ్యపెట్టడానికి కాగూడదు. ప్రజాకర్షక నినాదాల వెనుక దాగి ఉన్న ప్రజా వ్యతిరేక చర్యలను, రాజకీయార్థిక ప్రయోజనాలను ఇప్పటికైనా గుర్తించక, ప్రతిఘటించక తప్పదు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

భూ సేకరణ పేరుతో భూ ఆక్రమణ


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకూ ఆయన ఆశ్రితులకూ అలవాటైన కనికట్టు విద్య ప్రజల కాళ్ల కింద నేల లాగేస్తూనే అరచేతిలో స్వర్గం చూపెట్టడం. రాజధానికి సంబంధించి శివరామకృష్ణన్ కమిటీ నివేదిక, రాయలసీమ ఆకాంక్షలు, రాష్ట్ర ప్రజల కోరికలు, ప్రకటిత ప్రాంత రైతుల అభ్యంతరాలు అన్నిటినీ తుంగలో తొక్కుతూ తానో, తన ఆశ్రితులైన రియల్ ఎస్టేట్ వ్యాపారులో కోరుకున్నట్టుగా రాజధానిని తుళ్లూరు – అమరావతి ప్రాంతంలో నిర్మించడానికి చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్లాడు. మూడు పంటలు పండే సారవంతమైన కృష్ణా తీరపు భూమిని వదులుకోవడానికి రైతాంగంలో గణనీయమైన భాగం అభ్యంతరం వ్యక్తం చేస్తుంటే ఇప్పుడు ప్రభుత్వం వారిని భయపెట్టడానికి రోజుకో వార్త, రోజుకో వదంతి విడుదల చేస్తున్నది. చట్టబద్ధమైన ప్రమాణాలను, సంప్రదాయాలను పాటించడం లేదు. డిసెంబర్‌లో కాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనే చట్టం తీసుకువచ్చారు. రైతుల నుంచి భూసేకరణ మాత్రమే జరుపుతున్నామని చెప్పి, గ్రామాలలో ఇప్పుడు ఇవ్వకపోతే, తర్వాత ఈ మాత్రం నష్టపరిహారం కూడ ఇవ్వకుండా ఆక్రమించుకుంటామని భయోత్పాతాన్ని వ్యాపింపజేశారు. మే మొదటి వారంలో కాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ అనే కొత్త సంస్థను సృష్టించి రాజధానికి సంబంధించి సకల కార్యకలాపాలనూ 99 సంవత్సరాల పాటు దానికి అప్పగించారు. స్వతంత్రంగా పనిచేసే ఆ సంస్థకు పది మంది డైరెక్టర్లు ఉంటారనీ, అందులో నలుగురు పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించేవారు (అంటే రియల్ ఎస్టేట్ వ్యాపార వర్గం) ఉంటారని ఒక జిఓ విడుదల చేశారు. మరో మాటల్లో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగబోవడం లేదు. ఆరుగురు అధికారులు, నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూచుని ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోబోతున్నారు. ఇది చాలదన్నట్టు, ఇప్పటికే కేంద్రంలో వివాదాస్పదంగా ఉన్న భూసేకరణ చట్టంలోని అతి ప్రమాదకరమైన సామాజిక ప్రభావ మదింపు మినహాయింపును రాజధాని ప్రాంతానికి అన్వయిస్తూ మే 14న ఉత్తర్వులు విడుదల చేశారు. భూఆక్రమణ విషయంలో మోడీ ప్రభుత్వం కన్న తామే మరింత దుర్మార్గులమని చూపుకున్నారు. ఈ జిఓ మీద ప్రస్తుతానికైతే హైకోర్టు స్టే విధించింది గాని ఆ స్టే ఎప్పుడైనా తొలగిపోవచ్చు. ఒకవైపు ఇటువంటి లోపాయకారీ, తప్పుడు, ప్రజావ్యతిరేకమైన పనులు చేస్తూ, ప్రజలను మభ్యపెట్టడానికి రాజధాని మాస్టర్ ప్లాన్ రెడీ అని ఆశ్రిత ప్రచార సాధనాలలో పెద్దఎత్తున అబద్ధాల గగ్గోలు సృష్టించారు. సింగపూర్ ప్రభుత్వ సంస్థ 55 వేల ఎకరాల విస్తీర్ణంలో రాజధాని ప్రణాళిక తయారు చేసిందని, అందులో పచ్చని పంటపొలాలు యథాతథంగా ఉంటాయని, అర్బన్ గ్రోత్ కారిడార్లు, విమానాశ్రయాలు, వ్యవసాయ జోన్లు, పారిశ్రామిక కేంద్రాలు, విశాలమైన రోడ్లు, కృష్ణా నదిపై వాటర్ టాక్సీలు, మెట్రో వంటి సకల సౌకర్యాలు ఉంటాయని, ఇదంతా కూడ వాస్తు ప్రకారమే జరుగుతున్నదని, సరిగ్గా విజన్ 2020 సమయంలో ప్రచారం చేసిన అందమైన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఈ రంగుల అబద్ధాల కలలను ప్రజలకు విప్పి చెప్పి కనీస అవసరాల కోసం పోరాడేలా చేయవలసిన బాధ్యత బుద్ధిజీవుల పైనే ఉంది.


వీ

బాల్టిమోర్‌లో మరోసారి అమెరికా జాత్యహంకారం


స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవహక్కులు వంటి మాటలతో ప్రపంచ ప్రజలను వంచిస్తున్న అగ్రరాజ్యం అమెరికాలో అమానుష జాత్యహంకారం, ఖాకీల కాఠిన్యం రాజ్యమేలుతుందని మరోసారి వెలుగులోకి వచ్చింది. నల్లజాతీయులకు కనీస పౌర ప్రజాతంత్ర, మానవహక్కులు మృగ్యమనే వాస్తవాన్ని గతంలో ఫెర్గూసన్, మిస్సోరి, క్లీవ్‌లాండ్, ఒహయో, న్యూమెక్సికో ఘటనలు చాటితే, తాజాగా మేరీల్యాండ్ రాష్ట్రంలోని బాల్టిమోర్ నగరంలో ఏప్రిల్ 12న పోలీసులను చూసి పారిపోతున్నాడన్న నెపంతో 25 ఏళ్ల నల్లజాతి యువకుడు ఫ్రెడ్డీ గ్రేను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. ఒక గంటలోనే కోమాలోకి వెళ్లి ఏప్రిల్ 19న కస్టడీలోనే మృత్యుఒడిలోకి చేరాడు. దీంతో ఏప్రిల్ 27న అంత్యక్రియల సందర్భంగా అగ్గి రాజుకుంది. ఆగ్రహంతోనూ, అవమానంతోనూ దహించుకుపోతున్న వేలాది మంది నల్లజాతి యువకులు బాల్టిమోర్ నగరంలో వివిధ ప్రాంతాల్లో ఒక్కసారిగా విధ్వంసం సృష్టించారు. అమెరికాలో లాకప్ డెత్‌లు సర్వసాధారణంగా మారాయి. అయితే మృతులందరూ నల్లజాతి యువకులే కావడం గమనార్హం. పోలీసుల్లో అవినీతి, హింసా ప్రవృత్తులు పెచ్చు మీరుతున్నాయి. 1968లో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్య జరిగినప్పుడు, గత ఏడాది ఆగస్టులో ఫెర్గూసన్‌లో నిరాయుధుడైన మైకేల్ బ్రౌన్ అనే నల్లజాతి బాలున్ని కాల్చినపుడు, ఆ తర్వాత నవంబర్‌లో 12 ఏళ్ల బాలుడి చేతిలో బొమ్మ తుపాకి ఉన్నందుకు పోలీసులు కాల్చినపుడు, ఇప్పుడు మళ్లీ బాల్టిమోర్‌లో భారీఎత్తున విధ్వంసం సాగింది. నల్ల జాతీయుల ఆగ్రహాన్ని తప్పు పట్టలేం. ఎందుకంటే పది మాసాలలోనే దాదాపు 600 మంది నల్ల జాతీయులు పోలీసుల చిత్రహింసల వల్ల మరణించడం సాధారణ విషయం కాదు. నల్ల జాతీయుడు అంటేనే నేరస్తుడు అన్నట్లుగా పోలీసులు ప్రవర్తిస్తున్నారు. 60 శాతం నల్ల జాతీయులు ఉన్న బాల్టిమోర్ నగరంలో అడుగడుగునా వర్ణ వివక్ష కొనసాగుతున్నది. నలుపురంగు మనిషి రోడ్డుమీద కనబడితే చాలు, అనుమానపు చూపులు, పోలీసు తనిఖీలు, ధృవీకృత పత్రాలు సరిగా లేవన్న సాకుతో అదుపులోకి తీసుకోవడం, కేసులు పెట్టి కోర్టుకు ఈడ్చడం వంటివి వర్ణపరమైన అగాధాన్ని సృష్టించాయి. అమెరికా మౌలికంగానే అసమాన సమాజం. ఇటీవలికాలంలో సంపద కేంద్రీకృతం కావడంతో అసమానతలు పెరిగి సమాజం నిట్టనిలువుగా చీలిపోయింది. ఆఫ్రికా – అమెరికా జాతికి చెందిన వ్యక్తిని అధ్యక్ష పీఠం మీద కూర్చోబెట్టామంటూ ప్రపంచం ముందు గొప్పలు పోతున్నా నల్లజాతి వారి ప్రాణాలకు మాత్రం ఎటువంటి హామీ లేదు. నల్లజాతివారు అటు ప్రభుత్వంతోనూ ఇటు శ్వేతజాతితోనూ వీధిన పడి పోరాటం చేయక తప్పడం లేదు. పాలకులు ఎవరైనా, అధికారంలోకి వచ్చే పార్టీ ఏదైనా నల్లజాతివారి హక్కులను యథేచ్ఛగా హరించడం అనవాయితీగా మారింది. అమెరికా సామాజిక సమస్య లోతులను స్పృశించకుండా ఆందోళనకారులను దొంగలు, దోపిడిదారులు, విధ్వంసకులు అంటూ బాల్టిమోర్ ప్రభుత్వం మిన్నకుంటున్న తీరుమాత్రం పరిష్కారానికి దోహదం చేయదు. తరాలుగా వివక్షకు గురవుతున్న నల్లజాతి ప్రజల్లో విశ్వాసం పెంపొందించకుండా, అభివృద్ధి ఫలాలు సమానంగా పంపిణీ చేయకుండా, అసమానతలను, వారి జీవన గమనాన్ని మార్చకుండా పోలీసు లాఠీలతో ఆందోళనలను అణచివేసే ప్రయత్నం దీర్ఘకాలంలో మరిన్ని సమస్యలను రాజేస్తుంది.

– ఎ. నర్సింహారెడ్డి







❖ **తెలుగు భాష – కొన్ని సంగతులు** – వి. చెంచయ్య – ప్రచురణ – విప్లవ రచయితల సంఘం – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : వి. చెంచయ్య, 'సాహితీ నిలయం', 10–40–15ఎ/1, జనతాపేట నార్త్, కావలి – 524 201; ఫోన్ : 08626–242277; సెల్ : 94406 38035; email:chenchaiah.sahitinilayam@gmail.com;




❖ **బి.ఎస్. రాములు కథలు – సామాజిక పరిణామాలు** – నందిగామ నిర్మల కుమారి – ప్రచురణ – విశాల సాహిత్య అకాడమి – 141పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు : విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ గోల్డెన్ టవర్స్ 2–2–186/53/5, రామకృష్ణనగర్, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013; ఫోన్ : 08331 966987



❖ **ఉట్నూరు కవిత – 2014** – ప్రచురణ – ఉట్నూరు సాహితీ వేదిక – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: గోపగాని రమణశ్రీ, 9–76/2, ఫకీర్‌గుట్ట, ఉట్నూర్, ఆదిలాబాద్ – 504311; సెల్: 944097882



❖ **కథ అద్దం తిరిగింది** – మరికొన్ని కథలు (1982–83) అరుణతార కథలు – సంకలనం : పరుచూరి సుబ్బయ్య – ప్రచురణ – చరిత – 88 పేజీలు, 1/8 క్రౌన్, రు. 30




❖ **కో... బలి** – మరికొన్ని కథలు (1983–84) అరుణతార కథలు – సంకలనం : పరుచూరి సుబ్బయ్య – ప్రచురణ – చరిత – 96 పేజీలు, 1/8 క్రౌన్, రు. 30

పై రెండు పుస్తకాల ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; మైత్రి బుక్‌హౌస్, విజయవాడ




❖ **ఒక మాట – ఒక సంభాషణ** – షహీదా కవిత్వం – ప్రచురణ – విప్లవ రచయితల సంఘం – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : పాణి, 50–348, ఎల్ 19, బి–2, అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్ – 2; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో




❖ **తెహల్కా అద్దంలో సర్కారు బింబం.. మరికొంత కవిత్వం** – బాసిత్ కవిత్వం– ప్రచురణ – విప్లవ రచయితల సంఘం – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : హఫీజా బేగం, ఇ. నెం. 6–38/1, వివేక్‌నగర్ కాలనీ, కె.సి. కాలనీ, హనుమకొండ, వరంగల్, ఫోన్ : 9491208617, అన్ని పుస్తక షాపుల్లో




❖ **అమ్మ చెక్కిన అక్షరం** – అశోక్ చిలువేరు – ప్రచురణ – విశ్వతేజ ఫౌండేషన్ – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : ఎ. జయశ్రీ, # 8–63, పోస్టు& గ్రా. రంగయ్యపల్లి, మం. రేగొండ, జిల్లా. వరంగల్, సెల్ : 9492443141



❖ **'మేదే' కి ముందు – వెనక** – యం. రత్నమాల – ప్రచురణ – నూతన ప్రచురణలు – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : యం. రత్నమాల, మేఘా అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 302, నల్లకుంట, హైదరాబాద్ – 500 044, ఫోన్ : 27662957, సెల్ : 9440329445




❖ **దిగంబర కవులు** – శ్రీశ్రీ – ప్రచురణ – శ్రీశ్రీ సాహిత్య నిధి – 55 పేజీలు, 1/8 డెమీ, రు. 45,




❖ **చే గువేరా** – శ్రీశ్రీ – ప్రచురణ – శ్రీశ్రీ సాహిత్య నిధి – – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 30,


పై రెండు పుస్తకాల ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి,305, ప్రగతి టొవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ –520004; ఫోన్ : 9246277375; email : srisri_sahityanidhi@yahoo.com,




❖ **ఆకాశమంత** – కథా సంపుటి – డాక్టర్ శమంతకమణి – 200 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలో, సాహితీ స్రవంతి, కృష్ణా జిల్లా




❖ **మతరహిత మానవవాదం** – జాబాలి – ప్రచురణ – లౌకికవాద ప్రచురణలు – 16 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : సమాంతర బుక్ హౌజ్, శాంతినగర్ 'X' రోడు, మంచిర్యాల రోడ్, నిర్మల్, జిల్లా, ఆదిలాబాద్



❖ **ముక్కారు పంటల భూమే కావాలి (రాజధానికా..? వ్యవసాయానికా..?) (నాటిక)** – మాటసియాంగ్ – ప్రచురణ – అవినాష్ ప్రింటర్స్ – 24 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : మైత్రి బుక్ హౌస్ జలీస్ వీధి, కార్ల్ మార్క్స్ రోడ్ (ఏలూరు రోడ్), విజయవాడ – 2, అన్ని ప్రస్తక కేంద్రాలలో లభించును.



❖ **ప్రజాకళారంగ మహాశిఖరం కానూరి వెంకటేశ్వరరావు (అనుభవాలు, జ్ఞాపకాలు, విశ్లేషణలు)** – ప్రచురణ – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య –140 పేజీలు, 1/8 డెమీ, రు. 100,



❖ **ప్రజాకళారంగ స్ఫూర్తి ప్రధాత కానూరి తాత (కవితలు, పాటలు, పద్యం, బుర్రకథ)** – ప్రచురణ – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య –88 పేజీలు, 1/8 డెమీ, రు. 50,

పై రెండు పుస్తక ప్రతులకు : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ఇం.నెం. 2–1–716 (బి–6, ఎఫ్–4), ఎస్‌విఎస్ స్కూల్ ఎదురుగా, ఒయు రోడ్, విద్యానగర్, హైదరాబాద్ –44, ఫోన్ : 040–27663211

ఏకీకృత మార్కెట్ కోసమే జిఎస్‌టి

కొత్త పన్నుల కోసం ప్రపంచ బ్యాంకు దేశవ్యాప్తంగా ఒకేరకమైన పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టడానికి వీలుగా ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఏప్రిల్ 24న లోకసభలో రాజ్యాంగానికి నూట ఇరవైరెండో సవరణ బిల్లు ప్రతిపాదించారు. ఆ సవరణ ఆధారంగా తయారయిన వస్తువుల, సేవల పన్ను బిల్లును మే6న లోకసభలో ప్రవేశపెట్టగా, అది మే 7న మూడింట రెండు వంతులకన్న ఎక్కువ ఆధిక్యతతో (352 అనుకూలం, 37 వ్యతిరేకం) ఆమోదం పొందింది. రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి, అంటే ఏప్రిల్ 1, 2016 నుంచి ఈ కొత్త పన్నుల పద్ధతి అమలులోకి తేవడానికి ఉద్దేశించిన బిల్లు అది. ఆ బిల్లు ఆ తర్వాత రాజ్యసభలో ఆమోదం పొంది చట్టం కావలసి ఉంది. దేశంలోని రాష్ట్రాలలో కనీసం సగం రాష్ట్ర శాసనసభలు దాన్ని ఆమోదిస్తేనే అది అమలులోకి వస్తుంది. కాని రాజ్యసభలో ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆధిక్యత లేదు. అనుకూలంగా రావలసిన వోట్లు 164 కాగా, రాజ్యసభ బలాబలాలు: ఎన్‌డిఎ 63, యుపిఎ 70, జనతా పరివార్ 30, తటస్థ పక్షాలు 64, నామినేటెడ్ 10, స్వతంత్రులు 7. కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ కూటమి ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నది గనుక రాజ్యసభలో ఓడిపోతామని ఎన్‌డిఎ భయపడుతున్నది. అందుకే చిన్నాచితకా రాజకీయ పక్షాలను బుజ్జగించి, తాయిలాలు ఇచ్చి వాళ్లతో అనుకూలంగా వోట్లు వేయించుకోవడానికి ఎన్‌డిఎ ప్రయత్నించింది. మే 12న ఈ బిల్లు రాజ్యసభలో ప్రవేశ పెట్టడానికి ఒక్కరోజు ముందు జయలలిత మీద కేసులు కొట్టివేయించడం ఎడిఎంకెకు ఉన్న 11 వోట్లను రాబట్టుకోవడానికే.

అయినా రాజ్యసభలో బిల్లు ఆమోదానికి పరిస్థితులు అనువుగా లేకపోవడంతో చివరికి దాన్ని చర్చకు పెట్టకుండా సెలెక్ట్ కమిటీకి అప్పగించారు. వర్షాకాలం సమావేశాల మొదటివారంలో నివేదిక సమర్పించమని కోరారు. అప్పటికల్లా ఎన్‌డిఎ ఎత్తుగడలన్నీ పారితే ఆ సమావేశాల్లో బిల్లుకు ఆమోదం దొరకవచ్చు. అయినా వెంటనే ఎన్‌డిఎ పాలిత రాష్ట్ర శాసన సభలను సమావేశపరిచి, ఈ చట్టానికి ఆమోద తీర్మానాలు చేయిస్తేనే 2016 ఏప్రిల్ 1 నుంచి వస్తువుల, పన్నుల చట్టం అమలులోకి వస్తుంది.

ఒక చట్టం అమలు కోసం పాలకపక్షం ఇంతగా ఎందుకు ప్రయత్నిస్తున్నది? ఆ చట్టంలో ఏముంది? ఆ చట్టం రాకముందు ఉన్న పరిస్థితి ఏమిటి?

ప్రస్తుతం దేశంలో రాజ్యాంగంలోని తొమ్మిదో విభాగం ప్రకారం కేంద్ర ప్రభుత్వ అధికారంలో కొన్ని పన్నులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో కొన్ని పన్నులు, ఉమ్మడి అధికారంలో కొన్ని పన్నులు ఉన్నాయి. పరోక్ష పన్నులలో, అంటే సరుకుల మీద, సేవల మీద ఉన్న పన్నులు ప్రధానంగా నాలుగు రకాలు: ఎక్సైజ్ డ్యూటీ, సర్వీ టాక్సు, కస్టమ్స్ డ్యూటీ, సేల్స్ టాక్స్ లేదా వాట్. వీటిలో మొదటి మూడూ విధించే, వసూలు చేసే అధికారం కేంద్రప్రభుత్వానికే. ఆర్థిక సంఘం సిఫారసులను బట్టి రాష్ట్రాలకు వాటి వాటా చెల్లిస్తుంది. చివరి పన్ను మాత్రం కేంద్రమూ విధిస్తుంది, రాష్ట్రాలూ విధిస్తాయి. దాని విభజనకు కూడ సాంకేతిక సూత్రాలూ ఏర్పాట్లూ ఉన్నాయి. ఇన్ని రకాల పన్నులు, వీటి వసూళ్ల కోసం విస్తృతమైన, భారీ యంత్రాంగం, రాష్ట్రాల మధ్య పోటీ, వినియోగదారుమీద అనవసరమైన భారం వంటి కారణాల వల్ల గందరగోళం, అనిశ్చితి ఏర్పడుతున్నాయని, అందువల్ల పన్నుల విధానాన్ని సరళీకరించాలని, ఆ దిశలో జిఎస్‌టి దోహదం చేస్తుందని పాలకులు అంటున్నారు.

అయితే జిఎస్‌టి గురించి పట్టుపట్టడంలో సంక్లిష్టత, సరళత్వం అనే పైకి చూపుతున్న సమస్యలను మించిన కారణాలున్నాయి. దేశంలో అరకొరగానైనా సమాఖ్య విధానం ఉండడం, పన్నులు విధింపులో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడ అధికారం ఉండడం అనే అంశాలు దేశవ్యాపిత ఏకీకృత మార్కెట్‌ను కోరుకుంటున్న బహుళజాతి సంస్థలకు, వారి దేశీయ దళారీలకు పంటికిందరాళ్లలా ఉన్నాయి. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పన్నుల విధానం, అటు కేంద్ర పన్నులు, ఇటు రాష్ట్రాల పన్నులు కలిసి సరుకుల, వస్తువుల ధరలలో పెరుగుదల, రాష్ట్రాల మధ్య విపరీతమైన వ్యత్యాసం, తమకు రావలసిన లాభాలలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో వివిధ ప్రభుత్వాలు వాటాలు పంచుకోవడం బహుళజాతి సంస్థలకు, వాటి దళారీలకు కంటగింపుగా ఉంది. ఏదో ఒకేరకమైన పన్ను, ఒకేఒక్క అధికారవ్యవస్థ ఉంటే, దేశమంతా ఒకే మార్కెట్‌గా తమ దోపిడీ ఇంకా సజావుగా సాగుతుందని వారి ఆలోచన.

ఆ ఆలోచనకు అనుగుణంగానే దేశవ్యాపిత ఏకసూత్ర పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టమని ప్రపంచ బ్యాంకు భారత పాలకులను చాల కాలంగా అదేశిస్తున్నది. నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన కొత్తలోనే రాష్ట్రాల అమ్మకపు పన్నును తొలగించి విలువ ఆధారిత పన్ను (వాట్) ప్రవేశపెట్టమని 1994లో డా. అమరేష్ బాగ్చి నివేదిక సిఫారసు చేసింది. ఆ సిఫారసుకు అనుగుణంగానే 2005 నుంచి దేశంలో వాట్ అమలవుతున్నది. అయితే ఆ నివేదికలోనే విభిన్న ప్రభుత్వాల అధికారం ఉండే దేశంలో వాట్ కూడ అంతిమ పరిష్కారం కాదని, కాని రాజ్యాంగం లోని సమాఖ్య భావన వల్ల అంతకన్న మంచి పరిష్కారం లేదని వాదించారు. అంటే అంతిమంగా జిఎస్‌టికి చేరడానికి మొదటి మెట్టుగానే ప్రపంచబ్యాంకు, బహుళజాతి సంస్థలు వాట్‌ను ప్రవేశ పెట్టించాయన్నమాట. ప్రపంచంలో చాల దేశాలలో జిఎస్‌టి ఉన్నదనీ, అది సులభతరమైనదనీ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలతో భారత ఆర్థిక వ్యవస్థ సమ్మేళనానికి జిఎస్‌టి అవసరమనీ ప్రపంచబ్యాంకు, ఆ భావజాలపు మేధావులు వాదిస్తూ వచ్చారు.

అలా తొలి ఎన్‌డిఎ ప్రభుత్వకాలంలో 2000లో అటల్ బిహారి వాజపాయి ప్రధానిగా ఉండగా మొదటిసారి జిఎస్‌టి మీద చర్చలు ప్రారంభించి అప్పటి పశ్చిమబెంగాల్ వామపక్ష ప్రభుత్వ ఆర్థికమంత్రి

అసిమ్‌దాస్‌గుప్తా నాయకత్వంలో ఒక సాధికార కమిటీని ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే రకమైన జిఎస్‌టి విధించడానికి తగిన నమూనాను, అందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని సూచించడం ఈ కమిటీ లక్ష్యాలు. ఈలోగా 2004 ఎన్నికల్లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఓడిపోయి, యుపిఎ ప్రభుత్వం అధికారానికి వచ్చింది. ఆ ప్రభుత్వంలో ఆర్థికమంత్రి పి. చిదంబరం 2006-07 బడ్జెట్‌లో తమ ప్రభుత్వం జిఎస్‌టి అమలు చేయడానికి కట్టుబడి ఉన్నదని, 2010 నాటికల్లా దేశవ్యాప్తంగా జిఎస్‌టి అమలులోకి వస్తుందని ప్రకటించాడు. తర్వాతి సంవత్సరం బడ్జెట్‌లో, ఆసిమ్‌దాస్ గుప్తా నాయకత్వంలోని రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ జిఎస్‌టి అమలు విధివిధానాలను సిఫారసు చేస్తుందనీ, ఆ కమిటీ సిఫారసులు రాగానే 2010 ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను విధానం అమలు చేస్తామనీ ప్రకటించాడు. సాధికార కమిటీ 2007, 2008ల్లో ఈ విషయమై చాల కసరత్తు చేసి (చేసినట్టు నటించి) 2009 జనవరి నాటికి తన నివేదికను, సిఫారసులను సమర్పించింది. అప్పటికి కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీతో కమిటీ అనేక సార్లు సమావేశమయింది. ప్రణబ్ ముఖర్జీ 2010 -11 బడ్జెట్ ప్రసంగంలో 2011 ఏప్రిల్ నుంచి జిఎస్‌టి అమలులోకి వస్తుందని ప్రకటించాడు. ఆ తర్వాత 2011-12 బడ్జెట్ ప్రసంగంలో 2012 ఏప్రిల్ నుంచి జిఎస్‌టి అమలులోకి వస్తుందని ప్రకటించి, అందుకు అవసరమైన నూట పదిహేనో రాజ్యాంగ సవరణ బిల్లును 2011 మార్చ్ 22న ప్రవేశపెట్టాడు. కాని అప్పటి ప్రతిపక్ష ఎన్‌డిఎ కూటమి ఆ బిల్లును వ్యతిరేకించినందువల్ల అది వాయిదా పడుతూ వచ్చి, చర్చకు రాకుండానే లోక్‌సభ రద్దుకావడంతో ఆగిపోయింది. కొత్తగా అధికారానికి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పుడు నూట ఇరవై రెండో రాజ్యాంగ సవరణ బిల్లును 2014 డిసెంబర్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఆ బిల్లు ఫలితంగానే ప్రస్తుత జిఎస్‌టి బిల్లు ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ చరిత్రంతా చూస్తే అసలు జిఎస్‌టి చట్టానికి యుపిఎ, ఎన్‌డిఎ కూటములలోని అన్ని రాజకీయ పక్షాలతో పాటు వామపక్ష పార్టీలు కూడ ఆమోదం తెలిపాయని అర్థమవుతుంది. అలాగే అన్ని రాజకీయ పక్షాలూ తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడో, కేంద్ర రాష్ట్ర హక్కుల మధ్య తేడా వచ్చినప్పుడో మాత్రమే వ్యతిరేకించాయని కూడ అర్థమవుతుంది.

సువిశాల భారత మార్కెట్ మీద తమ రాబందు నీడ పరవాలని చూసే బహుళ జాతి సంస్థలకు, వాటి దళారులకు ఈ జిఎస్‌టి చాల ఉపయోగం, అవసరం. అదే సమయంలో వివిధ రాష్ట్రాలలో విభిన్న రాజకీయ పక్షాల ద్వారా వ్యక్తమవుతున్న ప్రాంతీయ దళారీ, పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకు మాత్రం తమ ప్రాంతాల మీద తమకే పూర్తి అధికారం, కనీసం ఎక్కువ అధికారం ఉండాలని కోరిక ఉంది. అది నిజమైన ప్రజాస్వామిక, వికేంద్రీకృత, సమాఖ్య భావన కూడ కాదు. దోపిడీ అవకాశాలలో తమ వాటా ఎంత అన్న సమస్యే. అందువల్లనే రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుంచీ కూడ దేశవ్యాపిత ఏకీకృత పన్నుల విధానాన్ని, జిఎస్‌టిని వ్యతిరేకిస్తున్నాయి. జిఎస్‌టి అనివార్యమని అర్థమైన తర్వాత ఎక్కువ వాటా కోసం కోరికలు మొదలుపెట్టాయి. కేంద్ర అమ్మకపు పన్ను స్థానంలో జిఎస్‌టి వసూలు చేస్తున్నందువల్ల రాష్ట్రాలు భారీగా నిధులు నష్టపోతాయని, అందుకు కేంద్రం నష్ట పరిహారం కట్టి ఇవ్వాలని కోరాయి. అటువంటి నష్టపరిహారం ఇస్తామని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వాగ్దానం చేశాడు. అలాగే, పెట్రోలియం మీద, మద్యం మీద పన్నులను జిఎస్‌టి నుంచి మినహాయించాలని కూడ రాష్ట్రాలు కోరాయి. కొత్తగా తయారైన బిల్లులో కేంద్ర ప్రభుత్వం ఆ కోరికను కూడ మన్నించింది. స్థానిక స్వపరిపాలన సంస్థలు వసూలు చేసే ప్రవేశపన్నులను కూడ జిఎస్‌టిలో కలపవద్దని రాష్ట్రాలు కోరాయి. దానికి కూడ కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. నిజానికి ఈ అంగీకారాలన్నీ జిఎస్‌టి ని అమలు చేయడంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఎంత ఆత్రుత ఉన్నదో చూపే నిదర్శనాలు. నరేంద్రమోడీ నాయకత్వం లోని ప్రభుత్వం ప్రపంచీకరణ క్రమాన్ని వేగవంతం చేయదలచుకున్నది గనుక, ప్రపంచ బ్యాంకు, బహుళ జాతి సంస్థల ఒత్తిడికి జీ హుజూర్ జో హుకుం అంటున్నది గనుక ఇప్పుడు హడావిడి పెరిగింది. ప్రపంచ బ్యాంకు తాజా ఒత్తిడిని చూడాలంటే 2014 అక్టోబర్ లో అది విడుదల చేసిన 'ఇండియా డెవలప్ మెంట్ అప్ డేట్' దేశంలో జిఎస్‌టి ఎందుకు ప్రవేశపెట్టాలో గట్టివాదనలు చేసింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టుల సంఖ్య 650 అనీ, సరుకులను చేర్చే ట్రక్కుల సమయంలో 60 శాతం ఈ చెక్ పోస్టుల దగ్గరే గడిచిపోతున్నదనీ అది రాసింది. ఈ ఆలస్యాల వల్ల దేశంలో రవాణా ఖర్చులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే రెండు మూడురెట్లు ఉంటున్నాయంది. అవసరమైన దానికన్న 27 శాతం ఎక్కువ నిలువలు మిగిలిపోతూ అమ్మకాలు తగ్గిపోతున్నాయంది. చెక్ పోస్టులను తప్పించుకోవడానికి ట్రక్కులు ఇతర మార్గాలు ఎంచుకుంటే రవాణా ఖర్చులు మరింత పెరుగుతున్నాయంది. దేశంలో సరుకుల రవాణాకు రిఫ్రిజిరేటెడ్ ట్రక్కుల కొరత ఉందనీ, అవి వాడితే ఖర్చులు ఇంకా పెరుగుతాయనీ అంది. మొత్తం మీద నికర అమ్మకాలలో రవాణా ఖర్చు అంతర్జాతీయంగా 3-4 శాతం ఉండగా, భారతదేశంలో మాత్రం 10-14 శాతం ఉంటుందన్నది. ఈ స్థితిని మార్చడానికి జిఎస్‌టి ప్రవేశపెట్టాలనీ, దానితో చెక్ పోస్టుల దగ్గర తనిఖీలు తగ్గిపోయి, వినియోగదారులకు సరుకులు తక్కువకు అందుతాయంది. ఈ మార్పుల వల్ల స్థూల జాతీయాదాయం, ఎగుమతులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతాయని ప్రపంచబ్యాంకు అంకెల గారడీ ప్రకటించింది.

ఆ ఒత్తిడి ఫలితమే ఎన్‌డిఎ ప్రభుత్వ హడావుడి. అయితే ఎవరు ఎంత ఒత్తిడి చేసినా, ఎవరు దాసోహం అనదలచుకున్నా, దేశ రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక చిత్రపటం ఏకీకరణకు అనువైనది కాదు. విభిన్న మతాల, కులాల, భాషల, నైసర్గిక పరిస్థితుల, సంస్కృతుల బహుళ సమాజమైన భారతదేశంలో ఆ వైవిధ్యాలన్నిటినీ తుడిచివేసి ఒకే ఒక ఉమ్మడి మార్కెట్ ఏర్పాటు చేయడం అంత సులభసాధ్యమైన పని కాదు. ప్రజల మధ్య వైవిధ్యం, అందువల్ల మార్కెట్ల మధ్య వైవిధ్యం మాత్రమే కాదు, భారత సమాజంలో ఇంకా పాలకవర్గ ముఠాల మధ్య వైరుధ్యాలు ప్రాధాన్యత సంతరించుకుని ఉన్నప్పుడు ఇక్కడ ఎటువంటి ఏకీకరణ ప్రయత్నాలైనా విఫలం కాకతప్పదు. ప్రత్యేకంగా ఏకీకృత, కేంద్రీకృత పన్నుల విధానం అమలు చేయడం అసాధ్యం కాకపోవచ్చు గాని కష్ట సాధ్యం. వీ

మోడీది సుపరిపాలన కాదు, స్వపరిపాలన

మోడీ ఏడాది పాలనలో అమలు చేసిన విధానాలు యుపిఏ ప్రభుత్వ విధానాల కొనసాగింపుగానే ఉన్నాయనీ, అవి ప్రజలకు మేలు చేయకపోగా మరింత అగాథంలోకి కూరుకుపోయేలా చేస్తున్నాయనీ అంటున్నారు **వి. హనుమంతరావు**

బిజెపి... కాదు, కాదు నరేంద్రమోడీ 2014 మే 28న కేవలం 31 శాతం ఓట్లతో ప్రధాని పదవి చేపట్టి ఏడాది పూర్తి అయింది. ఈ ఏడాది పాలనా కాలంలో ఆయన ప్రజలకు ఏం చేశాడు అని విశ్లేషించాలంటే ఈ సంచికలో పేజీలు చాలవు. అందుచేత ముఖ్యమైన పాయింట్లుగా మీ ముందుంచుతున్నా. ఒక్క వాక్యంలో చెప్పాలంటే కాంగ్రెస్ విధానాల కొనసాగింపే ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలు. పాలించే పార్టీ మారింది, విధానాలు కాదు. రెండు ప్రభుత్వాలు బహుళజాతి సంస్థల, కార్పొరేట్ల సేవలో తరించిపోతున్నాయి. రెండు ప్రభుత్వాలు అమెరికా పల్లకీ బోయీలుగా, ఆ దేశ సేవకులుగా వ్యవహరిస్తున్నాయి. చిన్న, సన్నకారు రైతాంగం, వ్యవసాయ కూలీల వలసలు పట్టణాలకు, నగరాలకు కొనసాగుతునే ఉన్నాయి. రైతుల ఆత్మహత్యలు, స్త్రీల మానభంగాల గురించి పత్రికల్లో వార్త రాని రోజులేదు. దేశ రక్షణను ఆనాటి రక్షణశాఖ మంత్రి ప్రణబ్‌ముఖర్జీ అమెరికా చేతుల్లోపెడితే, మోడీ మహాశయుడు మరింత ముందుకు తీసుకుపోయారు. అణు విద్యుచ్ఛక్తి యంత్ర సామగ్రి సరఫరా, ఏదైనా ప్రమాదం జరిగితే, యంత్ర సరఫరా సంస్థలే నష్టపరిహారం చెల్లించాలన్న ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ఒబామాను మనదేశానికి పిలిచి జీహుజూర్ అన్నాడు.

ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, మొదటి రోజునే ప్రజానుకూలపు ప్రకటనలు చేయడం జరుగుతుంది. (రాష్ట్రంలో రెండు రూపాయలకు కిలోబియ్యం, విద్యుత్ బకాయిలరద్దు వగైరా). అందరిలాగే తానూ చేస్తే తన గొప్ప ఏముంది అని అనుకున్నారేమో, దేశ ప్రజల, ముఖ్యంగా గ్రామీణ రైతాంగాన్ని వారి మానానికి వారిని వదిలివేసి, వివిధ దేశాల్లో చక్కర్లు కొట్టడంతో తన పరిపాలనకు శ్రీకారం చుట్టారు. ఈనాటికి కొనసాగుతూనే ఉంది. ప్రజల్లో అసంతృప్తి నిప్పురాజుకోవడం ప్రారంభమైంది. అంతగా ఇష్టం లేకపోయినా కార్పొరేట్ల చేతుల్లో ఉన్న పత్రికలు ఈ అసంతృప్తికి అద్దం పట్టడం ప్రారంభించాయి. ఎందుకంటే కోట్ల రూపాయలు కుమ్మరించి మోడీని గెలిపించుకున్నాయి. వివిధ రాష్ట్రాల్లో వచ్చే ఏడాదిలో జరిగే ఎన్నికల్లో ఓడిపోతే తమ గతేంకాను? కాగా, ప్రజల్లో ప్రారంభమైన అసంతృప్తికి అద్దం పడితే, మోడీకి మేలుకొలుపు పాడడమే లక్ష్యమే కాని ప్రజల అసంతృప్తిని నిజంగా ప్రతిబింబించాలని కాదు. మోడీకి పెట్టుబడిదారులే, కార్పొరేట్లే ప్రజలు; బహుళజాతి సంస్థలు పెట్టుబడి పెట్టండి అని ఇటు కార్పొరేట్లను అటు విదేశీయులను 'మేక్ ఇన్ ఇండియా' అని పిలుపునిచ్చారు. వారి స్పందన ఏమిటి? కాంగ్రెస్ పాలనలోనే తయారీ రంగం కునికిపాట్లు పడుతూ వచ్చింది. అదే పరిస్థితి ఈ రోజుకు కొనసాగుతోంది. మోడీ మోకాళ్ల మీద నిలబడి బహుళజాతి సంస్థలను అర్థిస్తే, వారు సవాలక్ష కోర్కెలు కోరుతున్నారు. అమెరికా వెళ్లి వారిని అర్థిస్తే, వారిచేత తన దేశంలో పెట్టుబడులు పెట్టేలా చూడమని ఒబామాను అర్థిస్తే, ఈనాటికీ బోణీలేదు.

కాంగ్రెస్ పాలన నాటి పరిస్థితే కొనసాగుతోంది. మనదేశ సంపదను కొల్లగొట్టుకొని పోతారో, మా దేశం నుంచి వెళ్లిపోండి అని బ్రిటిష్ సామ్రాజ్యవాదులను, తెల్లదొరలను తరిమేసి స్వతంత్రం సంపాదించు కుంటే, ఇప్పుడు మోడీ, అంతకు ముందు కాంగ్రెస్ ఎర్రతివాచి పరచినా (ఎంత దిగజారుడు) వాళ్లు రావడం లేదు ఎందుకు? పరిశ్రమ పెడితే, లాభాలు వారి వారి దేశాలకు తరలిపోతాయి, అక్కడ నుంచి వచ్చిన తెల్లతొక్కవాళ్ల వారి సంపాదన కూడా వారి దేశాలకు తరలిపోతుంది. మనదేశంలో కార్మిక శక్తి చౌక కాంట్రాక్టు కార్మికులను నియమించు కొంటారు. ఇన్ని అవకాశాలున్నా వారు రావడం లేదంటే, ఇంకా బుర్ర బిగిసుకుంటే మరన్ని కోర్కెలు సాధించుకోవచ్చు. జపాన్, చైనాలను ఆహ్వానించినా, ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది.

విదేశాల్లో, స్విస్ బ్యాంకుల్లో దాచిన నిధులను ఇదిగో, ఇలా అధికారంలోకి రాగానే దేశంలోకి రప్పిస్తానన్నారు. ఏదీ? పోనీ, దేశంలోనే గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన నల్లధనాన్ని గురించి మాట్లాడరేం మోడీ? ఒకవేళ పరిశ్రమలు వస్తే, వాటికి కావాల్సిన నీరుందా? గంగా నదీ జలాల స్వచ్ఛతకు కేటాయింపు 20 వేల కోట్ల రూపాయల ఖర్చు! దేశంలో నీటి కరువు నివారణకు నిధుల్లేవు! బ్రిటిష్ పాలనలో గ్రామాల్లో, పట్టణాల్లో విరివిగా చలివేంద్రాలుండేవి. చల్లటి మంచినీరు, కొన్ని చోట్ల మజ్జిగ కూడా ఇచ్చిన పరిస్థితిని నా చిన్నప్పుడు చూశా. ఇప్పుడు డబ్బిచ్చి మంచినీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది.

ఇటీవల చంద్రబాబు జపాన్, చైనాలు పర్యటించి తిరిగివచ్చి పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని ప్రకటనలు గుప్పించారు. కాని వాస్తవమేమంటే అవి వట్టి ఎంఒయులు మాత్రమే. అంటే మేము మీ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి సూత్రరీత్యా అంగీకరిస్తున్నాం అని మాత్రమే. పరిశ్రమల గురించి మాట్లాడుతున్నాం కాబట్టి కార్మికుల గురించి ప్రస్తావించుకోవాలి. బిజెపి పాలించే రాజస్థాన్‌లో కార్మిక చట్టాలను సవరించి, యజమానులకు హైర్ అండ్ ఫైర్ అధికారాన్ని ఇవ్వడం చూసిన కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వం కూడా అలాంటి నిర్ణయాన్ని తీసుకుంది. దేశంలో 93 శాతం మంది శ్రమజీవులు అసంఘటిత రంగంలో ఉన్నారు. అలాంటి కార్మికులకు ఉపాధి రక్షణకు చట్టాలు తీసుకొని రావాల్సింది పోయి, పనిలో ఉన్న ఏడు శాతం కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నది మోడీ ప్రభుత్వం.

దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ నడిచినప్పుడు రాజు, మంత్రి వీరిద్దరే రాజ్యాన్ని పరిపాలించేవారు. కాని ఇప్పుడు దేశంలో డెమోక్రటిక్ వ్యవస్థ

విఇచ్ కాలమ్

- ప్రధాని కార్యాలయంలో అధికారం కేంద్రీకృతం, అధికార వికేంద్రీకరణకు గుడ్‌బై చెప్పేశారా మోడీజీ?
- 2014 సెప్టెంబర్ 25న మోడీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదమిచ్చారు. ఈ పిలుపునందుకుని ఎన్ని పరిశ్రమలు వచ్చాయో, ఎంత పెట్టుబడి వచ్చిందో లెక్కచెపుతారా?
- ఒక్క సంవత్సరం పరిపాలన ఆధారంగా మోడీ పాలనను బేరీజు వేయడం సబబా? సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు 2014 ఉత్తరార్థ కాలంలో తగ్గించారు. మళ్లా 2015 - 16లో తగ్గింపు.
- ప్రజలకు సంబంధించినంత వరకు ఇదివరకు, ఇప్పుడు కూడా ప్రభుత్వ సబ్సిడీల మీద ఆధారపడాల్సిన దుర్గతి. ప్రజల నెత్తిన దరిద్ర నారాయునుడు తాండవమాడుతున్నాడు. మోడీజీ ఈ దుస్థితి నుండి ప్రజలకు స్వాంతన కలిగించడానికి మోడీజీ తీసుకున్న చర్య ఒక్కటైనా ఉందా?
- వ్యవసాయంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడమంటే భూమిని ఆహార ధాన్యాల పంట నుంచి తప్పించి, ఎగుమతి చేయడానికి వచ్చే పంటలను పండించడం. దీనితో ఆహార ధాన్యాల పంట తగ్గి, తిరిగి దిగుమతుల మీద ఆధారపడాల్సి రావడం.
- సంవత్సరం క్రితం ఎన్నికల్లో పోటీచేసి గెలిచింది భాజపా. ఈ సంవత్సర కాలంలో మోడీ నోటి నుంచి ఒక్కసారైనా భాజపా అనే మాట విన్నారా?
- దేశం అంతా మోడీ మాటే. ఆయన పరిపాలన గురించే. కాని దేశంలోకి తొంగిచూస్తే ఇంటిపేరు కస్తూరివారు కాని ఇంటినిండా గబ్బిలాల పెంటకంపు అనే సామెత గుర్తుకొస్తుంది.
- మోడీది వన్-మాన్ పాలన-సోనియా. ఆయన అధికారంలో ఉన్నారు. కాని సోనియాజీ ఏ అధికార పదవి లేకుండానే పరిపాలించారు కదా.
- బ్రిటిష్ పాలనలో 1861లో సెక్షన్ 144 ప్రజా తిరుగుబాటును అణచివేసే ఉద్దేశంతో ప్రవేశ పెట్టారు. మోడీజీ మీరు ఈ సెక్షన్‌ను రద్దు చేసి ప్రజల మెప్పు పొందవచ్చుకదా? లేక బ్రిటిష్ సామ్రాజ్యవాదుల అడుగుజాడల్లోనే నడుస్తానంటారా?
- స్టాండర్డ్ అండ్ పూర్ సంస్థ ఆర్థిక విశ్లేషణ ప్రకారం మరో ఏడాది వరకూ దేశంలో పెట్టుబడులు పడకేస్తాయి.
- దేశంలోని పరిశ్రమల సంఖ్యలో 96 శాతం చిన్న, మధ్యతరగతి పరిశ్రమలే.
- భూగర్భ వనరులను మనమే ఉపయోగించుకోవాలంటే విదేశాల వైపు చూడనక్కర లేదు.
- దేశంలో బిలియనీర్ల ఆస్తి ఒక్క సంవత్సరంలో ఎంత పెరిగిందంటే మోడీ ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో ఒక్క ఏడాదిలో షేర్లు అమ్మితే వచ్చిన నిధుల కన్నా పదిరేట్లు ఎక్కువ ఆదాయం వస్తుంది.
- 2014లో 32 మంది బిలియనీర్లు అదనంగా 40 శాతం మేరకు మరింత ధనవంతులయ్యారు.
- 2014 చివరి త్రైమాసంలో 500 పరిశ్రమల అమ్మకాలు సెప్టెంబర్ త్రైమాసంలో 4 శాతం పెరిగితే, ఆ తర్వాత త్రైమాసంలో ఒక శాతం కన్నా తక్కువగానే పెరిగాయి.
- మాజీ ఎంపి గురుదాస్‌గుప్తా ప్రకారం అయిదేళ్లలో రిలయన్స్ లాభాలు రు. 81 వేల కోట్లు.
- రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాతో, సుప్రీం కోర్టుతో మోడీ పేచీలు - వాటి అధికారాలను కూడా కబ్జా చేసుకోవాలనా మోడీజీ?
- జాతీయ క్రైం బ్యూరో గణంకాల ప్రకారం 1997 - 2013 మధ్య కాలంలో ఆత్మహత్యల సంఖ్య 3,46,358. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికే వెయ్యిమంది.
- అసమానతల దేశం భారతదేశం.
- ఒబామా మనదేశం వచ్చినప్పుడు మోడీ ధరించిన సూట్ విలువ 10 లక్షలు!
- మోడీ ఇతర దేశాలకు వెళ్లినప్పుడు, దేశాన్ని పాలించిన గత ప్రభుత్వాలను చెండాడుతున్నారు. పర దేశంలో విమర్శలు చేయడం సబబా? ఆ దేశస్తులేమనుకుంటారు? మనదేశ పరువు గంగపాలు చేయడమా? ఒబామా వచ్చి తన దేశంలో రిపబ్లికన్‌లను పల్లెత్తుమాట అయినా అన్నారా?
- ధనికుల కోసం దేశాన్ని అమ్మేసిన కాంగ్రెస్ - మోడీజీ మీరు దేశాన్ని అమెరికాకు అమ్మేయలేదూ?
- మోడీ అధికారంలోకి రావడంతోనే, తన కార్యాలయానికి ఒకరిని ఎంచుకొన్నారు. అలా ఎంచుకొన్న అధికారి అంతకు ముందు పనిచేసి రిటైరైన సంస్థ నియమ నిబంధనల ప్రకారం ఆ అధికారి మూడు సంవత్సరాల వరకు ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ పనిలో చేరకూడదు. అయినా మోడీ అతనినే ఎంచుకొని, మొట్టమొదటి ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టి ఆ నిబంధనను రద్దుచేసి, అతనిని తన కార్యాలయ అధికారిగా నియమించి ఆర్డినెన్స్‌ల రాజ్యానికి శ్రీకారం చుట్టారు. తానేమిటో, దేశ ప్రజానీకానికి చెప్పకనే చెప్పారు. ఇది ప్రజాస్వామ్య లక్షణం కాదు, ఒక నియంత లక్షణం. ఎన్నికల్లో ఓడిపోయిన అరుణ్‌జైట్లీని ఆర్థిక శాఖా మాత్యునిగా ఎంచుకోవడం కూడా ఈ కోవలోనిదే. ఇటువంటి వ్యక్తి ప్రధాని పదవిలో కొనసాగాలా, లేదా అనేది మీ ఇష్టం.

వీ

ఏర్పడినా, ఆచరణలో రాజుగా మోడీ, మంత్రిగా అరుణ్‌జైట్లీ చక్రం తిప్పుతున్నారు. మంత్రి మండలితో సంప్రదింపులు కేవలం లాంఛన ప్రాయం. ఏ మంత్రికైనా మోడీ ముందు నోరు విప్పే ఖలేజా ఉందా? సీనియర్ అధికారులందరూ మోడీ ముందు తలవొంచుకుని నిలబడాల్సిందేనని అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఆజ్ఞ జారీ చేశారు. తాజాగా కో ఆపరేటివ్ ఫెడరలిజం మోడీ తమ లక్ష్యమంటున్నారు. అంటే పరోక్షంగా రాష్ట్రాల మీద అధికారం చెలాయించడమే. ఏ ముఖ్యమంత్రి అయినా తోకాడిస్తే అంతే సంగతులు. న్యాయాధిపతుల వ్యవస్థ మీద, రిజర్వు బ్యాంకు మీద పట్టు సాధించే ప్రయత్నం డెమోక్రసీ ముసుగులో ఫాసిజానికి పునాదులు పడుతున్నాయి.

కాంగ్రెస్ పాలనలోనే నిధుల కొరత పేరుతో ప్రైవేట్ - పబ్లిక్ జాయింట్ రంగాన్ని (పిపిపి) ఏర్పాటు చేయడం ప్రారంభమైంది. లక్ష్యం నుంచి మెల్లమెల్లగా ప్రభుత్వం తప్పుకొని, అంతా ప్రైవేట్ పరం చేయడం పాలకులు తమ జేబులు నింపుకోవడం. ఈ పద్ధతిని హైవేస్ నిర్మాణ రంగంలో ప్రవేశపెట్టారు. కొంతకాలం పనిచేసిన తర్వాత ప్రైవేట్ రంగం చేతులెత్తేసింది. కారణం ప్రైవేట్ రంగం కూడా అవసరమైన నిధులను సమకూర్చలేకపోవడం, ఈలోగా ధరల పెరుగుదలతో మొదటి అంచనాలు తలకిందులయ్యాయి.

ఈ అనుభవం నుంచి మోడీ ప్రభుత్వం ఏమీ నేర్చుకొన్నట్లు లేదు. పిపిపి పద్ధతినే కొనసాగిస్తోంది. విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోంది

➡

మోడీ ఏడాది పాలనలో తుపాకులు - నాగళ్లు

మావోయిస్టులు తుపాకులు వీడి నాగళ్లు పట్టుకోవాలని ఒక పక్క అంటూనే మోడీ, మరోపక్క ఆ నాగళ్లు పట్టి సాగుచేస్తున్న రైతుల కాళ్ల కింద భూమి లాక్కోవడానికి దుర్మార్గ, అణచివేత ధోరణులు అవలంబిస్తున్నారని అంటున్నారు పి. రుక్మిణి

'తుపాకులు వీడి భుజాలపై నాగళ్లు మోయండి' అని బస్తర్‌లోని దంతెవాడ బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోడీ మావోయిస్టులకు సూచించాడు. అంతేకాదు 'మీరు చేసిన హింసలో ఎన్ని కుటుంబాలు అనాథలుగా మారాయో కదా! ఆ బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లండి. ఐదు రోజులు వారితో కలిసి ఉండండి. కానీ, మీరు ఎవరో మాత్రం వారితో చెప్పకండి. వారితో మాట్లాడండి. కష్టసుఖాలు పంచుకోండి. నేను పూర్తి ఆత్మవిశ్వాసంతో చెపుతున్నాను. వారితో మాట్లాడిన తరువాత.. వారి అనుభవాలు విన్న తరువాత, మీరు పునరాలోచనలో పడతారు. హింస ద్వారా మీరు ఎంత పెద్ద పాపం చేశాం అని తీవ్ర మనోవ్యథకు గురవుతారు. మరోసారి హింసా మార్గంలోకి వెళ్లరు. తప్పు చేశామని భావిస్తారు. ప్రభుత్వం, చట్టాలు, ప్రలోభాలు – ఇవేవీ మిమ్మల్ని మార్చలేకపోవచ్చు. కానీ మీ తుపాకీ గుళ్లకు బలైన ఆ బాధిత కుటుంబాలు తప్పకుండా మిమ్మల్ని మారుస్తాయి. ఈ ఒక్క ప్రయోగం చేయండి' అని ఆయన మావోయిస్టులకు చాల తాత్విక ధోరణిలో హితం చెప్పాడు. భుజాలపై తుపాకులు కాకుండా నాగళ్లు ఉంటేనే సాధ్యమవుతుందన్నాడు. తుపాకులను విడిచిపెట్టిన తరువాత పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నాడు. మావోయిస్టుల సమస్య అంతమైతే ఆర్థికాభివృద్ధిలో ఛత్తీస్‌గడ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రం అవుతుందన్నాడు.

1985లో ప్రధానిగా రాజీవ్‌గాంధీ తరువాత ముప్పై ఏళ్లకు దేశ ప్రధానిగా మోడీ బస్తర్ ప్రాంతంలో పర్యటించాడు. ఇది యాదృచ్ఛికం కాదని చెప్పడానికి ఒక వృద్ధి విధ్వంసాన్ని విశ్లేషించడానికి మోడీ ప్రసంగాన్ని ఆయన మాటల్లోనే ప్రస్తావించాను. ఇప్పటికింక మోడీ రాజీవ్‌గాంధీ వలె ఇరుగు పొరుగు దేశాల మీదికి భౌతిక దాడికి సైన్యాన్ని పంపలేదు గానీ మిగతా అంశాలన్నీ ఆయన నుంచి పుణికి పుచ్చుకున్నవే. రాజీవ్‌గాంధీ సిక్కుజాతి హననంతో హిందూరాజ్యాధిపతి అయ్యాడు. మోడీకి గుజరాత్‌లో మూడువేల మంది ముస్లింల మారణకాండతో ప్రధాని కావడానికి పన్నెండేళ్లు పట్టింది కానీ ఉత్తరప్రదేశ్ ముజఫర్ నగర్‌లో నెలల తరబడి జరిగిన ముస్లింల మారణకాండ, స్త్రీలపై అత్యాచారాలు, ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో అమిత్ షా హిందూ ముస్లిం విభజనకు పన్నిన విద్వేష పథకాలకు లోక్‌సభ ఎన్నికలే కాదు, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి బలపడడానికి వాడుకున్నాడు.

రాజీవ్‌గాంధీని అధికారానికి తెచ్చిన భోపాల్ విషాదాలు ఇవ్వాళ దేశంలో ఎన్ని రెట్లయినవో. ఆయన హామీపడిన ఇరవై ఒకటో శతాబ్దంలో మోడీ అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాడు. రాజీవ్‌గాంధీ 1985లో బస్తర్‌కు వెళ్లినప్పుడు అప్పటి దాకా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల సంక్షేమం కోసం వెచ్చించిన డబ్బు మధ్య దళారీలు లేకుండా వారికి చేరితే ప్రతి ఆదివాసీ కుటుంబానికి ఒక కోటి రూపాయలు చేరి ఉండేవి అన్నాడు. ముప్పై ఏళ్లు గడిచిపోయాయి. ఈ మధ్యకాలంలో అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల కోసం ఎన్ని వేల వేల కోట్లు ఖర్చు పెట్టి ఉంటారో లెక్కలు అలా ఉంచి మే 9న ప్రధాని ఇరవై నాలుగు వేల కోట్ల రూపాయల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రకటించాడు. అవి 1) దంతెవాడలో మూడువేల ఎకరాల విస్తీర్ణం గల అడవిలో అల్ట్రా మెగా ఉక్కు కర్మాగారం, 2) జగదల్‌పూర్ నుంచి రావ్‌ఘాట్ దాకా నూటా ఇరవై కిలోమీటర్ల రైలు మార్గం, 3) మురుగు నీటి పైప్‌లైన్, 4) పెల్లెట్ ప్లాంట్.

➡

కూడా. డిక్టేటర్లు తాము పట్టిన కుందేళ్లకు మూడే కాళ్లంటారు. పిపిపి విధానం పరిష్కారం కాదని తేలిపోయింది.

సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ – మోడీ నినాదం. కార్పొరేట్‌కాసాత్, కార్పొరేట్‌కా వికాస్ అంటే వాస్తవానికి దగ్గరగా ఉంటుందేమో.

పడిపోతున్న చమురు ధరలు తాత్కాలికమే. అవి పెరగడం ప్రారంభిస్తే అంతే సంగతులు అని మోడీ గ్రహించాలి. ప్రతి సంవత్సరం 120 లక్షల మంది కార్మిక శక్తిలో చేరుతున్నారు. ఇప్పటికే నిరుద్యోగులు నాలుగు కోట్లు విద్యార్థికుల నైపుణ్యతలేని వారుగా ఉన్నారు. అటువంటి వారికి ఉద్యోగాలు ఇవ్వలేమంటున్నారు పారిశ్రామికవేత్తలు. విదేశాల నుంచి హై టెక్నాలజీని ఉపయోగించే పరిశ్రమలే వస్తాయి. నైపుణ్యతను పెంచడానికి కొన్ని శిక్షణా సంస్థలు నెలకొల్పుతుంది కేంద్రం. చాలాకాలం క్రితమే ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఒక సంవత్సరం పరిశ్రమల్లో పని చేయాలని విద్యా సంస్థలు – పరిశ్రమలు ఉమ్మడిగా పని చేయాలనే సిఫార్సు చెత్తబుట్టలో పడింది. రెడ్డొచ్చే మొదలాడరా అన్నట్లు మోడీ వచ్చారు మళ్లీ మొదలు పెట్టండంటున్నారు.

రక్షణ పరిశ్రమల రంగంలో భారతీయతను సాధించాలనేది లక్ష్యంగా, ఏకంగా రక్షణ వ్యవస్థనే అమెరికా చేతుల్లో పెట్టేశారు మోడీ. చిల్లర వర్తకంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించిన భాజపా, అధికారంలోకి వచ్చేసరికి ప్లేటు మార్చింది. 2014లో ఒక్క జూన్ మాసంలోనే అంతర్జాతీయ వాల్‌మార్ట్ సంస్థ భారత్‌లో రు. 600 కోట్లు కుమ్మరించింది.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

తుపాకులు వీడి నాగళ్లు పడితే అభివృద్ధి సంగతి తరువాత మాట్లాడుకుందాం గానీ ఈ నాలుగు అభివృద్ధి పథకాల్లో నాగళ్లు పట్టిన రైతులకు, ఆదివాసులకు ప్రయోజనకరమైన అంశం ఒక్కటైనా ఉందా? కనీసం ఉపాధి ఇచ్చేవి కూడ కాదు. అల్ట్రా మెగా అంటే అత్యాధునిక భారీ ప్రాజెక్టు – పూర్తిగా ప్రత్యేక సాంకేతిక జ్ఞానంతో నిర్మాణమయ్యే ఉక్కు కర్మాగారం – విశాఖ ఉక్కు వంటిది కూడా కాదు. ఉక్కు ఆదివాసుల కోసం కాదు. రావ్‌ఘాట్ రైలు మార్గం కోసం కోల్పోయే భూమి, అటవీ సంపద గురించి ఈ ప్రాజెక్టు ఆలోచనలో ఉన్నప్పటి నుంచీ ఆదివాసులు ప్రతిఘటిస్తున్నారు. ఇప్పటికే బైలదిల్లా నుంచి విశాఖపట్నం ఇనుప రజాన్ని తీసుకపోవడానికి కిరుండల్ రైలు మార్గం ఉంది. ఇప్పుడు జగదల్‌పూర్ నుంచి రావ్‌ఘాట్‌కు కూడ అటువంటి కార్పొరేట్ ప్రయోజనం కోసమే రైలు మార్గం.

ఈస్ట్ ఇండియా కంపెనీ కాలం నుంచి ఈనాటి వరకు రైలు మార్గాలు ప్రభుత్వాలు ఎక్కడికి వేస్తున్నాయో ఒక్కసారి దేశపటం చూస్తే ప్రకృతి సంపద దోచుకోవడానికే ప్రాథమ్యమనేది గ్రహించడం కష్టం కాదు. దానికి తోడు శాంతిభద్రతలు కాపాడే నెపంతో అర్ధసైనిక బలగాల మోహరింపు కూడ దేశవ్యాప్తంగా ఉన్న కంటోన్మెంటుల నుంచి ఉద్యమ ప్రాంతాలకు తరలిపోయే దృశ్యాలు ప్రతి ప్రధాన పట్టణాల్లో నిత్యమూ ప్రయాణీకులు చూస్తూనే ఉంటారు. తమ ప్రయాణ సౌకర్యాల కోసమే రైళ్లు ఉన్నాయనుకునే ప్రయాణీకులు, ముఖ్యంగా బస్తర్‌లో మందుపాతరల భయంతో రోడ్డు ప్రయాణం ప్రమాదకరమనుకుంటున్న అర్ధసైనిక బలగాల కోసమే ఈ రావ్‌ఘాట్ ప్రయాణ మార్గం.

ఇక మురుగునీటి గొట్టపు మార్గం, పెల్లెట్ ప్లాంట్ – బస్తర్‌లో ఇప్పటికే ఉన్న ఎస్సార్ వంటి కార్పొరేట్ కంపెనీల ప్రయోజనం కోసమే తప్ప ఆదివాసుల కోసం కాదు.

ఈ ఇరవై నాలుగు వేల కోట్ల భారీ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం, ఎంత భూమిని ఆక్రమించుకుంటుంది. కొన్ని వేల ఎకరాలు. మరి పోడు వ్యవసాయం నుంచి స్థిర వ్యవసాయంలోకి తుపాకులు పట్టుకున్న మావోయిస్టుల వల్లనే మారిన ఆదివాసులు రైతులుగా మారి నాగళ్లు పట్టుకొని ఎక్కడ దున్నుకోవాలి?

వాస్తవానికి గత ముప్పై ఏళ్ల విప్లవోద్యమ ఫలితంగా ఇదే బస్తర్‌లో ఆదివాసులు తెగ పెత్తందార్ల నుంచి, భూస్వాముల నుంచి లక్షలాది ఎకరాల భూమి స్వాధీనం చేసుకొని రెవెన్యూ, పోలీసు, అటవీ అధికారుల దాడులను, అర్ధ సైనిక బలగాలను, సాల్వాజుడుంను, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రతిఘటిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఇవ్వాళ బస్తర్‌లో కనీసం మూడు ఎకరాల భూమి లేని ఆదివాసీ కుటుంబం లేదు. లక్షలాది ఎకరాల భూమి చదను చేసుకుంటున్నారు. దున్నుకుంటున్నారు. తాము గడచిన పంటలో జాగ్రత్త పరచిన విత్తనాలు వేసుకుంటున్నారు. తమ పశు ....రంలో, అడవిలో పోగుచేసిన ఎరువులు వేసుకుంటున్నారు. చెరువులు, కాలువలు తవ్వుకుంటున్నారు. కూరగాయలు, పండ్ల తోటలు పెంచుతున్నారు. తమకవసరమైన ధాన్యమే కాదు, మార్కెట్ నుంచి అవసరమైన వస్తువులు కొనుక్కోవడానికి కావలసినంత ధాన్యాన్ని పండిస్తున్నారు. అర్ధసైనిక బలగాలు ఆదివాసీ గృహాల్లో ఒక పద్ధతి ప్రకారం తగులబెట్టే ధాన్యాగారాల జాబితా చూస్తే ఈ స్వయం సమృద్ధి మార్గం పట్ల పాలకులు ఎంత కక్షతో ఉన్నారో అర్థమవుతుంది.

ఇపుడు ఆదివాసులంతా పేద, సన్నకారు, మధ్యతరగతి, ధనిక రైతులయ్యారు. నాలుగు వర్గాల ఐక్య సంఘటనగా అక్కడ గత తొమ్మిది సంవత్సరాలుగా జనతన సర్కార్ స్వావలంబనతో స్వయం పాలన చేస్తున్నది. ఇదంతా శ్రమ, సహకార, సమష్టి భావనలతో మాత్రమే కాదు – వీటన్నింటినీ ధ్వంసం చేయడానికి ప్రజలపై ప్రకటించిన యుద్ధాన్ని ప్రజాయుద్ధం ద్వారా ఎదుర్కోవడం వల్ల సాధ్యమవుతున్నది. నాగళ్లే కాదు, వాళ్లు భూమి చదును చేయడానికి, దున్నడానికి ట్రాక్టర్లు కూడ వాడుతున్నారు.

ఫిబ్రవరి 10 – వందేళ్ల క్రితం గుండాదర్ నాయకత్వంలో భూంకాల్ సేన బ్రిటిష్ రాజ్యంపై తిరుగుబాటు చేసిన రోజు. ఆ స్ఫూర్తితోనే ఇవ్వాళ బస్తర్ ప్రజా మిలీషియా సంరక్షణలో ఫిబ్రవరి 10 నుంచి ఆదివాసీ రైతాంగం భూమి చదను కార్యక్రమాన్ని చేపట్టాయి. మారుమూల కొండ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసే ఆదివాసులు బస్తర్ అంతటా దళితులు, పేద ఆదివాసేతరులతో కూడ కలిసి వ్యవసాయం చేసుకోగలుగుతున్నారంటే అది వాళ్లు ఎంచుకున్న వ్యవసాయ విప్లవ మార్గం వల్లనే సాధ్యమవుతున్నది.

మోడీకి అర్థమయ్యే భాషలో చెప్పాలంటే మావోయిస్టులే కాదు, మావోయిస్టులుగా మారిన లేదా పీపుల్స్ మిలిషియాలోనూ, గ్రామ రక్షణ దళాల్లోనూ చేరిన ఆదివాసులు కూడ భుజాల మీద తుపాకులు మోస్తూనే నాగళ్లు మోస్తున్నారు కనుకనే అక్కడ వ్యవసాయం సాధ్యమవుతున్నది. అక్కడ ఇంత యుద్ధంలోనూ ఉత్పత్తి జరుగుతున్నది. అక్కడ రైతుల ఆత్మహత్యలు లేవు. అర్ధసైనిక బలగాలో, కొత్త కొత్త రూపాల్లో పుట్టుకొస్తున్న సాల్వాజుడుం వంటి ప్రైవేట్ మాఫియాల నుంచి తప్ప ఆదివాసీ సమాజాల్లో స్త్రీలపై లైంగిక అత్యాచారాలు లేవు. దొంగతనాలు లేవు. అటవీ సంపదను, వ్యవసాయాన్ని, మానవ శ్రమను కాపాడుకొని గౌరవించడానికే అక్కడ ఆదివాసులు ముప్పై ఏళ్లుగా భారీ పరిశ్రమలను – ముఖ్యంగా బహుళజాతి కంపెనీల, బడా కంపెనీల ప్రవేశాన్ని బస్తర్‌లో నిరోధిస్తున్నారు.

మోడీ పంజాబ్, నక్సల్బరీల ఉదాహరణలు ప్రస్తావించాడు. పంజాబ్ ప్రస్తావన తెచ్చినపుడు బహుశా ఆయన దృష్టిలో 1980 నుంచి 85 వరకు పంజాబ్ యువత చేపట్టిన మిలిటెంట్ ఉద్యమం ఉండి ఉంటుంది. అది ఆనందపూర్ సాహెబ్ తీర్మానం అమలు మొదలు కొనసాగి ఖలిస్తాన్ వరకు వివిధ ధోరణుల్లో సాగవచ్చు గానీ అది కేంద్రానికి, సంపదల, అధికారాల కేంద్రీకరణకు వ్యతిరేకంగా సిక్కు జాతి ఎంచుకున్న మిలిటెంట్ ఉద్యమం. భారత సైన్యం, అర్ధసైనిక బలగాలు అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంపై సైనికదాడి మొదలు 'ఎన్‌కౌంటర్ల' రూపంలో వేలాది మంది యువకులను చంపివేసింది. కాని నిజంగానే ఇవ్వాళ పంజాబ్ ప్రశాంతంగా ఉన్నదా? అక్కడ హరిత విప్లవం వికటించి ఇవ్వాళ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గిట్టుబాటు ధరలు లేక ధాన్యాన్ని పొలాల్లోనే దహనం చేస్తున్నారు. ప్రభుత్వమేమో భూములన్నీ కంపెనీలకు కట్టబెడుతున్నది. నిరుద్యోగం ప్రబలి పంజాబ్‌లో ప్రతి ముగ్గురు యువకుల్లో ఒకరు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. ఇవ్వాళ పాలకవర్గాల అభివృద్ధి మినహాయిస్తే లక్షలాది మంది పంజాబీయుల బతుకులు వలస మార్గం పట్టాయి. అవి అమెరికా, కెనెడా, యూరపు మొదలు దేశంలో ఎక్కడికైనా కావచ్చు. భూ ఆక్రమణకు వ్యతిరేకంగా

విద్యుత్ వైఫల్యాలకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధరల కోసం వేలాదిగా పంజాబ్ రైతులు ప్రతిరోజూ పంజాబ్‌లోనే కాదు, ఢిల్లీ దాకా వచ్చి మిలిటెంట్ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. గజేంద్రసింగ్ ఆత్మహత్య తర్వాత పెద్ద ఎత్తున పంజాబ్ రాష్ట్రమంతా రైల్ రోకో నిర్వహించి – ఇదే 'ఘర్‌వాపసీ' అసలు రూపం అని నినదించారు. ఇవ్వాళ పంజాబ్‌లో నెలకొన్నది శ్మశాన శాంతి.

ఇంక నక్సల్బరీ ప్రశాంతత ఏమిటో ముప్పై ఏళ్ల లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలోను, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ చూస్తూనే ఉన్నాం. మోడీ 'నాగళ్లు – తుపాకులు' పోటీ గురించి, పోలిక గురించి మాట్లాడాడు గనుక రైతాంగానికి సంబంధించి నందిగ్రాం, సింగూర్, జంగల్‌మహల్‌లో ఏం జరిగిందో – వ్యవసాయంలో సాధించవలసింది సాధించాం – ఇంక సాధించవలసింది పారిశ్రామిక రంగంలోనేనని ఇండోనేషియాగా సలీం కంపెనీని, టాటా కార్ల కంపెనీని, జిందాల్ ఉక్కు కర్మాగారాన్ని ఆహ్వానించి వేలాది ఎకరాల పేద ముస్లింల భూములు, రెండు కార్లు పండే సింగూర్ భూములను, ఆదివాసులకు చెందిన అడవి భూములను అప్పగించిన చరిత్ర – నెత్తుటి మరకల తడి ఇంకా ఆరలేదు. నందిగ్రాంలో ప్రతి ముస్లిం కుటుంబానికి రెండు మూడు ఎకరాల భూమి, పెంపుడు జంతువులు, కోళ్లు, మేకలు, బాతులు మొదలైనవి. ఇంటి చుట్టూ స్వయం పోషకమైన వాతావరణం ఉండేది. శాంతినికేతన్‌కు దగ్గరగా ఉండే సింగూర్‌లో భూములు సస్యశ్యామల మైనవి. జంగల్ మహల్ ఉక్కు కర్మాగారం కోసం ఐదు వందల ఎకరాలు జిందాల్‌కు అప్పగించే నాటికి అక్కడ మావోయిస్టు పార్టీ సహకారంతో ఒక స్వావలంబనతో కూడిన స్వయం పోషక వ్యవసాయార్థిక విధానాన్ని సంతాల్ ఆదివాసీ సమాజం విజయవంతంగా ప్రయోగం చేస్తున్నది. 'నందిగ్రాం నుంచి జంగల్ మహల్‌కు సింగూర్ మీదుగా' అనే పుస్తకంలో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం చరిత్ర ఆచార్యుడు అమిత్ భట్టాచార్య చాల వివరంగా ఈ స్వయం పోషక స్వావలంబన అభివృద్ధి గురించి రాశాడు. దీనినంతా నాగళ్లతో కాదు మమతా బెనర్జీ తుపాకులతో ధ్వంసం చేసింది – కార్పొరేట్ కంపెనీల ప్రయోజనం కోసం. నాగళ్ల (వ్యవసాయం) గురించి ఆలోచించే ప్రభుత్వం ఒకటైనా ఉందా?

ఇవ్వాళ కొత్తగా దంతేవాడలోనే కాదు, ఎన్నికల ప్రచార కాలం నుంచి ఏడాదికి పైగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రతి సందర్భంలోనూ నరేంద్ర మోడీ 'తుపాకులు వదిలి నాగళ్లు భుజాలకెత్తుకోండి' అనే ప్రభోధం చేస్తూనే ఉన్నాడు. నిజానికి మావోయిస్టుల ప్రభావం, అండ, సహకారం ఉన్న చోటనే ఇంకా నాగళ్లు మిగిలి ఉన్నాయి. మావోయిస్టులు అభివృద్ధి వ్యతిరేకం అని సాధారణంగా మాట్లాడే వాళ్లంతా – వాళ్లు పరిశ్రమలను వ్యతిరేకిస్తారు. రోడ్లు, రైలు మార్గాలు, ప్రాజెక్టులను వ్యతిరేకిస్తారు అనే అర్థంలోనే మాట్లాడు తుంటారు. నాగరికులకు ఉండే అభివృద్ధి అవగాహనకు భిన్నమైన భూమి – రైతాంగం – వ్యవసాయం పక్షం వహించే మావోయిస్టులు వ్యవసాయ విప్లవం కోసం – భూమి ఇరుసుగా గల వ్యవసాయ విప్లవం కోసమే ప్రజల్ని సాయుధుల్ని కమ్మన్నారు. ఆ భూమిని హరించి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి వ్యవసాయాన్ని ధ్వంసం చేసి రైతుల వెన్నెముక విరవడానికి వచ్చిందే మోడీ ప్రభుత్వం.

ముఖ్యంగా ఇవ్వాళ ఎట్లాగైనా చేసి పార్లమెంట్‌లో నెగ్గించుకోవాలని చూస్తున్న భూ ఆక్రమణ బిల్లు. కోట్లాది మందిని విస్థాపనకు గురి చేస్తూ మోడీ ఎవర్ని నాగళ్లు పట్టుకొమ్మని పిలుపు ఇస్తున్నట్లు? సాయుధ మావోయిస్టులు లేని విశాలమైన భారత భూభాగంలో ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు భుజాల మీద నాగళ్లు మోస్తున్న వాళ్లకు బులెట్లు తినిపిస్తున్నారు. ఆత్మహత్యలు ప్రోత్సహిస్తున్నారు. ఇంతగా నాగళ్ల గురించి, రైతాంగం గురించి ఆలోచించే వాడయితే మోడీ మరి రైతాంగం నుంచి ప్రభుత్వం భూమి ఆక్రమించడానికి మనల్ని నూటా ఇరవై నాలుగు సంవత్సరాల వెనక్కి తీసుకవెళ్లే శాసనం ఎందుకు చేయాలను కుంటున్నట్లు? తూర్పు మధ్య భారతాల్లో ఉండే అటవీ భూముల్ని, సంపదల్ని, తూర్పు, పశ్చిమ కనుమల వెంబడి, సముద్ర తీరాల వెంబడి ఉన్న సంపదల్ని, గ్రామీణ, పట్టణ పరిసర భూముల్ని ఏ గ్రామ సభ అనుమతి లేకుండా, ఏ రైతు అనుకూలత లేకుండా కార్పొరేట్ కంపెనీల కోసం భూములు సేకరించడం అనే పేరుతో ఆక్రమించడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు పడరాని పాట్లు పడుతున్నాయి. ఇదీ నాగళ్ల మీద పాలకుల తుపాకుల ప్రేమ. ప్రజల్ని సాయుధుల్ని చేస్తున్న మావోయిస్టుల ప్రాపంచిక దృక్పథం ఇవ్వాళ ఆయనకు భుజం మీద తుపాకి వలె కనిపిస్తున్నది. భుజం మీద తుపాకి ఉన్నమాట నిజమే కానీ అది ప్రజా రాజకీయాల నియంత్రణలో ఉన్నది.

ఇవ్వాళ బస్తర్‌లో ప్రజా రాజకీయాలను నూతన మానవావిష్కరణ వైపు నడుపుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ పంథా నిర్దేశిస్తున్నది. ముందే చెప్పినట్లుగా వ్యవసాయ విప్లవం భూమి ఇరుసుగా అక్కడ పురోగమిస్తున్నది. అందుకు జనతన సర్కార్‌కు తుపాకి గొట్టం ద్వారా వచ్చిన అధికారం రక్షకవచంగా ఉన్నది. నాగళ్లకు తోడుగా భుజం మీద మోస్తున్న తుపాకీని వదిలితే నాగళ్లను ధ్వంసం చేయడం సులభమని మోడీకి తెలుసు. అయితే ప్రలోభ పెట్టడం, చట్టాలు చేయడం, ప్రభుత్వాలు అవి సాధించలేవని కూడ ఆయనకు తెలుసు. ఆయన చాయ్ వాలా నుంచి చానాళ్ల క్రితమే చట్టాలు చేసే ప్రభుత్వంలో భాగమయ్యాడు గనుక ఆయన ప్రజల మధ్యన ఉండే మావోయిస్టులకు చెప్పినట్లుగా – నువ్వు ఒక్కసారి నువు చంపించిన, అత్యాచారాలు చేయించిన, గృహ దహనాలు చేసిన వేలాది మంది గుజరాతీ ముస్లిం కుటుంబాల మధ్యకు వెళ్లు. ఐదు రోజులు కాదు గదా సెలవు రోజయినా వాళ్లతో గడుపు – నువ్వెంత దుర్మార్గం చేశావో, పాపం చేశావో తెలిసి వస్తుంది అని ఆయనకు చెప్పలేం. ఎందుకంటే గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఆయన ప్రోత్సహించిన భౌతిక మారణకాండ మూడు రోజులదే కావచ్చు కానీ ఐదు పర్యాయాల బిజెపి పరిపాలనలో రగిలించిన విద్వేషాలు, అభివృద్ధి పేరిట ఆచరించిన విధ్వంసం ఇవ్వాళ ఒక ఏడాదిగా దేశ ప్రజల అనుభవానికి వస్తున్నాయి. హింసా హింసల చర్చ సమాజం చేయవలసిందే కానీ ప్రభుత్వాలు – ప్రజలు ఎదురెదురుగా చేయ వలసినవి కావు. రాజ్యం హింసాచరణలో ఉంటుందనే పరిపూర్ణమైన జ్ఞానంతో రాజ్యాన్ని త్యజించి సమాజంలో అహింస ప్రభోదించడానికి జీవితమంతా కృషి చేశాడు బుద్ధుడు. హింసను రాజ్యాధిరోహణకు ఒక రాజపథంగా ఎంచుకున్న నరేంద్రమోడీ చట్టంగా, ప్రభుత్వంగా, ఆయన మాటల్లోనే ఒక ప్రలోభంగా ఇవ్వాళ అహింసా ప్రభోదం చేస్తున్నాడు.

మావోయిస్టులు మనుషులు గనుక, మనుషుల మధ్యన ఉన్న

మనుషులు గనుక, ముఖ్యంగా ఆయన హితం చెప్పిన బస్తర్ అడవుల్లో ఏడు దళాలుగా ప్రవేశించి వేల సంఖ్యలో లక్షలాది ప్రజల మధ్యన విస్తరించిన మనుషులు కనుక ప్రజల విషయంలో ఏమైనా తప్పులు చేసి ఉంటే నిజంగానే ప్రజల నుంచి నేర్చుకుంటారు. దిద్దుకుంటారు. ఎందుకంటే వాళ్లూ ఆ బస్తర్ అడవుల్లో ఆ ఆదివాసుల మధ్యనే ముప్పై ఏళ్లుగా ఎండకూ, వానకూ, చలికీ, శత్రువు దాడులకూ, ఎన్‌కౌంటర్‌లకూ తట్టుకొని బతుకుతూ, అమరులవుతూ ఆదివాసుల్లో భాగమయ్యారు కనుక వచ్చి నిత్యం మారుతూనే ఉన్నారు. వాళ్లవి మార్పు రాజకీయాలు, వాళ్లొక ప్రయోగం చేస్తూనే ఉన్నారు. వాళ్లెవరో వాళ్ల ఆచరణ ద్వారా ప్రజలకు ఏనాడో తెలిసిపోయారు. 'పోలీసులకు, మావోయిస్టులకు మధ్యన ఆదివాసీ ప్రజలు నలిగిపోతున్నారు' అని రాస్తున్న మీడియా, మేధావుల మాటలకు విస్తుపోతూ అక్కడి ఆదివాసులు 'ఇదేమిటి, వీళ్లింత అమాయకులా. మేం మావోయిస్టులమే కదా' అని అంటున్నారు. ఎటొచ్చీ మోడీకి ఇవ్వాళ తానెవరో తెలియకుండా బాధిత కుటుంబాల మధ్యకు వెళ్లే అవకాశం లేదు. ఆయన ఆత్మ విశ్వాసమంతా అధికారం వల్ల వచ్చింది కానీ మనుషుల మధ్య మసలుకోవడం వల్ల రాలేదు. ఆయనకు పునరాలోచనలో పడే అవకాశమే లేదు. ఆయనను మన్మోహన్ సింగ్ కన్న వేగవంతంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంసాన్ని అమలు చేయడానికి అధికారంలోకి తెచ్చిన కార్పొరేట్ శక్తులు తలుచుకుంటే చెత్త కుప్పలోకి విసిరేయగలిగే రోబో మోడీ. ఆయన ప్రయోగమే పెట్టుబడి ప్రయోగం. గుత్తపెట్టుబడి ప్రయోగం మానవ ప్రయోగం కాదు. అందులో మానవసారం లేదు. అందుకే ఈ ఏడాది పాలనే కాదు సుదీర్ఘమైన రక్తపంకిల కుఖ్యాతి చరిత్ర ఆయనకున్నది.

రెండు ఉప కథలు, మే 9న దంతేవాడకు పోవడానికి ముందు ప్రధాని మోడీకి నవరాయపూర్‌లో కూడ మే 8న చాలా కార్యక్రమాలు ఉండె. గుజరాత్‌లో గాంధీనగర్‌తో ప్రారంభమై కొత్త రాష్ట్రాలకు కొత్త రాజధానులు ప్రపంచబ్యాంకు విధానాలకు అనుగుణంగా నిర్మాణ మవుతున్న క్రమంలో నవరాయపూర్‌ను ఒక నమూనా రాజధానిగా పాలకవర్గాలు, మీడియా చిత్రిస్తున్నాయి. అక్కడ మోడీ బహిరంగ సభలో ప్రసంగించడానికి భారీ పెండాల్స్ వేశారు. చాల అట్టహాసంగా వేదిక నిర్మాణం చేశారు. ఎంతో సాంకేతిక విజ్ఞానంతో, కట్టుదిట్టమైన శాంతిభద్రతా చర్యల దృష్టితో కాని అది బహిరంగ సభకు ఒకరోజు ముందే వచ్చిన సుడిగాలికి కుప్ప కూలిపోయింది. దీనిపై సమగ్ర విచారణకు ఉన్నత స్థాయి కమిటీని వేసి ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ మోడీ నవరాయపూర్ కార్యక్రమాలన్నీ రద్దు చేశాడు. చాయ్‌వాలా నుంచి పది లక్షల సూట్‌వాలాగా మారి మొబామా అనిపించుకున్న మోడీ సుడిగాలి పర్యటనకు సుడిగాలి అడ్డుపడడం ప్రకృతి న్యాయంగా ఉన్నది కదూ.

మోడీ బస్తర్ పర్యటన సందర్భంగా మావోయిస్టు పార్టీ 9న బస్తర్ బంద్‌కు పిలుపు ఇచ్చింది. బస్తర్‌లో బంద్ పిలుపు అంతే మిలిటెంట్‌గా జరిగింది. సుకుమా జిల్లాలో అడవిలో చెట్లు కొట్టి రోడ్డు కడ్డంగా వేశారు. నరహంతక మోడీ పర్యటనను బహిష్కరించవలసిందిగా ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఆ సందర్భంగా దంతేవాడ జిల్లాలో కొన్ని గ్రామాల నుంచి గ్రామస్తులను పిలిచి ఒక ఇన్ ఫార్మర్ గురించి ప్రజా న్యాయస్థానంలో విచారణ జరిపారు. గ్రామస్తులు కొందరు మావోయిస్టు పార్టీ నిర్వహించిన ప్రజాకోర్టుకు వెళ్లడాన్ని మీడియా గ్రామస్తులను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు అని ప్రసార, ప్రచార సాధనాల్లో ఒక సంచలన వార్త చేసింది. కొన్ని పత్రికలు వెయ్యి మందిని అపహరించారని రాస్తే కొన్ని పత్రికలు రెండు వందల ఏభై మందిని అపహరించారని రాశారు. నెలల తరబడి పోలీసుల అక్రమ నిర్బంధంలో ఉండే సామాన్య ప్రజలు, సానుభూతిపరులు, రాజకీయ కార్యకర్తల విషయంలో మీడియా కిడ్నాప్, అపహరణ అనే మాట వాడరు. కాని మావోయిస్టులు మాట్లాడడానికి ఎవరిని పిలిచినా అది బలవంతపు అపహరణ అవుతుంది. న్యాయ విచారణ ముగిసి ఇన్‌ఫార్మర్‌ను శిక్షించి గ్రామస్తులను పంపించివేశారు. మోడీ పర్యటన సందర్భంగా మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు సభను విచ్ఛిన్నం చేస్తారని భావించిన వందలాది మందిని కూడ పోలీసులు ఆ రోజంతా నిర్బంధంలోకి తీసుకున్నారు. సాయంకాలానికి వదిలేశారు. అది మీడియాకు వార్త కాలేదు. మోడీ పట్ల ఇంత మూఢ భక్తి ప్రదర్శించిన మీడియా పట్ల కల్లూరి వంటి దుర్మార్గమైన పోలీసు అధికారి కూడ విసుక్కుని గ్రామస్తులనెవరిని మావోయిస్టు పార్టీ కిడ్నాప్ చేయలేదని ప్రకటించాల్సి వచ్చింది. ఎందుకంటే రెండు వందల యాభై మందినో, వెయ్యి మందినో బలవంతంగా అపహరించాలంటే మావోయిస్టుల సంఖ్య ఎన్ని రెట్లు ఉందని ఒప్పుకొన్నట్లు?

(రచయిత పాత్రికేయులు) వీ

రాబోయే సంచికలలో...

- ❖ **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు - రవిచందన్**
- ❖ **రాజ్యాంగ విలువలు - హక్కులు - సంక్షేమం - షేక్ కరిముల్లా**
- ❖ **ప్రాథమిక హక్కుల్లో విద్య మిథ్యేనా? - దుర్గం సారయ్య**
- ❖ **పరాయీకరణ - వై.వి. రమణారావు**

పెట్టుబడులకు మోడీ రెడ్ కార్పెట్

***మోడీ అభివృద్ధి పేరుతో దేశంలోని వనరులను విదేశీ కంపెనీలకు కట్టబెట్టి, అమెరికా ఆధిపత్యానికి వంతపాడుతూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నాడనీ, ఇది దేశ ప్రజలకు ప్రమాదకరమనీ హెచ్చరిస్తున్నారు* సంతోష్**

నరేంద్రమోడీ అధికారం చేపట్టి మే 25 నాటికి ఏడాది పూర్తయింది. ఈ సంవత్సర కాలంలో తమకు ఒరిగిందేమిలేదని సామాన్య ప్రజలు రుసరుసలాడుతున్నారు. మోడీ పాలనలో చెప్పుకోవడానికి సాధించిన అద్భుతాలు అసాధారణ విషయాలు ఏమిలేవు. యుపిఎ విధానాలనే మరింత వేగంగా అమలు చేస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విదేశాల్లో ఉన్న స్వదేశీ దొంగ డబ్బును వెనక్కి తెప్పిస్తానన్న మోడీ అధికార పీఠం ఎక్కగానే తెల్లముఖం పెట్టాడు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. ఉపాధి అవకాశాలు మెరుగు కాలేదు. వ్యవసాయానికి ఆసరా దొరకలేదు. ఆయన తేదలుచుకున్న భూసేకరణ చట్టం దేశవ్యాప్త ఆందోళనకు కారణమైంది. రాజకీయాల్లో ప్రభుత్వంలో అన్నితానై నడుపుతున్న తీరు కూడ విమర్శలకు తావిస్తున్నది. మోడీ కార్పొరేట్ సేవలో తరించి పోవాలని తపనపడుతుంటే, ఆయన మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ మాత్రం హిందూ ఫాసిస్టు ఎజెండాను ముందుకు తీసుకపోతున్నది. విదేశీ, స్వదేశీ అనుకూల విధానాలను ప్రమాదకర వేగంతో దూకుడుగా ముందుకు తీసుకపోతున్నాడు.

మోడీ పాలనలో సమస్యలు పరిష్కారమవుతాయని, ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటుందని, పేదరికం క్రమంగా మటుమాయమవుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని యువత, మధ్యతరగతి, మహిళలు, రైతాంగం ఇలా ప్రతి ఒక వర్గం మోడీ పట్ల అమిత విశ్వాసాన్ని పెంచుకున్నాయి. ఏడాది కాలంలో ఏమీ పనులు చేశారని అవలోకనం చేసుకుంటే మూడు ఆర్డినెన్స్‌లు (బొగ్గు గనుల వేలం, ఖనిజ వనరుల వేలం, భూసేకరణ చట్ట సవరణ), 'యాక్టు ఈస్టు, లుక్ వెస్టు' విధానంలో భాగంలో 18 దేశాలలో ప్రధాని విదేశీ పర్యటన కనిపిస్తుంది. ఈ విదేశీ పర్యటనల ద్వారా దేశానికి ఏమైనా ప్రయోజనం చేకూరిందా అంటే ఏమిలేదని చెప్పవచ్చు. ఎంతమంది విదేశీ పెట్టుబడి దారులు మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపించారు అంటే ఇదమిత్థంగా చెప్పలేం. ప్రచారానికి ఇస్తున్నంత ప్రాధాన్యత పనులు చేయడంలో కనిపించడం లేదని బిజెపి మాజీ మంత్రి అరుణ్ శౌరి పేర్కొనడం గమనార్హం. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వానికి యుపిఎకు తేడా ఏమి లేదని రాష్ట్రీయ స్వాభిమాన్ ఆందోళన వ్యవస్థాపకుడు కెఎస్ గోవిందాచార్య విమర్శించడం గమనార్హం. 'మేక్ ఇన్ ఇండియాను' 'మేక్ ఫర్ ఇండియా'గా లేదా 'మేడ్ బై ఇండియా'గా మార్చుకోవాలని ఆయన సూచించారు. లేదంటే 'ఇండియా ఫర్ సేల్' అంటూ సంకేతమిచ్చినట్టేననడం అక్షర సత్యం. మొత్తంగా చూస్తే, మోడీ ప్రభుత్వ పాలనలో స్తబ్దత ఆవరించినట్లు విదితమవుతుంది.

ఆర్థిక విధానాలే తన విదేశాంగ విధానాన్ని నడిపే శక్తిగా మోడీ ప్రకటించుకున్నాడు. ఆర్థిక విధానాలంటే ఆయన దృష్టిలో స్వతంత్రతకు, స్వావలంబనకు కట్టుబడిన దేశీయ ఆర్థిక విధానం కాదు. సామ్రాజ్యవాదులకు పచ్చి లొంగుబాటు విధానం. మోడీ ప్రభుత్వం వాణిజ్య అభివృద్ధికి, పెట్టుబడుల ప్రవాహానికి అవరోధంగా ఉన్న పలు నియమాలను తొలగించింది. భారత ప్రభుత్వం పెట్టుబడులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆశించే స్థితిలో ఉండగా సామ్రాజ్యవాద దేశాలు పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే స్థితిలో ఉన్నాయి. అందువల్ల పెట్టుబడులు రావాలంటే వారి పెట్టుబడులకు అనుకూలంగా దేశీయ చట్టాలను, విధి విధానాలను మార్చి, వారి దోపిడీ సజావుగా సాగిపోయేందుకు వీలుగా ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా పరిస్థితులను కల్పించక తప్పదు అంటున్నారు. ఇచ్చే దేశానికి, పుచ్చుకునే దేశానికి మధ్య ఉన్న తేడా రెండు దేశాలమధ్య అసమాన సంబంధాలకు, ముఖ్యంగా భారత ప్రజలకు శ్రేయస్సుకు వ్యతిరేకంగా, దేశీయ పెట్టుబడికి, పరిశ్రమల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పరిణమించనున్నాయి. మన పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు పరుస్తూ, విధ్వంసకర అభివృద్ధి విధానాలు రూపొందించి అమలు చేస్తున్నారు. ఫలితంగా సహజ వనరులు, మానవవనరులు సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలోకి, యథేచ్ఛగా వారి దోపిడీకి అప్పగించే 'అభివృద్ధి' నమూనాను అనుసరిస్తున్నారు.

భారతదేశంలో ఉత్పత్తి రంగానికి కొత్త ఊపునిచ్చి, పెట్టుబడుల ప్రవాహం వచ్చేలా చేసే లక్ష్యంతో మోడీ 'భారత్‌లో తయారీ' (మేక్ ఇన్ ఇండియా) పేరిట ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'వాణిజ్యవేత్తలు, పెట్టుబడి దారులు' భారత్‌లో తమ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ 2014 సెప్టెంబర్ 25న ప్రప్రథమంగా 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని ప్రకటించాడు. ఇందుకోసం పెట్టుబడికి ఆటంకాలుగా ఉన్న చట్టాలను, నిబంధనలను తొలగించి, అధికారిక విధానాలను సరళీకృతం చేసి బాధ్యతాయుతంగా ఉంటానని కార్పొరేట్లకు హామీ ఇచ్చాడు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం పెంచడం ప్రధానాంశంగా పరిశ్రమల స్థాపనకు నిర్దిష్ట కాలపరిమితిలో ఒకే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సంబంధిత పరిశ్రమలకు ఆమోదాలు లభించేలా చూస్తానన్నాడు. ఈ ప్రణాళికను విజయవంతం చేయడానికంటూ ఆయన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, రష్యా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, చైనా వగైరా 18 దేశాలలో పర్యటించారు. బహుశ సంవత్సర కాలంలో ఇంతగా విదేశీ పర్యటనలు చేసిన ప్రధాని

మనదేశంలో ఇప్పటివరకు ఎవరులేరు. మోడీ దృష్టిలో విదేశాంగ విధానం అంటే వాణిజ్య ఒప్పందాలు, విదేశీ పెట్టుబడులను స్వాగతించడం తప్ప పరస్పర సహకారం, శాంతియుత సంబంధాలు, స్వావలంబన కానరావు.

మోడీ 2014 సెప్టెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు అమెరికాలో పర్యటించినపుడు 'అగ్రశ్రేణి అమెరికన్ కార్పొరేట్ల సిఇఒలతో జరిపిన చర్చల్లో' ఇకపై 'రెడ్ టేపు కాదు-రెడ్ కార్పెట్' పరుస్తామని హామీ ఇచ్చారు. అంటే కావలిసిన క్లియరెన్స్‌లు, రాయితీలు మీరు కోరినట్లు ఇస్తాం - భారత్‌కు పెట్టుబడులతో తరలిరండి అని అర్థం. మోడీ అమెరికా బయలు దేరే ముందు ప్రాణరక్షణ ఔషదాలను ధరల నియంత్రణ చట్టం నుండి తొలగించి అమెరికన్ బహుళజాతి సంస్థలకు తన విధేయతను తెలియ జేశాడు. అమెరికా పర్యటన ఆద్యంతం అగ్ర రాజ్యానికి దాసోహం అనడానికి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల, ఆయుధ ఉత్పత్తిదారుల దోపిడీని మరింత విశృంఖల పరచడానికి దోహదపడేలా ఉంది. అమెరికాకు సంబంధించి దాని ప్రయోజనాలు దానికున్నాయి. చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలిపే ఉద్దేశంతోనే అది భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. పదేళ్ల రక్షణ ఒప్పందం అందులో ఒకటి. దాన్ని 2015 నుంచి మరో 10 ఏళ్లు పొడగించేందుకు మోడీ అంగీకరించాడు. దీంతో అమెరికా సామ్రాజ్యవాదానికి, అంతర్జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేర్చడానికి ఒక జూనియర్ భాగస్వామిగా భారత్ హోదాను మరింతగా పెంచే ప్రయత్నం జరిగింది. అమెరికా ఆయుధ పారిశ్రామిక వేత్తలను ఆకర్షించేందుకే రక్షణ ఉత్పత్తుల రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డిఐ) లను 49 శాతానికి పెంచడం గమనార్హం.

రక్షణ సహకార ఒప్పందం అనేది అమెరికా-భారత్ వ్యూహాత్మక పొత్తులో కీలకమైన భాగం. భారత్ ఇప్పటి వరకు అనుసరిస్తూ వచ్చిన అలీన వైఖరి నుంచి ఇది పూర్తిగా పక్కకు మళ్ళడమే. ఆసియాలో భౌగోళిక రాజకీయ వ్యూహాన్ని అమలు చేసేందుకు గానూ భారత్‌ను అమెరికా మిత్ర పక్షంగా వాడుకోవాలని అభిలషిస్తోంది. జపాన్ కాకుండా, భారత్ మరో ప్రధాన ఆసియా దేశం. అందుకే చైనాను నిలువరించాలంటే భారత్‌కు కీలక పాత్ర ఇవ్వాలని అమెరికా భావిస్తోంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని అమెరికా సమతూకం చేసుకునే ఉద్దేశ్యంతో పదేళ్ల రక్షణ ఒప్పందం పునరుద్ధరించాలన్న నిర్ణయం తీసుకుంది. అమెరికాతో మోడీ ప్రభుత్వం ఎంత లోతుగా సైనిక సంబంధాలు పెట్టుకుంటుందో భారత్‌కు ప్రమాదం అంత తీవ్రంగా ఉంటుంది. చిక్కులు అంత క్లిష్టంగా ఉంటాయి. భారత సైన్యాన్ని అమెరికా సైనిక రథ చక్రాలకు కట్టివేసినట్లు అయింది. అమెరికా చేసే యుద్ధాలన్నింటిలో భారతసైన్యం పాల్గొనవలసి ఉంటుంది. అందువల్ల అమెరికాతో తాజాగా రక్షణ సహకార ఒప్పందం కుదుర్చు కోవడం దేశ మౌలిక ప్రయోజనాలకు విరుద్ధం. అంతేకాక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి, స్వతంత్ర విదేశాంగ విధానానికి కూడా వ్యతిరేకం. ఆసియాలో అమెరికా భౌగోళిక, రాజకీయ వ్యూహంలో కిందిస్థాయి భాగస్వామిగా భారత్ మారింది. భారత రక్షణరంగ ఉత్పత్తుల తయారీకి అమెరికా కంపెనీలకు రెడ్‌కార్పెట్ వేయడం మరీ దారుణం. అత్యంత రహస్యంగా ఉండాల్సిన రక్షణరంగంలోకి విదేశీ కంపెనీలు ప్రవేశిస్తే దేశ భద్రత, సమగ్రతకు ప్రమాదం. నిత్యం దేశభక్తి గురించి గొప్పలు చెప్పుకునే మోడీ, ఆయన పార్టీ అత్యంత కీలకమైన రక్షణ రంగంలోకి అమెరికా కంపెనీలను ఆహ్వానించడంపై ప్రజలకు సమాధానం చెప్పాలి.

డబ్లుటిఒ వాణిజ్య వెసులుబాటు ఒప్పందం, మేధోహక్కులు (ఐపిఆర్), ఐఎస్ వ్యతిరేక సంకీర్ణంలోకి మన దేశాన్ని రాబట్టడం అమెరికా తక్షణ ప్రాధాన్యతలుగా ఉన్నాయి. అయితే ఈ విషయాల్లో చర్చల్లో పురోగతి లేదు. అయినా టెర్రరిజంపై పోరాటం పేరుతో భారత్ - అమెరికా - ఇజ్రాయిల్ గూఢచారి సంస్థల మధ్య సహకారం మరింత పెంపుదలపై కుదిరిన ఒప్పందాలను తీవ్రంగా పరిగణించాలి. ఐఎస్ఐఎస్ వ్యతిరేక సంకీర్ణంలో చేరడానికి మోడీ ప్రభుత్వం లాంఛనంగా అంగీకరించక పోయినా ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మొస్సాద్ మరింత క్రియాశీలక పాత్ర వహించడం ద్వారా అంతిమంగా మనదేశం పశ్చిమ ఆసియాలో యూదు దురహంకారుల పన్నాగాల్లో, చేరేటట్లు చేయగలదు. ఈ ప్రయత్నంలో మొస్సాద్‌కు అమెరికన్‌ల సహాయం ఉండనే ఉంటుంది.

అణు లయబిలిటి చట్టం కారణంగా మన దేశంలో అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అమెరికన్ కంపెనీలు ముందుకు రాలేదు. భారత అణు పరిహారచట్టం ప్రకారం అణు ప్రమాదం జరిగినపుడు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని గరిష్టంగా 1500 కోట్ల రూపాయలు నిర్ణయించారు. అయితే వందల బిలియన్ డాలర్ల అణువ్యాపారాన్ని సొంతం చేసుకోవడానికి అవి తహతహలాడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు 2015 జనవరిలో భారత్ వచ్చినప్పుడు మోడీ ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలను సామ్రాజ్యవాద అధినేతకు నజరానాగా సమర్పించింది. అదేమిటంటే అణు ప్రమాదం జరిగినప్పుడు చెల్లించే బాధ్యతను విదేశీ కంపెనీలకు లేకుండా చేస్తానని మోడీ ఒబామాకు హామీ ఇచ్చాడు. దీని కొరకు ఒక బీమానిధిని ఏర్పాటు చేస్తారు. అమెరికా కంపెనీలు బీమా తీసుకోవడానికి వెనుకాడవు. బీమా చెల్లించే ప్రీమియం ఎంత తక్కువ వుంటే నష్టపరిహారం మొత్తం అంత పరిమితంగా ఉంటుంది. అణు పరిహార చట్టానికి తూట్లు పడింది. విదేశీ కంపెనీలకు పరిహారం చెల్లించే బాధ్యత వుండదు. ఈ నేపథ్యంలో రెండు ప్రైవేట్ కంపెనీలతో (వెస్టింగ్ హౌస్, జిఇ - హిటాచి) చర్చించడానికి అంగీకరించడం, మోడీ లొంగుబాటును సూచిస్తోంది.

భారత్‌ను తయారీ రంగానికి కేంద్రస్థానంగా మార్చాలని, ఇక్కడి పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ఉత్పత్తుల ఎగుమతుల్ని పెంపొందించాలని మోడీ అభిలషిస్తున్నారు. దేశంలో వివిధరంగాలలోకి విదేశీ పెట్టుబడులను రప్పించేందుకు చట్ట సవరణలు చేయడం, బుల్లెట్ రైళ్లు, ఆధునిక రైల్వే లైన్ల నిర్మాణం, వంద స్మార్ట్ సిటీల నిర్మాణం, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు, యువతకు శాస్త్ర, సాంకేతిక నైపుణ్యం మెరుగుదల వంటి మోడీ ఆలోచనలు అమెరికా ప్రభుత్వానికి, అక్కడి పెట్టుబడిదారులను, పారిశ్రామిక వేత్తలను, ఉన్నత విద్యా సంస్థలను భారతదేశంలో భారీగా పెట్టుబడులుపెట్టి తమ కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు ప్రేరేపించేవిగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ పరిణామాల విషయంలో ఇరుదేశాల మధ్య పొడచూపిన అభిప్రాయ బేధాల తొలగింపు, పెట్టుబడుల కల్పనకు ప్రతికూలతలు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో సహకారం, రక్షణ ఉత్పత్తులు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి మోడీ పర్యటన

అమెరికా ప్రయోజనాలు నెరవేర్చేదిగానే ఉంది. ప్రధానంగా ఆసియాలో చైనాకు వ్యతిరేకంగా అమెరికా అధిపత్యం నిలుపుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగస్వామి కావడం వల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు, సైనిక వ్యయం పెరుగుతుంది. లాభపడేది మాత్రం సామ్రాజ్యవాద దేశాలు, ఆయుధ ఉత్పత్తిదారులేనన్నది యథార్థం.

మన మీడియా వ్యక్తి ఆరాధనలో ఎంత తన్మయం చెందినా, అమెరికన్ మీడియా మాత్రం సాధారణంగానే స్పందించింది. మోడీ అమెరికాకు దగ్గరయ్యారు కాని 'భేదాభిప్రాయాలు అలాగే ఉన్నాయి' అనే శీర్షికతో వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించింది. మిగతా పత్రికలు అదే రీతిలో స్పందించాయి. నౌకాయాన సహకారం ద్వారా దక్షిణ చైనా సముద్రంలో 'చైనా దురాక్రమణను అణిచే ఫ్రంట్'గా సంయుక్త ప్రకటనలో సంబంధిత ప్రస్తావనలకు పత్రికలు విపరీత అర్థాలు తీస్తున్నాయి. ఆసియా–పసిఫిక్‌లో తన ఆధిపత్యాన్ని పెంచుకునే అమెరికా వ్యూహంలో భారత్ చిక్కుకుంటే ప్రమాదంలో ఇరుక్కోవడమే అవుతుంది. మోడీ, ఆయన పార్టీ చైనా వ్యతిరేక భావజాలం నుండి దేశంలో రాజకీయ లబ్ధిపొందాలని చూస్తోంది. ఈ అవకాశాన్ని అమెరికా తన భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. అందువల్ల భారతీయ మీడియా సమస్యలను దేశ ప్రయోజనాల కోణం నుంచి విశ్లేషించే బదులు నరేంద్రమోడీ ఆరాధనలో మునిగిపోతే తర్వాత చింతించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సర్వాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటున్న మోడీ నిరంకుశ పెత్తందారీ పోకడగూర్చి మీడియా గొంతెత్తాలి. లేకపోతే ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, లౌకికత్వం వంటి విలువలు ప్రమాదంలో పడతాయి.

పెట్టుబడులను ఆకర్షించడం, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరింప చేయడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సముపార్జించడం, 'మేక్ ఇన్ ఇండియా'లో భాగస్వాములుగా చేయడం లక్ష్యంగా మోడీ విదేశీ పర్యటన కొనసాగింది. 2014 ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 3 వరకు మోడీ జపాన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ జపాన్' పెట్టుబడుల పెంపు భాగస్వామ్యాన్ని ప్రకటించారు. మొత్తం ఐదు ఒప్పందాలు కుదిరాయి. రానున్న ఐదేళ్లలో ఓవర్‌సీస్ అభివృద్ధి సహాయంతో కలిపి 35 బిలియన్ డాలర్లు (రు.2,20,000 కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. చైనా అధ్యక్షుడు భారత్‌లో 2014 సెప్టెంబర్ 17–19 తేదీలలో పర్యటించారు. ఈ సందర్భంలో ఆర్థిక, వాణిజ్యపరమైన 13 ఒప్పందాలు కుదిరాయి. మనదేశంలో చైనా రాబోయే ఐదు సంవత్సరాలలో 20 బిలియన్ డాలర్లు (రు.1,30,000 కోట్లు) పెట్టుబడులను పెట్టనుంది. ఆస్ట్రేలియా ప్రధాని టోని అబ్బోట్ 2014 సెప్టెంబర్ 14–15 తేదీలల్లో భారత్‌లో పర్యటించారు. ఆస్ట్రేలియాలో నవంబర్ 14–18 తేదీల్లో జరిగిన జి.2 సమావేశానికి మోడీ వెళ్లినప్పుడు ఆస్ట్రేలియా ప్రధాని టోని అబ్బోట్‌తో కుదిరిన ఒప్పందాలలో ప్రధానమైనది భద్రతా ఒప్పందం. 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ సెక్యూరిటీ కోఆపరేషన్' పేరుతో పేర్కొనబడిన ఒప్పందం అమెరికా భౌగోళిక వ్యూహంలో ఇండియాను పావుగా చేసిందన్న విషయాన్ని గుర్తించాలి. ఇండియా – ఆస్ట్రేలియా, అమెరికా మధ్య (ఉమ్మడి) సైనిక విన్యాసాలు పెరుగుతాయి. ఈ సందర్భంగానే యురేనియం సరఫరాకు ఒప్పందం కుదిరింది. ఆస్ట్రేలియా, కెనడా దేశాలు సరఫరా చేయనున్న యురేనియం సమాన స్థాయి వ్యాపార సంబంధాల్లో భాగంగా జరిగేది కాదు. అమెరికా, దాని మిత్ర దేశాలతో వాణిజ్య, రాజకీయ, ఆర్థిక సంబంధాలను మరింత దృఢతరం చేసుకుని, అమెరికా శిబిరానికి భారత్ మరింత దగ్గర అయ్యే భౌగోళిక రాజకీయ అవసరం రీత్యానే యురేనియం సరఫరా అవుతుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2014 డిసెంబర్ 11న భారత పర్యటన సందర్భంగా వేలకోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు జరిగాయి. ప్రధానంగా రక్షణ, శక్తి, వాణిజ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పరిశోధన–అభివృద్ధి తదితర రంగాలలో ఒప్పందాలకు కుదిరాయి. 226.టి తేలికపాటి హెలికాప్టర్లు 400 భారత్‌లో రష్యా సాంకేతిక పరిజ్ఞానంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ భాగస్వామ్యంతో తయారు చేస్తారు. అణు విద్యుత్తు తయారీకీ సంబంధించిన 12 రియాక్టర్లు సరఫరా చేస్తుంది.

మోడీ 2015 ఏప్రిల్ 10,11 తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటించాడు. ఈ సందర్భంగా రక్షణ, అణువిద్యుత్తు, అంతరిక్షం, ఆర్థికపరమైన 11 ఒప్పందాలు కుదిరాయి. 2001లో 126 యుద్ధ విమానాలు కొనాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడు మొదలైన విమానాల కొనుగోలు కథ నేటిదాక అనేక మలుపులు తిరిగింది. 15 ఏళ్ల తర్వాత మోడీ ఫ్రెంచి పర్యటన సందర్భంగా ఫ్రెంచి కంపెని దసూం నుంచి 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు నిర్ణయం జరిగింది. ఒక్కో విమానం ఖరీదు రూ.1250 కోట్లు, ఇవి కూడ మరో నాలుగేళ్ల తర్వాత సరఫరా అవుతాయి. కాలయాపన జరిగిన వాటి సాంకేతిక పరిజ్ఞానం బదిలీ మనకు దక్కడం లేదు. సంపన్న దేశాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ససేమిరా బదిలీ చేయవు, చేసినా కాలం చెల్లిన ద్వితీయ శ్రేణి పరిజ్ఞానాన్ని బదిలీ చేస్తాయి. ఏప్రిల్ 12–14 తేదీల్లో జర్మనీ సందర్శించారు. ఈ సందర్భంగా భారత్ 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు మద్దతును జర్మనీ ప్రకటించింది. అక్కడి నుంచి కెనడాలో 14–17 తేదీల మధ్య పర్యటించాడు. కెనడా భారత్‌కు యురేనియం సరఫరా చేయడానికి అంగీకరించింది. ఇరుదేశాల మధ్య వర్తక, పెట్టుబడుల సంబంధాలను విస్తృతం చేసుకోవాలన్న లక్ష్యాన్ని ప్రకటించారు.

21వ శతాబ్దం ఆరంభంలోనే ఆసియా చోధకశక్తి అని గుర్తించబడింది. జపాన్ పర్యటనలో చైనాను ఉద్దేశించి మోడీ పరోక్షంగా వ్యాఖ్యలు చేసినా, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్ రాగానే అదే మోడీ ఘనస్వాగతం పలికాడు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన భారత్ పర్యటనకు గల మూడు లక్ష్యాలను వెల్లడించారు. ఒకటి, ఇరు దేశాల మధ్యగల మైత్రిని ముందుకు తీసుకెళ్లడం. రెండు, ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని మరింత పెంపొందించడం. మూడు, రెండు దేశాలు అభివృద్ధిని ప్రాధమ్యంగా ఎంచుకున్నందున కలిసికట్టుగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం. 'చైనా – భారత్‌లు ప్రపంచంలోనే రెండు అతిపెద్ద వర్ధమాన దేశాలు, ప్రాదుర్భావ మార్కెట్లు, పెరుగుతున్న బహుళ ధృవ ప్రపంచంలో మనం రెండు ముఖ్యమైన శక్తులం కూడా. అందువల్ల మన సంబంధానికి వ్యూహాత్మక, ప్రపంచ ప్రాముఖ్యత ఉంది' అని ఆయన వక్కాణించారు. మన సరిహద్దుల్లో ఏదైనా చిన్న ఘటన జరగ్గానే మన మీడియా బిగ్గరగా గొంతెత్తడం, కొన్ని ఉన్మాదశక్తులు తరచు పాకిస్తాన్, చైనా వ్యతిరేకతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో సరిహద్దు వివాధాలను పరిష్కరించుకోవడానికి ద్వైపాక్షిక సంబంధాల వృద్ధి దిశలో

పయనించడానికి రాజకీయంగా నిబద్ధం కావడం ఇరు దేశాల ఆర్థిక వాణిజ్య సంబంధాల పురోగమనానికి కీలక అంశం. భారత్ – చైనాల మధ్య గుజరాత్‌లో 3, ఢిల్లీలో 12 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. మనదేశంలో రానున్న ఐదేళ్లలో రెండు పారిశ్రామిక పార్కులను చైనా నెలకొల్పనుంది. వాటి విలువ దాదాపు 200 కోట్ల అమెరికా డాలర్లు (రు.12600 కోట్లు). చైనాలాగ భారత్ ఆర్థికాభివృద్ధి సాధించలేక పోవడానికి ప్రధానకారణం చైనా తయారు చేసిన వస్తువులను ఎగుమతి చేస్తుండగా భారత్ ముడి ఖనిజాలను ఎగుమతి చేస్తుంది. మోడీ 2015 మే 14-16 తేదీల్లో మోడీ చైనాలో పర్యటించారు. భారత్ – చైనాల మధ్య రు. 1000 కోట్ల డాలర్ల (రు. 63,000 కోట్లు) విలువైన 24 ఒప్పందాలు కుదిరాయి. ఇరుదేశాల కంపెనీల మధ్య మరో 26 ఒప్పందాలు (రు. 1,39,000 కోట్లు) కుదిరాయి. భారత్ – చైనాల మధ్య రాబోయే కాలంలో పెరిగే ఆర్థిక సంబంధాలు, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో భారత దేశ సంబంధాలపై భవిష్యత్తులో ఏ విధమైన ప్రభావం చూపనుందో వేచిచూడాలి.

భారత్‌ను స్వయం సమృద్ధి గల దేశంగా, అంతర్జాతీయంగా భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త గుర్తింపు తేవడం లక్ష్యంగా ప్రకటించినప్పటికీ విదేశీ పర్యటనల ద్వారా మోడీ సాధించింది ఏమీలేదు. ఉత్పత్తి రంగం పుంజుకోలేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగలేదు. ఎగుమతులు పెరుగ లేదు. వాణిజ్యలోటు తగ్గలేదు. ద్రవ్యోల్బణం అలాగే ఉంది. ఉపాధికల్పన, ద్రవ్యలోటు తగ్గింపు, ఎనిమిది శాతం ఆర్థికాభివృద్ధి లక్ష్యాలుగా చెపుతున్నా, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పరిశీలిస్తే అవేమి సాధ్యమయ్యేటట్లు కనిపించడం లేదు. ఈ కాలంలోనే 'పెట్టుబడులకు రక్షణ, లాభాలకు భరోసా' కల్పించడానికి కార్మికుల హక్కులు హరించే విధంగా కార్మిక చట్టాలను సవరించింది. భూసేకరణ పేరుతో భూ స్వాధీన చట్టం కొరకు ఆర్డినెన్స్ తెచ్చింది. బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 29 నుంచి 49 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ తెచ్చింది. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసింది. బ్యాంకుల విలీనం పేరుతో పేదల పరపతిని దెబ్బతీసింది. పర్యావరణ విధ్వంసకరమైన, ఉపాధిరహిత, సహజ వనరులను లూటీ చేసే ఆర్థిక విధానాలకు కంకణ బద్ధమైనట్లు 'మేక్ ఇన్ ఇండియా' పథకంతో తేటతెల్లమవుతుంది.. రక్షణ, బీమా, రైల్వే, బ్యాంకింగ్, రిటైల్ వ్యాపార రంగాలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కొరకు కార్పొరేట్ల ముందు సాగిలపడుతుంది. ఇవన్నీ స్వావలంబనకు తిలోదకాలు ఇచ్చే, జీవనాధారాలను, జీవికను కొల్లగొట్టే, సార్వభౌమత్వానికి తూట్లుపొడిచే సామ్రాజ్యవాద అనుకూల విధానాల్లో భాగమే. విదేశీ మార్కెట్ కొరకు, విదేశీ పెట్టుబడులతో, విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో చేసే ఉత్పత్తి వలన మన దేశానికి ఒరిగేది ఏమిలేదు. దేశీయ, విదేశీ కార్పొరేటు శక్తులు మాత్రం భారీగా లాభాలు దండుకుంటాయి. 'మేక్ ఇన్ ఇండియా' విధానాలు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించేవి కావన్నది స్పష్టం.

ఆసియా ఖండంలోని భూటాన్, ఫిజీ, నేపాల్, శ్రీలంక, సిసీల్స్, మారిషస్, మంగోలియా, దక్షిణకొరియా దేశాలలో కూడా మోడీ పర్యటించారు. ఆ దేశాలను ప్రభావితం చేయడానికి ఆర్థిక సహకారాన్ని కూడా ప్రకటించాడు. అమెరికా, పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడుల లక్ష్యం గరిష్ఠ లాభార్జననే తప్ప భారతదేశ ఉత్పాదకతా సామర్థ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం కానే కాదు. భారత మార్కెట్ ద్వారాలను ఇలా విదేశీ పెట్టుబడులకు తెరవడంతో మనదేశంలోని సహజ వనరులు, చౌకగా దొరికే కార్మికుల శ్రమశక్తిని కొల్లగొట్టి విదేశీ కంపెనీలు అధిక లాభాలు దండుకోవడానికి అవకాశ మిస్తాయి. ఇది కచ్చితంగా భారత ప్రజలపై మరిన్ని భారాలు మోపడానికి, ఇబ్బందులు పెరుగడానికి దారి తీస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేగాకుండా అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పొరుగుదేశాలతో ఉన్న సత్సంబంధాలను త్యాగం చేయడం భారత్ ప్రయోజనాల రీత్యా మంచిది కాదు.

భారత సైన్యాన్ని ఆధునీకరించడం, సరిహద్దు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు పెంచడం, చైనా సరిహద్దు పొడవునా సైన్యాన్ని రెట్టింపు చేయబోతున్నట్లు ప్రకటించడం, తూర్పు, ఆగ్నేయాసియా దేశాలైనా సింగపూర్, దక్షిణకొరియా, వియత్నాం, జపాన్ దేశాలతో భారత సంబంధాలు ఆర్థిక – రాజకీయాంశాలలో పురోభివృద్ధి దిశలో కొనసాగడం చైనా కలవరపాటుకు కారణమవుతుంటే. 'బి సి ఐ ఎం కారిడార్, ఇండో – పసిఫిక్ మారిటైమ్ సిల్క్‌రూట్, వంటి వ్యూహాత్మక విధానాలు భారతదేశాన్ని కలవరానికి గురిచేస్తున్నది. మోడీ చైనా సందర్శనకు రెండు రోజుల ముందు చైనా ప్రభుత్వ పత్రిక మోడీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. చైనాకు వ్యతిరేకంగా భద్రతా అంశాలపై జిత్తులు ప్రదర్శిస్తున్నాడని నిందించింది. భౌగోళిక రాజకీయాల నుండి ఏర్పడ్డ చారిత్రక విరోధం, ఒకరంటే ఒకరికి ఉన్న అపనమ్మకాన్ని ఆ పత్రిక పేర్కొంది. ఇరుదేశాల నాయకులు వారి వాక్చాతుర్యాన్ని చేతలలో చూపాలని సలహా ఇచ్చింది. చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను కలుపుకోవాలనే అమెరికా, జపాన్ ఎత్తుల పట్ల చైనా గమనింపుతోనే ఉంది. అదే సమయంలో భారత వ్యాపార వర్గాలు చైనాతో ఆర్థిక సంబంధాలు అభివృద్ధి చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్నాయనే విషయం కూడా చైనాకు తెలుసు. తయారీ, మౌలిక రంగాల్లో భారత్ విస్తృత అవసరాలు చైనాను ఊరిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే అమెరికాకు లొంగుబాటు, చైనా – రష్యాతో సర్దుబాటు అన్న చందంగా మన విదేశీ విధానం రూపు దిద్దుకుంటుంది. విదేశీ విధానం పరస్పర సహకారం, అభివృద్ధికి సహకరించుకోవడం, ఇరుగు పొరుగు దేశాలతో శాంతియుత సంబంధాలు నెలకొల్పడం. తద్వారా స్వావలంబన, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం జరగాలి. ప్రస్తుతం మోడీ విధానాలు గమనిస్తే అమెరికా భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతూ, హిందూ మహాసముద్రంలో, ఆసియా పసిఫిక్‌లో అమెరికా ఆధిపత్యానికి తోడ్పడుతూ చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేయాలనే అమెరికా వ్యూహానికి వంత పాడుతున్నట్లుంది. మరోవైపు సామ్రాజ్యవాద పెట్టుబడులను స్వాగతిస్తూ దేశీయ వనరులను, చౌక శ్రమశక్తిని కొల్లగొట్టడానికి సహకరించే విధంగా ఉంది. ఈ విధానాలు ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించజాలవు సరికదా! మరింతగా విస్తృతం చేస్తాయని గమనించాలి. విదేశీ పెట్టుబడులతో దేశీయ అభివృద్ధిని ఆశించడం వట్టి భ్రమే. స్వంత ఉత్పత్తి, స్వంత మార్కెట్‌పై ఆధారపడితేనే స్వావలంబన సాధ్యమవుతుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

ఎవరి అచ్చే దిన్ కోసం అడుగులు?

అధికారం కోసం ఎన్నో ప్రజా సంక్షేమ పథకాల వాగ్దానాలు చేసిన మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించిందనీ, అవి కేవలం ఎన్నికల ప్రగల్భాలేనని మరోసారి రుజువు చేసిందనీ అంటున్నారు **బి. రామకృష్ణ**

అచ్చే దిన్ ఆయేగీ... అంటూ ఏడాదిగా పాలనలో కొనసాగుతున్నది మోడీ ప్రభుత్వం. 2014 ఎన్నికల్లో కార్పొరేటు శక్తులు వాటి అనుంగు మీడియా మోడీని ఆకాశానికి ఎత్తుకున్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు అమెరికాలో అడుగుపెట్టడానికి అంటరానివాడిగా చూడబడిన వ్యక్తికి అదే అమెరికా ఘనమైన స్వాగతం పలికింది. అతని రాకకోసం అమెరికా ప్రభుత్వం అక్కడి కార్పొరేట్ శక్తులు వేయి కళ్లతో ఎదురుచూసి సాదరంగా, గౌరవ ఆతిథ్యం ఇచ్చాయి. ఒబామా తన దేశ ఆర్థిక అవసరాలను చక్కబెట్టే అణు ఒప్పందంపై మోడీతో సంతకాలు చేయించేసుకున్నాడు. అణు ఒప్పందం, అణు రియాక్టర్ల స్థాపన వల్ల భారత్‌లో కలిగే తీవ్రమైన పర్యావరణ, ప్రాణహాని, మరెన్నో ఇతర నష్టాలను పక్కనబెట్టి మోడీ సునాయసంగా ఒబామాకు సలాం కొట్టాడు. ఒబామా మోహం మోడీని ఎంతలా ఆవహించిందోకదా! ధనదాహంతో తపించిపోతున్న బహుళజాతి శక్తులకు ఇండియా వంటి పుష్కలంగా సహజవనరులు, సంపదలున్న దేశం బంగారు బాతులాగా కనిపించక మానదు. ఇక్కడ చౌకగా లభించే మానవ శ్రమ, మీదు మిక్కిలి వాటి వ్యాపార లాభాల కోసం భేషరతుగా తలలూపే పాలక వర్గాలు ఇక్కడ సిద్ధంగా ఉండనే ఉన్నాయి. ఆ వర్గాల్లో ఒకటిగా ఏకమై ఉన్న మోడీ వారికి ఇష్ట సఖుడుగానే ఉండక ఏమవుతాడు. ఈ పరిస్థితుల్లో అచ్చే దిన్ ఎవరికి వస్తాయో, లేదా ఎవరికి వచ్చాయో చెప్పడం కష్టమా?

ప్రపంచవ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైన సామాన్య ప్రజల కనీస అవసరాలు తీర్చి మెరుగైన, గౌరవ ప్రదమైన జీవన పరిస్థితులను ఏర్పరచడమే ప్రభుత్వాల కర్తవ్యం. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు కావస్తున్నా మూడొంతులకు పైగానే దారిద్ర రేఖకు దిగువన ఉండి ఒక పూట తిండికి సైతం అల్లాడుతున్న ప్రజానీకం ఉన్న ఈ దేశ దౌర్భగ్యానికి కారకులైన పాలకవర్గాలను ఏమనాలి? వీరు ఎవరి అవసరాలకోసం పనిచేస్తున్నారో, ఏ వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారో తెలుసుకోవడం కష్టమేమికాదు. ప్రపంచ కుబేరుల జాబితాలో పోటీలు పడి చేరిపోతున్న భారత ధనికస్వామ్యం ఈ విషయాన్ని స్పష్టం చేస్తూనే ఉన్నది. అంబానీలు, టాటాలు, బిర్లాలు, మిట్టల్‌లు మరెందరో ఈ నిచ్చెనెక్కి కూర్చున్నారు. అత్యధిక ప్రజానీకం తమ శ్రమవల్ల పోగైన సంపదలో న్యాయమైన వాటా దక్కకుండా కునారిల్లిపోతుండడం జరుగుతున్నది.

'భారతదేశం భాగ్యసీమర... సకల సంపదలున్న దేశంలో దరిద్రమెట్లుందో నాయనా' అన్న చాలా ఏళ్ల కిందటి పాట ఈ దేశంలో భూస్వామ్య, పెట్టుబడిదారి శక్తులు దేశంలోని శ్రమజీవుల సంపదను ఎలా దోచుకుంటున్నాయో స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఏడాది పూర్తి చేసుకున్న మోడీ పాలన గత పాలకులకు భిన్నంగా ఏమీలేదు సరికదా వాటికి మించిన అత్యుత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారి శక్తుల ఆకాంక్షలను తీర్చడంలో దూసుకుపోతున్నది.

మోడీ ఏడాదికాలంలో తీసుకున్న సంక్షేమ చర్యలు ఏమైనా ఉన్నాయా అంటే దాదాపుగా అవి పూర్వ ప్రభుత్వాల పథకాలను కొనసాగించడమే తప్ప మరోటి కాదు. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేసిందేమి లేదు. మోడీ ప్రభుత్వం అ పథకాల పేర్లు మార్చి కొత్త పేర్లతో విపరీత ప్రచారం కల్పించి ఎన్నో ప్రజానుకూల కార్యక్రమాలు చేపడుతున్నట్లు భ్రాంతి కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. పోని ఆ పథకాలకోసమేమైనా సరైన నిధులు కేటాయిస్తున్నారా అంటే అదీ లేదు. 2014లో అధికారంలోకి వచ్చాక మోడీ ప్రభుత్వం సంక్షేమ రంగాలకు కేటాయింపులు తగ్గించింది.

విద్య, సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్), ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధికి సంబంధించి, మధ్యాహ్న భోజన పథకం, కుటుంబ సంక్షేమం, గృహ నిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత అభ్యుదయం, పేదలకు ఇచ్చే సబ్సిడీలు, వ్యవసాయరంగం మొదలగు సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో గతంలో కంటే కేటాయింపులు తగ్గించేశారు. కార్పొరేట్ రంగంపై వేసే పన్నులను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించి వారి సేవలో తరించి పోతున్నారు. మేకిన్ ఇండియా అంటూ బహుళజాతి కంపెనీలను వేనోళ్ల ఆహ్వానిస్తున్నది ప్రభుత్వం. వారి కోసం కావలసిన భూములను సులభంగా అప్పగించేందుకు భూసేకరణ చట్టంలో అనేక సవరణలు, మార్పులు తెచ్చారు. అన్ని రంగాల్లోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ద్వారాలను బార్లా తెరిచి ఉంచారు. విదేశీ పెట్టుబడి దారులేమైనా ఈ దేశ సంక్షేమం గురించి ఆలోచిస్తారా? పెట్టుబడి దారులకు ఎప్పుడు లాభాల ధ్యాసే ఉంటుంది తప్ప ఈ దేశవాసుల బాగోగులు, స్వావలంబన, స్వాభిమానం, ఈ ప్రాంత పర్యావరణ పరిరక్షణపై గౌరవం, బాధ్యతలెందుకు ఉంటాయి. మిడతల దండువలె పంటలపై పడి రసాన్ని పీల్చిన చందంగా ఈ దేశ ఆర్థిక సంపదను కొల్లగొడతాయి తప్ప అభివృద్ధి చేయవు.

నిజంగా ఈ దేశంలో బహుళజాతి కంపెనీల పెట్టుబడుల ద్వారా కాకుండా స్వతహాగా తనకు తానుగా దేశాభివృద్ధి జరగడానికి వీలే లేకుండా పోయిందా? సర్వ ప్రపంచానికి జ్ఞానమిచ్చిన పుణ్యభూమిగా చెప్పుకునే భావజాలమున్న బిజెపి పాలకులకు విదేశీ పెట్టుబడిదారులపై అంత మక్కువ ఎందుకోమరి? ఈ దేశంలో పెట్టుబడులు పెట్టి లాభాలు

చేసుకోండని బాహాటంగానే మోడీ ప్రకటిస్తున్నారు. తద్వారా ఈ దేశ సంపదపై ఈ దేశ వాసులకు హక్కులు లేకుండా పరాయి వారిగా చేసే విధానాలను అవలంభిస్తున్నారు.

ఏడాది కాలంగా మోడీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్, సంసద్ ఆదర్శ్ గ్రామయోజన, బేటీ బచావో బేటీ పడావో, 2022కల్లా అందరికీ ఇళ్లు, ప్రతి రైతుకు ఆరోగ్య కార్డు పథకం శ్యాంప్రసాద్ ముఖర్జీ రుర్బన్ మిషన్ వంటి పేర్లతో చాలానే సంక్షేమ పథకాలను ప్రకటించింది.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు కావస్తున్నా నేటికీ నూటికి అరవై మందికి పైగా మలవిసర్జనలు బహిర్భూముల్లో చేస్తున్నారు. మానవ మలాన్ని మనుషులు ఎత్తివేసే పరిస్థితి నేటికీ ఉన్నదంటే మన సమాజం ఏ అభివృద్ధి పథంలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 'ఇండియా షైనింగ్' అని 2004 ఎన్నికలకు ముందు ఇదే బిజెపి ప్రభుత్వం ఊదరగొట్టిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రస్తుతం మోడీ తెచ్చిన స్వచ్ఛ భారత్ పథకం కొత్తదేమీకాదు. 1986లో కేంద్ర గ్రామీణ పారిశుధ్య కార్యక్రమం ప్రారంభించబడింది. కాలక్రమంలో పేర్లు మార్చుకుంటూ వచ్చింది. 2012లో అది నిర్మల్ భారత్ అభియాన్‌గా ఉన్నది. నేడు మోడీ దానిని స్వచ్ఛ భారత్ అభియాన్‌గా మార్చి విపరీత ప్రచారం కల్పించారు. స్థానిక సంస్థలకు సరిపోను నిదులు అందించి సక్రమంగా నిర్వహించబడితే ఈ సమస్యకు పరిష్కారం ఇప్పటికే లభించేది. స్వచ్ఛ భారత్ అనేది ప్రచార ఆర్భాటంగా కనిపిస్తుంది తప్పిస్తే చిత్తశుద్ధితో నిర్వహించడంగా లేదు. చీపుర్లు పట్టుకుని, చెత్త తట్టలెత్తుకుని కలెక్టర్లు, ఇతర ఉన్నత అధికారులు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు మరెందరో మీడియాలకు ఫోజులివ్వడం గొప్ప ఫ్యాషన్‌గా మారింది. తప్పిస్తే ప్రభుత్వాల బాధ్యతగా పారిశుధ్య కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకున్న దాఖలాలు తక్కువే.

గాంధీ అంటే గిట్టని ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమున్న మోడీ రాజకీయ అవసరాల రిత్యా స్వచ్ఛ్ భారత్‌కు గాంధీని అరువు తెచ్చుకుంటున్నారు. గాంధీ పుట్టిన రోజు దీన్ని ప్రారంభించారు. మళ్లీ గాంధీ పుట్టినరోజు 2019 నాటికి దీన్ని పూర్తి చేయాలని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ వసతులకు సంబంధించిన నిర్మాణాలు, నిర్వహణ వంటి వాటిల్లో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లను ఆహ్వానిస్తున్నారు. రోడ్లపై టోల్‌టాక్స్ వసూలు చేసినట్లు పబ్లిక్ టాయ్‌లెట్లకు సైతం వసూలు చేస్తారన్నమాట. సులభ్ కాంప్లెక్సుల్లో, బస్టాండుల్లో ఇప్పటికే ఈ విధంగా టాయ్‌లెట్లు నడుస్తున్నాయనుకోండి. స్వచ్ఛ్ భారత్ అభియాన్ కొరకు 62 వేల కోట్లు కేటాయించారు. ఇవి సరిపోతాయా అనేది ఒక అంశం. అయితే వీటిని అవినీతి రహితంగా వినియోగిస్తారా అనేది అనుమానమే. పారిశుధ్య కార్యక్రమం అనేది కేవలం పౌరుల వ్యక్తిగత అంశమని అనుకుంటే అయ్యేపనికాదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు పారిశుధ్య కార్యక్రమం అనేది వారి ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మౌలిక మార్పులు లేనంతవరకు తలకుమించిన భారంగానే ఉంటాయి. పౌరులకు పాలన వ్యవస్థలు సరిగ్గా సేవలందిస్తూ చక్కటి గాలి, నీరు, పారిశుధ్యం, పర్యావరణం వంటిని అందిస్తేనే ఇది సాధ్యపడుతుంది.

సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన పేరుతో ఆదర్శ గ్రామాల నిర్మాణం జరగాలని నిర్ణయించారు. ప్రతి పార్లమెంట్ సభ్యుడు తన నియోజకవర్గం లోని గ్రామాన్ని 2016 కల్లా ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలి. అలా 2024 కల్లా మొత్తం ఎనిమిది గ్రామాలను తీర్చిదిద్దాలి. దీనికొరకు ప్రత్యేకంగా, కొత్తగా నిధులు మంజూరు చేయలేదు. ఇప్పటికే అమల్లో ఉన్నటువంటి ఇందిరా ఆవాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్), ఎంపిఎల్‌ఎడిఎస్, గ్రామ పంచాయతీ నిధులు, కేంద్ర రాష్ట్ర ఫైనాన్సియల్ కమిషన్ గ్రాంట్స్, కార్పొరేట్, సామాజిక బాధ్యతల ఫండ్స్ నుండి నిధులు వాడుకోవలసి ఉంటుంది. ఈ గ్రామాల్లో ఆరోగ్య వసతులు, వ్యవసాయ అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధి, పెన్షన్లు ఇవ్వడం, అందరికీ ఇళ్లు, సామాజిక అడవులు మొదలగునవి చేపట్టాలి. ఇవన్నీ కూడా స్థానిక సంస్థలైన గ్రామ పంచాయితీలు, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, తప్పనిసరిగా నిత్యం చేయవలసినవే అంతేగానీ ఏదో సంక్షేమ పథకం చేపట్టాం అని చెప్పుకోవడానికి ఈ పథకాన్ని ముందుకు తెచ్చారు. ఎందుకు కొన్ని మాత్రమే ఆదర్శ గ్రామాలు కావాలి, అన్నింటిపై దృష్టి పెట్టకూడదు. ఇది ఒక వివక్షాపూరిత వ్యవస్థకు దారి తీసినట్లు కాదా? పోనీ ఈ ఆదర్శ గ్రామాలనైనా అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పరుస్తారా?

గతంలో యుపిఎ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ ఆవాస్ యోజనను సర్దార్ పటేల్ అర్బన్ హౌసింగ్ మిషన్‌గా మార్చారు. దీని ద్వారా 2022 కల్లా మూడు కోట్ల ఇళ్లు కట్టాలని అంటున్నారు. పేరుకు అందరికి ఇళ్లని అంటున్నారు కాని ఆచరణలో అది కొందరికేనని ప్రభుత్వం చెప్పే ఇళ్ల సంఖ్య గాని దానికి కేటాయించిన బడ్జెట్‌ను గాని పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఆ కొందరిలో కూడా ఇంకా కొందరికే అరకొర వసతులతో మాత్రమే పరిమితం అవుతుందేమో. మరోవైపు స్మార్ట్ సిటీల నిర్మాణం ఉంటుందని అంటున్నారు. దేశంలో సొంత ఇళ్లులేని నిరుపేదలు, గుడిసెల్లో, పూరి పాకల్లో నివసిస్తున్న అత్యధిక నిరుపేద గ్రామీణ ప్రజలు, పట్టణ మురికి వాడలో నివసించే పేదల గురించిన పథకాలపైన చిత్తశుద్ధి లేదుగాని స్మార్ట్ సిటీల నిర్మాణంను ఆహ్వానిస్తున్నారు. ఈ పథకాలన్నింటిలో కూడా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌ను ఆహ్వానిస్తున్నారు. నాణ్యతేమోగాని పెట్టుబడిదారుల, కాంట్రాక్టర్ల పొట్టలు బాగా నింపే ప్రయత్నమే ఇక్కడా కొనసాగకుండా ఉంటుందా? శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 'అర్బన్ మిషన్'ను గ్రామీణ ప్రాంతాలలోని వారికి పట్టణ ప్రాంత వసతులు కల్పిస్తామనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించారని చెపుతున్నారు. రక్షిత మంచినీరు, సివరేజ్ మేనేజ్‌మెంట్, పండ్లు, కూరగాయలు పండించడానికి రీసైకిల్ చేసిన నీటిని వాడడం, ఘన వ్యర్థాలను తొలగించుట, డిజిటల్ కనెక్టివిటీ వంటివి కల్పించడం ఈ పథకం ఉద్దేశం. నిజానికి స్థానిక సంస్థల పనే ఇది. వాటిని బలోపేతం చేస్తూ, వాటికి సరైన నిధులు అందిస్తూ, అవి సరైన రీతిలో పనిచేసేలా చర్యలు తీసుకోకుండా ఇటువంటి కంటి తుడుపు పథకాలు తెస్తున్నారు.

కార్మిక చట్టాలను సవరిస్తూ పెట్టుబడిదారులకు మద్దతుగా నిలబడింది మోడీ ప్రభుత్వం. ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, కేంద్ర కార్మిక చట్టం, అప్రెంటిస్ షిప్ చట్టాలలో మార్పులను ప్రతిపాదిస్తున్నారు. వీటి ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా 300 మందివరకు కార్మికులను తొలగించవచ్చు. ప్రస్తుతం అది వందమంది వరకు ఉన్నది. తొలగించబడిన కార్మికుడు తన అభ్యంతరాలను మూడు నెలల్లో చెప్పుకోవాలి. ప్రస్తుతం అలా కాల పరిమితి లేదు. కార్మికులలో

30 శాతం వరకు సభ్యులుగా ఉంటేనే సంఘం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం అది 15 శాతం ఉంది. ఇలా కార్మిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ మరోవైపు సంక్షేమమంటూ మాట్లాడడం విడ్డూరం. మేక్ ఇన్ ఇండియా సెల్ ఎనీవేర్ (ఇండియాలో తయారు చేయండి మరెక్కడైనా అమ్ముకోండి) అని పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నారు. భారత్‌లో తయారు చేయండి మీకనుకూలమైన వాతావరణం కల్పిస్తామని, అలాంటి పరిస్థితులు మా దగ్గర ఉన్నాయని ప్రపంచ కార్పొరేట్ పెట్టుబడికి విన్నపాలు, విజ్ఞప్తుల మీద విజ్ఞప్తులు చేస్తున్నారు. తద్వారా ఈ దేశ సహజవనరులను లూటీ చేయడానికి, పర్యావరణాన్ని నాశనం చేయడానికి, ప్రజలను నిర్వాసితులను చేయడానికి, చౌకగా లభించే మానవ శ్రమను దోచుకోవడానికి రోడ్డు క్లియర్ చేసి పెడుతున్నారు. అందుకోసం ప్రస్తుతమున్న కొద్దోగొప్పో ప్రజానుకూల చట్టాలను సైతం సవరిస్తూ పెట్టుబడిదారి శక్తులకు దాసోహం అంటున్నారు. అందులో భాగమే భూసేకరణచట్టంలో, పర్యావరణ, అటవీ హక్కుల చట్టాలలో, కార్మికచట్టాలలోని సవరణలు.

అటవీ జంతు రక్షిత ప్రాంతాలకు పది కిలోమీటర్ల లోపుగా ప్రాజెక్టులు స్థాపించాలంటే నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే దీనిని 5 కి.మీ. పరిధికి కుదిస్తూ పర్యావరణ మంత్రిత్వశాఖ పర్యావరణ ప్రభావ అంచనాకు సంబంధించిన నియమాలను సవరించింది. పారిశ్రామిక అవసరాలకు అటవీ ప్రాంతాన్ని వినియోగించే పక్షాన గ్రామ సభల అనుమతిని తీసుకోవాలని తెలిపే అటవీ హక్కుల చట్టం 2006లోని నిబంధనలను రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారు. సంవత్సరానికి ఎనిమిది మిలియన్ టన్నులలోపు బొగ్గును తవ్వేలోపు పబ్లిక్ హియరింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదని తెలిపే నిబంధనను సవరిస్తూ 16 మిలియన్ టన్నుల వరకని వెసులుబాటు కల్పించింది పర్యావరణ మంత్రిత్వశాఖ. రెండువేల హెక్టార్లలోపు భూములకు నష్టం కలిగించే నీటి పారుదల ప్రాజెక్టులకు పర్యావరణ క్లియరెన్స్‌లు అవసరం లేదని పదివేల హెక్టార్ల ప్రాంతం ప్రభావితం అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వాలు క్లియరెన్సులు ఇవ్వవచ్చని ఈ మంత్రిత్వ శాఖ సవరణలు చేసింది. సెప్టెంబర్ 2013లో యుపిఎ ప్రభుత్వం కేంద్ర కాలుష్య నియంత్రణా మండలిని ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చేందుకు అవసరమైన కాంప్రహెన్సివ్ ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ ఇండెక్స్ ను పునహ అంచనా వేయమని ఆదేశించింది. కాలుష్య పరంగా సున్నితంగా ఉండే ప్రాంతాలలో ప్రాజెక్టుల అనుమతిని నియంత్రించేందుక ఇది అవసరం. ఈ అధ్యయనం పూర్తి కానేలేదు కానీ, ఘజియాబాద్ ఇండోర్ జార్స్ గూడా, లుథియానా, పానిపట్, పటాన్‌చెరు – బొల్లారం, సింగ్రౌనీ మొదలైన ఎనిమిది కాలుష్యమయమైన ప్రాంతాల్లో ఫ్యాక్టరీలను నెలకొల్పడంపై ఉన్న మారిటోరియంను ప్రకాశ్ జవదేకర్ మంత్రిగా ఉన్న పర్యావరణ మంత్రిత్వశాఖ తొలగించేసింది. అంటే ఈ ప్రాంతాలలో ఫ్యాక్టరీలు తెరవడానికి వీలు కల్పించారు.

క్షయ, క్యాన్సర్, డయాబెటిస్, హెచ్ఐవి, ఎయిడ్స్ మొదలగు వాటికి సంబంధించి 108 రకాల మందుల ధరలను నియంత్రించే మార్గదర్శకాలను వెనక్కి తీసుకోమని నేషనల్ ఫార్మాసుటికల్ ప్రైసింగ్ అథారిటీని ఆదేశించారు. ఫలితంగా 108 రకాల మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఉదాహరణకు క్యాన్సర్‌కు సంబంధించిన మందుల ధర ఏకంగా 8,000 నుండి 1,08,000 వరకు పెరిగింది.

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి గ్యారంటీ చట్టంను దేశమంతటికి అన్వయించకుండా కేవలం చాల వెనుకబడ్డ 2500 బ్లాకులకే పరిమితం చేశారు. కొంతమేరకు ప్రజోపయోగకరమై ఈ పథకానికి గత సంవత్సరం కంటే (34,000 కోట్లు) ఈ సంవత్సరం కొంచెం ఎక్కువగా (34,699 కోట్లు) కేటాయించారు తప్పిస్తే పెద్దగా మార్పులేదు. ఈ చట్టం ఉపాధి హక్కును గ్యారంటీ చేసింది. అది హక్కుగా ఉన్నది కాబట్టి ప్రజల అవసరాలను బట్టి అవసరమైన నిధులను కేటాయించాల్సి ఉంటుంది. ఈ పథకానికి అధిక నిదులు కేటాయించకుండా గత పరిస్థితినే కొనసాగించాలని అనుకోవడం ఈ ప్రభుత్వ దివాళాకోరుతనాన్ని తెలుపుతుంది. గ్రామీణులకు సార్వత్రిక ఆర్థిక హక్కును కల్పిస్తున్న ఈ పథకాన్ని మొక్కుబడిగా చేస్తూ మరోవైపు ప్రతివారికి బ్యాంకు అకౌంట్లను తెరిచేలా జనధనయోజన పేరుతో పథకాలను ప్రవేశపెట్టారు. అసలు చేతిలో డబ్బే లేకుండా బ్యాంకుల్లో అకౌంట్ తెరుచుకుని ఏం లాభం. ప్రజల ఆదాయం పెరిగేలా ఉపాధి ఉద్యోగ భద్రతలు కల్పించడంపై దృష్టిపెట్టాలి.

2008లో యుపిఎ ప్రభుత్వం తెచ్చిన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పాలసీకి కొనసాగింపుగా వచ్చినటువంటిదే ప్రధానమంత్రి జనధన యోజన (పిఎంజెడివై). కోట్లాది మంది పేదలకు సెల్‌ఫోన్లు ఉన్నాయి కాని బ్యాంకు ఖాతాలు లేవని, ఆర్థికాభివృద్ధి పేదలకు చేకూరాలని అందుకోసం బ్యాంకు ఖాతాలు అవసరమని మోడీ ప్రకటించారు. బ్యాంకు ఖాతాలు తెరిచిన వారికి డెబిట్ కార్డు, ఒక లక్ష భీమా సౌకర్యం ఉంటుందని, జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు తెరువవచ్చని ఈ పథకం ప్రారంభించారు. ఉపాధి, ఉద్యోగం, ఆదాయవనరులు చూపకుండా బ్యాంకు అకౌంట్లనేమి చేసుకుంటారు. అయినా సరే తమకు ఏదో మేలు జరిగిపోతుందని ఈ పథకం ప్రారంభించిన మొదటి రోజు రికార్డు స్థాయిలో ఒక కోటి యాభై లక్షల మంది తరువాత నెల రోజుల్లో మూడు కోట్ల ఇరవై వేల మంది ఖాతాలు తెరిచారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందే ఆర్థిక ప్రయోజనాలను బ్యాంక్ అకౌంట్‌లతో అనుసంధానం చేస్తున్నారు.

పాఠశాలల్లో టాయిలెట్ల గురించి కోర్టులు ఎన్నోసార్లు ప్రభుత్వాలకు సూచనలు చేశాయి. దీని గురించి మోడీ కూడా ప్రస్తావించారు. అయితే ప్రభుత్వమే విద్యను అందించడంపై మిన్నకుంటుంది. ప్రైవేట్ పాఠశాలలను, కళాశాలలను, విశ్వ విద్యాలయాలను చివరకు విదేశీ విశ్వ విద్యాలయాలను సహితం దేశంలోకి ఆహ్వానిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను క్రమేపి మూసివేసే దిశలో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి, తప్పిస్తే ప్రైవేట్ వాటిని నియంత్రిస్తూ క్రమేపి వాటిని రద్దు చేసే దిశలో ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, వాటిల్లో మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధపడడం లేదు. ఏదో మెక్కుబడిగా ఏవో కొన్ని బలహీనమైన ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే పాఠశాలల్లో టాయిలెట్ల పథకాన్ని చూడాల్సి ఉంటుంది.

బేటి బచావో–బేటి పడావో పేరుతో ఆడపిల్లల హక్కుల గురించి వారు విద్య ద్వారా సామాజికంగా, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలనే ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించారు. ఓవైపు ప్రైవేట్ విద్యా సంస్థలు

పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడానికి, విద్యను వ్యాపారమయం చేయడానికి సహకరించే అనేక చట్టాలు చేసేవారు ఈ పథకం గురించి మాట్లాడడంలోని నిజాయితీ ఏమిటో తెలుసుకోవచ్చు. అందరికీ సమాన గుణాత్మక విద్య అదికూడా ఉచితంగా అందివ్వాలనే విలువను తుంగలో తొక్కి పైపైకి ఇలాంటి ఆకర్షణీయమైన పేర్లతో పథకాలు తేవడంలో అర్థం ఏముంటుంది. బాలికల, మహిళల భద్రత, స్వతంత్రల గురించి మాట్లాడే ప్రభుత్వం సమస్యల మూలాల్లోకి వెళ్లడంలేదు. బాలికలు, మహిళలను సంబంధించి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలలో రావాల్సిన మార్పులకై నిర్దిష్టమైన కార్యక్రమాలు లేవు. మహిళలు, బాలికలపై అత్యాచారాలకు ఒక కారణంగా ఉన్న మద్యం, సినిమాలు, విషసంస్కృతిని మోసుకొస్తున్న సామ్రాజ్యవాద పెట్టుబడుల నియంత్రణ గురించి ఏం మాట్లాడడం లేదు.

వ్యవసాయానికి సంబంధించి భూ ఆరోగ్య కార్డు పథకం (సోషల్ హెల్త్ కార్డు స్కీమ్) ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పద్నాలుగు కోట్ల రైతులకు చెందిన భూముల సారవంతత, గుణాత్మకతను, ఏ పంటలు, ఏ ఎరువులు, ఎంతమేరకు వేయలో అంచనా వేస్తారు. భూములు మట్టి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లకు పంపి దాని స్వభావాన్ని విశ్లేషిస్తారు. భూమి చెంతకు ప్రయోగశాల అని పరిశోధన ఆధారిత వ్యవవసాయ విప్లవం అని మోడీ అంటున్నారు. వ్యవసాయంపై ఎంతో ప్రేమను వలకపోస్తున్న ప్రభుత్వం ఎన్నో అత్యవసర విషయాలను దాటవేస్తున్నది. దేశంలో 65 శాతం వర్షాధార వ్యవసాయమే దాన్నెలా అధిగమిస్తారో మాట్లాడడం లేదు. భూమిలేని నిరుపేదలకు భూములు పంచే విధానం గురించి ఏమీ చెప్పడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, జన్యుమార్పిడి పంటలు మొదలగు వాటితో మొత్తంగా వ్యవసాయరంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్న బహుళజాతి సంస్థలు మోన్‌శాంటో, కార్గల్, సిన్‌జెంటా, డుపాంట్ వంటి వాటిని ఎలా నియంత్రిస్తారో లేదా నిరాకరిస్తారో చెప్పడం లేదు. పుగుగు మందులు, ఎరువుల వాడకాన్ని తయారీని ఎలా నియంత్రిస్తారో తెలుపడం లేదు. దేశీయ స్థానిక విత్తనాలను, వంగడాలను, పంటలను పునరుద్ధరించి, వాడుకలోకి తెస్తూ రైతుకు వాటిపై స్వయం నిర్ణయాధికారాన్ని ఎలా కల్పిస్తారో చెప్పడం లేదు. కాని వ్యవసాయ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ప్రధానమంత్రి సురక్షాబీమా, యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, అటల్‌పెన్షన్ యోజన అనే పథాలను 2015 మేలో ప్రారంభించారు.

ఏదేని బ్యాంకులో సేవింగ్ ఖాత ఉన్నవారు వీటిని పొందవచ్చు. సంవత్సరానికి పన్నెండు రూపాయలు కడితే ప్రమాదంలో చనిపోయినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా రెండు లక్షల పరిహారం చెల్లిస్తారు. 18-50 ఏళ్ల మధ్య ఉన్నవారు సంవత్సరానికి రు. 330 లు కడితే పాలసీదారుడు చనిపోతే రెండు లక్షల పరిహారం పొందవచ్చు. 18-40 ఏళ్ల మధ్య వయస్సున్న వారు నెలకు రు. 42 లేదా రు. 210 లు కడితే 60 ఏళ్ల వయసు తరువాత పెన్షన్ వస్తుంది. ఈ పథకంలో చేరిన వాటి నుండి చెల్లించిన మొత్తం ఆధారంగా పెన్షన్ ఎంత అనేది నిర్ణయిచబడుతుంది. ఈ మూడు పథకాలను సామాజిక భద్ర పథకాలుగా చెపుతున్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న వారికి ఈ చిన్న మొత్తాలు చెల్లించడం కూడా సాధ్యం కాదు. పైపైన చూస్తే ఈ పథకాలు ఆకర్షణీయంగానే ఉండొచ్చు.

మొత్తంగా ఏడాది పాలనలో మోడీ వేసిన అడుగులన్ని కూడా ప్రజల మౌలిక అవసరాలను తీర్చడం కోసం పడలేదని స్పష్టం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, ఆదివాసుల, దళితుల, మైనారిటీల పరిరక్షణలో ఈ ప్రభుత్వం పాటు పడిందేమిలేదు. ప్రతివారికి నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగం ఉపాధి సౌకర్యాలు కల్పించడం ద్వారా మాత్రమే ప్రజలకు మేలుచేసిన వారవుతారు.

దేశవ్యాప్తంగా గత రెండు దశాబ్దాలుగా 3లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలకు గురయ్యారు. అంటే ప్రతిరోజు దేశవ్యాప్తంగా 41 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ రెండు దశాబ్దాలలో 1999 నుండి 2004 వరకు ఐదేళ్లు బిజెపి కేంద్రంలో పాలన చేసింది. కనుక ఈ ఆత్మహత్యల పాపంలో బిజెపికి భాగస్వామ్యం లేదని కాదనగలమా? రైతుల ఆత్మహత్యలు భారత వ్యవసాయరంగ సంక్షోభాన్ని చెప్పకనే చెపుతున్నాయి. నేటికీ 65 శాతం వ్యవసాయం వర్షాధారమే. వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయం వారు చేసిన అప్పులను చెల్లించడానికే సరిపోవడం లేదు. ఫలితంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కనీస మద్దతుధరను పెంచకపోవడం, సరైన ఎరువులు, విత్తనాలు అందక నీటిపారుదల వసతులు లేక, వ్యవసాయ పరిశోధనలు వీటిని పరిష్కరించలేక విఫలం అవుతుండడం పాలకుల చిత్తశుద్ధి లోపించడం మొదలగు వాటి వల్ల వ్యవసాయం రైతుకు ఉరితాడైపోవడం ఎంతో విషాదకరం. రైతుకు కనీస మద్దతు ధర గ్యారంటీ చేయకపోవడమే కాకుండా యుపిఎ ప్రభుత్వం ప్రకటించినదానికంటే కూడా తక్కువగానే 2014 -2015, 2015-16 సంవత్సరాల్లో ప్రకటించింది మోడీ ప్రభుత్వం. అంతే కాకుండా గోదుమ, వరిలపై కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరను మించిన రేటును రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించడాన్ని రద్దు చేయమని కూడా చెప్పారు. గత సంవత్సరంతో చూసినప్పుడు 2015 బడ్జెట్‌లో వ్యవసాయానికి 10.4 శాతం నిధులు తగ్గించారు. అంతేకాకుండా వ్యవసాయ యోగ్యమైన భూములను పారిశ్రామికీకరణ కోసం సేకరించడానికి ఉన్న పరిమితులను రద్దు చేస్తూ భూసేకరణ చట్టం 2013లో మార్పులు చేస్తూ రెండుసార్లు ఆర్డినెన్సులు జారీ చేశారు. ఇలా మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగానికి సంబంధించి వేస్తున్న అడుగులు రైతులను, వ్యవసాయ రంగాన్ని ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి నెట్టేసిందిగా ఉంటూ భవిష్యత్‌లో మరింత సంక్షోభాలకు రైతుల జీవితాలకు ఉరితాళ్లుగా మారబోతున్నాయి. వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. - సం.*

మళ్లీ సాల్వాజుడుం - మరెంత విధ్వంసం?

***పది సంవత్సరాల కింద మొదలై, భయానకమైన విధ్వంసానికి పాల్పడి, నాలుగు సంవత్సరాల కింద సుప్రీంకోర్టు చేత నిషేధానికి గురైన సాల్వాజుడుంకు మళ్లీ జీవం పోయడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని ఖండిస్తున్నారు* నందిని సుందర్**

తమ ప్రభుత్వం టాటా, ఎస్సార్ వంటి కంపెనీలతో 2005లో కుదుర్చుకున్న ఒప్పందాలకూ, ఆ సంవత్సరమే ప్రారంభమైన సాల్వాజుడుంకూ ఏమీ సంబంధం లేదనీ, అది యాదృచ్ఛికమైన ప్రజా ఉద్యమమనీ చెప్పడానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, ఆయన ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా చాల కష్టపడుతున్నారు. అప్పటి సాల్వాజుడుం యాదృచ్ఛికమేనని అనుకున్నా, ప్రధానమంత్రి బస్తర్‌లో రు. 24,000 కోట్ల పెట్టుబడులను ప్రకటించినప్పుడే రెండో సాల్వాజుడుం ప్రారంభం కావడమంటే, మొదటి సాల్వా జుడుం కూడ ఆదేశాల ప్రకారం తయారైన వస్తువే అనిపిస్తుంది. ఎవరో కార్పొరేట్ సంస్థ తయారుచేసి అమ్మకానికి బీరువాలో పెట్టిన 'ప్రజా ఉద్యమం' అనే సరుకన్న మాట అది. అది ఢిల్లీలోనో, రాయపూర్‌లోనో, నాగపూర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యాలయంలోనో తయారై ఉంటుంది. కచ్చితంగా దంతెవాడ జిల్లా గ్రామంలో మాత్రం కాదు.

గతంలో లాగనే కచ్చితంగా ఈ సారి కూడ పైకి చూడడానికి జుడుం ఒక కాంగ్రెస్ రాజకీయవేత్త నాయకత్వంలో ఉంది. పోయినసారి అది కాంగ్రెస్ కు చెందిన దంతెవాడ శాసనసభ్యుడు మహేంద్ర కర్మ నాయకత్వంలో ఉండగా, ఈసారి ఆయన కొడుకు, 2014 లోక్‌సభ ఎన్నికలలో దంతెవాడ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఛవీంద్ర కర్మ నాయకత్వంలో ఉంది. తన తండ్రి రెండో వర్ధంతి సందర్భంగా మే 25న ఫర్సపాల్‌లో వికాస్ సంఘర్ష సమితి లేదా రెండో సాల్వాజుడుం పేరుతో ఉద్యమం ప్రారంభిస్తానని ఛవీంద్ర కర్మ ఈ నెల మొదట్లో ప్రకటించాడు.

ఈ ఉద్యమం ప్రజలకు మావోయిస్టుల గురించి చైతన్యం కలిగించడానికి 'బస్తర్ గ్రామాల్లో పనిచేస్తుంద'ని ఆయన అన్నాడు. సుఖరాం దాడి, పి విజయ్, చైత్రం అట్టామి వంటి పాత జుడుం నాయకులు ఆయనకు సహకరిస్తున్నారు. వీరిలో కొందరు రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి సన్నిహితంగా ఉంటారు.

నేను ఒకప్పుడు ఆయన తండ్రి నోట విన్న మాటలనే జూనియర్ కర్మ ఏషియన్ ఏజ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చిలక పలుకుల్లా వల్లించాడు. రెండో సాల్వాజుడుం 'శాంతియుతమైనది' అన్నాడు. మొదటిసారి అది హింసాత్మకంగా ఉండిందనే ఆరోపణలు 'బైటిశక్తుల' దుష్ప్రచారం మాత్రమేనని కొట్టివేశాడు. కాని, అదే సమయంలో, 'కొందరు జుడుం సభ్యులు చేసిన అత్యాచారాల గురించి ఆరోపణల విషయానికి వస్తే, మానవజాతి చరిత్రలో సంపూర్ణంగా అహింసాత్మకంగా నడిచిన ప్రజా పోరాటం ఒక్కటైనా లేదని నేను చెప్పగలను. చివరికి భారత స్వాతంత్ర్యోద్యమం కూడ ఎన్నో హింసాత్మక ఘటనల కథనాలతో నిండి ఉంది' అని ఆయన అన్నాడు.

కర్మ ఏమి చెప్పినప్పటికీ, సాల్వాజుడుం వల్ల పెద్దఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయనే సాక్ష్యాధారాలను నమ్మిన భారత సుప్రీంకోర్టు 2011 జూలైలో సాల్వాజుడుంను నిషేధించింది. ఆ కేసులో సమర్థులైన న్యాయవాదులు లేనందువల్ల ఓడిపోయామని కర్మ, తదితర ఛత్తీస్‌గఢ్ నాయకులు అంటూ ఉంటారు గాని సమస్య అది కాదు. నిజానికి న్యాయస్థానంలో వాదనలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ముకుల్ రోహత్గి, హరీష్ సాల్వే వంటి అగ్రశ్రేణి న్యాయవాదులను నియోగించింది. వారిలో ముకుల్ రోహత్గి అయితే ప్రస్తుతం అడ్వకేట్ జనరల్‌గా ఉన్నాడు. సాక్ష్యాధారాలు పెద్దఎత్తున ఉండడం వల్లనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ కేసులో ఓడిపోయింది.

ఇటువంటి కార్యక్రమం భవిష్యత్తులో కూడ జరగకుండా చూసే బాధ్యతను సుప్రీంకోర్టు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మీదనే పెట్టింది: 'సాల్వాజుడుం, కోయ కమాండోలతో సహా ఇటువంటి బృందాలు పనిచేయడాన్ని, ఏ రూపంలోనైనా చట్టాన్ని ప్రైవేటు వ్యక్తులు తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని, ఏ వ్యక్తికైనా ఉన్న మానవహక్కులను ఉల్లంఘించడానికి చట్టవ్యతిరేకంగా గాని మరొకరకంగా గాని పనిచేయడాన్ని నిరోధించడానికి తగిన చర్యలన్నిటినీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలలో తప్పనిసరిగా ఉండవలసినవి, సాల్వాజుడుం లేదా అందరికీ తెలిసిన కోయ కమాండోల పేరుతో జరిగిన హంతక కార్యకలాపాల గురించిన ఆరోపణల మీద, గతంలో సక్రమంగా దర్యాప్తు జరగని, అసంపూర్తిగా దర్యాప్తు జరిగిన అన్ని సంఘటనల మీద దర్యాప్తు చేయించాలి. తగిన ప్రాథమిక దర్యాప్తు నివేదికలను నమోదు చేయాలి. కచ్చితమైన విచారణ జరపాలి. ప్రభుత్వ చర్యలు ఇంకా ఎక్కువ కూడ ఉండవచ్చును. వీటికే పరిమితం కానక్కరలేదు'.

కాని, అసలు సుప్రీంకోర్టు అనేదే ఉనికిలో లేదన్నట్టుగా ప్రవర్తించడంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తలమునకలై ఉంది. సాల్వా జుడుం దాడుల్లో తీవ్రంగా నష్టపోయినవారికి నష్టపరిహారం ఇవ్వకపోవడం మాత్రమే కాదు, ఒక్క వ్యక్తి మీద కూడ విచారణ జరపకపోవడం మాత్రమే కాదు, కోయ కమాండోలకు మరిన్ని నిధులు ఇచ్చింది. మరిన్ని ఆయుధాలు ఇచ్చింది. వారిని 'ఆర్మ్‌డ్ ఆక్జిలరీ ఫోర్సెస్' (సాయుధ అనుబంధ బలగాలు) అనే అధికారికమైన పేరు ఇచ్చింది.

చిట్టచివరికి, అత్యున్నత న్యాయస్థానపు తీర్పును భూస్థాపితం చేసి

చివరి పిడికెడు మన్ను చల్లినట్టుగా అటువంటి ఏ ఉద్యమానికైనా భద్రతా దళాల రక్షణతో సహా అన్ని రకాల మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేశాడు. అదీ వాళ్లకు చట్టబద్ధపాలన పట్ల ఉన్న గౌరవం!

రాజ్య ప్రేరేపిత హంతక ముఠాలు

సాల్వాజుడుం 2005 జూన్ లో ప్రారంభమైనప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న గ్రామాలలో ప్రదర్శనలు నిర్వహిస్తుండేది. గ్రామస్థాయిలో 'సంఘసభ్యులు'గా అందరికీ తెలిసిన మావోయిస్టు సానుభూతిపరులను, కార్యకర్తలను 'లొంగిపొమ్మని' కోరుతూ ఈ ప్రదర్శనలు జరిగేవి. ఈ ప్రదర్శనలను అడ్డుకున్నవారి, ప్రదర్శనల్లో పాల్గొనడానికి నిరాకరించిన వారి ఇళ్లను తగులబెట్టేవారు.

గ్రామస్తులను మొత్తంగా కుప్ప వేసి సాల్వాజుడుం శిబిరాలకు తరలించేవారు. అక్కడ ఏళ్ల తరబడి గ్రామస్తులు జైళ్లలాంటి పరిస్థితులలో జీవించవలసి వచ్చేది. వాళ్ల ఇళ్లకూ, పొలాలకూ వెళ్లడానికి వీలు లేదు. వాళ్ల జంతువులను చూసుకోవడానికి వీలు లేదు. తిరుగుబాటుదారులను అణచడానికి గ్రామాలను కుప్పవేయడం అని అనేక చోట్ల అమలు చేసిన ఎత్తుగడలనే వాళ్ల విషయంలోనూ కొనసాగించారు. యాదృచ్ఛికమైన విషయమేమంటే 1960లలో మిజోరాంలో ఇలా ఊళ్లకు ఊళ్లను కుప్పవేసిన సమయంలో అధికారంలో తొలిపాఠాలు నేర్చుకున్న అజిత్ దోవల్ సాల్వా జుడుం ప్రారంభమైనప్పుడు ఇంటిలిజెన్స్ బ్యూరో అధిపతిగా ఉన్నాడు. ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్నాడు. ఆయన మొదటి నుంచీ ఈ పద్ధతిని గట్టిగా బలపరుస్తున్నాడు.

ఈ సాల్వాజుడుం అత్యాచారాల వల్ల దాదాపు ఒక లక్ష మంది గ్రామస్తులు ఆంధ్రప్రదేశ్‌కు వలస వెళ్లారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇంకా హింసాకాండ కొనసాగుతున్నందువల్ల వాళ్లలో అత్యధికులు వెనక్కు వెళ్లడానికి భయపడుతున్నారు. లొంగిపోయిన సంఘం సభ్యులు, ఇతరులు బతుకు తెరువు కావాలని అడిగితే వారిని స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్‌పిఒల) గా నియమించి తుపాకులు ఇచ్చారు. గ్రామస్తుల మీద ఉసిగొలిపారు.

తొలిరోజుల్లో వారి వెంట నాగా ఇండియా రిజర్వ్ బెటాలియన్ దళాలు ఉండేవి. ఆ తర్వాత సిఆర్‌పిఎఫ్ దళాలున్నాయి. ఆ ఎస్‌పిఒలు ఆడింది ఆట పాడింది పాటగా హింసాకాండ కొనసాగించారు. చివరికి వాళ్లు 2012లో ఆ అత్యాచారాలపై దర్యాప్తు చేయడానికి వెళ్లిన సిబిఐ బృందాన్ని కూడ ముప్పు తిప్పలు పెట్టారు.

ఈ హింసాకాండలో చిన్నారి పిల్లలతో సహా వందలాది మందిని చంపారు. పురుషులను సజీవ దహనం చేశారు. స్త్రీలపై దారుణమైన అత్యాచారాలు జరిపారు. అధికారిక గణాంకాల ప్రకారమే మొత్తం 644 గ్రామాలలో విధ్వంసం జరిగింది. అంటే అవిభక్త దంతెవాడ జిల్లాలో దాదాపు సగం ఈ విధ్వంసానికి గురి అయిందన్నమాట. గ్రామస్తుల ఇళ్లు తగులబెట్టబడినప్పుడు వాళ్లకు ఉండిన సమస్తం – బట్టలు, డబ్బు, ధాన్యం, అటవీ ఉత్పత్తులు – అన్నీ తగులబడిపోయాయి. వాళ్లలో చాలమంది ఇప్పుడు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నప్పటికీ, గతంలో కన్న ఎక్కువ పేదరికంలో జీవించవలసి వస్తున్నది.

తిరుగుబాటు వ్యతిరేక విధ్వంసం

ఒక మానవతా విధ్వంసంగా మాత్రమే కాక, సాల్వా జుడుంను ఒక తిరుగుబాటు వ్యతిరేక విధ్వంసంగా చూడవలసి ఉంది. చివరికి ఇంటిలిజెన్స్ బ్యూరో కూడ గుర్తించినట్టుగా సాల్వాజుడుం వల్ల మావోయిస్టులకు మద్దతు పెరిగింది. కొత్తగా 20 శాతం మంది ఎక్కువగా మావోయిస్టు శ్రేణుల్లో చేరారు. సుక్మా కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్ అపహరణకు గురైనప్పుడు ఆయనను బందీలుగా పెట్టుకున్న మావోయిస్టు కార్యకర్తలందరూ సాల్వాజుడుం బాధితులే. మావోయిస్టులు కూడ తమ ప్రతీకారదాడులను ఎక్కువ చేశారు. సాల్వాజుడుం నాయకులను చంపేశారు. చివరికి అది 2013లో జీరమ్ ఘాటీలో జరిగిన భారీ రక్తపాతంగా పరిణమించింది. ఆ ఘటనలో ఒక రాజకీయ సభ నుంచి తిరిగివస్తున్న మహేంద్ర కర్మ, ఇతర కాంగ్రెస్ నాయకులు చనిపోయారు.

సాల్వాజుడుంకు కొనసాగింపుగా 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలైంది. నిజానికి అది మరింత పద్ధతి ప్రకారం జుడుం రూపం. అయితే ఈ రూపంలో ప్రజా ప్రదర్శనలూ, బలవంతంగా గ్రామాలను కుప్పవేయడాలూ లేవు. ఎస్‌పిఒలూ, భద్రతా బలగాలూ కలిసి గ్రామాల మీద దాడులు చేయడం, ఇళ్లు తగులబెట్టడం కొనసాగింది. 2011 మార్చ్‌లో తాడిమెట్ల, ఇరుగుపొరుగు గ్రామాల్లో 300 ఇళ్లను తగులబెట్టడం ఈ కార్యక్రమంలో భాగమే.

ఇవాళ దేశంలోకెల్లా అత్యంత సైనికీకరణ జరిగిన ప్రాంతం బస్తర్. అక్కడ అరెస్టులూ, చిత్రహింసలూ సర్వసాధారణం. ఎన్‌కౌంటర్ ఘటనలు పెరిగినట్టుగానే మావోయిస్టులు ఇన్‌ఫార్మర్లను చంపిన ఘటనలు కూడ పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో మరొకసారి సాల్వాజుడుం ప్రారంభించాలని ఆలోచించడమంటే ఈ సైనిక వైఖరి పనిచేయడం లేదని గుర్తించడానికి సూచనే. చర్చలు తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదనే వాస్తవాన్ని ప్రభుత్వం ఎప్పుడు గుర్తిస్తుంది? ప్రజల వనరుల మీద ప్రజలకే హక్కు ఉందని గుర్తించడం మినహా మరొక ప్రత్యామ్నాయం లేదని ప్రభుత్వం ఎప్పుడు గుర్తిస్తుంది?

(రచయిత్రి ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో సామాజిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. సాల్వాజుడుంను నిషేధిస్తూ సుప్రీంకోర్టు 2011లో తీర్పు ఇవ్వడానికి దారి తీసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం దరఖాస్తుదారులలో ఒకరు. http://thewire.in సౌజన్యంతో) వీ

(రచయిత ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆచార్యురాలు)

మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.

తెరాస విధానాల దిశను సూచించే ప్లీనరీ

తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి వ్యవస్థాగత సమావేశం ఆ పార్టీ విధానాల దిశను సూచిస్తున్నదని అంటున్నారు ఎన్. వేణుగోపాల్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తెలంగాణ రాష్ట్ర సమితి అధికారానికి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఆ పార్టీ వ్యవస్థాగత సమావేశాలు ఏప్రిల్ 24-27 తేదీల్లో హైదరాబాదులో జరిగాయి. ఏప్రిల్ 24న ప్లీనరీతో ప్రారంభమైన ఆ సమావేశాలు 27న బహిరంగసభతో ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర సమితి విధానాలను, ఏడాది కాలంలో అధికార పక్షంగా దాని పనితీరును, విధానాల మార్పును పరిశీలించ డానికి ఇది ఒక సందర్భం. ఒక పాలక రాజకీయ పార్టీ వ్యవస్థాగత సమావేశాల గురించి ఆలోచించవలసింది ఏముంటుందని కూడ సాధారణంగా అనిపించవచ్చు. నిజానికి భారతదేశంలో పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నీ ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయంలో ప్రజలను పట్టించుకోకుండా కుటుంబ పార్టీలుగా, చిన్న ముఠాల పార్టీలుగా, సంపన్నుల పార్టీలుగా ఉంటున్నవే. ఎన్నికల్లో ప్రజల వోట్లు అవసరం గనుక, రాజ్యాంగబద్ధంగానూ, సామాజిక అనివార్యతల దృష్ట్యానూ కొన్ని స్థానాలలో ఇతరులను కూడ నిలబెట్టవలసి ఉంటుంది గనుక అన్ని పార్టీలూ తాము ప్రజానుకూల పార్టీలమన్నట్టుగా ప్రవర్తిస్తున్నాయి. కాషాయం నుంచి ముదురు ఎరుపు దాకా పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నీ వాటి జెండాలూ నినాదాలూ ఏమైనప్పటికీ ప్రజావ్యతిరేక విధానాలలో ఒకటే తాను ముక్కలని 1992 నుంచి సాగుతున్న ప్రపంచీకరణ విధానాలు చూపుతున్నాయి. ప్రజల నుంచి, నిజమైన ప్రజా సమస్యల నుంచి ఆయా పార్టీలు ఎంత దూరమై పోయాయో, ప్రజలతో వారి సంబంధం ఎంత బలహీనమైనదో అడుగడుగునా స్పష్టమవుతున్నది. ఈ సంబంధం ఎంతగా బలహీనమవు తుంటే అంతగా అన్ని రాజకీయ పక్షాల నాయకులూ సాయుధ భద్రతా బలగాల మీద, సొంత ప్రైవేటు సైన్యాల మీద ఆధారపడుతున్నారు. ప్రజలను భ్రమల్లో ముంచడానికి అభివృద్ధి, సంక్షేమం, పథకాలు మంత్రజపం చేస్తున్నారు. అందువల్ల ఒక పార్లమెంటరీ రాజకీయ పక్షపు అంతర్గత సమావేశాల వివరాలలో పెద్దగా సమీక్షించవలసింది ఏముంటుందని ఎవరికైనా అనిపించవచ్చు.

కాని మిగిలిన రాజకీయ పక్షాలకూ తెలంగాణ రాష్ట్ర సమితికీ కొంత తేడా ఉన్నదని అనుకునేవాళ్లు తెలంగాణలో, మరీ ముఖ్యంగా బుద్ధిజీవుల్లో ఎక్కువమందే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఒక విశాలమైన ప్రాంతీయ ప్రజా ఆకాంక్ష ఆధారంగా ఉనికిలోకి వచ్చింది. గత పదిహేను సంవత్సరాలలో నిరంతరాయంగా సాగిన ఉద్యమంలో అనేక కార్యక్రమాల్లో ప్రజలతో పాటు కలిసి నడిచిన ఉదాహరణలు ఉన్నాయి. ఆ ఉద్యమ కార్యక్రమాల్లో తెలంగాణలోని బుద్ధిజీవుల్లో అత్యధిక సంఖ్యాకులు తెరాస మీద విమర్శలు ఉన్నప్పటికీ తెరాసతో కలిసి నడవక తప్పని స్థితి ఉండింది. అప్పటికి నాలుగు దశాబ్దాలుగా తెలంగాణ సమాజంలో ఆరని నిప్పులా ఉన్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు తెలంగాణ రాష్ట్ర సమితి రాజకీయ రూపం ఇచ్చింది. అప్పటికి కనీసం ఆరు సంవత్సరాలుగా తెలంగాణవ్యాప్తంగా సభలు, సమావేశాలు, సదస్సులు, కరపత్రాలు, పత్రికల రూపంలో జరుగుతున్న తెలంగాణ భావజాల వ్యాప్తికి ఒక ఉద్యమ రూపాన్ని, ఒక రాజకీయ వేదిక రూపాన్ని ఇవ్వడానికి తెరాస ప్రయత్నించింది. ఏ చలనశీలమైన సమాజంలోనైనా ఉన్నట్టుగానే తెలంగాణ సమాజంలో కూడ రానున్న తెలంగాణ గురించి, అందులో తమ భాగస్వామ్యం గురించి భిన్నమైన ఆలోచనలు ఉండేవి. ఆ ఆలోచనల మధ్య ఘర్షణ లేని, లేదా తక్కువ ఘర్షణతో కూడిన సమన్వయం సాధించే వేదికగా తెరాస పనిచేసింది. అన్నిటికన్న ముఖ్యంగా అది ఒక పాలకవర్గ పార్టీ అయి కూడ పాలిత పార్టీగా వ్యవహరించే అరుదైన సందర్భం తెలంగాణలో వచ్చింది.

ఈ ప్రత్యేక పరిస్థితి వల్ల తెరాస మిగిలిన రాజకీయ పక్షాల కన్న భిన్నమైనదని, ప్రజానుకూలమైనదని, ప్రగతిశీలమైనదని, ప్రజాస్వామిక మైనదని అనుకునే అవకాశం వచ్చింది. పార్టీగా అది పటిష్టమైన నిర్మాణంతో సుసంఘటితం కానప్పటికీ, దాని కేంద్ర నాయకులలో ఎక్కువ మంది, జిల్లా, స్థానిక నాయకులు అందరికందరూ ప్రజాస్వామికంగా, ఉద్యమచైతన్యంతో కనబడ్డారు. 2001 నుంచి 2014 దాకా తమతో పాటు ప్రదర్శనల్లో పాల్గొంటూ, తమతో పాటు మాటలూ పాటలూ ఆటలూ సాగిస్తూ, పోరాటరూపాలన్నిటినీ పంచుకుంటూ, తమలో ఒకరుగా ఉన్నారు గనుక ఆ నాయకులను ప్రజలు దాదాపు పూర్తిగా విశ్వసించారు. అందువల్లనే చాలమంది పరిశీలకులు వ్యాఖ్యానించినట్టుగా ఉద్యమ కాలంలో వర్గం, కులం, మతం, వయసు వంటి భేదాలన్నీ సమసిపోయి అందరూ ఒకటే అన్నట్టుగా వ్యవహరించిన స్థితి ఉండింది. మిగిలిన రాజకీయ పక్షాల నాయకులను కూడ ప్రజలు అన్నా అని పిలుస్తారు గాని అక్కడ నిజంగా అన్నాదమ్ముల సంబంధం పెదాల మీదనే ఉండిపోగా, తెలంగాణ ఉద్యమ క్రమంలో నాయకులకూ ప్రజలకూ మధ్య నిజంగానే అన్నాదమ్ముల సంబంధం కనిపించింది. ఇక బుద్ధిజీవులనైతే నాయకులే అన్నా అని పిలవడం సాధారణంగా జరిగింది.

ఇలా ప్రజా ఉద్యమ క్రమంలో ప్రజల్లో కలిసిపోయి, ఆ తర్వాత అధికారానికి వచ్చిన రాజకీయపక్షాలు భారత చరిత్రలో తక్కువ. కాంగ్రెస్ బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ దాని నాయకత్వానికీ ప్రజలకూ ఎప్పుడైనా సంబంధం తక్కువే. అది ఎక్కువలో ఎక్కువ మధ్యతరగతికి మాత్రం పరిమితమయింది. భారతీయ జనతాపార్టీకి

గాని, ఇతర పాలకవర్గ రాజకీయ పార్టీలకు గాని ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న చరిత్ర దాదాపుగా లేదు. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంలో ప్రజల్లో కలిసిపోయి, ఆ తర్వాత అధికారానికి వచ్చిన డిఎంకె, పంజాబీ సుబా ఉద్యమంలో పాల్గొని తర్వాత అధికారానికి వచ్చిన అకాలీ దళ్, అస్సాం ప్రజా ఉద్యమాన్ని నడిపి, ఆ అనుభవంతో అధికారానికి వచ్చిన అసోం గణ పరిషత్, అవినీతి వ్యతిరేక ఆందోళనలో పాల్గొని అధికారానికి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ వంటి అతి తక్కువ ఉదాహరణలు ఉన్నాయి గాని, వీటిలో ప్రతి ఒక్కటీ ప్రత్యేకమైనది. ప్రజా ఆకాంక్షల విషయంలోనూ, ఉద్యమం విషయంలోనూ, చివరికి విస్తృత ప్రజా భాగస్వామ్యం విషయంలోనూ తెలంగాణకూ ఆయా ప్రాంతాలకూ చాల తేడా ఉంది. అలాగే ఆయా పార్టీలతో తెరాసను పోల్చడానికి కూడ వీలులేదు.

అంటే తెరాస నేపథ్యం, దాని చరిత్ర దాన్ని భారత పార్లమెంటరీ రాజకీయాల, పాలకవర్గ రాజకీయాల సంప్రదాయంలో ఒక ప్రత్యేకమైన స్థానంలో కూచోబెడుతున్నాయి. బహుశా అందువల్లనే ఆ పార్టీని వాస్తవికంగా అంచనా వేయడంలో కొంత గందరగోళానికి అవకాశం వస్తున్నది. అది పాలకవర్గ పార్టీ కాదని, అందువల్ల అది ప్రభుత్వంలోకి వచ్చినా దాన్ని బలపరచడం ప్రజాపక్షం ఉండడమేనని సిద్ధాంతాలు వెలువడుతున్నాయి. అయితే ఉద్యమ క్రమంలో తెరాస నిర్వహించిన పాత్ర వల్ల ఆ కాలంలో ఆ గందరగోళానికి అవకాశం ఉన్నదేమో గాని, అధికారంలో ఏడాది గడిపిన తర్వాత (ఆ మాటకొస్తే పరిమిత అధికారపు 2004-2006 కాలం తర్వాత) ఆ పార్టీని కచ్చితంగా విశ్లేషించడానికి మరింత అవకాశం దొరుకుతున్నది. ఆ విశ్లేషణకు 2015 ప్లీనరీ ఇంకా ఎక్కువ ఉపయోగపడుతుంది.

తెరాస ప్రకటిత ఆశయాలు, గత ఏడాదిగా తెరాసలో జరుగుతున్న పరిణామాలు, ప్లీనరీ జరిగిన తీరు, ప్లీనరీ తీర్మానాలు, తెలంగాణ ప్రజా ఆకాంక్షలు అనే ఐదు కోణాల నుంచి తెరాసను పరిశీలించడానికి అవకాశం ఉంది. తెరాస ప్రకటిత ఆశయం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం. అయితే అది దానికదిగా గమ్యం కాదు. తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకే దక్కడం, తెలంగాణ సమాజం ఆత్మగౌరవంతో లేచి నిలవడం, తెలంగాణ సమాజం తన రాజకీయ నిర్ణయాలను తానే చేసుకోగలగడం, తెలంగాణ సంస్కృతికి సముచిత గౌరవం దక్కడం వంటి విశాల లక్ష్యాలు సాధించే మార్గంగానే ప్రత్యేక రాష్ట్ర సాధనను చూస్తున్నామని తెరాస నాయకులు కూడ అనేకసార్లు చెప్పారు. గోదావరి కృష్ణమ్మలు మన బీళ్లకు మళ్లాలె, పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండాలె, సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలె అనీ, వలసలు లేని తెలంగాణ, ఉపాధి దొరికే తెలంగాణ, ఎన్ కౌంటర్లు లేని తెలంగాణ అనీ ఎన్నో మాటలు తెరాస నాయకులనుంచే వెలువడ్డాయి. ఇటీవలి కాలంలో ఎక్కువగా వాడుతున్న బంగారు తెలంగాణ అనే మాట బహుశా ఆ మాటల సమగ్ర రూపమే కావచ్చునని చాలమంది అనుకుంటున్నారు. బంగారానికి అంత ప్రాధాన్యత ఇవ్వవచ్చునా, అంతకు ముందరి మాటలే ఎక్కువ ప్రజల గురించి తెలిపేలా ఉన్నాయి గదా, బంగారు తెలంగాణ అనడంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ అనే చంద్రబాబు వాసన కొనసాగడం లేదా అనే ప్రశ్నలు ఉన్నాయి గాని అవి పక్కన పెట్టవచ్చు. పేరు ఏదైనప్పటికీ, ఉద్దేశాలు, ఆచరణ ఏమిటనేది ప్రధానం.

ప్లీనరీలో మొదటిరోజు అధ్యక్షుడు కె చంద్రశేఖర రావు చేసిన ఉపన్యాసం ఎప్పటిలాగనే తెలంగాణవాదులకు ఆకర్షణీయమైన పద్ధతిలో, ప్రత్యర్థుల మీద చెణుకులతో, తెలంగాణ గత వైభవ ప్రశంసలతో, అరచేతిలో స్వర్గం చూపెట్టేలా సాగింది. ఉద్యమక్రమంలో అటువంటి ఉపన్యాసాల అవసరం, ప్రాధాన్యత ఉంటాయి గాని సకలాధికారాలు తన చేతిలోనే ఉన్నప్పుడు పది నెలలుగా తాను ఏమి చేయదలచుకుంటే అది చేసే అవకాశం ఉన్నప్పుడు, ఈ పాత ఉపన్యాసం సముచితం కాదు. ఈ ఉపన్యాసంలో గత పాలకుల మీద విమర్శ ఉంది గాని పది నెలల పాలనలో ఆ గతం నీడలను తుడిచివేయడానికి, కనీసం సమీక్షించడానికి ఏ ప్రయత్నాలు జరిగాయో ఒక్క మాట కూడ లేదు. తెరాస చరిత్ర గురించి, సాధించిన విజయాల గురించి ఉంది గాని, ఈ పది నెలల పాలనలో లోటుపాట్ల గురించి లేదు. మొత్తం మీద ఆత్మవిమర్శ లేని, సమీక్ష లేని, పొరపాట్లను, లోపాలను బహిరంగంగా ప్రజల ముందు, శ్రేణుల ముందు అంగీకరించలేని వైఖరి ఆ ఉపన్యాసం నిండా కనబడుతుంది. తెలంగాణ ప్రజల నిజమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలను పరిష్కరించే దిశలో తొలి అడుగులైనా పడడం లేదని, కనీసం ఆ దిశగా ప్రయాణమే ప్రారంభం కాలేదని గుర్తింపు లేదు. కఠోర వాస్తవానికి మసిపూసి మారేడుకాయ చేయడానికి సాంస్కృతిక చిహ్నాలను చూపడం, సాంస్కృతిక ఆభిజాత్యాన్ని ఎత్తిపట్టడం, కుహనా ఘనకీర్తి అతిశయాన్ని రెచ్చగొట్టి అసలు సమస్యలవైపు దృష్టి పోకుండా చేయడం ఈ ఉపన్యాసపు ప్రధాన ఉద్దేశ్యం. ఒక్క చిన్న ఉదాహరణ చెప్పాలంటే, పదిహేను సంవత్సరాల పాటు ప్రజా ఉద్యమాన్ని నడిపించిన, తెలంగాణ ఏర్పడితే అన్ని వర్గాల సమస్యలూ సమసిపోతాయని చెప్పిన తమ పార్టీ పాలనలో రోజుకు ముగ్గురు చొప్పున రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారో ప్రస్తావనైనా లేకపోవడం హాస్యాస్పదం. నిజానికి ఆ ఆత్మహత్యలన్నిటికీ ఈ పది నెలల పాలనే కారణమని అనే అమాయకులెవరూ ఉండరు. కచ్చితంగా అనేక చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక కారణాలతో ఆ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కాని, తమ పాలనలోని రాష్ట్రంలో అదే ప్రధాన సమస్య అయినప్పుడు దాన్ని ఎంతమాత్రం ప్రస్తావించకుండా ఒక రాజకీయ పార్టీ సమావేశం జరిగిందంటే ఆ పార్టీ ప్రజల నుంచి దూరంగా ఉన్నదనడానికి నిదర్శనం. తలచుకుంటే ఆ ఆత్మహత్యలను ప్రస్తావించి, అందుకు కారణాలను మరొకరి మీదికి నెట్టవచ్చు, తాము కారణం కాదని చెప్పుకోవచ్చు. పాలకులుగా ఆ మృతుల కుటుంబాల పట్ల తమకు బాధ్యత ఉందని, ఆ బాధ్యతను నెరవేరుస్తామని చెప్పుకోవచ్చు. కాని అసలేమీ ప్రస్తావించకుండా మౌనం వహించడమంటే గత పదిహేను సంవత్సరాలుగా ఏ దుర్మార్గాల గురించి పాత ఆంధ్రప్రదేశ్ పాలకులను విమర్శించారో ఆ పాలకుల విధానాలనె యథాతథంగా అనుసరించడం తప్ప మరొకటి కాదు.

అధినాయకుడి ఉపన్యాసం సాధారణంగా శ్రేణులను ఉత్తేజపరిచే ఉద్దేశంతో ఉంటుంది గనుక దానిలో లోపాల ప్రస్తావన, పొరపాట్ల ప్రస్తావన ఉండకపోవడాన్ని కూడ అర్థం చేసుకోవచ్చు. కాని ఇటువంటి సమావేశాలలో చేసుకునే తీర్మానాలు వాస్తవికంగా, యథాస్థితిని ప్రతిబింబించేలా, ఆత్మవిమర్శనా పూర్వకంగా ఉంటే ఆ సంస్థ ఆరోగ్యం, చిత్తశుద్ధి, నిజాయితీ బైటపడతాయి. కాని ఈ ప్లీనరీలో ఆమోదించిన తీర్మానాలలో, అవి ప్రవేశపెడుతూ చేసిన ఉపన్యాసాలలో, ఆ తీర్మానాల

మీద వ్యాఖ్యలలో అవసరమైన విషయాల అనావృష్టి, అనవరమైన విషయాల అతివృష్టి కనబడుతున్నాయి.

ప్లీనరీలో మొత్తం పన్నెండు తీర్మానాలు ఆమోదించారు. 1. తెరాస వ్యవస్థాగత నిర్మాణం బంగారు తెలంగాణకు పునరంకితం కావాలి. 2. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలి. 3. ఆసరా, కళ్యాణలక్ష్మి, వివిధ వర్గాల సంక్షేమపథకాల వంటి తెలంగాణ ప్రజాసంక్షేమ చర్యలు చేపట్టాలి. 4. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం సాధించాలి. 5. మిషన్ కాకతీయ తో సహా వ్యవసాయం, నీటిపారుదల రంగాల అభివృద్ధి చర్యలు చేపట్టాలి. 6. విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని స్వయం సమృద్ధంగా తీర్చిదిద్దాలి. 7. మౌలిక వసతులు కల్పించాలి. 8. తాగునీటి వ్యవస్థను రూపొందించాలి. 9. వర్తమాన రాజకీయాల్లో ఆంధ్రా రాజకీయ పార్టీల కుట్రలను ఓడిస్తూ టి ఆర్ ఎస్ శ్రేణులు ఉద్యమ వీరుల్లా నిలబడాలి. 10. హరితహారం పథకం కింద విస్తృతంగా మొక్కలు నాటాలి. తెలంగాణకు వానలు వాపస్ రావాలె, కోతులు అడవికి వాపస్ పోవాలె. 11. విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. 12. బలహీన వర్గాల గృహ నిర్మాణం సాగించాలి, గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించాలి. ఈ తీర్మానాలలో అవసరమైన తీర్మానాలు లేకపోవడం ఒక ఎత్తు కాగా, అవకాశం ఉన్నచోట కూడ అవసరమైన విషయాలు చర్చించకుండా ఉండడం మరొక ఎత్తు. దాదాపు ప్రతి తీర్మానంలోనూ ఆత్మస్తుతి పరనింద ఉన్నంతగా, నిర్మాణాత్మకమైన సమీక్ష, లోపాల గుర్తింపు, భవిష్యత్తుకు మార్గదర్శకాలు లేవు.

హైదరాబాద్ ను విశ్వనగరంగా మారుస్తామనే ప్రచారార్భాటం సరిగ్గా చంద్రబాబునాయుడు కాలాన్ని గుర్తు తెస్తున్నది. హైదరాబాద్ ప్రజలకు అవసరమైన, తగిన అభివృద్ధి తప్పనిసరిగా జరగవలసిందే. కాని అభివృద్ధి అంటే మళ్లీ చంద్రబాబు నాయుడు నిర్వచించినట్టుగానే ఫ్లై ఓవర్లు, స్కైవేలు అనే పాటలే మళ్లీ వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య ఉండని హైదరాబాద్ ను నిర్మిస్తామని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే నగరంగా తీర్చిదిద్దుతామని అంటున్నారు. విశ్వనగరంగా మార్చనక్కర లేదు, జీవించడానికి అనువైన నగరంగా మారిస్తే చాలు. హైదరాబాద్ ప్రజా జీవితం ఇబ్బందులమయం కావడానికి ఒక తప్పుడు అభివృద్ధి నమూనా కారణం. గ్రామీణ ప్రాంతాలను, చిన్న పట్టణాలను, జిల్లా కేంద్రాలను నిర్లక్ష్యం చేసి, అన్ని విద్యా, ఉద్యోగ, పారిశ్రామిక అవకాశాలను హైదరాబాదులో కేంద్రీకరించినందువల్ల, హైదరాబాదుకు వలసలు పెరిగి, జనాభా పెరిగి, హైదరాబాద్ మౌలిక సౌకర్యాలు ఆ జనాభా అవసరాలకు సరిపోక ప్రస్తుత దుస్థితి ఏర్పడింది. అంటే హైదరాబాద్ ను మరింతగా విద్యా, ఉద్యోగ అవకాశాల కేంద్రంగా మారిస్తే ఆ సమస్య మరింత పెరుగుతుంది. కాని ప్రస్తుతం తెరాస హైదరాబాదును మరింత సమస్యల మయం చేసే అభివృద్ధి నమూనాను ఒకవైపు ప్రకటిస్తూ, ఆ సమస్యలను పరిష్కరిస్తానని అంటున్నది.

మన సమాజం ఇవాళ ఉన్న స్థితిలో ప్రజలు సంక్షేమ పథకాలు అవసరమైన దుస్థితిలో ఉన్నమాట నిజమే. కాని సంక్షేమ పథకాల పేరు మీద అమలవుతున్నవన్నీ ఒకవైపు ప్రజలను పరాధీనులుగా చేయడానికి, మరొకవైపు ఆ పథకాలు అమలు చేసే అధికార యంత్రాంగాన్ని అవినీతి మయం చేయడానికి తప్ప ప్రజల నిజమైన అభ్యున్నతికి దారి తీయడం లేదు. తక్షణ, మధ్యంతర స్థాయిలలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, దీర్ఘకాలిక స్థాయిలో సంక్షేమ పథకాలు అవసరం రాని స్థితికి ప్రజలను అభివృద్ధి చేయడం, అంటే వారికి అర్థవంతమైన ఆదాయ వనరులు కల్పించడం, భూమి, ఉపాధి అందించడం ప్రభుత్వ కర్తవ్యాలు కావాలి. ఆ ఊసే ఎత్తకుండా సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడడం యథాస్థితిని కొనసాగించడమే అవుతుంది.

అలాగే సాంస్కృతిక పునరుజ్జీవనం అంటే కొన్ని సాంస్కృతిక చిహ్నాలను గుర్తించడం, కొంతమంది సాంస్కృతిక రంగ కార్యకర్తలకు అవకాశాలు కల్పించడం మాత్రమే కాదు. తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, భాష గత దశాబ్దాలలో ఏయే అన్యాయాలకు, విస్మరణకు, వివక్షకు గురయ్యాయో కచ్చితంగా గుర్తించి, ఆ రంగాలన్నిటిలో సముచిత గౌరవాన్ని, ప్రతిపత్తిని సాధించే చర్యలు చేపట్టడం. గత పది నెలల పాలనా కాలంలో కొన్ని ప్రదర్శనా వస్తువులను, కొంతమంది ఉదాహరణ ప్రాయమైన వ్యక్తులను, పేర్లను మినహా నిజంగా విస్తృతమైన, వైవిధ్యభరితమైన, సబ్బండవర్ణాల తెలంగాణ సంస్కృతిని పునరుజ్జీవింపజేసే దిశగా కనీస చర్యలు అమలు కాలేదు.

తెలంగాణ వ్యవసాయ రంగంలో, నీటిపారుదల రంగంలో చేయవలసింది ఎంతో ఉంది. కాకతీయుల నాటి నుంచీ తెలంగాణలో సాగుతున్న గొలుసుకట్టు చెరువుల ఏర్పాటు తెలంగాణ ఆర్థికవ్యవస్థ బలోపేతం కావడానికి కారణమైంది. కనుక చెరువుల పునరుద్ధరణకు తలపెట్టిన మిషన్ కాకతీయ, దాని ద్వారా వ్యవసాయ, నీటి పారుదల రంగాల అభివృద్ధి రూపంలో చాల అవసరమైన, ఆకర్షణీయమైన చర్యలే. కాని చెరువుల పునరుద్ధరణ అంటే పూడిక తీయడం, కట్టలు బలోపేతం చేయడం మాత్రమే అయితే ఉపయోగం లేదు. చెరువులు నిండాలంటే వాగులు పారాలి. వాగులు పారాలంటే కొండలు, అడవులు, ఇసుక ఉండాలి. గ్రానైట్ కోసం కొండలు పగులగొట్టి, కలపకోసం అడవులు నరికి, భవన నిర్మాణం కోసం ఇసుక తోడిపోసి, చెరువుల పునరుద్ధరణ అంటే అది అమలు జరగని ఊహే అవుతుంది. అంటే చెరువుల పునరుద్ధరణ అనేది ఒక సమగ్ర విధానంలో, ఒక కొత్త అభివృద్ధి నమూనాలో భాగం కావాలి. ఆ పూడిక తీసివేతకు కూడ తప్పనిసరిగా యంత్రాలు వాడాలని, మానవశ్రమ ఉపయోగించవద్దని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందంటే పొక్లెయిన్లు కొనుక్కున్న సంపన్న కంట్రాక్టర్ల (వారిలో అత్యధికులు శాసనసభ్యులు) ప్రయోజనాలకే తప్ప, కనీసం నాలుగు రోజులు కూలి దొరికే శ్రామికుల కోసం కాదు.

పన్నెండు తీర్మానాలు ఉండి కూడ తెలంగాణ పారిశ్రామికీకరణ గురించి, మరీ ముఖ్యంగా చంద్రబాబు నాయుడు కాలం నుంచీ మూసివేతకు గురైన ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణ గురించి ఒక తీర్మానం లేకపోవడం తెరాస, 2014 జూన్ 2 కు ముందు పదమూడు సంవత్సరాల పాటు తాను నిరంతరం ఇచ్చిన నినాదాలను తానే మరిచిపోయిందనడానికి గుర్తు. అలాగే ఆ పదమూడు సంవత్సరాలలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలంగాణ నిరుద్యోగులకు దక్కవలసిన రెండున్నర లక్షల ఉద్యోగాలు కొల్లగొట్టుకుపోయారని ఆరోపించిన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే, తెలంగాణ బిడ్డలకు ఉపాధి దొరుకుతుందనీ వాగ్దానాలు చేసిన తెరాస, అధికారానికి వచ్చినతర్వాత జరిపిన మొదటి సమావేశంలో ఉద్యోగాల గురించి మాట మాత్రం కూడ ఎత్తలేదు. ఈ ప్లీనరీ ఉపన్యాసాలలో కూడ అనేకసార్లు ఆంధ్ర ద్రోహుల గురించి,

తెలంగాణలో పారిశ్రామిక విధానం

మన రాష్ట్రం - మన పాలన అంటూ అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ఆ నినాదానికి తూట్లు పొడుస్తూ, అవిభక్త రాష్ట్రంలో పాలకులు అమలు చేసిన ప్రజావ్యతిరేక విధానాలనే కొనసాగిస్తోందని అంటున్నారు **ఏంపల్లి భాస్కర్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2కు సంవత్సరం అవుతుంది. అధికారం తెలంగాణకు మారింది. ఇప్పుడు ఏం చేయాలి? సీమాంధ్ర పాలకులు తెలంగాణకు చేసిన అన్యాయాన్ని సరిదిద్దుకుంటూ, అవే తప్పులు జరగకుండా చూడాలి. ఒక పద్ధతి ప్రకారం సీమాంధ్ర పాలకులు తెలంగాణలోని పరిశ్రమలను దివాళ తీయించి, నష్టాల సాకుతో ఆంధ్ర పెట్టుబడిదారులకు కట్టబెట్టారు. ఆ విషయం టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ప్రస్తావించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఆంధ్ర పెట్టుబడిదారులను ఏం చేశారు? రామోజీ ఫిలిం సిటీని లక్ష నాగళ్లతో దున్నుతామని చెప్పిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఇప్పుడు ఓం సిటీ కట్టుకొమ్మని రాచకొండ గుట్టలు ఇచ్చారు.

టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధి చెందిన దేశాల్లో పర్యటనలు చేశారు. వారు ఏ విధంగా అభివృద్ధి చెందారో తెలుసుకున్నారు. తిరిగి వచ్చి ఆ దేశాల మాదిరిగా ఈ రాష్ట్రాన్ని మారుస్తామన్నారు. నూతన పారిశ్రామిక విధానం, ముఖ్యమంత్రి ఇస్తున్న హామీలను చూస్తే రాష్ట్రం సింగపూర్, స్విట్జర్లాండ్‌గా మారిపోయినట్లే అనిపిస్తుంది.

మూతపడ్డ పరిశ్రమలు తెరుస్తామని, పారిశ్రామిక కారిడార్లు, ఫార్మా సిటీలు, పారిశ్రామిక పార్కులు, ఓం సిటీలు ఏర్పాటు చేస్తామంటారు. వలసపోయిన వాళ్లందరిని తిరిగి తీసుకు వస్తామంటారు. చేతి వృత్తులను పునరుద్ధరిస్తామంటారు. టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తామంటారు. చెరుకు రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్లి ఎకరాకు 30 టన్నులు కాదు 100 టన్నులు ఎలా పండించాలో నేర్చుకొమంటారు. హుసేన్‌సాగర్‌ను మంచినీళ్లతో నింపేస్తామంటారు. ఉచిత వైఫై సిటీగా హైదరాబాద్‌ను చేస్తామంటారు. హైదరాబాద్‌లోని, వరంగల్‌లోని బస్తీలన్నింటిని సుందరంగా తీర్చి దిద్దుతామంటారు. ఇవన్ని వింటుంటే సింగపూర్‌లోనే ఉన్నట్టుంది. ఏమి కనిపించదు అంతా వినడమే.

సీమాంధ్ర పాలనలో నిర్లక్ష్యానికి గురై, వెనుకబడిన ప్రాంతంలో ఇప్పటికిప్పుడు సింగపూర్‌నో, స్విట్జర్లాండ్‌నో చేయమని ఎవరు అడిగారు? అత్యంత వెనుకబడిందని చెప్పుకుంటున్న ప్రాంతంలో అది ఎట్లా సాధ్యమవుతుంది. దానికి నిధులు ఎక్కడి నుండి వస్తాయి? అధికారంలోకి రాగానే చేసిన సమగ్ర సర్వే ద్వారా తేలింది. తెలంగాణలో 30 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అది చాలు ఇవన్ని చేయడానికి. అధికారంలోకి ఎవరు వచ్చినా ఈ అమ్ముకోవడమనే కాన్సెప్ట్ ఒకటి ముందుకు వస్తుంది. సహజ వనరులను మల్టినేషనల్ కంపెనీలకు కట్టబెట్టి, ప్రభుత్వ భూములను ఉచితంగా ఇస్తామని పెట్టుబడిదారులను ఆకట్టుకునేదే అభివృద్ధి నమూనాగా ప్రచారం చేస్తుంది.

ప్రధానమంత్రి మొదలుకొని, కొత్త రాష్ట్రాల ముఖ్యమంత్రులు వారి యువరాజులు సేల్స్‌మేన్ అవతారం ఎత్తి ఒకరికొకరు పోటీపడి బేరాలు ఆడుతున్నారు. నారా లోకేష్ టివి9తో మాట్లాడుతూ 'తెలంగాణలో హైదరాబాద్ ఉంది, ప్రభ్వుత భూములున్నాయి. పైగా మంత్రి హోదాలో వెళ్లిన కెటిఆర్ తేలేని పెట్టుబడులు ఒక సామాన్య కార్యకర్తగా నేను తెచ్చాను' అని సవాల్ చేస్తున్నాడు. ఇదంతా రెండు రాష్ట్రాలు, రెండు పార్టీలు కాదు. రెండు కుటుంబాల విషయంగా మారింది.

నూతన పారిశ్రామిక విధానం

రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల ప్రభుత్వం భూమి ఉంది. కొత్తగా రెండు లక్షల 35 వేల ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. ఈ భూములను కొత్తగా వచ్చే పరిశ్రమలకు అప్పగిస్తారు. ఇంతకు ముందు

ఆంధ్ర అన్యాయాల గురించి మాట్లాడిన తెరాస నాయకులు 2014 జూన్ 2 వరకూ కూడ తెలంగాణను వ్యతిరేకించిన, ఆంధ్ర పార్టీల అగ్రనాయకులుగా ఉన్న వారెందరో, అధికారం కోసం గోడ దూకి ఇవాళ తెరాస ప్రభుత్వంలో చక్రం తిప్పే స్థానాల్లో ఉన్నారని మరిచిపోయారు. తప్పకుండా ఎవరైనా అభిప్రాయాలు మార్చుకోవచ్చు, నిన్నటిదాకా ఆంధ్రవాదులుగా, సమైక్యవాదులుగా ఉన్నవారు, ఇవాళ తెలంగాణవాదులు కావచ్చు, అభ్యంతరం లేదు. కాని ఆ మార్పు అభిప్రాయాల మార్పా, అధికారం కోసం మార్పా గుర్తించలేనంత అమాయకత్వం సరైనదేనా?అధికారాన్ని అనుభవిస్తున్న పార్టీగా తెరాస తెలంగాణలో నానాటికీ అడుగంటుతున్న పౌరహక్కుల గురించి మాట్లాడాలనుకోవడం అత్యాశే గాని, 2014 జూన్ 2 వరకూ తెలంగాణలో ఏ పౌరహక్కుల ఉల్లంఘన జరిగిందో, ఏ అప్రజాస్వామికత గురించి తెరాస కూడ అప్పుడప్పుడు మాట్లాడిందో, అదే పౌరహక్కుల ఉల్లంఘన, అదే అప్రజాస్వామికత ఈ పది నెలల్లో జరుగుతుంటే, బైటికి చెప్పకపోయినా సరే, తెరాస నాయకులకు తమ పాత మాటలు గుర్తుకైనా రావడం లేదా?

మాట మార్చడం, మతిమరపు, నమ్మకద్రోహం, వంచన, ప్రజావ్యతిరేకత, పౌరహక్కుల ఉల్లంఘన ఈ దేశంలోని పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నిటికీ ఉమ్మడి లక్షణాలు. తానూ ఆ తానులోని ముక్కనేనని తెలంగాణ రాష్ట్ర సమితి రుజువు చేసుకుంటున్నదనడానికి నిదర్శనం 2015 ప్లీనరీ.

(రచయిత వీక్షణం సంపాదకులు)

'సింగిల్ విండో' సిస్టం ఉండేది. ఇప్పుడు 'సింగిల్ విండో విత్‌ఔట్ గ్రిల్స్' అంటే అంతకు ముందున్న పద్ధతి కంటే సులువుగా పరిశ్రమలకు అనుమతులు లభిస్తాయి. అనుమతులు పొందడం పెట్టుబడిదారుల హక్కుగా ఉంటుంది.

ప్రపంచంలోనే మొదటిసారి 'రైట్ టు క్లియరెన్స్'అనే విధానం అమలు చేస్తామని చెపుతున్నారు. దీని ప్రకారం పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం ఉండదు. కంపెనీలిచ్చే 'సెల్ఫ్ క్లియరెన్స్' సర్టిఫికెట్ ఆధారంగా మెగా పరిశ్రమలకు 15 రోజుల్లో, మిగతా పరిశ్రమలకు 30 రోజుల్లో అనుమతులు ఇవ్వాలి. పరిశ్రమల కోసమే ప్రత్యేకంగా డిస్కంలు పెట్టాలని నిర్ణయించారు. వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తూ 200 కోట్ల పెట్టుబడులు పెట్టే మెగా ఇండస్ట్రీయల్ ప్రాజెక్టులకు ప్రత్యేమైన ప్రోత్సహకాలు ఇవ్వనున్నారు. స్టాంపు డ్యూటీ, వ్యాట్, పవర్, నైపుణ్య శిక్షణకు అయ్యే ఖర్చు, భూమి, మౌలిక వసతుల అభివృద్ధికి అయ్యే ఖర్చుతిరిగి చెల్లించి పరిశ్రమలను ప్రోత్సహిస్తారు. ఇంతే కాకుండా రంగాల వారిగా ప్రత్యేక ప్రోత్సహకాలు ఇవ్వాలని ప్రతిపాదించడం జరిగింది. పన్నులు, పరిశ్రమలు రావడానికి అడ్డంకిగా ఉండి, ఆదాయం రాకుండా ఉన్నందున పన్నుల రేషనైలెజేషన్ చేయాలని నిర్ణయించారు. అంతర్ రాష్ట్ర పారిశ్రామిక ఎగుమతులు, దిగుమతులపై పన్నులు లేకుండా రేషనలైజ్ చేయడానికి నిర్ణయించడం జరిగింది. కొత్తగా పారిశ్రామిక సిటీలను, ఆరు పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

దళితులు, ఆదివాసులు, మహిళలు, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక ప్రోత్సహకాలు కల్పించే పాలసీ చేస్తామన్నారు. వారికి వారి జనాభా దామాషా ప్రకారం పరిశ్రమలకు భూములు కేటాయిస్తామని తప్ప, వేరే ఏ ప్రయోజనాల ప్రోత్సహకాలు ప్రకటించలేదు. నిర్మల్, పెంబర్తి, కరీంనగర్ ప్రాంతాల్లోని అద్భుతమైన చేతి వృత్తులకు మార్కెటింగ్ కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఏరోస్పెస్, రక్షణ పరికరాల ఉత్పత్తి మీద ఎక్కువగా దృష్టి సారిస్తామని చెప్పారు. రంగారెడ్డి జిల్లాలోని ముచ్చెర్లలో పదకొండు వేల ఎకరాల్లో ఫార్మా సిటీని నెలకొల్పి, ప్రపంచంలోనే చైనా, జపాన్ తర్వాత మూడవ ఫార్మా యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఇదంతా చెప్పడానికి బాగానే ఉంది. మరి అమలు సంగతేంటి? ఇంతకు మించిన ప్రత్యామ్నాయమే లేదా ఉపాధి కల్పనకు. రైట్ టు క్లియరెన్స్ ప్రకారం మెగా పరిశ్రమలకు 15 రోజుల్లో, ఇతర పరిశ్రమలకు 30 రోజుల్లో అనుమతులు ఇవ్వాలి. లేకపోతే దానికి అధికారులను బాధ్యులను చేస్తారు. ఇటువంటి హక్కు ప్రజలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను, ఇతర చట్టాలను ధిక్కరించేదిగా ఉంటుంది. పర్యావరణం మైనింగ్ అనుమతులు, ఆదివాసుల హక్కులు కాదని ఈ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఏదైనా కారణాల దృష్ట్యా అనుమతులు ఇవ్వడం కుదరదు అని చెప్పే వీలు అధికారులకు ఉండదు. అనుమతులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం, బాధ్యులను చేస్తాం అంటే మిగతా చట్టాలను పట్టించుకోకుండా అనుమతులు ఇస్తారు.

ఇవన్నీ చేస్తే కొత్తగా రాష్ట్రంలోకి 8,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశించారు. ప్రపంచంలో ఎక్కడాలేని ఇంత మంచి పాలసీ చేస్తే ప్రపంచంలోని కంపెనీలన్నీ పెట్టుబడులు పెట్టడానికి ఎగబడి రావాలి కదా? మరి ఎందుకు రాలేదు? లాభాలు వస్తాయని తెలిస్తే కంపెనీలు, పెట్టుబడిదారులు ఎలాగైనా అనుమతి పొందుతారు. లేదంటే ప్రభుత్వాలనే మార్చిన చరిత్ర ఈ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఉంది.

మొదట పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ అడాగ్ పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మీడియాల్లో, సికె బిర్లా గ్రూప్ హెల్త్‌కేర్, సిమెంట్‌లలో, మహీంద్రా గ్రూప్ ట్రాక్టర్‌ల ఉత్పత్తి, లులూ గ్రూప్ రిటైలింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌లలో ముందుకు వచ్చారు. ఆ తర్వాత కేంద్రం తెలంగాణకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలో పన్ను మినహాయింపులు ఇవ్వకపోవడం, ఇచ్చిన కొన్ని ప్రోత్సహకాలు కూడా హైదరాబాద్‌కు కాకుండా ఇతర వెనుకబడిన ప్రాంతాలకే పరిమితం చేయడం వలన వెనక్కి తగ్గారు. పెట్టుబడిదారులకు కావాల్సింది ఉచిత పవర్, పన్ను మినహాయింపులు. వాటికోసం ముఖ్యమంత్రి సహా, మంత్రులందరూ ఢిల్లీ చుట్టూ తిరిగారు. సరైన స్పందన లేకపోవడంతో ఆహ్వానిస్తే కేంద్రంలో చేరతామని కవితను కేంద్రమంత్రిని చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు కేంద్రం నుండి పొందడానికి నానా తిప్పలు పడుతున్నారు.

1956 నాటికే తెలంగాణలో ఉన్న అజాంజాహి మిల్లు, ఆల్విన్, ప్రాగాటూల్స్, అస్‌వెస్టాస్, దక్కన్ బటన్ ఫ్యాక్టరీ, దక్కన్ గ్యాస్ ఫాక్టరీ, డిబిఆర్ మిల్స్, గోల్కొండా సిగరెట్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ ల్యామినేషన్ ప్రొడక్స్, నిజాం షుగర్స్, సిర్పూర్ పేపర్ మిల్లు వంటివి ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ఫ్యాక్టరీలన్ని ప్రత్యక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించేవి. వీటిని గత ప్రభుత్వాలు అభివృద్ధి నమూనాల కనుగుణంగా దివాళ తీయించి, నష్టాలబాట పట్టించి, మూసేసి, ప్రైవేట్‌పరం చేశారు.

నిజాం షుగర్స్‌ను 15,000 ఎకరాల విస్తీర్ణంలో 1921లో చివరి నిజాం ఏర్పాటు చేశాడు. అప్పటికి ఆసియాలోనే పెద్ద షుగర్ ఫ్యాక్టరీ. దీనిని 2002లో చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు పశ్చిమ గోదావరికి చెందిన గోకరాజు గంగరాజుకు నామమాత్రపు ధరకే అమ్మివేశారు. 2001లోనే 4,200 ఎకరాల ఫ్యాక్టరీ భూములు వేలంలో అమ్మేశారు. నిజాం షుగర్స్‌ను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకుని, ప్రైవేట్ యాజమాన్యం పెట్టిన 180 కోట్లు తిరిగి ఇస్తామని చెప్పారు. వాస్తవానికి ఈ నిర్ణయం 2014లో కాంగ్రెస్ ప్రభుత్వంలో 'గ్రూఫ్ ఆఫ్ మినిష్టర్' ఆనం రామనారాయణరెడ్డి, పి. సుదర్శన్‌రెడ్డి, పి. సునితారెడ్డి, ఘంటా శ్రీనివాసరావులతో కూడిన కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం ఇంకా అమలుకు నోచుకోలేదు.

అజాంజాహి మిల్స్‌ను 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేస్తే అన్ని రాజకీయ పార్టీలు, తెలుగుదేశంతో సహా వ్యతిరేకించాయి. ఉద్యమించాయి. ఆ మిల్లు పదివేల మందికి ప్రత్యక్షంగా, 15 లక్షల మందికి పరోక్షంగా ఉపాధినిచ్చింది. అక్కడ టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆ దిశగా ఒక అడుగు కూడా వేయలేదు. సిర్పూర్ పేపర్ మిల్లు, కమలాపురం పేపర్ మిల్లు మూత పడ్డాయి.

లేని కంపెనీలకు, రాని కంపెనీలకు అన్ని ప్రోత్సహకాలు ఇచ్చే బదులు ఉన్న ఫ్యాక్టరీలను పునరుద్ధరించవచ్చు కదా! ఏ ప్రజలు అడిగారు తెలంగాణను ఐదు సంవత్సరాల్లో సింగపూర్, స్విట్జర్‌లాండ్ చేయమని. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసపోయిన వాళ్లందరికి ఇక్కడ ఉపాధి కల్పించే విషయం ఆలోచించండి. గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల ప్రాణాలు కాపాడండి.

(రచయిత ఆర్థికశాస్త్ర పరిశోధక విద్యార్థి, సెంట్రల్ యూనివర్సిటీ)

కెసిఆర్ ఏడాది పాలన జనరంజకమేనా?

తెలంగాణ కోసం కృషి చేసిన వారిని అణచివేస్తూ, వ్యతిరేకించిన వారిని వెనుకేసుకొస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఈ ఏడాది కాలంలో తెరాస ప్రజలకు నమ్మక ద్రోహం చేసిందని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన ప్రజలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే అన్ని సమస్యలు పరిష్కార మవుతాయని ఆశించారు. ఉద్యమ నాయకత్వం, తెలంగాణ వాదులు కూడ తెలంగాణ ప్రజల సమస్యలకు ఆంధ్ర పాలకుల విధానాలే కారణమని ప్రజలకు చెప్పారు. తెరాస ఉద్యమ పార్టీగా ఉద్యమకాలంలో, ముఖ్యంగా 2014 మే ఎన్నికల ప్రణాళికలో చాల ఆకర్షణీయమైన హామీలు ఇచ్చింది. ప్రజాస్వామికవాదులు చాల వరకు హర్షించారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి హామీ ఇవ్వనప్పటికీ కనీస ఉపశమనంగా కొన్ని సంక్షేమ కార్యక్రమాలు వంటివి అధికారం లోకి రాకముందు, వచ్చిన తర్వాత టిఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నో హామీలు ప్రకటించారు. ఆత్మహత్యలులేని తెలంగాణ, ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కులు పరిఢవిల్లె తెలంగాణ. పంట పొలాలకు నీరు, ఇంటికో ఉద్యోగం, అందరికీ సమానమైన నాణ్యమైన విద్య, పేదలకు, వృద్ధులకు పించన్లు, ఇల్లు లేని కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు, దళితులకు – ఆదివాసి కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికగా నియమించడం. పర్యావరణాన్ని విధ్వంసం చేసే పారిశ్రామిక – మైనింగ్ విధానాన్ని అరికట్టడం వంటివి ప్రధానమైనవి. తద్వారా బంగారు తెలంగాణ, పచ్చని తెలంగాణ నిర్మిస్తామని తెలంగాణ ప్రజలకు భరోసా ఇచ్చారు.

తెరాస పార్టీ అధినేత కెసిఆర్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా ఆయన వాగ్దానాలు ఏ మేరకు ఆచరణలోకి వచ్చాయో పరిశీలించవల్సి ఉంది. ప్రధానంగా దళితులకు భూమి, యువతకు ఉపాధి, తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చడం, తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన ఉచిత విద్య, ప్రజలందరికి అందుబాటులో వైద్యం, ఇల్లులేని వారికి ఇల్లు వంటి ప్రధాన సమస్యలపై ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోంది. మాటల గారడీతో సమస్యల పరిష్కారాన్ని వాయిదావేసే తంతు అతిగా కనిపిస్తుంది. కెసిఆర్ నినాదాలు ఇంకా విధానాలుగా మారలేదు. విచిత్రమేమంటే ఇప్పటికి ఆయన పాలన ప్రధానంగా ఆంధ్ర పాలకులను విమర్శించడంలోనే గడిచిపోతోంది. ఏ సమస్య పరిష్కరించాలన్న సమస్య తీవ్రతను ముందు గుర్తించాలి. సమస్యతో బాధపడుతున్న బాధితుల సంఖ్యను నిర్ధారించాలి. అందుకు కావల్సిన ఆర్థికాన్ని సమకూర్చుకోవాలి. తగిన ప్రణాళికను రూపొందించు కొని నిజాయితీతో అమలు చేయాలి. ఇవేమి చేయకుండా బహిరంగ వేదికల నుండి ఆచరణకు రాని, కార్యాచరణ లేని వాగ్దానాలు చేయడం కెసిఆర్‌కు పరిపాటి అయింది. దీనికి తోడు తెలంగాణ ఉద్యమంలో సామాజిక గుర్తింపు పొందిన ఉద్యమకారులు ఏదో ఒక ప్రభుత్వ పదవిలో ఉండడంవల్ల వారి గత విమర్శనాత్మక దృక్పథం, దృష్టి కొడిగట్టింది. పైగా వీళ్లు ఎవరైనా ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఎదురు దాడి చేస్తున్నారు. మరికొందరు మౌనాన్ని ఆశ్రయించారు. చంద్రబాబు పాలనకాలంలో ఏ ప్రపంచబ్యాంక్ అభివృద్ధి నమూనానైతే తెలంగాణను పీల్చిపిప్పి చేసిందో అదే సామ్రాజ్యవాద కార్పొరేట్ అనుకూల అభివృద్ధి నమూనాను కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించి మరింత దూకుడుగా అమలుచేస్తున్నది.

దళితులకు భూపంపిణీ దారెటు...?

అనేక బహిరంగ సభలల్లో, ఎన్నికల ప్రణాళికలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దళిత కుటుంబాలకు మూడు ఎకరాల సాగుభూమి ఇస్తామని హామీ ఇచ్చింది. భూములు కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేస్తామని కెసిఆర్ ప్రకటించారు. గత ఏడాది ఆగస్టు 15న అట్టహాసంగా ప్రారంభమైన భూముల పంపకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎకరం ఉంటే రెండెకరాలు, రెండెకరాలు ఉంటే ఎకరం, ఏమీ లేని వారికి మూడెకరాలు భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. నిజానికి ఇదేమి కొత్త పథకం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 2006లోనే దళితులకు భూమి పంపిణీ చేసే 'భూమి పథకం' ప్రారంభమైంది. ఈ పథకం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 2008 వరకు కొనసాగింది. దాదాపు 1772 ఎకరాల భూమి కొనుగోలు చేసి 2142 ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు పంచారు. ఇందుకోసం రు. 11.17 కోట్లు ఖర్చు పెట్టారు. ఇప్పుడు కెసిఆర్ ప్రకటించిన దళితులకు మూడు ఎకరాల భూమి 2008 నాటి భూములు కొని దళితులకు ఇచ్చే ప్రభుత్వ విధానపు కొనసాగింపే.

అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం ముగిసింది. 2015–16 బడ్జెట్ ప్రసంగంలో తెలిపిన వివరాల ప్రకారం 550 దళిత కుటుంబాలకు 1402 ఎకరాల భూమిని పంపిణీ చేశామని తెలిపారు. 2015–16 సంవత్సరపు బడ్జెట్‌లో ఈ పథకానికి 1000 కోట్ల రూపాయలు కేటాయించారు. తెలంగాణలో 2011 జనాభా లెక్కల ప్రకారం 54,32,680 ఎస్‌సిలు ఉన్నారు. కుటుంబాల పరంగా చూస్తే 6 లక్షల పైనే ఉంటాయి. వీరిలో ఒక వంతు పట్టణాల్లో ఉంటే మూడొంతులు గ్రామాల్లో ఉంటున్నారు. ఇవాళ భూమి కొరకు చూస్తున్న కుటుంబాలు దాదాపు నాలుగు లక్షల వరకు ఉంటాయి. మనదేశంలో, రాష్ట్రంలో భూ యాజమాన్యంలో తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. అసలే భూమిలేని వారు మూడు లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ లెక్కలే చెపుతున్నాయి. దళితులందరికి భూమి ఇవ్వాలంటే 15 లక్షల ఎకరాల భూమి కావాలి. భూపంపిణీకి భూమికొనడం అనేది ఒక అంశమే తప్ప అదే సర్వస్వం కాదు. దేవాలయ, బంచరాయి, ప్రభుత్వం వద్ద, భూస్వాముల వద్ద ఉన్న మిగులు భూములు పంచడం ద్వారా మాత్రమే దళితులందరికి భూమి ఇవ్వడం సాధ్యమవుతుందన్న సత్యాన్ని కెసిఆర్

ఇప్పటికైనా గుర్తించడం మంచిది. భూమి కుటుంబానికి హోదాను, జీవికనిస్తుంది. భూపంపిణీ చేయడానికి సంబంధించిన భూములు కొనడానికి 2015-16 ఆర్థిక సంవత్సరానికి రు.1000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఒక ఎకరం సగటున నాలుగు లక్షలు పలికినా 25000 ఎకరాల భూమి మాత్రమే పంచడానికి దొరుకుతుంది. భూమి కావల్సిన కుటుంబాలు లక్షల్లో ఉంటే భూపంపిణి వేల కుటుంబాలకే పరిమితం చేస్తే ఈ పథకం పూర్తి కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో అంతుచిక్కడం లేదు. బహుళజాతి సంస్థలకు, పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు ఇవ్వడానికి 20 లక్షల ఎకరాలు సేకరిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించడం గమనార్హం. దీంతో దళితుల భూపంపిణీ పథకం సాకారం చేయడానికి కెసిఆర్‌కు చిత్తశుద్ధిలేదని చెప్పక తప్పదు.

కెజి నుంచి పిజి విద్య ఓ మిథ్య

కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తానంటూ ఎన్నికల ప్రణాళికలో ఘనంగా ప్రకటించిన ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో, జూనియర్ కళాశాలల్లో ఉన్న ఖాళీలను ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. అనేక విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వి.సిలు లేరు. వాటికి కావల్సిన నిధుల కేటాయింపులేదు. ఉన్న విద్యాలయాలను మెరుగుపరచకుండా ఉన్నతమైన విద్య అందిస్తామంటే ఎలా నమ్మాలి? మనరాష్ట్రంలో విద్యకు 1980 దశకంలో రాష్ట్ర బడ్జెట్‌లో 18 నుంచి 20 శాతం మధ్య నిధులు కేటాయించారు. 1990 దశకంలో 15-16 శాతం నిధులు విద్యకు కేటాయించారు. ఈ శతాబ్దపు ఆరంభం నుండి 14 శాతం నిధులు రాష్ట్ర విభజన జరిగేవరకు కేటాయించారు. అయితే అందరికి విద్య, ఉచిత విద్య, నాణ్యమైన విద్య అంటూ ప్రకటనలు చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం 2014-15 సంవత్సరంలో 11 శాతం నిధులు కేటాయించగా, 2015-16 సంవత్సరానికి 10 శాతం నిధులు కేటాయించడంతో ప్రభుత్వం విద్యను చిన్నచూపు చూస్తోందని అర్థమవుతున్నది. రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఉన్నత విద్యారంగానికి నామమాత్రం నిధులు కేటాయించి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు కొన్నేళ్లుగా నిధుల లేమితో సతమతమవుతున్నాయి. దాదాపు 1000కి పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్క ఉస్మానియాలోనే 600 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా విశ్వ విద్యాలయాల్లో ప్రమాణాలు నానాటికి దిగజారి పోతున్నాయి. డా. కొఠారి కమిషన్ విద్యకు రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం నిధులు కేటాయించాలని 1966 లోనే సిఫారసు చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఆరంభం లో 2015-16 నుంచి కెజి నుంచి పిజి వరకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందిస్తామని గంభీరంగా ప్రకటించింది. మాటలకు చేతలకు పొంతనలేదని ఆచరణ చెపుతుంది. ఇప్పుడేమో నిపుణుల కమిటీ వేశాం, కమిటీ రిపోర్ట్ రాగానే రాష్ట్ర విద్యా విధాన ప్రకటన చేస్తామని ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపాడు. ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు అప్పుడప్పుడు వెలిబుచ్చుతున్న అభిప్రాయాల ప్రకారం ప్రతి నియోజక వర్గానికి ఒక పాఠశాల అందులో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో సిబిఎస్ఇ సిలబస్ ప్రకారం బోధన ఉంటుందంటున్నారు. అయితే ప్రీ ప్రైమరీ, కళాశాల, ఉన్నత విద్య గురించి ఎక్కడ ప్రస్తావన రావడం లేదు.

కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అని చెపుతూనే మరోపక్క ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనం చేస్తూ ప్రైవేట్, కార్పొరేటు విద్యను ప్రోత్సహిస్తుంది. అందరికి విద్య అంటూనే 3000 గ్రామీణ ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల మూసివేతకు సన్నాహాలు చేస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో 19లోపు, ఉన్నత పాఠశాలల్లో 75మంది పిల్లలు ఉంటే మూసివేస్తామంటున్నారు తప్ప సర్కారీ బడుల్లో నాణ్యమైన వసతులు కల్పించి విద్య అందిస్తామని ప్రజలకు ఎందుకు భరోసా ఇవ్వలేకపోతున్నారో చెప్పలేకపోతున్నారు? కెజి నుంచి పిజి వరకు విద్య అందిస్తారని ప్రజలు ఎంతో ఆశగా ఉన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో తరాలుగా సమాజానికి దూరంగా బతుకుతూ, చదువుకు నోచుకోని వర్గాలు నేడు బడికి వస్తున్నాయి. ఈ క్రమంలో వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీలు గుప్పిస్తూ గద్దెనెక్కుతున్న ప్రభుత్వాలు వారిని ఏ రకంగా సంక్షోభంలోకి నెట్టాయో దశాబ్దాల అనుభవమే. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యాపరంగా వెనుకబాటుతనానికి గురైన తెలంగాణలోని గిరిజన, దళిత, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకు దూరమయ్యారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ మయం చేసిన తీరుపైనా ఎంతో సమరశీలంగా విద్యార్థులు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ బడులు మూసివేస్తున్నారన్న వార్తలు ప్రజల్లో ఆందోళనల్ని రేకెత్తిస్తున్నాయి, ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఏడాది కాలంగా ప్రభుత్వ విన్యాసాన్ని గమనిస్తే ఏవో కొన్ని ఆదర్శ పాఠశాలలను స్థాపించి మరో శిష్టవర్గ విద్యకు బీజమేసేటట్లు కనిపిస్తోంది. కెసిఆర్ చెప్పేది డా. కొఠారి చెప్పిన 'నేబర్‌వుడ్ స్కూలు' విధానం కాదు. అలాగే అందరికి ఉచిత విద్య అంటూనే ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేస్తామని ప్రకటించడం లేదు సరికదా! ఆ పాఠశాలల యజమాన్యాలు చేస్తున్న అక్రమాలను నియంత్రిస్తామనిగాని, అందులో పనిచేసే ఉపాధ్యాయులకు న్యాయమైన వేతనాలు ఇప్పిస్తామని కూడ మాట్లాడడం లేదు. విద్యా మాఫియా టిఆర్ఎస్ పార్టీలో ప్రధాన స్థానాల్లో ఉండి క్రియాశీల పాత్ర పోషిస్తోంది. నాణ్యమైన విద్య అంటూనే పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాల భౌతిక, బోధన అవసరాలు తీర్చేందుకు నిధులు కేటాయించడం లేదు. మనరాష్ట్రంలో 3-5 వయస్సు గలవారు, 6-14 వయస్సు గలవారు, 15-24 వయస్సు గలవారు దాదాపు రెండు కోట్ల మంది వరకు ఉంటారు. వీరందరికి ఎన్ని పాఠశాలలు, కళాశాలలు అవసరం అన్న సమాచారం కూడ ప్రభుత్వం వద్దలేదు. ఒక్క పాఠశాల విద్యను అభ్యసించే వారిలో 62 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 60 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఆరు లక్షల మంది బడి ముఖం చూడని పిల్లలు ఉన్నారు. ఈ పూర్వరంగంలో కెజి నుంచి పిజి అమూర్తంగానే ఉంది. ఏనుగు, ముగ్గురు గుడ్డివాళ్ల కథ చందంగా ఉంది.

కార్పొరేట్ చదువుల్ని తమ పిల్లలకు ఇప్పించలేని పేద వర్గాలన్నింటికీ ప్రభుత్వ బడే శరణ్యం. తమ నివాసాలకు దగ్గరలో ఉన్న బడులకే తమ పిల్లల్ని పంపించాలనుకుంటారు. మరి అలాంటి బడుల్ని రేషన్‌లైజేషన్ పేరుతో ఎత్తివేస్తామంటే ఆ పిల్లల చదువు మాటేమిటో పాలకులే తేల్చాలి. ఎంతో ఆశగా ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద పిల్లలకు సరైన వసతులు కల్పించలేకపోతున్నారు. నాణ్యమైన విద్య అందించలేకపోతున్నారు. దీంతో వారిలో నైపుణ్యాలు కరువై ఉద్యోగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారు. నేడు కచ్చితంగా ఇలాంటి పరిస్థితులు ఉండడం వల్లే ప్రభుత్వ బడుల్ని వదిలి ప్రజలు గుడ్డిగా ప్రైవేట్ బడులవైపు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో అద్భుతమైన నైపుణ్యత గల ఉపాధ్యాయులున్నారు. వారి సంక్షేమానికి వేల కోట్ల రూపాయల నిధులు ఏటా వెచ్చిస్తున్నారు. కానీ పిల్లలు ప్రైవేట్ బడులకు పోతున్నారు. అసలు

ప్రభుత్వ బడుల్లోంచి పిల్లలు ఎందుకు ప్రైవేట్ బడులకు వలసపోతున్నారో ఎప్పుడైనా ఆత్మపరిశీలన జరిగిందా? కాబట్టి ఇప్పుడే ఆ బడుల్ని మూసి వేసేదానికన్నా.. బడుల్లో మౌలిక వసతుల్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన బోధన అందించాలి. అప్పటికీ విద్యార్థులు ఈ బడులకు రాకపోతే అప్పుడు జిఒ నెం.6పై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవచ్చు. సరైన ప్రక్షాళన, ప్రణాళిక లేకపోవడంతో మన విద్యావ్యవస్థలో ఇంత గందరగోళమైన పరిస్థితి నెలకొంది.

నియామకాల మాటేమిటి?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక నినాదంగా ఉన్న ఉద్యోగాల కల్పన విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించ లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్నది. ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారమే వివిధ విభాగాలల్లో ఒక లక్ష ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కానీ ఉద్యోగాల కల్పనకు సంబంధించి ఒక్క నోటిఫికేషన్ రాకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్లు విడుదల ఆలస్యం కావడంతో వయోపరిమితి దాటిపోతోందని, ఉద్యోగాలకు పనికిరాకుండా పోతామని, తమ కల తీరకుండానే పోతోందని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ, రాష్ట్రంగా ఏర్పడిన వెంటనే కాంట్రాక్టు అనే పదం ఉండదని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీ కరిస్తామని చెప్పారు. ఆ రకంగానే మొదటి కేబినెట్‌లో విధానపరమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. కానీ ఆ నిర్ణయం ఇంకా అమలులోకి రాలేదు. తమను ఎప్పుడు క్రమబద్ధీకరణ చేస్తారన్న ఆశతో కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. మనరాష్ట్రంలో ఒక లక్ష కాంటిన్‌జెన్సి ఉద్యోగులు, ఒక లక్ష వరకు ఉద్యోగులు తాత్కాలిక ప్రతిపాదికపై పని చేస్తున్నారు. ఇలాంటి కాంట్రాక్టు ఉద్యోగులు బోధన, బోధనేతర సిబ్బందిగా ఉన్నారు.

కాంట్రాక్టు ఉదోగ్యులు ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడలేదు. వాళ్లు తెలంగాణ బిడ్డలే. అనేక ఏండ్ల నుండి వెట్టిచాకిరి చేస్తూ, ఉద్యోగం కాపాడుకోవడం కోసం.. అధికారుల, రాజకీయ నాయకుల కనసన్నలలో మెలిగి శ్రమ దోపిడికి గురైనవారే! వారిలో చాలామందికి పూర్తిస్థాయి అర్హతలు ఉన్నాయి. పిజి, డబుల్ పిజి, గ్రాడ్యుయేషన్ అర్హతలు ఉన్నవారే. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి, వివిధ ప్రయత్నాలు శాశ్వత ఉద్యోగం కొరకు చేస్తున్నవారే. వయస్సు పైబడుతున్నందున కుటుంబ పోషనార్థం బతకడానికి కాంట్రాక్టు ఉద్యోగం అయినా సరే, రేపు రేపు ఉద్యోగం శాశ్వత ఉద్యోగం రాక పోతుందా అన్న ఆశలో ఉద్యోగం చేస్తున్న వాళ్లే. వీరి వేతనం తక్కువ. సౌకర్యాలు తక్కువ, పెన్షన్ ఉండదు. ఇంక్రిమెంట్ ఉండదు. ఎంతకాలం పని చేసినా నియామకం నాటి వేతనమే చెల్లిస్తారు. ఈ కాంట్రాక్టు విధానాన్నే పూర్తిగా రద్దు చేయాలి.

ముగింపు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి వికేంద్రీకరణ, స్వావలంబన, నీళ్లు, నిధులు, నియామకాలు జరుగుతాయని, ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామిక హక్కులకు గ్యారంటీ ఉంటుందని ప్రజలు విశ్వసించారు. తెలంగాణకు ద్రోహం చేసిన వారిపైన, భూ ఆక్రమణ దారులపైన విచారణ జరుగుతాయని ఆశించారు. ఇవేమి జరుగకపోగా తెలంగాణ విధ్వంసంలో భాగస్వాములైన వారిని, తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకున్న వారిని పార్టీలోకి ఆహ్వానించడం, మంత్రి పదవులివ్వడం జరిగింది. రామోజీరావును ప్రశంసించడం, చిన్నజియర్ స్వామితో తిరగడం, తన మొక్కులు తీర్చుకోవడానికి ప్రభుత్వ ధనాన్ని వాడుకోవడం, రాజ్యాంగంపై ప్రమాణం చేసి ముఖ్యమంత్రి బాధ్యత స్వీకరించిన తర్వాత, వాస్తు పేరుతో సెక్రటేరియట్ మార్చాలనడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. సంవత్సరకాలంగా కెసిఆర్ పాలన ప్రజల గొంతునొక్కే విధంగానే ఉంది. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తే ధర్నాచౌక్‌లో ధర్నాలు ఉండవు అన్నారు. కెసిఆర్ దృష్టిలో ధర్నా చౌక్‌లో ధర్నాలు ఉండవంటే ధర్నాలు చేసే వారిని, సమావేశాలు నిర్వహించేవారిని పోలీసులు ముందుస్తు అరెస్టులు చేసి ఎవరినీ ధర్నాకు, సమావేశాలకు, సభలకు రాకుండా అడ్డుకోవడమని ఇప్పుడు అర్థమవుతోంది. ప్రభుత్వ నియంతృత్వానికి, నిరంకుశత్వానికి నిలువెత్తు సాక్ష్యం ధర్నా చౌక్. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నన్ని రోజులు ఇందిరా పార్క్ వద్ద ఎటుచూసినా ధర్నా దృశ్యాలే. మరొవైపు భారీగా మోహరించిన పోలీసు బలగాలు. ఉద్యోగ, కార్మికులకు సంబంధించి ఎన్నికల మ్యానిఫెస్టోలో 'మేం ఉద్యోగులతో, కార్మికులతో స్నేహపూర్వక ప్రభుత్వాన్ని నడిపిస్తామని, కార్మికుల (సింగరేణి, ఆర్‌టిసి) చెమట, నెత్తురతో వచ్చిన తెలంగాణలో వారికి సముచిత స్థానం కల్పిస్తామ'న్నారు. కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, పనిభద్రత కల్పిస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చారు. కాని ఈ సంవత్సర కాలంలో ఉద్యమాలను, పోరాడే సంఘాలను విచ్ఛిన్నం చేయడం, అణగదొక్కడం కోసం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముందస్తు అరెస్టులు, బెదిరింపులు, బైండోవర్లు, అర్ధరాత్రి అరెస్టులు సాధారణ చర్యలుగా మారాయి. 2015-16 విద్యా సంవత్సరంలో హేతుబద్ధీకరణ, పాఠశాలల విలీనం పేరుతో దాదాపు 4000 పాఠశాలలు మూత పడనున్నాయి. గ్రామంలో ఉన్న పాఠశాల మూతపడితే పక్క గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళతారా లేదా అనేది ప్రశ్నార్థకం. మొత్తం మీద డ్రాఫ్అవుట్ పెరిగే అవకాశం ఉంది. దేవుళ్లు, వాస్తు, పుష్కరాలు, గోపురాలు పేరిట దోపిడీ రాజకీయాలు చలామణిలోకి వస్తున్నాయి.

తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా రైతులను పరామర్శించలేదు. పర్యావరణాన్ని విధ్వంసం చేసే ఓపెన్ కాస్టు బొగ్గు తవ్వకం కొనసాగుతూనే ఉంది. పేదలకు వైద్యం అందుబాటులో లేదు. గిరిజనులపై దాడులు ఆగలేదు. గుట్టల విధ్వంసం, ఇసుక అక్రమ రవాణాలో మార్పులేదు. ప్రజా ఉద్యమాలను నిర్బంధంతో ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు. మౌలిక సమస్యల పరిష్కారపు ఊసేలేదు. అభివృద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన విధానాలే అనుసరిస్తున్నారు. గతంలో చంద్రబాబు అమలు చేసిన కార్పొరేట్ సామ్రాజ్యవాద అనుకూల విధానాలనే మరో పేరుతో మరింత దూకుడుగా అమలుచేస్తున్నారు. స్వరాష్ట్రం, పరరాష్ట్రం, స్వదేశీ, విదేశీ అనే భేదం లేకుండా బడా పెట్టుబడిదారులు, భూ స్వాములకు తెలంగాణ వనరులను కట్టబెట్టాలని కెసిఆర్ చూస్తున్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అసలే లేదు. కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు అన్నింటికీ మద్దతు తెలుపుతున్నారు. తెలంగాణ ప్రజల కలలు సాకారం కావాలంటే ప్రజాస్వామిక తెలంగాణ, అభివృద్ధి వికేంద్రీకరణ, అందరికీ ఉపాధి, అందరికి నాణ్యమైన ఉచిత విద్య, వ్యవసాయానికి భరోసా, స్వావలంబన, భూసంస్కరణల అమలు, పౌర, ప్రజాతంత్ర హక్కుల కొరకు ఉద్యమించక తప్పదు.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

సాయిబాబాపై కొనసాగుతున్న నిర్బంధం

అంగవైకల్యంతో, అనారోగ్యంతో ఉన్న జిఎన్ సాయిబాబాకు బెయిల్ కూడా ఇవ్వకుండా నిర్బంధించిన రాజ్యం జైలులోనే హతమార్చాలనుకుంటున్నదని అంటున్నారు **పి. వరవరరావు**

ప్రొ.జి.ఎన్ సాయిబాబా అరెస్టు అయి మే 9 కి ఏడాది అయింది. ఆయనను రాజ్యం జైల్లో చంపాలని కుట్ర చేస్తున్నదా? ఈ ఏడాది పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తున్నది. ఇటీవలి కొన్ని సంఘటనల నుంచి గతంలోకి అవలోకించే ప్రయత్నం చేద్దాం. ప్రతి సంవత్సరం మార్చ్ 23 నుంచి ఒకవారం రోజులపాటు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ సంస్మరణలో దేశవ్యాప్తంగా రాజకీయ ఖైదీలు, ఖైదీల హక్కుల పోరాట వారంగా పాటిస్తారు. అంటే తామున్న జైళ్ల పరిస్థితులపై ఆందోళనలు చేపడతారు. తమను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, జైలంటే దేశంలో ఎక్కడైనా తిరిగే సంచార స్వేచ్ఛ తప్ప ఏ ప్రాథమిక హక్కు కూడా రద్దుకాని న్యాయస్థానాల సంరక్షణ (జుడీషియల్ కస్టడీ) లేదా శిక్ష తప్ప మరొకటి కాదని కనుక తమ ప్రాథమిక హక్కులన్నీ గుర్తించి అమలు చేయాలని సుదీర్ఘకాలం (63 రోజులు) జైల్లో ఆమరణ నిరాహార దీక్ష చేసి వలసకాలపు జైల్లో అమరుడైన జతిన్‌దాస్‌ను కూడా ఒక ప్రేరణగా తలుచుకొంటారు. దేశంలో వివిధ జైళ్లలో ఇటీవలి కాలంలో మావోయిస్టు ఖైదీల సంఖ్య పెరుగుతుండడం వలన ఇటువంటి రాజకీయ చైతన్యం ఎక్కువవుతున్నది. అందుకని ఈసారి రాజ్యం మార్చి నెల రాబోతున్నదనగానే ఎదురుదాడి ప్రారంభించింది. ముంబై బైకుల్లా మహిళా జైలులో సిసిటివి కేమరాలను పెట్టడాన్ని వ్యతిరేకించిన ఏంజెలా సోంటకే పై దాడి చేశారు. గతంలో రాయపూర్ జైల్లో తమ హక్కుల కోసం డిమాండు చేసిన మాలతి, మీనాలపై కూడా ఇట్లాగే దాడి చేశారు. మధురై జైల్లో మూడు సంవత్సరాలుగా మగ్గుతున్న మావోయిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు రాజా (వివేక్) తన న్యాయవాదితో మాట్లాడి జైల్లో తన సెల్‌కు తిరిగి వెళ్తుండగా జడ్తీ (సెర్చ్) పేరుతో జైలు జవాన్లు, అధికారులు పోషించే ఖైదీ రౌడీలు, ప్రతిఘటించాడనే సాకుతో ఆసుపత్రి పాలయ్యేలా దెబ్బలు కొట్టారు. ఆయన అందుకు నిరసనగా ఆసుపత్రిలోనే నిరాహార దీక్ష ప్రారంభించాడు.

నాగపూర్ జైలు నుంచి కేసు వాయిదాకు ప్రొఫెసర్ సహముద్దాయి హేమ్ మిశ్రాను (జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థి. సాంస్కృతిక కార్యకర్త, గాయకుడు, వికలాంగుడు– రెండేళ్లుగా జైల్లో మగ్గుతున్నాడు.) తీసుకుపోవడానికి వచ్చిన ఎస్కార్ట్ పోలీసులు ఆయన చేతులకి బేడీలు వేయడానికి ప్రయత్నించారు. కోర్టుకైనా, ఆసుపత్రికైనా తీసుకుపోయేటప్పుడు ఖైదీలకు బేడీలు వేయద్దని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, ఉత్తర్వులు చూపినా వినకుండా బేడీలు, గొలుసులు వేయడానికి ప్రయత్నించారు. ఆయన నిరాకరించాడు. దానితో ఎస్కార్టు పోలీసులు, బయట ఉండే అర్ధ సైనికబలగాలు అతనిపై బడి విపరీతంగా కొట్టి జైల్లోకి తోసేశారు. ఈ దాడిపై ఒకే కేసులో ముద్దాయిలైన ప్రొ. జి.ఎన్. సాయిబాబా, హేమ్‌మిశ్రా, మారుతి (ఆదివాసి రాజకీయ ఖైదీ) ఒక ప్రకటన ఇచ్చి ఒకరోజు నిరాహార దీక్షకు పూనుకొన్నారు. అంతకు ముందు సాయిబాబా వెన్ను నొప్పి, గుండెనొప్పి, జ్వరంతో నాగపూర్ హై సెక్యూరిటీ జైల్లోని అండాసెల్‌లో మూడు నెలలు శయ్యాగతుడై ఉన్నాడు. అపుడపుడే కోలుకొంటున్నాడు. అటువంటి తరుణంలో కేసు గురించి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన అనారోగ్యాన్ని, దైహిక, మానసిక స్థితి స్వయంగా చూసిన జడ్జి, ఆయన ఉద్వేగ పూరితమైన వాంగ్మూలం విని, మీరు ఇంత ఆందోళనకరమైన శారీరక, మానసిక స్థితిలో ఉన్నారని, మీ మీద ఇంత తప్పుడు ఆరోపణలు చేశారంటే నేను ఊహించలేక పోయాను, బెయిలుకు పిటిషన్ వేసుకుంటే ఇస్తానన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, బయటా ఆయనకు వైద్యులు చెప్పిన మందులు ఇవ్వాలని (లేదా ఆయన బంధు మిత్రులు తెచ్చిస్తే అనుమతించాలని) వైద్య సలహా మేరకు పోషక ఆహారం ఇవ్వాలని జైలు అధికారులకు సూచించారు. కానీ ఈ నిరసనపై కక్ష పెట్టుకొని అదే రోజుల్లో అదే జైలు నుంచి ఇద్దరు సాధారణ ఖైదీలు తప్పించుకొని పోయారన్నది సాకు తీసుకొని సాయిబాబాకు ఆయన సహచరి వసంత, తమ్ముడు రాందేవ్ అంతకు పూర్వం ఇచ్చిన మందులను బందు చేశారు. జైలు క్యాంటీన్ నుండి తప్ప (అది కూడా నెల కెంత ఖర్చు చేయాలో వాళ్లు పెట్టె పరిమితికి మించకుండా) ఏదీ బయట నుంచి కొని తెప్పించు కోరాదని మందులు, పోషకాహారం కొనుక్కొనివ్వలేదు. వైద్య సలహాతో ఇస్తున్న పోషకాహారం బంద్ చేశారు.

ఇట్లా జైలు అధికారులు ఎలాగూ అర్థాకలికి గురిచేసి కడుపు మాడ్చి, మందులు బందు చేసి అనారోగ్యం పెంచుతున్నారు కనుక ఇట్లా వాళ్ల చేతుల్లో చావడం కన్నా, ఆమరణ నిరాహార దీక్ష చేయడమే మేలని ఏప్రిల్ 11న ఆయన ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నాడు. ఏప్రిల్ 16 వరకూ ఆరు రోజులపాటు సాగిన ఈ నిరాహార దీక్షలో ఆయన రెండుసార్లు స్పృహతప్పి పడిపోయాడు. ఏప్రిల్ 16న అర్ధరాత్రి మళ్లా స్పృహతప్పి పడిపోయినప్పుడు జైలు డాక్టర్ వచ్చి చూసి ఆరోగ్యం విషమించి ప్రాణాపాయ స్థితి ఏర్పడిందని వెంటనే నాగపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి బలవంతంగా ఆహారం ఎక్కించారు. ఈలోగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు కూడా ఆయనని నిరాహారదీక్ష విరమించవల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్ 18 సాయంత్రం లోపుగా ఆయనను, ఆయన తమ్ముడు, సహచరిని తప్ప న్యాయవాదులను కూడా కలవనివ్వలేదు. ఏప్రిల్ 18న

మళ్లీ ఆసుపత్రికి పంపించే ముందు చేసిన వైద్య పరీక్షలలో రక్తపోటు, భుజాల నరాల క్షీణత, వెన్నెముక నొప్పితో పాటు, గుండె జబ్బు అంజియోగ్రామ్ చేయించుకొనే స్థితికి చేరుకొందనీ బయట పడింది. కానీ జైలు వాతావరణంలో 90 శాతం శారీరక వికలత్వం వల్ల ఇద్దరి సహాయం లేకుండా ఆహారం కూడా తీసుకోలేని స్థితిలో ఆయన జైలులోనే ఉండి అంజియోగ్రామ్ చేయించుకొంటే తట్టుకోలేడని, ఆయనను హైదరాబాదులోనూ, ఢిల్లీలోనూ మొదటి నుండి చూస్తున్న వైద్య నిపుణులు చెప్తున్నారు. ఆయన, ఆయన కుటుంబ సభ్యులు, రాజకీయ సహచరులు కూడా ఇంత జరిగాక రాజ్యం ఆయనను జైల్లో చంపడానికే ఇంత కుట్ర చేస్తున్నదని భావిస్తున్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, ముఖ్యంగా నాగపూర్‌లో నక్సలైట్ వ్యతిరేక నిఘావర్గాల అధికారి జోక్యంతో జైలు అధికారులు సాయిబాబాతో వ్యవహరిస్తున్న తీరు ఈ అనుమానానికి బలం చేకూరుస్తున్నది. తొంభై శాతం వైకల్యం వల్ల అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం తనకు నైసర్గికంగా లభించవలిసిన హక్కుల గురించి అడుగుతూ, తన ఇతర అనారోగ్య కారణాలను కూడా చూపుతూ ఆయన సెషన్స్ కోర్టులోనూ, హైకోర్టులోనూ బెయిల్ కోసం వేసినప్పుడు జవాబుగా వేసే పత్రాల్లో ప్రభుత్వం ఆయన శారీరక స్థితి, అనారోగ్యం దృష్టిలో పెట్టుకొని అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నామని రాస్తున్నారు. మధ్యన రంధ్రం చేసిన ఒక కుర్చీని ఇచ్చి అండా సెల్‌లో పాశ్చాత్య పద్ధతి కమోడ్ ఇచ్చామని, ఆయన ఇద్దరి సహ ముద్దాయిల సహకారంతో దినమంతా అవసరాలు తీర్చుకొంటుంటే తామే ఇద్దరు సహాయకులను ఇచ్చామని చెప్తున్నారు. ఇంటి నుంచి తెచ్చుకొన్న వీల్‌చేయిర్ అసలు జైలు ద్వారం నుంచి అండా సెల్ దాకా పోవడానికి జైలు లోపల బాటకూడా సరిగా లేనంత గతుకుల సమస్య. అది ఆసుపత్రికి, జైలుకి వెళ్లేటప్పుడు ఎస్కార్టు వ్యాన్‌లో పట్టదు. కనుక ఆసుపత్రికి తీసుకుపోరు. కోర్టుకు వందలమైళ్ల దూరంలో గడ్చిరోలీ జిల్లాలో ఉన్న అహిరికి ఒక్కసారే తీసుకుపోయారు కానీ, అప్పుడు వంద సాయుధ వాహనాలు, రెండు వేలమంది అర్ధసైనిక బలగాలు, ముందర మందుపాతరలు కనుగొనే వాహనాలు – ఒక భయంకరమైన, ప్రమాదకరమైన నేరస్థుడిని తీసుకుపోతున్న వాతావరణాన్ని కల్పిస్తూ ప్రాసిక్యూషన్ చార్జిషీట్ ఆయన గురించి ఆయన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీకి, ప్రధాన కార్యదర్శికి, 'అర్బన్ కనెక్ట్' అని రాస్తుంది. పత్రికలు దానికింకా చిలవలు పలవలు కల్పించి రాస్తాయి.

ఏప్రిల్ 17న ఢిల్లీ నుంచి వచ్చిన ఢిల్లీ విశ్వవిద్యాలయం టీచర్స్ యూనియన్‌కు చెందిన డిఫెన్స్ కమిటీ సభ్యుడు ప్రొ. హనీబాబు, నాగపూర్ విశ్వ విద్యాలయం ప్రొ. షోమాసేన్, న్యాయవాదులు సురేంద్ర గడ్లింగ్, దశరథ్, మహదేవన్, రాందేవ్‌లు సాయిబాబా అనారోగ్యం గురించి, బెయిల్ అవసరం గురించి మీడియా సమావేశంపెట్టి మాట్లాడితే వెంటనే ఒక ఇంటిలిజెన్స్ ప్రేరేపిత సంస్థ సాయిబాబా విడుదల కోసం కోర్టుల మీద ఒత్తిడి తెచ్చే వ్యూహామిది అని ప్రకటన ఇస్తుంది.

వాస్తవానికి గతంలో హైకోర్టు, ఈసారి వీడియో కాన్ఫరెన్సు తరవాత సెషన్స్ కోర్టు బెయిల్ ఇస్తామని నోటితో చెప్పారు. హైకోర్టులో సుప్రీంకోర్టు న్యాయవాది ఆనంద్ గ్రోవర్ వాదించాడు. హైకోర్టు అనుకూలంగా స్పందించింది, కానీ ప్రాసిక్యూషన్ వాయిదాల మీద వాయిదాలు తీసుకొని ఆ జడ్జి బెంచ్ మారే దాకా చూసి ఆ తరవాత వచ్చిన జడ్జిపై ఒత్తిడి తెచ్చి బెయిల్ రాకుండా చూసింది. ఈ సారి సెషన్స్ జడ్జి వీడియో కాన్ఫరెన్సులో బెయిల్ ఇస్తానంటేనే పిటిషన్ వేశానని ప్రస్తావించాడు, స్వయంగా ఇంటెలిజెన్స్ అధికారి కేసు విచారణ సమయంలో కోర్టుకు హాజరయ్యి ఒత్తిడి తెస్తున్నాడు.

ప్రొ.సాయిబాబా మీద ఇంత కక్ష ఎందుకు? రెండున్నర దశాబ్దాలుగా దేశ విదేశాలలో ప్రజాస్వామిక హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతూ ఉన్నందుకు, ఏ వైకల్యమూ, ఏ అనారోగ్యమూ లేని వారికన్నా దృఢ దీక్షతో పోరాడుతున్నందుకు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఒక పేద కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ ఉపకార వేతనంతో చదువుకొని, కళాశాల విద్యార్థిగా, రాడికల్ విద్యార్థి సంఘంతో ప్రభావితుడై, తొంభైలో సెంట్రల్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ ఎం.ఎ, ఇఫ్లూలో ఎం.ఫిల్ చేస్తూ, నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో గద్దర్ అజ్ఞాత జీవితం నుంచి వచ్చిన సభలో పాల్గొన్నప్పటి నుంచీ క్రియాశీలంగా ప్రజా సంఘాల కార్యకలాపాలల్లోకి వచ్చాడు. కవిగా, సాహిత్య విమర్శకునిగా విరసంలో చేరి రచనలు చేస్తూ 1992లో ఆలిండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం ఏర్పడగానే తనకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్య అభినివేశం వల్ల అందులో ఎక్కువ బాధ్యతతో పనిచేయాలని నిర్ణయించుకొన్నాడు. 1995లో ఎఐపిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగం వదిలి 96లో ఢిల్లీలో జరిగిన జాతుల సమస్యపై అంతర్జాతీయ సదస్సు తరవాత ఢిల్లీకి మారిపోయాడు. ఆ తరవాత ఎఐపిఆర్ఎఫ్ అఖిల భారత కార్యదర్శి అయ్యాడు. ఈ కాలమంతా ఆచరణతో పాటు విస్తృత అధ్యయనం వల్ల తన కృషికి దోహదకరంగా ఉంటుందని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా చేరాడు. ముల్క్‌రాజ్ ఆనంద్ మొదలు జి.కళ్యాణరావు వరకు అంటరానితనం విషయంగా రాసిన ఇంగ్లిష్ నవలలపై (కళ్యాణరావు నవల ఇంగ్లిష్ అనువాదంపై ఆధారంగా) పిఎచ్.డి. చేశాడు. ఎన్నో అంతర్జాతీయ సదస్సులలో అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, మొదలైన పలుదేశాల్లో పాల్గొన్నాడు. సామాజిక సమస్యలనైనా, సాహిత్యాన్నైనా మార్క్సిస్టు దృక్పథంతో నిశితంగా పరిశీలించి రచనలు చేశాడు.

ఎఐపిఆర్ఎఫ్ తరువాత ఫోరం ఎగైనెస్ట్ ఇంపీరియలిస్టు గ్లోబలైసెషన్ లోనూ, ముంబై రెసిస్టెన్స్ ఫోరం 2004లోనూ ముఖ్య భూమిక నిర్వహించాడు. ముఖ్యంగా ఢిల్లీ కేంద్రంగా అఖిల భారతస్థాయిలో ప్రజాస్వామ్య సంస్థలను ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయ సంస్థలను సంఘటితం చేయడానికి చాలా కృషి చేశాడు. ఆదివాసులు, దళితులు, ముస్లిం మైనారిటీలు, జాతి విముక్తి పోరాటాల్లో నిమగ్నమైన వాళ్ల విప్లవాభిమానులు – సంఘటితమై, ఈ దేశంలోని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దళారీ పరిపాలనను అంతం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించుకోవడానికి భౌద్ధిక సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చేయగల నిర్మాణాల గురించి ఆలోచించాడు.

ప్రైవేటీకరణ, సరళీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వల్ల– ముఖ్యంగా 2004 లో మన్మోహన్‌సింగ్ ప్రధాని అయిన దగ్గరి నుంచి తూర్పు మధ్య భారతాల్లో, ప్రకృతి సంపదపై, మానవ శ్రమలపై

జరుగుతున్న దాడి క్రమంగా అది ప్రజలపై యుద్ధంగా మారుతున్న స్థితిపై భూ విస్తాపనను ప్రతిఘటిస్తూ నిర్మాణమైన సంఘాలకు ఉద్యమాలకు అండగా నిలిచాడు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనేది రాజకీయ పార్టీల ప్రణాళికలు, విధానాల ఆచరణ వేదికగా కాకుండా కార్పొరేట్ కంపెనీల దళారీ వ్యవహారంగా మారిందని దశాబ్దంన్నర అనుభవంతో ప్రత్యక్షంగా గ్రహించి 2005లో నిజమైన ప్రజాస్వామ్య విప్లవం ద్వారా మాత్రమే సాధ్యమనే అవగాహనతో మరికొందరు సహచరులతో కలిసి రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశాడు. దానికాయన అఖిలభారత సహాయ కార్యదర్శి. ఏర్పడి ఏర్పడగానే 2006 ఏప్రిల్‌లో ఆర్‌డిఎఫ్ ఒడిశా బాధ్యుడు, అఖిలభారత కార్యవర్గ సభ్యుడు అయిన దండపాణిమహంతి నాయకత్వంలో ఏర్పడిన ఒడిశా సంస్థను అక్కడి ప్రభుత్వం నిషేధించింది. ఆ నిషేధంపై ఇప్పటికీ సుప్రీంకోర్టు విచారణ చేపట్టవలసి ఉంది. 2012లో ఆర్‌డిఎఫ్ ప్రథమ మహాసభ హైదరాబాదులో విజయవంతంగా జరిగిన దగ్గరి నుంచి అందులో పాల్గొన్న, ప్రజాసంఘాలపై నిర్బంధాలు, దాడులు మొదలైనాయి. బాధ్యులపై యుఎపిఎ కింద కేసులు నమోదు చేయడం మొదలైంది. 2012 ఏప్రిల్‌లో మహాసభలు జరిగితే జూలై 9న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్‌డిఎఫ్‌ని నిషేధించి, దానిపై, అధ్యక్షుడిగా నేను హైకోర్టులో వేసిన పిటిషన్ ఇంకా విచారణ చేపట్టలేదు. 2013 జూలై నాలుగున నెల్లూరులో ప్రభుత్వ ఆసుపత్రి ముందు పట్టపగలు ఆర్‌డిఎఫ్ ఉపాధ్యక్షుడు, సంస్థకు వెన్నెముక, గంటి ప్రసాదంను హత్య చేశారు. ఆర్‌డిఎఫ్ మహా సభల్లో క్రియాశీలంగా పాల్గొని అఖిల భారత స్థాయిలో ఆ సంస్థ కార్యకలాపాలకు సహకరిస్తున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు ఆకుల భూమయ్య మున్సిపల్ ట్రక్కు కింద 2013 డిసెంబర్ 24 న అసహజ మరణానికి గురయినాడు. ఒరిస్సాలో కలెక్టర్‌ను మావోయిస్టులు బందీగా తీసుకొన్నప్పుడు ప్రొఫెసర్ ఆర్‌ఎస్ రావు, ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు మధ్యవర్తిగా వ్యవహరించి ఇటాలియన్ ఫోటోగ్రాఫర్‌ను బందీగా తీసుకొన్నప్పుడు బి.డి.శర్మతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన దండపాణి మహంతిని 2013లో యుఎపిఎ కింద అరెస్టు చేసి 13 కేసులు పెట్టారు. అన్నింటిలో నిర్దోషిగా కోర్టులు తేల్చాక మరో ఐదు కేసులు పెట్టారు. 2015 ఏప్రిల్ 24 నుంచి ఆయన బరంపురం జైల్లో నిరాహార దీక్ష చేస్తుంటే ఆరోగ్యం విషమిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆయన 70 ఏళ్ల పైబడిన వృద్ధుడు. కేరళలో వంద యేళ్ల యుద్ధం (1914- 2014), వందేళ్ల విప్లవం (గదర్ పార్టీ ఏర్పడిన దగ్గర నుంచీ) గురించి సదస్సు ఏర్పాటు చేస్తే ఆర్‌డిఎఫ్ అఖిల భారత కార్యదర్శి అజయన్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులను ఇద్దరినీ అరెస్టు చేసి యూఏపిఏ కింద జైల్లో పెట్టారు.

డాక్టర్ బినాయక్ సేన్ అరెస్టు నాటి నుంచి నేటి వరకూ ప్రజాస్వామ్య వాదులైన బుద్ధిజీవుల పట్ల రాజ్యం అనుసరిస్తున్న వైఖరి ఇది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల కన్నా ప్రకృతి సంపదలను, శ్రమ కొల్లగొట్టే సామ్రాజ్య వాద విధానాలను ప్రతిఘటించే బుద్ధిజీవులు ప్రమాదకరమని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా వేసి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వమే అటువంటి వారిని అణచివేసే రహస్య ఉత్తర్వులు కూడా పంపి ఉన్నది. కనుకనే సాయిబాబాని జైల్లోనే చంపాలనుకుంటుందని ఆరోపించడం. భావ ప్రకటనా స్వేచ్ఛ, జీవించే స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులని భావించే మనం అందుకు అనుమతిస్తామా?

(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం సభ్యులు) వీ

వీక్షణం విడి ప్రతి కొనుగోలుదారులకు ఒక క్షమాపణ, ఒక విజ్ఞప్తి

వీక్షణం పాఠకులలో దాదాపు సగం మంది వీక్షణంకు చందాదారులు కారు, ఏనెలకానెల తమ తమ ప్రాంతాలలో వార్తాపత్రికలు అమ్మే దుకాణాలలో విడి ప్రతి కొనుక్కుని చదువుతుంటారు. గత రెండు నెలలుగా ఆ దుకాణాలలో వారికి వీక్షణం దొరకడం లేదు. రెండు రాష్ట్రాలలోని దాదాపు 300 న్యూస్ స్టాల్స్‌లో వీక్షణం పంపిణీ చేస్తూ ఉండిన ఆనంద్ ఏజెన్సీస్ వీక్షణంను ఇప్పుడు పంపిణీ చేయడం లేదు. మరొక రాష్ట్ర వ్యాప్త సోల్ ఏజెన్సీ గాని, ఎక్కడికక్కడ ఏజెన్సీలు గాని ఏర్పడేవరకూ న్యూస్ ఏజెంట్ల దగ్గర వీక్షణం దొరకదని చెప్పడానికి చింతిస్తున్నాం. పాఠకులకు కలుగుతున్న ఈ అసౌకర్యానికి క్షమించవలసిందిగా కోరుతున్నాం.

ఇప్పటిదాకా ఏనెలకానెల విడిప్రతి కొనుక్కుంటున్న పాఠకులు, అభిమానులు చందాదారులుగా చేరవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఎక్కువ కాపీలు అమ్మకం అయ్యే ప్రాంతాలలో, పట్టణాలలో కొత్త, నమ్మకమైన ఏజెంట్లను ఏర్పాటు చేయవలసిందిగా మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

- సర్క్యులేషన్ మేనేజర్

9949391028

బాల్టిమోర్ నల్లజాతి ధర్మాగ్రహం

ప్రపంచ దేశాలకు ప్రజాస్వామ్యం, హక్కుల గురించి చెప్పే అమెరికా తన దేశంలోని నల్లజాతి ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమనీ, ఇదే విషయాన్ని ప్రజలు తమ నిరసన ద్వారా తెలిపారనీ అంటున్నారు **బైరెడ్డి సతీష్**

ప్రపంచ పాలక పాత్ర పోషిస్తున్న అమెరికా దేశంలోని మేరిలాండ్ రాష్ట్రంలోని మధ్య నగరమైన బాల్టిమోర్ నినాదాలతో హోరెత్తిపోయింది. న్యాయం కోసం నల్ల పిడికిల్లు బిగుసుకున్నాయి, నలుదిక్కులు వినిపించేలా నినదించాయి. తక్షణ నేపథ్యం ఫ్రెడ్డ గ్రే అనే 25 ఏళ్ల నల్లజాతి యువకున్ని స్విచ్ బ్లేడ్ కత్తిని కలిగి ఉన్నాడన్న నెపంతో ఏప్రిల్ 12 న అరెస్ట్ చేసి కాళ్లు, చేతులు విరిచి కట్టి పోలీస్ వ్యాన్‌లోవేసి పోలీస్ స్టేషన్‌కు బలవంతంగా తరలించడంతో మెడకు, వెన్నెముకకు తీవ్ర గాయాలవడం వల్ల వారంరోజుల తరువాత ఆసుపత్రిలో మరణించడం. ఆ నల్లజాతి యువకుని అంతిమ యాత్రలోనే దశాబ్దాలుగా గూడుకట్టుకున్న ఆవేశమే బాల్టిమోర్ బద్ధలయ్యేలా చేసింది. నల్లాగ్రహానికి అనేక గృహాలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ వాహనాలు దగ్ధమయ్యాయి. గత సంవత్సరమే మిస్సోరి రాష్ట్రంలోని ఫెర్గూసన్ పట్టణంలో మెకాయిల్ బ్రౌన్ అనే నల్లజాతీయున్ని తెల్లపోలీసులు కాల్చి చంపిన నేపథ్యంలో వెల్లువెత్తిన ప్రజాగ్రహజ్వాల చల్లారకముందే బాల్టిమోర్‌లో మరో నల్లదీపాన్ని తెల్లదొరలు ఆర్పేశారు. అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్శించిన ఈ ఘటనలలాంటివి ప్రతినిత్యం జరుగుతూనే ఉన్నా అవి అన్నీ కూడా ప్రపంచ వార్తలు కాలేకపోతున్నాయి.

అమెరికాను ఆరాధించేవారికి, ఆదర్శంగా చూసేవారికి, ఆధిపత్యాన్ని చెలాయించేవారికి, అసమానతలను పాటించేవారికి ఈ ఘటనలు యాదృచ్ఛికంగా అనిపించవచ్చు. అమెరికన్ సమాజంలో వ్యవస్థీకృతమైన తెల్లజాతి దురహంకార ఆధిపత్యం, నల్లజాతీయులపై వివక్ష, ఆఫ్రో-అమెరికన్‌లను బానిసలుగా చూసే అమానవీయమైన ధోరణులను ఒక వాస్తవంగా అంగీకరించక పోవచ్చు. నాగరిక సమాజంగా తనను తాను ప్రపంచపటం మీద ప్రదర్శించుకునే అమెరికా సమాజపు అనాగరిక లక్షణమది. అనేక శతాబ్దాలుగా వేళ్లూనుకొని పోయిన తెల్లజాతి ఆధిపత్య భావజాలం అభివృద్ధి జరిగినా కొద్దీ రూపం మార్చుకుందే కానీ వదిలి పోలేదు. అభివృద్ధి అనేది కేవలం వస్తూత్పత్తి, సంపద పోగేయడం, భౌతిక సౌకర్యాల పెరుగుదల, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అత్యంత ఆధునిక దశకు చేరుకోవడం వంటి అంశాలకు మాత్రమే పరిమితం చేయబడింది. మనుషుల్ని మనుషులుగా చూడలేని అభివృద్ధిని నిజమైన అభివృద్ధి అని ఏలా అనగలం? ఆధిపత్యాలు పోకుండా, అసమానతలు, అంతరాలు అంతరించకుండా జరిగేది ఏదీ మానవ వికాసం అనిపించుకోదు. ప్రజాస్వామ్యం, నాగరికం అంతకంటే కాదు.

మళ్లీ బాల్టిమోర్ విషయానికొస్తే 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాంత సుదీర్ఘ ప్రస్తానం అనేక మార్పులకు, పరిణామాలకు లోనైంది. వ్యవసాయం, వస్తూత్పత్తి, సేవారంగం నుండి నేడు టూరిజం పరిశ్రమ ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందింది. అమెరికా అంతటా నల్లజాతీయులపై వివక్ష కొనసాగినట్టే ఇక్కడి నల్లజాతి ప్రజలకు మినహాయింపేమీకాదు. నల్లజాతి ఉపాధ్యాయులతో మాత్రమే నడిచే 'వర్ణ పాఠశాలలు', విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రబలంగా కొనసాగిన వివక్ష అక్కడి ప్రజలను అవమానాలకు గురిచేయడమే కాకుండా అది క్రమంగా ఆగ్రహంగా రూపుమారి అనేక వీధి పోరాటాలకు దారితీసింది. అభివృద్ధి ఫలాలు అన్నీ ఒకే 'వర్ణం' వారు అనుభవించడం, రాజ్యాధికారమంతా వారి చేతుల్లోనే ఉంచుకొని నల్లవారిని బానిసలుగా భావించింది. ఇంతటి అమానవీయమైన సామాజిక వ్యవస్థపై నల్లజాతి ప్రజానీకం ఎప్పటికప్పుడు తిరుగుబాటును తీసుకొస్తూనే ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి మార్టిన్ లూథర్ కింగ్ చంపబడే కాలం (1968) నాటికి బాల్టిమోర్‌లో జనాభా పరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. నల్లవారికి ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, తయారీ రంగం మందగించడం, తక్కువ నైపుణ్యం, తక్కువ వేతనం కలిగిన ఉద్యోగాలు మాత్రమే దక్కడం వంటివి నల్లజాతి ప్రజల్లో మరింత ఆగ్రహాన్ని కలిగించినవి. యాదృచ్ఛికం అనిపించవచ్చుగానీ నల్లజాతి హక్కుల నాయకుడైన మార్టిన్ లూథర్ కింగ్ హత్య జరిగింది కూడా 1968 ఏప్రిల్ మాసంలోనే. దాని పర్యావసానంగా వెల్లువెత్తిన ప్రజా ఉద్యమ జ్వాల బాల్టిమోర్‌లోనే అతి తీవ్రంగా కొనసాగింది. 125 పట్టణాలకు ఈ ఉద్యమం ఎగబాకి వారం రోజుల పాటు కొనసాగి పవిత్ర తిరుగుబాటుగా పేరుగాంచింది. ఆ సందర్భంలో కూడా విధ్వంసం చెలరేగింది. సరిగ్గా ఈ ఏప్రిల్‌లోనే నల్ల జాతీయున్ని చంపిన నేపథ్యంలోనే బాల్టిమోర్ అట్టుడికిపోయింది. ఆనాటి హింసాయుత ఘటన నేపథ్యంలో తెల్లజాతి ప్రజలు బాల్టిమోర్‌ను వదిలిపెట్టి సమీప పట్టణాలకు తరలివెళ్లారు. దీనితో జనాభా పరంగా నల్ల జాతీయులదే పైచేయి అయింది. 6,22,000 జనాభాలో 63 శాతం పైగా నల్ల జాతీయులదే. మార్టిన్ లూథర్ కింగ్ హత్య నాటికే ఊడలుదిగిన తెల్లజాతి అహంకారం కొనసాగుతూ అనేక సందర్భాల్లో అది పోలీస్ హింసా రూపంలో బయట పడుతూ వస్తోంది. బాల్టిమోర్ మెజారిటీ ప్రజలు నల్ల జాతీయులే అయినా 19.1 శాతం నిరుద్యోగం, 33 శాతం ప్రజలు ప్రభుత్వ ఆహార పథకంపై ఆధారపడడం, 24 శాతం పైగా ప్రజలు దారిద్రరేఖకు దిగువన జీవిస్తుండడం వారి ధీనస్థితికి అద్దంపడుతుంది. అమెరికా సగటు జాతీయ పేదరికం 14 శాతం అయితే ఆఫ్రో - అమెరికన్‌లలో 23 శాతం పైగా ఉన్నది. శిశు మరణాల రేటు ఎక్కువగా నమోదు అవుతున్నది నల్ల జాతీయులలోనే. బాల్టిమోర్ సన్ 2014 లెక్కల ప్రకారం 2011 నుండి 100 మంది పోలీసు బాధితులకు ప్రత్యేకించి నల్ల జాతీయులకు ఆరు మిలియన్ల డాలర్లు నష్ట పరిహారంగా చెల్లించారు. అంటే పోలీసుల ఆకృత్యాలు ఏ రీతిలో ఉన్నాయో అర్థమవుతుంది. బాల్టిమోర్ మేయర్‌గా, పోలీస్ కమీషనర్‌గా నల్ల జాతీయులే ఉండడం

అమెరికాలో అంతర్యుద్ధ ఛాయలు

***అమెరికా బాల్టిమోర్ పట్టణంలో జరిగిన వీధి పోరాటాల కారణాలను, వాటి వెనుక ఉన్న జాతి వివక్ష రాజకీయ అంశాలను విశ్లేషిస్తున్నారు* రాజేంద్రబాబు అర్విణి**

భారతదేశంలో చాలా మంది యువతకు అమెరికా ఒక భూతల స్వర్గం. అమెరికా ప్రభుత్వం ఎంత 'పెద్దన్న' పాత్ర పోషించే ప్రయత్నం చేసినా, ప్రపంచంలో అగ్రరాజ్య హోదా కోసం ఎంత 'దాదాగిరి' చెలాయించినా, అమెరికా సమాజంలో మాత్రం ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, అందరి అవసరాలకు ఏ లోటు ఉండదని, అన్ని సౌకర్యాలు అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని భారతదేశంలో విద్యావంతులు కూడా విశ్వసిస్తూ ఉంటారు. అలా ప్రపంచంలో చాలా మంది ఊహల్లో అందమైన దేశం అమెరికాలో బాల్టిమోర్ పట్టణం. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష భవనం 'శ్వేత సౌధా'నికి కేవలం 40 మైళ్ల దూరంలో ఉన్న బాల్టిమోర్ పట్టణంలో ఈ సంవత్సరం ఏప్రిల్ చివరి వారంలో ఎమర్జెన్సీ (ఆత్యయిక పరిస్థితి) ప్రకటించారు. వారం రోజులు నిరవధిక కర్ఫ్యూ విధించబడ్డది. ఏప్రిల్ 27న పోలీసులకు, ప్రజలకు మధ్య ఎడతెరపి లేకుండా వీధి పోరాటం జరిగింది. ఆ ఘర్షణలో కనీసం 20 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. 250 మంది ఆందోళన కారులు అరెస్టయ్యారు. కోపోద్రిక్తులైన ప్రజల ధాటికి ఎన్నో దుకాణాలు, షాపింగ్ క్లాంప్లెక్సులు ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో పోలీసు వాహనాలు కాల్చివేయ బడ్డాయి. బాష్పవాయు గోళాలు, గుళికలాంటి డమ్మీ (పెల్లెట్‌తో) బుల్లెట్లను పోలీసులు విచ్చలవిడిగా వాడారు. అమెరికా జాతీయ పోలీసు దళం నుండి వేలాది మంది రక్షక భటులను అల్లర్లను నియంత్రించడం కోసం రప్పించారు. ఏమాత్రం సదురు బెదురు లేకుండా నల్లజాతి ప్రజలు (ఆఫ్రికన్ అమెరికన్లు) తమ చేతికందిన ఆయుధాలతో ఆ పోలీసు బలగాలను ఎదుర్కొనడం టి.వి.లలో ప్రత్యక్షంగా ప్రసారమైంది. ఈ అల్లర్లు ఒక్క రోజుతో ఆగిపోలేదు. ఆ తర్వాత కూడా కొనసాగాయి.

ఇంతటి ఆగ్రహావేశాలు పెల్లుబుకడానికి కారణం 'ఫ్రెడ్డీగ్రే' అనే 25 సంవత్సరాల నల్లజాతి యువకుడు పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురై, వెన్నెముకకు గాయమై, కోమాలోకి వెళ్లిపోయి, చివరికి వారం రోజుల తర్వాత మరణించారు. ఆయన చేసిన నేరమల్లా పోలీసుల కళ్లలో కళ్లు పెట్టిచూసి, భయంతో గాబరాగా వడివడిగా వెళ్లిపోయే ప్రయత్నం చేయడం. అది బాల్టిమోర్ పట్టణంలో నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతం. ఆ ప్రాంతంలో పోలీసులు గస్తీ తిరుగుతుంటే ఫ్రెడ్డీగ్రే పోలీసులను చూసి, కళ్లు మరల్చుకొని గాబరాగా ముందకు కదిలాడు. పోలీసులకు అనుమానం వచ్చి అతణ్ణి అరెస్టు చేశారు. అరెస్టు చేసేటప్పుడు కూడా గ్రే వారినేమీ అడ్డగించ లేదు.

అనుమానంతో అరెస్టు చేశారు. అరెస్టు చేసి పోలీసు వ్యానులోకి విసిరేశారు. అప్పుడే ఆయన మెడపై ఒక ఎముక విరిగి ఉంటుందని అనుమానం. ఆ పోలీసు వ్యాను ఒక చిత్రహింసల శిబిరం. పోలీసు తరహా సెకెండ్ డిగ్రీ హింసలు ఆ వ్యానులోనే ప్రారంభమవుతాయట! వ్యానులో పడవేసి గ్రే కాళ్లను ఇనుప గొలుసులతో బిగించారు. మధ్యలో ట్రాఫిక్ సిగ్నల్ ఏమీ లేకుండానే వ్యాను ఆగింది. ఎందుకు ఆగిందో స్పష్టమైన కారణం లేదు. ఆ తర్వాత మళ్లీ ఒకసారి వ్యాను ఆపి ఇంకొక నేరస్తుణ్ణి వ్యానులోకి ఎక్కించుకొని, గ్రేను ఎత్తి సీట్లో కూర్చొబెట్టారు. అంటే అప్పటికీ ఆయన వెన్నెముక విరిగి పొయిందని అర్థం. పోలీసు స్టేషన్లో ఆ అరెస్టును రికార్డు చేసిన అనంతరం ఫ్రెడ్డీగ్రేను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఇదంతా సిసి కెమెరాల్లో రికార్డు అయింది. పెద్దఎత్తున అల్లర్లు జరిగిన తరువాత జరిగిన విచారణలో బయటికి వచ్చిన నిజాలు గమనించవచ్చు. పోలీస్ కమీషనర్ ఆంథోని బ్యాట్స్ బాల్టిమోర్ అల్లర్ల తరువాత మాట్లాడుతూ 1950కి పూర్వం కొనసాగిన తెల్ల, నల్లజాతి వైరుధ్యాల కంటే నేడు తీవ్రంగా కొనసాగుతూ ఉన్నాయంటే పరిస్థితి ఎంత దిగ్భ్రాంతికరంగా ఉందో తెలుస్తుంది. బాల్టిమోర్‌లో నల్లజాతీయుడి కస్టడీ మరణంలో కొసమెరుపు ఏమీటంటే ఆ ఘటనకు బాధ్యులైన ఆరుగురు పోలీసు ఆఫీసర్లను పూర్తిస్థాయి జీతాలు పొందే నిబంధనల కింద సస్పెండు చేయడం. తెల్ల న్యాయం మరీ!

ప్రజాస్వామ్యం, మానవహక్కులు, స్వేచ్ఛా సమానత్వాల గురించి ప్రపంచ దేశాలకు తెగపాఠాలు బోధించే అమెరికా తనదేశంలోని దుర్నీతి గురించి మాట్లాడదు. చర్మం రంగు ఆధారంగా మనుషుల్ని మనుషులుగా చూడలేని దుర్మార్గం, ఆటవిక న్యాయం తన నేలమీద అమలు జరుగుతుండగా ప్రపంచ ప్రజలకు న్యాయం అందడం గురించి మాట్లాడడం ఎంత విడ్డూరం. దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, దేశాల మధ్యలేని చిచ్చునుపెట్టి ఆయుధాలను అమ్ముకోకుండా, ప్రపంచ పోలీసులా వ్యవహరించకుండా తన దేశ పోలీసులకు మానవ విలువలు, మానవ హక్కుల గురించి నేర్పుకుంటే మంచిది. నువ్వు చెప్పే చట్టబద్ధ పాలన, సమన్యాయం, నీ పౌరులకే అందడం లేదనే విషయాన్ని ఇతర దేశాలు చెబితే ఊరుకోనపుడు జనహనన ఆయుధాలున్నాయనే నెపంతో ఇరాక్‌పై దాడిచేసి లక్షలాది మంది చావుకు కారణమైన నీ ఉన్మాదాన్ని ఆపుకుంటే ప్రపంచం భద్రంగా ఉంటుంది. పాలస్తీనా పసిపిల్లలపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ప్రేక్షకుడిలా చూసిన నీకు మానవహక్కుల గురించి మాట్లాడే హక్కు ఎక్కడుంది. నీ దేశ నల్లవాడికే న్యాయం చేయలేని వాడివి నీవు ప్రపంచ న్యాయం గురించి మాట్లాడడం ఎంత హాస్యాస్పదం. ప్రపంచమెప్పుడూ ఒకలా ఉండదు ఒక్కోసారి వియత్నాంలా మారుతుంది. తస్మాత్ జాగ్రత్త.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

ఇవి. ఫ్రెడ్డీగ్రే అంతిమ యాత్ర ఉదయం 11 గంటలకు ప్రశాంతంగానే ముగిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి గ్రే మరణానికి సంతాప సూచికంగా బాల్టిమోర్‌లో అన్ని హైస్కూళ్లు పర్జ్‌లో పాల్గొంటామని సోషల్ మీడియాలో ఒక ప్రకటన వెలువడింది. 'ది పర్జ్' (ప్రక్షాళన) అనేది ఓ సినిమా పేరు. సృజనాత్మకంగా 'ది పర్జ్' అన్న సినిమా పేరును తమ మనోభావాలకు సంకేతంగా ఉద్యమకారులు వాడుకున్నారు. ఆ సినిమాలో ఒక ధనిక కుటుంబాన్ని బందీలుగా పట్టుకుని 12 గంటల పాటు అన్ని నేరాలను, విధ్వంసాన్ని చట్టబద్ధంగా ప్రకటిస్తారు. మొదట హైస్కూల్ విద్యార్థులతో ప్రారంభమైన ర్యాలీ యూనివర్సిటీ స్టూడెంట్స్‌కు వ్యాపించింది. హైస్కూల్ పిల్లలు బాటిళ్లు, ఇటుకలతో పోలీసులను ఎదుర్కొన్నారు. పోలీసులు పిల్లలపైకి రాళ్లు విసిరారు. ఆ తర్వాత పెద్దలు ఆందోళనకారులతో చేతులు కలిపారు. పిల్లలూ, పెద్దలూ అందరూ ఆఫ్రికన్ అమెరికన్లే. కనిపించిన షాపింగ్ మాల్స్‌ను, మందుల దుకాణాలను బూడిద చేశారు. అయితే ఆందోళన కారుల కోపానికి ప్రధానంగా గురైంది అమెరికన్ పోలీసులే.

ఆందోళన ఉగ్రరూపం ధరించగానే ఫ్రెడ్డీగ్రే మారక ద్రవ్యాలు అమ్మేవాడని, ఆయనది నేరమయ చరిత్ర అని మీడియాలో చాలా కథనాలు ప్రచారంలో పెట్టారు. పోలీసులు తాము చేసిన దారుణ కృత్యాన్ని కప్పిపుచుకునే విఫల ప్రయత్నం చేశారు. 'అనుమానంతో అరెస్టు చేసిన వ్యక్తిని, నేరస్తుడైన, నల్లజాతివాడైనా చిత్రహింసలు పెట్టి చంపేస్తారా... కోర్టు, చట్టాలు ఏమయ్యాయి' అన్నదే అమెరికాలో ప్రజాస్వామ్యవాదులు అడిగిన ప్రశ్న. ర్యాలీలో హింస ప్రజ్వరిల్లిందని, అదే సాకుగా లూటీలు చేశారని, చేతికి దొరికిన సామాన్లు పట్టుకు పోయారని నల్లజాతీయులను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. స్వతహాగా ఆఫ్రికన్ అయిన ఒబామా ఆందోళన కారులను 'థగ్గులు.. నేరస్తులు' అని ఆందోళనకారులపై నేరం మోపే ప్రయత్నం చేశాడు. (మహాకవి శ్రీశ్రీ నరహంతకులను 'థగ్గులు, పిండారీలు' అని పిలిచాడు. నరహంతక తెల్ల పోలీసు ముఠాకు నాయకత్వం వహిస్తున్న ఒబామా పోలీసుల అరాచకత్వాన్ని నిరసిస్తున్న ప్రజలను 'థగ్గులు..' అని సంబోధించడం అమెరికాలో సర్వత్రా విమర్శకు గురైంది) అయితే, చాలా మంది ప్రదర్శనకారులు మాల్‌ల నుండి బయటకు తెచ్చిన సరుకులనే ఆయుధాలుగా మలుచుకొని పోలీసు వాహనాలపైకి, బారులు తీరి తుపాకులు పట్టుకుని నిలుచున్న పోలీసులపైకి విసిరారు. మీడియా కథనాల ప్రకారమే పోలీసు వాహనాలు ప్రదర్శనకారులు విసురుతున్న డబ్బాల, మూటల ధాటికి తట్టుకోలేక కంట్రోల్ తప్పి బోల్తాపడ్డాయి.

బాల్టిమోర్ సంఘటనలు అకస్మాత్తుగా పెల్లుబికిన నల్లజాతి జనుల క్షణికావేశం కాదు. కొన్ని దశాబ్దాలుగా నలుగుతున్న సంక్షోభం, అమెరికన్ పోలీసులకు – ఆఫ్రికన్, అమెరికన్ ప్రజలకు మధ్య రగులుతున్న చిచ్చు. గత సంవత్సరం ఆగస్టులో, మిస్సోరి రాష్ట్రంలోని ఫెర్గుసన్ పట్టణంలో డోరన్ విల్సన్ అనే తెల్లజాతీయుడైన ఒక పోలీసు అధికారి మైఖేల్ బ్రౌన్ అనే 18 ఏళ్ల నల్లజాతి యువకుణ్ణి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపాడు. ఒక దుకాణంలో సిగార్‌లు దొంగతనం చేసి, ఆ షాపు యజమానిని తోసివేసి పరుగెత్తడమే బ్రౌన్ చేసిన నేరం. మైఖేల్ హత్యను నిరసిస్తూ పెద్దఎత్తున హింసాత్మక సంఘటనలు జరిగాయి. వారానికి పైగా కర్ఫ్యూ విధించ బడ్డది. ప్రజల ఒత్తిడి తట్టుకోలేక విచారణ సంఘాన్ని నియమించారు. ఆ విచారణ సంఘం కొన్ని నెలలు విచారించి పోలీసు అధికారి నిర్దోషి అని తేల్చింది. ఎరిక్‌గార్నర్‌కు 43 ఏళ్లు. న్యూయార్క్‌లో ఆయన నివాసం. నల్లజాతీయుడు. ఆరుగురు పిల్లలు. ముగ్గురు మనుమలు. లైసెన్స్ లేని సిగరెట్టు (మత్తునిచ్చే పొగ చెట్టు) అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నడిరోడ్డు మీదే (తెల్లజాతి) పోలీసులు ఆయన మెడను గట్టిగా నొక్కి పట్టుకుంటే ఊపిరాడక చనిపోయాడు. ఇది 2014 జూలై 17న జరిగింది. బంధువులు గొడవ పెడితే విచారణ సంఘం ఏర్పాటు చేశారు. అక్కడా పోలీసులు నిర్దోషులని తేల్చారు. ప్రతిగా న్యూయార్క్, ఇతర పట్టణాలలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. అరిజోనా రాష్ట్రంలోని ఫీనిక్స్ పట్టణంలో రుమెయిన్ బ్రిస్‌బిన్ అనే 34 సంవత్సరాల నల్లజాతి యువకుడు పోలీసు తూటాలకు బలి అయి మరణించాడు. (డిసెంబర్ 2014) అతని చేతిలోని మందుల డబ్బాను పిస్టల్ అని పొరపాటు పడి తుపాకితో కాల్చామని పోలీసుల కథనం. మళ్లీ కథ మామూలు విచారణలో తెల్లజాతి పోలీసులు నిర్దోషులని తేలారు. మిచిగాన్ యూనివర్శిటీలో నల్లజాతి విద్యార్థులు యూనివర్శిటీ ఆవరణలో 'మరణ ప్రదర్శన' నిర్వహించి తమ నిరసన తెలిపారు.

ఇలాంటి ఇంకో సంఘటనలో ట్రెవాన్ మార్టిన్ అనే 17 సంవత్సరాల ఆఫ్రికన్, అమెరికన్‌ను జిమ్మర్‌మాన్ అనే హిస్పానిక్ జాతికి చెందిన వ్యక్తి కాల్చి చంపాడు. ట్రెవాన్ మార్టిన్ హైస్కూల్ విద్యార్థి. తన తండ్రి పెళ్లి చేసుకోబోతున్న ఓ మహిళను కలువడానికి తన తండ్రితో పాటు జిమ్మర్‌మాన్ నివాసం ఉంటున్న కాలనీకి వచ్చాడు. జిమ్మర్‌కు మార్టిన్ దొంగ అని అనుమానం వచ్చింది. ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. మార్టిన్‌ను తన దగ్గర ఉన్న పిస్టల్‌తో కాల్చిచంపాడు. జిమ్మర్‌మాన్‌ను పోలీసులు అరెస్టు చేయలేదు. అప్పుడు పోలీసు ఉన్నతాధికారి బిల్‌లీకి ఆఫ్రికన్ అమెరికన్ జాతీయుల మీద చచ్చేంత కోపం. వాళ్లను చంపినా సరే తప్పు లేదు అనుకునేవాడు. ఆయనకు బంధుప్రీతి ఎక్కువని, ఆయన బంధువులు దుర్మార్గాలు చేసినా పోలీసు కేసు లేకుండా చేస్తున్నాడన్న తప్పుమోపి ఆయన్ను ఆ తర్వాత బదిలీ చేశారు. ప్రజాగ్రహానికి జడిసి జిమ్మర్‌మాన్‌ను కొంతకాలం తర్వాత అరెస్టు చేశారు. కాని అతడు నిర్దోషి అని విడుదల చేశారు. సెయింట్ లూయిస్ పట్టణంలో కజీం పావెల్ దక్షిణ కొరలీనాలో వాల్టర్‌స్కాట్, లాస్ ఎంజల్స్‌లో ఎజిల్ ఫోర్డు... ఇలా అమెరికన్ పోలీసుల చేతుల్లో మరణానికి గురైన నల్లజాతీయుల గురించి చెప్పుకుంటూ పోతే ఒక ఉద్గ్రంథమే అవుతుంది. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం 1999 నుండి 2014 మధ్యకాలంలో దాదాపు 70 మంది నిరాయుధులైన నల్లజాతి ప్రజలు పోలీసుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు.

బాల్టిమోర్ అల్లర్ల వెనుక గూడు కట్టిన ఆగ్రహం ఉంది. అప్పటికప్పుడు పెల్లుబికిన క్షణికావేశం కాదు. చావు తరువాత చావు. పోలీసుల చేతుల్లో నల్ల జాతీయుల వరుస వెంబడి చావులు. ప్రతి చావు తరువాత గొడవలు, నిరసన ప్రదర్శనలు, కర్ఫ్యూ, నల్లజాతి ప్రజల మీద నిందలు, అపనిందలు, రాజకీయ నాయకుల ఓదార్పు మాటలు... విచారణ సంఘాన్ని నియమించడం, పోలీసు అధికారులను నిర్దోషులుగా ప్రకటించడం లేదా చిన్న చిన్న శిక్షలతో సరిపెట్టడం. ఇదీ తంతు. సంవత్సరాల తరబడి నడుస్తున్న పరంపర. ఒక ఆఫ్రికన్ అమెరికన్ (ఒబామా) అమెరికా అధ్యక్ష పీఠం అలంకరించినా ఆగిపోని వివక్ష. అమెరికాలో అంతర్ భాగమైన ఒక ప్రజాసమూహం పట్ల ఎడతెగని చిన్న చూపు. నేరస్తులని, అనాగరికులని ఈసడింపు. తెల్లటి అమెరికా సభ్య సమాజంలో నల్లటి కురకలని వారిపై చిన్న చూపు.

టి.వి.లో ఒక నల్లజాతి మహిళ 'అధికారం ఎక్కడ?' అన్న కవితలో రాజకీయాధికారం పోలీసు తుపాకీ తూటాలో ఉందా... వైట్ హౌస్‌లో ఉందా అని ప్రశ్నించింది. బాల్టిమోర్ నిరసన ప్రదర్శనలో 'ఆ తర్వాత ఎవరు? నేనేనా! అని ప్లేకార్డు పట్టుకుని నిలుచున్న ఓ పదేళ్ల బాలుడు కనిపించాడు.

బాల్టిమోర్‌లో 2014 ఆగస్టు 18 నుండి యువత కోసం కొత్త కర్ఫ్యూ విధానాన్ని ప్రవేశపెట్టారు. 14 సంవత్సరాల కంటె తక్కువ వయస్సు ఉన్న పిల్లలు పెద్దవారి తోడు లేకుండా రాత్రి తొమ్మిది గంటల తర్వాత రోడ్లపై తిరగ కూడదు. 14-16 సంవత్సరాల పిల్లలు రాత్రి 10 గంటల తర్వాత అసలు రోడ్డు మీద కనిపించకూడదు. ఈ నియమం ఉదయం ఆరు గంటల వరకు అమలులో ఉంటుంది. అయితే వారాంతంలో ఈ నిబంధనకు రాత్రి పదకొండు గంటల వరకు సడలింపు ఉంటుంది. చాలా రాష్ట్రాలలో ఇలాంటి ఆంక్షలు ఉన్నా, బాల్టిమోర్‌లో ఎక్కువ కఠిన తరం అని చెపుతారు. హక్కుల సంఘాలు ఈ పద్ధతిని వ్యతిరేకిస్తున్నాయి. నల్లజాతి పిల్లల విషయంలోనే ఇలాంటి కర్ఫ్యూను అమలులోకి తెచ్చారని, ఇది వివక్ష కాదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

మొత్తం సమస్యను అన్ని కోణాల్లోంచి విశ్లేషిస్తే నిజంగా ఇది తెల్ల జాతీయులకు, నల్ల జాతీయులకు మధ్య ఘర్షణ వాతావరణ ఫలితమేనా దీనికి వేరే కారణాలేమీ లేవా అన్న అనుమానం వస్తుంది. బాల్టిమోర్‌లో పోలీసుల అమానుషాన్ని నిరసిస్తూ నల్లజాతి ప్రజల పోరాటానికి సంఘీ భావం ప్రకటిస్తూ అమెరికాలో చాలా ప్రదేశాలలో ర్యాలీలు జరిగాయి. వాటిల్లో తెల్లవాళ్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాల్టిమోర్‌లో గాని, నిరుడు ఫెర్గుసన్‌లో గాని నల్లవాళ్ల కోపం అంత పోలీసులపైగాని తెల్లజాతి ప్రజల మీద కాదు. ఫ్రెడ్డీగ్రే మరణానికి దారి తీసిన సంఘటనలపై ఏర్పాటైన విచారణ సంఘం ఆరుగురు పోలీసులపై అభియోగాలు మోపింది. ఆ ఆరుగురిలో ముగ్గురు నల్ల జాతీయులే! నల్లజాతి జనులను అనుమానాస్పదంగా చూసే వైఖరిని, వారి పట్ల అనుమానంగా ఉంటేనే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్న పోలీసుల వైఖరిని పెంచి పోషిస్తున్న అమెరికా ప్రభుత్వ వైఖరిని గురించి కూడా ఆలోచించాలి. 'కొంత మంది పోలీసు అధికారులు సరైన పద్ధతిలో ప్రవర్తించడం లేదు. చట్టాన్ని అమలు పరచడానికి, నల్లజాతి ప్రజా సమూహానికి మధ్య కొంతకాలంగా ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి'. 'పోలీసు అధికారులు వ్యక్తులతో ముఖ్యంగా ఆఫ్రికన్ అమెరికన్ తెగకు చెందిన వ్యక్తులతో వ్యవహరించే తీరు కొన్ని ఇబ్బందులకు గురి చేస్తుంది' అన్న వ్యాఖ్యలతో ప్రెసిడెంట్ ఒబామా అసలు సమస్య నుండి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారు.

మేరీల్యాండ్ రాష్ట్రంలో అత్యంత ఎక్కువ జనాభా గల పట్టణం బాల్టిమోర్. ఆరు లక్షల 23 వేల మంది ప్రజలు నివసిస్తున్న ఈ పట్టణంలో 63 శాతం మంది నల్ల జాతీయులే! చాలా పట్టణాలలో ఇదే పరిస్థితి. ఆరు లక్షలపై చిలుకు జనాభా ఉన్న బాల్టిమోర్‌లో నాలుగొ వంతుకు పైగా ప్రజలు దారిద్ర రేఖకు దిగువన బతుకుతున్నారు. అమెరికాలో అత్యంత ఐశ్వర్యవంతమైన రాష్ట్రం మేరీల్యాండ్‌లో అంతర్భాగమైన బాల్టిమోర్ పట్టణంలో సంవత్సరానికి నల్ల జాతీయుల సగటు సంపాదన 40,000 డాలర్లు. ఇది మేరీల్యాండ్ రాష్ట్రంలోని జనాభా సగటు సంపాదన కంటె చాలా తక్కువ. బాల్టిమోర్‌లో 20-24 సంవత్సరాల మధ్య వయస్సు గల నల్లజాతి యువకుల్లో నిరుద్యోగం 37 శాతం. అదే వయస్సు గల తెల్లజాతి యువకుల్లో నిరుద్యోగం 10 శాతంగా గణాంకాలు చెపుతున్నాయి. నల్లజాతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో సగటు జీవన ప్రమాణం 63 సంవత్సరాలు కాగా, వాటికి కేవలం ఐదు మైళ్ల దూరంలో ఉన్న తెల్ల ప్రజల నివాస ప్రాంతాలలో సగటున ప్రజలు 83 సంవత్సరాలు జీవిస్తారు. ఫ్రెడ్డీగ్రే నివసించిన కాలనీలో 16 నుండి 64 సంవత్సరాల వయస్సు కలిగిన నల్లజాతి ప్రజలలో సగం మంది కంటె ఎక్కువ నిరుద్యోగులే.

నల్లజాతి ప్రజలు అనుభవిస్తున్న కడు పేదరికం అసలు సమస్య. వాళ్లలో నిరుద్యోగులు ఎక్కువ. నేరాలు ఎక్కువే! కారల్ మార్క్స్ అన్నట్లు 'దొంగతనం చేయడం అంటే వ్యక్తిగత ఆస్తి పట్ల, ఐశ్వర్యం పట్ల నిరసన వ్యక్తపరచడం'. తీరని అవసరాలు నల్లజాతి ప్రజలను నేరాల వైపు ఉసిగొల్పుతాయి. మాదక ద్రవ్యాలు అమ్మడం ద్వారా సులువుగా డబ్బు సంపాదించే వీలు ఉంటుంది. మాదక ద్రవ్యాలు వాడి మత్తులో గడిపి బాధలు మర్చిపోయే ప్రయత్నం చేస్తారు. దానికి అలవాటు పడిపోతారు. ఇవన్నీ పోలీసుల దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో నేరాలు. సమస్యకు పరిష్కారంగా పోలీసు శాఖను పటిష్ఠం చేయడం, అమానవీయంగా తయారు చేయడమేనని ప్రభుత్వం భావిస్తుంది. ఇటీవలి కాలంలో ఆరు మిలియన్ డాలర్లు పోలీసు వ్యవస్థను ఆధునీకరించడానికి బాల్టిమోర్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందంటే ఆ ప్రభుత్వం ప్రాధాన్యతలేమిటో అర్థం చేసుకోవచ్చు.

బాల్టిమోర్ మాజీ మేయర్, బాల్టిమోర్ యూనివర్సిటీ ప్రస్తుత అధ్యక్షుడు కర్క్ స్కిమోక్ మాటల్లో 'అవధులు దాటిన నిరుద్యోగం, మితిమీరిన నేరాలు, పట్టణ జీవితంలోని ఒత్తిడి – వీటన్నింటితో పాటు చాలా మందికి మధ్యలో స్కూల్ వదిలేయాల్సిన స్థితి – ఇవీ ప్రధాన సమస్యలు. బాల్టిమోర్‌లో పెరుగుతున్న అశాంతికి జాతి వైరుధ్యం కంటె వర్గ వ్యత్యాసం, ఆర్థిక విభజనలే అసలైన నేపథ్యాలు. 'నిజానికి, బాల్టిమోర్ అల్లర్లకు ఫ్రెడ్డీగ్రే మృతి పట్ల రగిలిన ఆక్రోశం మాత్రమే కారణం కాదు. సమాజంలో కొంతమందితో పోల్చుకున్నప్పుడు హీనమైన జీవితం గడపడానికి కారణమైన తమ ఆర్థిక పరిస్థితుల పట్ల అసహనం, ఆ స్థితిగతులు మారుతాయన్న ఆశ ఏమాత్రం లేకపోవడం కూడా కారణాలుగా చెప్పడం సమంజసంగా ఉంటుంది.

ఈ సంవత్సరం బాల్టిమోర్, గత సంవత్సరం ఫెర్గుసన్ ఇంకా పోలీసులకు నల్లజాతి ప్రజలకు మధ్య జరిగిన అనేక ఇతర ఘర్షణలు లేవనెత్తిన ఆర్థిక, సామాజికపరమైన ఘర్షణలు లేవనెత్తిన ఆర్థిక, సామాజిక పరిష్కారం లభించకపోతే రాబోయే కాలంలో ఇంకా ఎన్నో బాల్టిమోర్ లాంటి సంఘటనలు పునరావృతమయ్యే పరిస్థితి ఉందని 'ఇండియాస్ టైమ్' అన్న ఆన్‌లైన్ పత్రిక అంచనా వేసింది. అమెరికా దేశ అంతర్గత, బహిర్గత విధానాలలో కొన్ని మార్పులు తీసుకు వచ్చిన సంఘటనలు కొన్నింటిని చరిత్ర కారులు, సామాజిక విశ్లేషణ కర్తలు ఉదహరిస్తారు. అవి 1773లో జరిగిన బోస్టన్ టీ పార్టీ, 1964లో మార్టిన్ లూథర్‌కింగ్‌ను వినడానికి వాషింగ్‌టన్ డిసినేషనల్ హాలులో గుమికూడిన రెండు లక్షలకుపైగా జనసమూహం, 1969లో వాషింగ్‌టన్ డిసిలో ఐదు లక్షల మందితో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శన. అబ్దుల్ జబ్బార్ అన్న ప్రముఖ రచయిత, జర్నలిస్టు బాల్టిమోర్ సంఘటనలను ఈ మూడింటితో పోల్చి 'అమెరికాలో రాబోవు కాలంలో జరగబోయే సమరానికి బాల్టిమోర్ ఒక ప్రారంభం మాత్రమే' అని తేల్చి చెప్పాడు.

(రచయిత రిటైర్డ్ లెక్చరర్) వీ

రీజెన్సీ సిరామిక్స్‌లో మేడే పోరాటం

నాలుగు సంవత్సరాల క్రితం మేడే రోజు యానాం రీజెన్సీ పరిశ్రమలో ఎగసిన పోరాట స్ఫూర్తి అక్కడి కార్మికులలో ఈనాటికీ కొనసాగుతోందని అంటున్నారు బి.ఎస్. రాజు

యానాం కాకినాడ పట్టణ సమీపంలో ఉన్న ఓ చిన్న సముద్ర తీర ప్రాంతం. పూర్వం ఫ్రెంచ్ పాలనలో పుదుచ్చేరిలో భాగంగా ఉండేది. ఇప్పుడు అది కేంద్ర పాలిత ప్రాంతమైన పుదిచ్చేరిలో భాగం. ఇక్కడ నివాసితుల్లో అత్యధిక శాతం కోస్తా ప్రాంతపు తెలుగువారే. ప్రధానంగా ఇది మత్స్యకారులకు చెందిన ప్రదేశం. కేంద్ర ప్రభుత్వ పన్నుల రాయితీలు, పెట్టుబడుల రాయితీలు, గోదావరి సహజ వాయువు, చౌకగా విద్యుత్తు, భూములు, శ్రమశక్తి, వగైరా పారిశ్రామిక లాభార్జనకు సానుకూల సదుపాయాల లభ్యత మూలంగా 1960 నుండి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అక్కడ పరిశ్రమలు స్థాపించసాగారు. అలా అక్కడ వెలసిన ఒక అతిపెద్ద సిరామిక్ పెంకుల ఉత్పత్తి ఫ్యాక్టరీయే 'రీజెన్సీ సిరామిక్స్ లిమిటెడ్' అనే సంస్థ. దీనికి అధిపతి, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జివిఎన్ నాయుడు.

రెండున్నర దశాబ్దాల పాటు తక్కువ జీతాలతో, అసంఘటిత కార్మిక శక్తిని కారుచౌకగా ఉపయోగించుకుని ప్రభుత్వం నుండి సకల సౌకర్యాలను, రాయతీలను పొంది, ఈ సంస్థ దండిగా చాలాకాలం లాభాలు ఆర్జించుకుంది. అప్పట్లో నాణ్యమైన సిరామిక్ పెంకుల ఉత్పత్తిదారుగా రీజెన్సీ బ్రాండ్‌కు మార్కెట్లో మంచిపేరే ఉండేది. ఈ పరిశ్రమ అధిపతి ఉత్తమ అభ్యుదయ పారిశ్రామికవేత్తగా పేరు ప్రఖ్యాతలు కూడా గడించాడు. ఈ పరిశ్రమ నుండి ఆర్జించిన లాభాలతో ఇటు హైదరాబాద్‌లోనూ, అటు యానాంలోనూ స్థిరచరాస్తులు పెంచుకున్నాడు. విద్యారంగంలోనికి విస్తరించి యానాం పట్టణంలో పలు విద్యాసంస్థలు స్థాపించాడు. 'కరేకల్' అనే చోట రెండవ పెంకుల ఫ్యాక్టరీ స్థాపించాడు.

రీజెన్సీ సిరామిక్స్ కార్పొరేట్ ఆఫీసు హైదరాబాద్‌లోని చిరాగ్ ఆలీ లేన్లో ఉంది. ఒకప్పుడు ఉద్యోగులతో, జాతీయ అంతర్జాతీయ మార్కెట్ ఎగుమతుల వ్యాపార సంరంభంతో కిటకిటలాడుతూ, కళకళలాడుతూ ఉండిన ఈ సంస్థ ఇప్పుడు పూర్తిగా వెలవెలబోయి కళావిహీనంగా మారిపోయింది. రీజెన్సీ సిరామిక్స్ అధిపతి జివిఎన్ నాయుడు, చంద్రబాబు నాయుడుకు, టిడిపికి సన్నిహితుడు కావడమే గాక, యానాం లోకల్ ఎంఎల్ఏ కృష్ణారావుకు కూడా బహుసన్నిహితుడని, ఈ రాజకీయ సంబంధాలతోనే ఈయన యానాం పట్టణంలో ఒక ప్రముఖ వ్యక్తిగా ఎదిగాడని, రీజెన్సీ కార్మికులు, యానాం ప్రజలు చెపుతారు. అయితే ఈ చరిత్ర 2011లో తారుమారైంది. రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ చరిత్ర తారుమారవ్వడానికి మేడేనే ప్రధాన కారణమనంటే మనం ఆశ్చర్య పోవచ్చు కాని నిజం మట్టుకు అదే.

అప్పటికి రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ కార్మికనాయకుడుగా ఉన్న కామ్రేడ్ మచ్చా మురళీమోహన్ 2011 మేడే ర్యాలీని మొదటిసారిగా యానాం పట్టణంలో జరపడమే రీజెన్సీ యాజమాన్యానికి, స్థానిక ఎంఎల్ఏకు తమను ప్రశ్నించే ఒక శ్రామిక శక్తి అవతరిస్తున్నదనే భయం పట్టుకొంది. ఫ్యూడల్ లార్డులకుండే అహంకారపూరిత సహజ స్వభావమే ఈ భయానికి కారణం. ఈ భయమే ఆ తదనంతరం జరిగిన సంఘటనలకు మూలం. అధికార బలంతో, పోలీస్ ఫోర్స్‌తో తమను ప్రశ్నించే శక్తిని అణిచివేయడం, నిర్మూలించడం అనే కుట్ర పూరితచర్యలు ఇటువంటి స్వభావం నుండే పుట్టుకొస్తాయి. రీజెన్సీ రాత, యానాం పరిస్థితి మారిపోవడానికి కారణమైంది ఈ స్వభావమే అనేది వాస్తవం.

2015 మేడే సందర్భంగా, రీజెన్సీ కార్మికుల పోరాటానికి మద్దతుగా, వారి పోరాటస్ఫూర్తికి, ఐక్యతకు జేజేలు పలుకుతూ 'రివల్యూషనరీ డెమాక్రాటిక్ ఫ్రంట్ (ఆర్‌డిఎఫ్) ప్రచురించి, యానాంలో పంచిన మేడే వర్ధిల్లాలి! యానాం రీజెన్సీ సిరామిక్ కార్మికుల పోరాటం వర్ధిల్లాలి!! యానాం రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ కార్మికుల వీరోచిత పోరాటానికి జేజేలు' అనే కరపత్ర వివరాల్లోనికి వెడితే రీజెన్సీ కార్మిక పోరాట ఉద్యమ స్వరూప స్వభావాలు అవగతమవుతాయి. ఇప్పుడా వివరాలు చూద్దాం.

యానాం రీజెన్సీ సిరామిక్ కార్మిక పోరాట ఎర్రజెండానెత్తిపట్టి, ఆ ఫ్యాక్టరీ ప్రారంభించిన 24 ఏళ్ల తర్వాత మొట్టమొదటి సారిగా కార్మిక యూనియన్‌ని స్థాపించి, 2011 మేడే జరిపి, ఆ స్ఫూర్తిని తమ గుండెల్లో నింపినందుకే రీజెన్సీ కార్మికుల ప్రియతమ నాయకుడైన మచ్చా మురళీ మోహన్, రీజెన్సీ యాజమాన్యానికి శత్రువైనాడు. అప్పటి నుండే రీజెన్సీ యజమాన్యం అతన్ని టార్గెట్ చేసి ఎలాగైనా వదిలించుకోవాలనే కపట వ్యూహం పన్నింది. ఆ వ్యూహంలో భాగంగానే అతను అమరుడయ్యాడు. అతను అమరుడైన తరవాత జరుపుకుంటున్న ఈ 2015 మే 5న మేడే నాడు మనం అతన్ని మనసారా స్మరించు కుంటున్నాం. అతను అమరుడైన 2012 జనవరి 27న గుర్తు చేసుకుంటున్నాం. అతని పోరాట స్ఫూర్తిని త్యాగ నిరతిని ఆవాహన చేసుకుంటున్నాం.

2012 జనవరి 27న గుర్తు చేసుకోవడమంటే కామ్రేడ్ మచ్చా మురళీమోహన్ అమరత్వాన్ని గుర్తు చేసుకోవడమే! మచ్చలేని, స్వచ్ఛమైన, అరుదైన, అమూల్యమైన యువకార్మిక నాయకుణ్ణి గుర్తు చేసుకోవడమే! రీజెన్సీ కార్మిక మిత్రులే కాదు, దేశంలోని సంఘటిత – అసంఘటిత కార్మిక లోకం తమ ఆత్మీయ సహచరుణ్ణి కోల్పోయిన విషాద సందర్భాన్ని గుర్తు చేసుకోవడమే! ఈ ఘటనకు కారణభూతమైన అహంభావ పూరిత, భూస్వామ్య భావజాల దర్పంతో విర్రవీగుతున్న 'రీజన్సీ సిరామిక్స్' యాజమాన్యాన్ని, దానికి వత్తాసుగా తెర వెనుక నిలబడ్డ యానాం రాజకీయ అధికార ప్రజా ప్రతినిధి కుట్ర పూరిత హత్యా రాజకీయాలను మననం చేసుకోవడమే! రీజెన్సీ సిరామిక్స్ కార్మికుల తలలో నాలుకై, మనసులో మనసై, కార్మిక సంఘానికి ఆత్మీయ నాయకుడై, యానాం సకల జనుల స్నేహాన్ని, సౌహార్ద్రతను, సమ్మతిని సంపాదించుకున్న మురళి రీజెన్సీ యాజమాన్యానికెందుకు కంటిలోనలుసై, కాలిలోముల్లై, గుండెలోదడై, అడ్డు తొలగించుకోక తప్పని వాడైనాడు? ఎందుకంటే, యాజమాన్యానికి తెలుసు, అతన్ని డబ్బుతో కొనలేమని. మభ్యపెట్టి, భయపెట్టి, నయాన్నో, భయాన్నో, రాజకీయ అధికారిక ఒత్తిడితోనో

దారికి తెచ్చుకోవడం కూడా సాధ్యం కాదని. అతను కార్మికుల గుండెకాయని, కార్మికుల రక్తబంధువని, శ్రామికవర్గ శ్రేయోభిలాషని రీజెన్సీ యాజమాన్యం, యాజమాన్యపు స్థానిక రాజకీయ మద్దతుదారు ఒక నిర్ణయానికి వచ్చిన తరువాతే, కామ్రేడ్ మచ్చా మురళిపై తెలివిగా పోలీసులతో దాడి జరిపించి, జైల్లో కొట్టి చంపించే వ్యూహం రచించ బడింది. అటువంటి వ్యూహానికి ప్రథమ టార్గెట్ కామ్రేడ్ మచ్చా మురళీ మోహన్. అలా చుక్కానిని విరిచేస్తే, కార్మికులు పయనిస్తున్న నౌక మునిగిపోతుందని రీజెన్సీ యాజమాన్యం అంచనా వేసింది. కాని యాజమాన్యపు దుర్మార్గానికి కార్మిక నాయకుడేగాక రీజెన్సీ స్థానిక యాజమాన్య ప్రతినిధి కూడా బలైపోయాడు.

ఈ సాకుతో, సజావుగా నాణ్యమైన ఉత్పత్తి కొనసాగుతూ, దేశ విదేశాల్లో సిరామిక్ పెంకులు పెద్దఎత్తున అమ్ముడు పోతున్న దశలో కక్ష పూరితంగాను, యానాం సమాజపు ఆకాంక్షలకు వ్యతిరేకంగాను ఫ్యాక్టరీని మూసివేయడం పూర్తిగా అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం. ఈ రోజు, రీజెన్సీ సిరామిక్స్ అధినేత జి.ఎన్. నాయుడు, కంపెనీ ప్రెసిడెంట్ రామ్‌ప్రసాద్, ఫైనాన్స్ ప్రెసిడెంట్ బాలకృష్ణారావులు తప్పుడు లెక్కలతో, తప్పుడు సమాచారంతో కార్మికులపై హత్యానేరం మోపికేసులు పెట్టడం, దూరాభారమైన పుదుచ్చేరీ, చెన్నై నగరాల చుట్టూ కార్మికులను నిత్యం ప్రదక్షిణ చేయించడమనే దుర్మార్గపు వ్యూహంతో, ఇటు స్థానిక యానాం ప్రభుత్వ అధికారులను, అటు పుదుచ్చేరీ ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తూ కార్మికుల పొట్టకొట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. కార్మికుల నెలాగైనా జైళ్లలో కుక్కి, చిత్రహింసలు పెట్టి, వారి హక్కుల సాధన పోరాటాన్ని నీరుగార్చి ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని వ్యవహరిస్తోంది రీజెన్సీ యాజమాన్యం.

వీరి దృష్టిలో, వీరి నీతిలో, అసలు కార్మికులు నోళ్లు తెరవడమే పెద్ద నేరం. తలవంచుకు పనిచేయడం, ఇచ్చిందేదో కళ్ల కద్దుకుని మహా ప్రసాదం ప్రభో అని జీహుకుం కొట్టడం తప్ప, హక్కులని, యూనియన్లని, కనీస వేతనాలని, కనీస సౌకర్యాలనీ, కార్మిక చట్టాల అమలని, రాజ్యాంగమని మాట్లాడితే, నోరు తెరిస్తే అది కార్మికుల తిరుగు బాటేనని వారి లెక్క. ఇక మేడే జరుపుకోవడం, ఎర్రజెండా పట్టుకోవడం, ప్రదర్శన చేయడం, తమ హక్కుల సాధనకై చుట్టూ నలుగురి మద్దతు కూడకట్టు కోవడమంటేవారి లెక్కలో అది అగ్గి మంటే! అది తిరుగుబాటే!

అన్యాయంగా ఫ్యాక్టరీ మూసివేసి, అలా మూసివేసే నాటికి కార్మికులకు ఇవ్వవలసిన జీతాలు కూడా ఇవ్వకుండా, కార్మికులకు ఒక్క రూపాయి కూడా కంపెనీ బాకీలేదని బుకాయించడం ఏహ్యమైన, నీతిబాహ్యమైన యాజమాన్య పద్ధతి. లేబర్ కమిషనర్ కు యాజమాన్యం రాసిన లేఖలో పచ్చి అబద్ధాలు చెపుతోంది. ఏది ముందో, ఏది వెనకో కూడా మరిచిపోయి, దేని పర్యవసానం ఏ నష్టానికి దారితీసిందో కావాలని కప్పిపుచ్చి రెండు చావులకు, మొత్తం ఫ్యాక్టరీ వాతావరణాన్ని, నడకను విచ్ఛినం చేసిన రీజెన్సీ యాజమాన్యపు అహంకార పూరిత స్వభావం, వారి అప్రజాస్వామిక పనివిధానమే ఈ రోజు ఫ్యాక్టరీ కార్మికుల దుస్థితికి పూర్తి కారణం.

ఈ వ్యవహారం యావత్తు యానాం సమాజానికి, యానాం చుట్టు పక్కల నివసించే గ్రామాల ప్రజలకు పూర్తిగా తెలుసు. ముందుగా కార్మిక నాయకుడు మచ్చా మురళీమోహన్ హత్య. తరవాతే, దాని పర్యవసానం గానే అదుపుతప్పిన ప్రజా ఆగ్రహంలో భాగంగానే ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధిపై దాడి జరిగింది, ఈ దాడిలో ఆయన ప్రాణం పోయింది. మురళీమోహన్ హత్యే జరగకపోతే అసలు చంద్రశేఖర్ అనే యాజమాన్య ప్రతినిధి జోలికి పోయేదెవరు? మరి ముందుగా మురళీ హత్యపై సిబిఐ విచారణను పక్కకునెట్టి, చంద్రశేఖర్ హత్యపై విచారణను ముందుకు తోస్తే నిజాలు ఎలా తెలుస్తాయి? ఫ్యాక్టరీ తెరచమని, పనివారిని లోనికి తీసుకుని ఉత్పత్తిని మొదలు పెట్టమని, ఎంతో మంది ఎన్ని చెప్పినా, వినకుండా మొండికేసి, తాము పూర్తిగా నష్టపోయామనీ, పాడై పోయిన యంత్రాలకు, భవనాలకు భీమా రాలేదనీ, కంపెనీ బ్యాంక్ అప్పుల్లో మునిగి ఉందనీ, కిస్తీలు కట్టలేక కంపెనీ చతికిల పడిందనీ, కార్మికులు తమ ఫ్యాక్టరీ అధికారిని హత్య చేశారనీ, కోర్టులో కేసులు కొనసాగు తున్నాయనీ కుంటిసాకులు చెపుతూ కాలం వెళ్లబుచ్చుతోంది రీజెన్సీ యాజమాన్యం. అంతేగాక, మేము ఫ్యాక్టరీని తెరవలేని స్థితిలో ఉన్నాం కాబట్టి, తెరవడం సాధ్యం కాదనీ లేబర్ కమిషనర్‌కు లేఖ సమర్పించింది.

అయ్యా! రీజెన్సీ యాజమాన్యమా! దశాబ్దాల తరబడి ఎవరి శ్రమశక్తి దోపిడీతో తమరు కోట్లకు పడగ లెత్తినారో, విలువైన స్థిర – చరాస్తులను సంపాదించుకున్నారో తెలియని వారెవరైనా యానాంలోను, ఆ చుట్టు ముట్టూ ఉన్నారా? ఏ శ్రామికుల స్వేదం, రక్తం తమకు సంపదలను చేకూర్చిందో, ఆ శ్రామికులకే ద్రోహం చేసి, ఈ రోజువారి మనుగడనే ప్రశ్నార్థకం చేసి, వారి కుటుంబాలను దిక్కులేనివారిగా చేసిన రీజెన్సీ యాజమాన్యమా! ఇప్పటికైనా కళ్లుతెరువు. నీకు రక్తం దారబోసిన కార్మికులతో ముందుకొచ్చి సంభాషించు. అంతేగాని తెరచాటు నుండి కుయుక్తులతో కాలయాపన చేసి మరింతగా ప్రజల శత్రువుగా మిగిలిపోకు.

అయ్యా! గౌరవనీయులైన యానాం ప్రజా ప్రతినిధిగారు! తమకు ఓట్లేసి గెలిపించి అధికారమిచ్చిన కార్మికుల, శ్రామిక ప్రజల యోగ క్షేమాన్ని, మీ ప్రాంతపు అభివృద్ధిని విస్మరించకు. వక్రమార్గ దారులైన యానాం రీజెన్సీ సిరామిక్స్ యాజమాన్యానికి, ముఖ్యంగా జి.ఎన్. నాయుడుకు, కంపెనీ ప్రెసిడెంట్ రామ్‌ప్రసాద్‌కు, కంపెనీ ఫైనాన్స్ ప్రెసిడెంట్ బాలకృష్ణారావుకు సవ్యమార్గంలోనికి వచ్చి రీజెన్సీ కార్మికుల ప్రయోజనాలను దానితో ముడిపడి ఉన్న యానాం ప్రజల ప్రయోజనాలను కాపాడవలసిన బాధ్యత వారిపై ఉందని వారికి హితవు చెప్పు. యానాం, పుదుచ్చేరీ ప్రభుత్వాలు రీజెన్సీకార్మికులకు న్యాయం చేకూర్చే విధంగా ఒత్తిడి తీసుకు రావలసిన బాధ్యత ఒక ప్రజాప్రతినిధిగా మీ పై ఉన్నదని మరవద్దు. ప్రజా న్యాయం సామాజిక న్యాయం అంటూ ఒకటి ఉంటుందని మీ ఇరువురికి తెలియని విషయం కాదు. ఎవరైతే సమస్యకు కారణ భూతులో, వారే ముందుండి ఈ సమస్యను చక్కదిద్దాలి. ఎవరి అహంభావం వల్ల వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయో, సామాజిక శాంతికి భంగం వాటిల్లుతున్నదో వారు తప్పించుకు తిరుగుతూ, పని చేసుకు బతికే శ్రామిక ప్రజలను బలిపెట్టడం సామాజిక న్యాయం, ప్రజా న్యాయం అనిపించుకోదు. ఫ్యాక్టరీ అన్యాయంగా మూతబడి ఇన్ని ఏళ్లు గడచినా, కోర్టులో కేసులని అడ్డంపెట్టి ఇంతవరకు కార్మికులను చర్చలకు పిలవడానికే సిద్ధంగా లేని రీజెన్సీ సిరామిక్స్ యాజమాన్యపు బలుపుకు, దురహంకారానికి ఒక ముగింపు ఉండాలి. యానాం ప్రజా ప్రతినిధిగా రీజెన్సీ యాజమాన్య మెడలు వంచి శ్రామికులతో చర్చలు జరిపించి, రీజెన్సీ కార్మికులకు సత్వరమే న్యాయం జరిగేటట్లు నీవు కంకణం కట్టుకోవాలని మేం గట్టిగా డిమాండ్ చేస్తున్నాం.

రీజెన్సీ సిరామిక్స్ కార్మిక నాయకుడు కామ్రేడ్ మచ్చా మురళీమోహన్ హత్య కావించబడ్డాక జరుపుకుంటున్న ఈ 2015, ఐదవ మేడే రీజెన్సీ సిరామిక్ కార్మికులకు ఓ కొత్త మలుపు. వారు తమ న్యాయమైన హక్కుల సాధన పోరాటంలో ఘనవిజయం సాధిస్తారనే ధీమాను ఇస్తున్న సంఘటిత శ్రామిక శక్తికి ఓ వెలుగు ద్వారం. అందుకే వారు ఈ

ఆర్‌టిసి సమ్మె - అనుభవాలు - విశ్లేషణ

***ఇరు రాష్ట్రాల్లోని ఆర్‌టిసి కార్మికులు చేసిన సమ్మె విజయవంతమైనా అది తాత్కాలిక ప్రయోజనమేననీ, ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ఆర్‌టిసిని కాపాడుకుంటేనే నిజమైన విజయమవుతుందనీ అంటున్నారు* కె. సూర్యప్రకాశ్‌రావు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల ఆర్‌టిసి కార్మికులకు 2013 ఏప్రిల్ 1 నుండి వేతన సవరణ జరగవలసి ఉంది. 25 నెలలు గడిచినప్పటికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌టిసి యాజమాన్యం కార్మిక సంఘాల ప్రయత్నాలను ఆర్‌టిసి నష్టాల పేరుతోనూ, రాష్ట్ర విభజన పేరుతోనూ వాయిదా వేసుకుంటూ వస్తున్నాయి. కార్మిక సంఘాలు వివిధ ప్రయత్నాల అనంతరం చిట్టచివరి ప్రయత్నంగా మార్చ్ 2న 214 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చి చివరకు ఏప్రిల్ 6న మొదటి సర్వీసు నుండే సమ్మెలోకి వెళ్లాయి.

సమ్మె డిమాండ్లలో ముఖ్యమైన, కీలకమైన డిమాండ్లు రెండే రెండు 1) 43 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయడం. 2) తక్షణ ఎపిఎస్ ఆర్‌టిసిని ఆంధ్ర, తెలంగాణ (ఎపిఎస్ ఆర్‌టిసి, టిఎస్ ఆర్‌టిసి) ఆర్‌టిసిలుగా విడగొట్టడం. సమ్మె మొదలైన రెండవ రోజే ఆర్‌టిసి విభజన మే 14న చేస్తున్నామని యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. కాని 43 శాతం ఫిట్‌మెంట్ మాత్రం సాధ్యం కాదని ప్రకటించింది. అంతే కాకుండా సమ్మె విచ్ఛిన్న చర్యలను ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌టిసి యాజమాన్యం కలసి అత్యంత వేగంగా, బలంగా ముందుకు తీసుకువచ్చాయి. కార్మికులకు 43 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలంటే తప్పని సరిగా 15 శాతం మేర టిక్కెట్ రేటు పెంచక తప్పదనే తప్పుడు ప్రచారాన్ని కుట్రపూరితంగా ముందుకు తెచ్చింది. ప్రజల నైతిక మద్దతును కార్మికులకు లేకుండా చేసే కుట్ర ఇది. ఇరు రాష్ట్రాలలోను ఉన్న అన్ని డిపోలలో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది నియామకాలను (డ్రైవర్లకు రోజుకు 1000, కండాక్టర్లకు 800) చేపట్టి సమ్మె చేస్తున్న కార్మికుల మొరాలిటీని దెబ్బతీసే కుట్రకు తెరతీసింది. రెండవ రోజున అంటే 2015 మే 7న తాత్కాలిక ప్రాతిపదికన పని చేయడానికి డ్రైవర్లను సమకూర్చే బాధ్యతను ఆర్‌టిఎ వారికి ప్రభుత్వం అప్పజెప్పగా ఎంవిఐలు హెవీ పాసింజర్ లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్లను నిర్బంధించి వందల సంఖ్యలో ఆర్‌టిసి గ్యారేజీలకు తీసుకురావడం మొదలుపెట్టారు. ఈ చర్యను కార్మికులు వ్యతిరేకించగా మేము కార్మికులకు వ్యతిరేకం కాదని ఈ పని మేము చేయకపోతే సస్పెండ్ చేస్తామని స్వయంగా ప్రభుత్వ యంత్రాంగం మమ్మలను భయపెడు తుందని ఎంవిఐలు కార్మికులతో చెప్పారు. పూర్తిగా పోలీసు యంత్రాంగాన్ని గ్యారేజీల వద్ద మోహరించి వాహనాలను అడ్డుకున్నా, విధ్వంసానికి పాల్పడినా 151 లాంటి సాధారణ సెక్షన్ కాకుండా బలమైన సెక్షన్స్‌ను ఆపాదించి జైళ్లలో పెడతామని కార్మికులను భయభ్రాంతులకు గురిచేశారు. రెండవ రోజు సుమారు 20 శాతం, మూడవ రోజు నుండి సుమారు 50 శాతం బస్సులను ఆంధ్రప్రదేశ్ లోనూ, కొంచెం తక్కువగా తెలంగాణ ప్రాంతంలోనూ నడపడం మొదలు పెట్టారు. తదనంతరం సమ్మె చేస్తున్న కార్మికులను చీల్చడానికి కాంట్రాక్టు

2015 మేడేను ఎప్పటికన్నా ఉద్వేగంగా ఉన్నతంగా పట్టుదలగా జరుపుకున్నారు.

2015 మే 1న తమ నాయకుడు, మచ్చా మురళీమోహన్ త్యాగాన్ని, అమరత్వాన్ని స్మరించుకుంటూ, అతని స్ఫూర్తిని గుండెలనిండా నింపుకుని ఫ్యాక్టరీ గేటు వద్ద మేడే రోజు ఎర్రజెండా ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆయన సతీమణి మేడే రోజు ఎర్రజెండా నెగరేశారు. తండ్రిని కోల్పోయిన మురళీమోహన్ నలుగురు పిల్లలు, రీజెన్సీ కార్మికులు, యానాంపుర ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, బుద్ధిజీవులు జెండా వందన కార్యక్రమానికి హాజరైవారు ఆయనను స్మరించుకుని ఘననివాళులు అర్పించారు. తదనంతరం యానాం పురవీథుల్లో విప్లవ గీతాలతో, డప్పు, డోలు కళాకారుల ప్రదర్శనతో ఎంతో ఉద్విగ్నంగా మేడే ర్యాలీ నిర్వ హించారు. దుర్మార్గంగా, చట్ట విరుద్ధంగా మూసివేసిన రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ తెరవాలని, తెరిచే వరకు తమ పోరాటం ఆగదనీ, యానాం పౌర సమాజంతో మమేకమై న్యాయ పోరాటం కొనసాగిస్తామని, కర పత్రాలను పంచుతూ యానాం ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. తమ న్యాయ పోరాటానికి వారి సంపూర్ణ మద్దతు మూట గట్టుకున్నారు. ఐతే, ఇప్పుడు రీజెన్సీ సిరామిక్స్ కార్మిక పోరాటానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి, తమిళనాడు, పుదుచ్చేరీ నుండి పెద్దఎత్తున మద్దతు సమీకరించి వారి విజయానికి దోహదపడవలసిన బాధ్యత తోటి కార్మిక మిత్రులకు, బుద్ధిజీవులకు ఎంతైనా ఉంది.

'మేక్ ఇన్ ఇండియా' అనే నినాదంతో భిక్షపుచిప్ప చేత పుచ్చుకుని దేశదేశాలు తిరుగుతూ, మనదేశ ప్రజల గౌరవాన్ని తాకట్టుపెట్టి, వనరులను గుప్పెడు కార్పొరేట్ సంస్థల పాదాక్రాంతం చేయడానికి ఏ మాత్రం వెనుకాడని మోడీకి దేశంలో ఏదో ఒక వంకతో యాజమాన్యాలు పరిశ్రమలను మూసివేసిన, మూసివేస్తున్న రీజెన్సీ సిరామిక్స్ వంటి అనేకానేక పరిశ్రమలు అసలు కనిపించవు. ఇవి 'మేక్ ఇన్ ఇండియా'లో భాగమని అతనికి అనిపించదు. వీటిని తెరిపించి వీధినబడ్డ కార్మికులకు ఉపాధి కల్పించాలని తట్టదు. బజారున పడి అడుక్కుని, దేశాన్ని మరింత అప్పుల ఊబిలోదించే విదేశీ పెట్టుబడులు మోడీకి ఎంత ముద్దో చెప్పలేం!

భారతదేశం ఇక్కడి ప్రజలు పెనువిషాదంలోనికి నెట్టివేస్తున్న దుర్మార్గపు పాలక విన్యాసాలు పెచ్చురిల్లిపోతున్న సందర్భంలో మనమంతా కూరుకుపోతున్నాం. ఇది గ్రహించి, వాటిని సంఘటిత ప్రజా ఉద్యమాల ద్వారా ఎదురొడ్డి ఓడించనట్లైతే ఈ దేశ శ్రామికవర్గం, సాధారణ ప్రజలు గాడాంధకారాన్ని కౌగిలించుకొవడమే, మరిన్ని కష్టాలను కొనితెచ్చుకోవడమే అవుతుంది.

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు) వీ

కార్మికులు విధుల్లో చేరితే తక్షణమే పర్మినెంట్ ఉత్తర్వులు ఇస్తామని భ్రమలు కల్పించారు. 14న అధికారికంగా రెండు రాష్ట్రాల ఆర్‌టిసిలను విభజిస్తామని చెపుతూనే 11న ఎవరి రాష్ట్ర ప్రభుత్వాలతో వారే విడివడిగా మాట్లాడుకోండి అంటూ సమ్మె చేస్తున్న ఆంధ్ర, తెలంగాణ కార్మికులను చీల్చే కుట్రకు విసి, ఎండి తెరతీశారు. సమ్మెలను విచ్ఛిన్నం చేసే కుట్రలో కీలకమైనది, బలమైనది న్యాయ స్థానాలను ఉపయోగిండం. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని రంగ ప్రవేశం చేయించి సమ్మె న్యాయ వ్యతిరేకమైనదిగా, ఎస్మాను ప్రయోగించమని, 13న ఉదయానికల్లా విధుల్లో చేరకపోతే షోకాజ్ నోటీసులు ఇవ్వమని, బస్సులను అడ్డుకుంటే క్రిమినల్ చర్యలు తీసుకోమని హైకోర్టుతో నిస్సిగ్గుగా ప్రకటింప చేయించారు.

ఒకపక్క ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె విచ్ఛిన్న కార్యక్రమాలను ముందుకు తెస్తుంటే, వాటిని కార్మిక సంఘాలు ఏమాత్రం అడ్డుకునే ప్రయత్నం చేయలేదనే చెప్పవచ్చు. సమ్మె విచ్ఛిన్న చర్యలను అడ్డుకోవడం లో కార్మిక సంఘాలు అత్యంత ఉదారంగా వ్యవహరించిన తీరు కార్మికులను విస్మయానికి గురిచేసింది. ఏటేటా ప్రభుత్వం ఆర్‌టిసిల నుండి వసూలు చేస్తున్న మోటర్ వాహనాల పన్ను సుమారు రు. 720 కోట్లు, ఇంధనం వాడకంపై విధిస్తున్న 23 శాతం పన్ను సుమారు రు. 484 కోట్లు, వ్యాట్ ట్యాక్స్ సుమారు రు. 500 కోట్లు, స్పేర్ పార్టుల కొనుగోలుపై విధిస్తున్న పన్ను సుమారు రు. 100 కోట్లు, వివిధ తరగతి ప్రయాణికులకు ఏటా ఇస్తున్న రాయితీలు సుమారు రు. 300 కోట్లు. ప్రభుత్వం ఆర్‌టిసిలకు చెల్లించకపోవడంతో పాటు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు, పెద్దల అండతోనూ నిర్వహిస్తున్న అక్రమ రవాణా రూపంలో ఆర్‌టిసిలకు సుమారు రు. 1000 కోట్లు నష్టం వస్తుంది. ఈ ప్రభుత్వ దోపిడీ విధానాలను ప్రజలకు విడమర్చి చెప్పడంలో వారి మద్దతును కూడగట్టడంలో కార్మిక సంఘాలు విఫలమైన తీరు అత్యంత బాధకరమైనది. ప్రభుత్వ దోపిడీ విధానాలను నిలుపుదల చేస్తే ప్రజలపై భారం మోపకుండా 43 శాతం వేతన సవరణ చేయవచ్చునని, విద్యార్థులకు, వికలాంగులకు ఉచితంగా ప్రయాణాన్ని అందించ వచ్చునని, ప్రయాణికుల టిక్కెట్టు చార్జీలను సగానికి పైగా తగ్గించ వచ్చునని, అంతే కాకుండా సమకూరిన నిధులతో బస్సులను కొనుగోలు చేసి అదనపు రూట్లలో బస్సులను నడపవచ్చునని తద్వారా నిరుద్యోగు లకు సంస్థలో ఉపాధి కలిగించవచ్చునని కార్మిక సంఘాలు ప్రజల్లో ప్రచారం చేసినట్లయితే సమ్మెకు వారి మద్దతును కూడగట్టి ఉండేవారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటు న్నామని ప్రభుత్వం, యాజమాన్యం ప్రకటించి బస్సులు నడపడానికి పెద్ద ఎత్తున తాత్కాలిక సిబ్బందిని నియమించింది. సుమారు 40 శాతం బస్సులను ఇరు ప్రాంతాలలోనూ (తెలంగాణలో కొంచెం తక్కువగా) బస్సులను నడపడం జరిగింది. ఆర్‌టిసి వద్ద ఉన్న బస్సులు అద్దె బస్సులతో కలిపి 24 వేలు మాత్రమే. ఈ సంఖ్యకు రెట్టింపు బస్సులు ఉన్నా ప్రజల అవసరాలకు సరిపోవు. అటువంటి స్థితిలో అరకొరగా తిరిగే బస్సులు ప్రజల అవసరాలకు ఏ రకంగానూ ప్రత్యామ్నాయం కాజాలవని కార్మిక సంఘాలు ఖండించవలసి ఉంది. ప్రయాణికుల నుండి తాత్కాలిక సిబ్బంది అదనంగా టిక్కెట్టు చార్జీని వసూలు చేస్తుంటే ఎటువంటి ఖండన వెలువరించలేదు. ప్రజల నుండి వసూలు చేసిన పైకాన్ని తాత్కాలిక సిబ్బంది, ఎస్కార్టుగా వచ్చిన పోలీసులు, ఆర్‌టిసి అధికారులు అన్యాక్రాంతం చేస్తుంటే కార్మిక సంఘాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాయి. రెండు రాష్ట్రాలలోనూ ఎనిమిది రోజుల ఆర్‌టిసి సమ్మె వలన సంస్థకు వచ్చిన నష్టం సుమారు 200 కోట్లు పైబడి ఉంటుంది. ఈ విధానం ఆర్‌టిసిని బలహీనం చేసి ప్రజలకు దూరం చేసే ప్రపంచ బ్యాంకు కుట్ర అని ప్రకటించవలసి ఉన్నది. శిక్షణలేని, అనుభవంలేని తాత్కాలిక డ్రైవర్లు బస్సులు నడపడం వలన జరిగిన వందలాది ప్రమాదాలను వెలికితీసి పేపర్లలో పతాక శీర్షిక వార్తలుగా తీసుకురావడంలో కార్మిక సంఘాలు విఫలమైనవి.

టిక్కెట్టు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేయడం, సంస్థ నిర్ణయించిన రేట్లకంటే అదనంగా టిక్కెట్టు రేటును వసూలు చేయడం వలన ప్రయాణికులలో ఏర్పడిన వాగ్వివాదాలను కూడా పేపర్లలో నమోదు చేయించడంలో కార్మిక సంఘాలు విఫలమైనవి. సమ్మె డిమాండ్లను రూపొందించడంలో కూడా కార్మిక సంఘాలు (ఇయు, టిఎంయు) సరైన ఐక్యతా వ్యూహాన్ని రచించలేదు. 20 శాతం పైబడి ఉన్న హైయిర్ బస్సు డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం 15,000 ఎక్కడా అమలు కావడం లేదు. హైయిర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనం అమలు జరిగేలా ఆర్‌టిసి యాజమాన్యం బాధ్యత వహించాలి అనే డిమాండ్ పెట్టినట్లయితే ఆ డ్రైవర్లు సమ్మెకు సంపూర్ణ మద్దతును ప్రకటించేవారు. గ్యారేజీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది, రిజర్వేషన్ కౌంటర్లలో, ఎంక్వైరీలలో, ట్రాఫిక్ గైడ్సుగా పనిచేస్తున్న సిబ్బంది డిమాండ్లను సమ్మె డిమాండ్లలో పెట్టినట్లయితే వారు కూడా సమ్మెను జయప్రదం చేయడానికి ప్రయత్నించేవారు. ప్రధాన ప్రతిపక్ష యూనియన్ ఎన్‌ఎంయుతో సమ్మెకు ముందుగానే జెఎసిగా నిర్మాణం చేసుకుని కార్మిక సంఘాల బలాన్ని ప్రభుత్వానికి తప్పని సరిగా తెలియజేసి ఉండవలసి ఉంది.

సమ్మెకు ముందు, సమ్మె జరుగుతుండగా ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె విచ్ఛిన్న చర్యలను అడ్డుకుని సమ్మెను గెలిపించుకునే వ్యూహాత్మక చర్యలను అమలు చేయడంలో కార్మిక సంఘాలు విఫలమవడంతో ప్రభుత్వ, యాజమాన్య సమ్మె విచ్ఛిన్న చర్యలు ఫలితాత్మక దశకు చేరుకున్నాయి. కార్మికుల ముఖ్యమైన డిమాండ్ 43 శాతం ఫిట్‌మెంట్‌పై ఆశలు వదులుకుని 36 శాతం లేదా 38 శాతం ఫిట్‌మెంట్‌కు సంతృప్తి పడక తప్పదని, ఏరియర్స్ సాధించడం కూడా అసాధ్యమని కార్మికులు ముఖ్యంగా నవ్యాంధ్ర కార్మికులు గుసగుసలు మొదలు పెట్టారు. కళ్ల ముందే బస్సులు తిరుగుతుంటే కార్మికులలో చోటుచేసుకున్న నిరాశా నిస్పృహల తీరు రాష్ట్ర ఇంటిలిజెన్స్ వారి కంటికి చిక్కనిది కాదు. కార్మికుల డిమాండ్ 43 శాతం ఫిట్‌మెంట్‌ను సాధ్యమైన మేరకు తగ్గించగలిగే అవకాశం ప్రభుత్వాల ముంగిట నలిచిన దశలో అనూహ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి సుమారు 40 శాతం ఫిట్‌మెంట్‌కు అనుకూల సంకేతాలను సబ్ కమిటీ వారితో 2015 మే 12న చెప్పించగా, 2015 మే 13న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్క ఉదుటున 43 శాతం ఫిట్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా ఆర్‌టిసి కార్మికులను ఆశ్చర్యానికి గురి చేసింది. సమ్మె విచ్ఛిన్న చర్యలను తీవ్రంగా అమలు చేయడం గాని, సమ్మెకాలం ఎనిమిది రోజులలో ఆర్‌టిసికి సుమారు 200 కోట్లు నష్టం తెప్పించడం గాని చూస్తే ఆర్‌టిసిలను బలహీనం చేసి నష్టాల్లోకి నెట్టి ప్రజా రవాణాను ప్రైవేట్ వారికి దక్కెలా చేసే ప్రపంచ బ్యాంక్ వ్యూహం కనపడుతుంది. కాని 43 శాతం ఆంధ్ర, 44 శాతం తెలంగాణ ఫిట్‌మెంట్‌ను పోటాపోటీగా ప్రకటించడం వెనుక ఉన్న వ్యూహం ఏమిటని కార్మికులు, ప్రజలు ఆరాతీస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కార్మికులు కోరినంత 43 శాతం ఫిట్‌మెంట్‌ను ఇచ్చినట్లయితే మలిదశ (2019లో) 5 సంవత్సరాలు కార్మికులు, ఉద్యోగులు అధికారాన్ని కట్టబెడతారని ఊహించి ఉండవచ్చు. చంద్రబాబునాయుడు ఇచ్చారు కనుక మాకు కూడా చంద్రశేఖర్‌రావు ఇవ్వక తప్పక తప్పలేదని తెలంగాణ కార్మికులు అనుకుంటే తన పార్టీ

ఆర్‌టిసి సమ్మె - నిజానిజాలు

***కార్మికుల హక్కులలో భాగంగా వారి మనుగడ కోసం చేసే సమ్మె హక్కును ప్రభుత్వాలు నష్టంగా పరిగణించి వారిపై నిర్బంధాలను ప్రయోగిస్తూ సంస్థ సేవలను ప్రజలకు దూరం చేస్తోందంటున్నారు* షేక్ కరిముల్లా**

ఆర్‌టిసి సమ్మె మొదలైంది. ప్రజానీకం కష్టాలు పడుతున్నారు. చిత్తూరులో పోలీసులు లాఠీ చార్జ్, నాన్ బెయిలెబుల్ కేసుల నమోదు, అపస్మారక స్థితిలో మహిళా కండక్టర్, ఒక యూనియన్ నాయకునికి గుండెపోటు లాంటి వార్తలతో పత్రికలు హోరెత్తిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఘర్షణాపూరిత వాతావరణం రెండు తెలుగు రాష్ట్రాల బస్ డిపోల వద్ద నెలకొన్నది. పరిస్థితిని స్వయంగా చూసి అక్కడి కార్మికులతో కలసిపోయి, మాట్లాడి ఈ సమస్య మీద రాద్దామని బస్ స్టేషన్‌కు చేరుకున్నాను. నిజంగా అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొని ఉంది. తాత్కాలికంగా నియమితుడైన ఒక డ్రైవర్ బస్సును గ్యారేజీ నుంచి బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ బస్సును అడ్డుకుంటున్న కార్మికులను పోలీసులు పక్కకు నెట్టివేస్తున్నారు. దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, ఎట్టకేలకు బస్ పోలీసుల రక్షణతో బయలుదేరింది. కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది ప్రస్తుత సమ్మెకాలంలో బస్ స్టేషన్‌లో పరిస్థితి. ఇంత రాద్ధాంతం అవసరమా? పలకరించగానే కార్మికులు వారి బాధలు, కష్టాలు, మెరుగైన జీవనం కోసం, సంస్థ పరిరక్షణకు వారి కృషిని, శ్రమను ఏకరువు పెట్టారు. ఇప్పుడు విషయాన్ని ఆమూలాగ్రంగా చర్చిద్దాం.

ఆర్‌టిసి ప్రస్థానం నిజాం స్టేట్ రైల్వేలో భాగంగా 1932లో ఏర్పడింది. కేవలం 27 బస్సులు, రు. 3.99 లక్షల పెట్టుబడితో మొదట ఆర్‌టిసి ఏర్పడింది. అప్పుడు కేవలం 166 మంది ఉద్యోగులు సంస్థలో ఉండే వారు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానంతరం రాష్ట్ర ప్రభుత్వశాఖగా 1958 వరకు కొనసాగి అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రు. 211 కోట్ల పెట్టుబడి పెట్టాయి. 1958 జనవరి 11న ఎపిఎస్‌ఆర్‌టిసి ఏర్పడింది. 609 బస్సులు, 16 డిపోలు, 5081 మంది సిబ్బందితో ప్రారంభమైంది. ప్రస్తుతం ఆర్‌టిసికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్తుల విలువ రు. 50 వేల కోట్ల పైనే! ప్రతి ఏడాది రు. 1565 కోట్ల పన్నులను ప్రభుత్వానికి ఆర్‌టిసి చెల్లిస్తుంది. 22,333 బస్సులను నడుపుతోంది. 778 బస్ స్టేషన్లు, 216 డిపోలు, 1881 బస్ షెల్టర్లను రాష్ట్ర వ్యాప్తంగా కలిగి ఉంది. ప్రస్తుతం 1,20,504 మంది సిబ్బందితో రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థగా ఉన్నది. ఆర్‌టిసి బస్సులు రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, చత్తీస్‌గడ్ రాష్ట్రాలలో కూడా నడుస్తూ రోజుకు 1.56 కోట్ల మంది ప్రయాణీకులను గమ్యం చేరుస్తున్నాయి. ఇంత ఘన చరిత్ర కలిగిన, సామాజిక భాధ్యతతో చౌకగా రవాణా సౌకర్యాన్ని ప్రజలకు కల్పిస్తున్న ఈ సంస్థ నేడు నష్టాలతో కునారిల్లుతుంది. ఈ పరిస్థితి దాపురించడానికి గల కారణాలను విశ్లేషిద్దాం.

ప్రస్తుత ఈ సమ్మెకు ప్రధాన కారణం వేతన సవరణ (ఫిట్‌మెంట్) ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చుకుంటే ఆర్‌టిసి కార్మికులకు వేతనాలలో ఎంతో తేడా ఉంది. ప్రభుత్వ రంగంలో పనిచేసే డ్రైవర్ కంటే ఎంతో కష్టపడి పనిచేసే ఆర్‌టిసి సిబ్బందికి జీతాలు చాలా తక్కువ. ఉదా :- నేను కార్మికులతో మాట్లాడుతున్నప్పుడు ఒక కండక్టర్ దూసుకొని వచ్చి 'చూడండి సార్ 1996లో జయిన్ అయిన నాకు ఎటువంటి పనిష్‌మెంట్ లేకుండా ఉంటేనే నా బేసిక్ పే రు. 10,430 అని పే స్లిప్ చూపించాడు. ఇంత తక్కువ జీతంతో పెరిగిన ధరలతో నాకుటుంబం ఎలా బతకాలి? చెప్పండి. మీరు బాగా రాసి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లండి' అని వాపోయాడు. నిజంగా ఈ వేతన వ్యత్యాసం గతం నుంచి జరుగుతున్నదే. ఆర్‌టిసి కార్మికులు ప్రతిసారి నష్టపోతూనే ఉన్నారు. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో ఇద్దరు చంద్రులు ఆర్‌టిసిని ప్రభుత్వంలో కలిపి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇస్తామని వాగ్దానాలు చేశారు. దీని ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. మాకు కూడా అదే ఫిట్‌మెంట్ అమలు చేసి మాజీవితాలలో వెలుగును నింపమని అడగడం తప్పు ఎలా అవుతుందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాల మేరకు 2013 ఏప్రిల్ 1 నుంచి ఫిట్‌మెంట్ అమలు కావలసి ఉంది. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినా కూడా ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్‌టిసి కార్మికులకు మధ్య వేతన వ్యత్యాసం 149 శాతంగా ఉంటుంది. యాజమాన్యం 27 శాతం ఇవ్వడానికి అంగీకరించినది. ఈ 27 శాతం కొత్తగా ఇస్తున్నదేమీ కాదు. 2014 ఫిబ్రవరి 1 నుంచి 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) రూపంలో కార్మికులకు ఇస్తున్నారు. ఇదే

తెలంగాణలో కూడా బలపడుతుందని బాబు ఎత్తు కావచ్చునని కార్మికులు చెవులు కొరుక్కుంటున్నారు. అందుకే తెలుగుదేశం గెలుపు గుర్రం కాకూడదని, తెలంగాణలో తెలుగుదేశం పార్టీని గల్లంతు చేయాలని కెసిఆర్ ఒక ఆకు ఎక్కువే చదివి 44 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ఉన్నాడని కార్మికులు అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఆర్‌టిసి కార్మికుల సమ్మె విజయం పొందడానికి ప్రధానమైన కారణం కార్మికులు అందరూ ఐక్యంగా ఒకతాటిమీద నిలబడి పోరాటం చేయడమే. ప్రభుత్వం, యాజమాన్యం ఇరువురూ కార్మికులను చీల్చడానికి ఎన్ని రకాల ఎత్తుగడలను ప్రయోగించినా సఫలం కాలేదని (కార్మికులను విడగొట్టడం) ప్రజలు, ప్రజాస్వామిక వాదులు విశ్లేషిస్తున్నారు. అయినప్పటికీ ఆర్‌టిసిల నుండి ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులను తక్షణం నిలుపుదల చేయకపోతే సంస్థ మనుగడ సాధ్యం కాదు. ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఆర్‌టిసి పరిరక్షణా డిమాండ్లతో ఆర్‌టిసి కార్మిక వర్గం తక్షణం ప్రజా, కార్మికోద్యమానికి నడుం బిగించాలని, అప్పుడే కార్మికులకు నిజమైన విజయం వరించినట్లు అవుతుంది.

(రచయిత కార్మిక నాయకులు)

మొత్తాన్ని ఫిట్‌మెంట్‌గా చెల్లిస్తామంటే ఎలా? కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనం శూన్యం ఈ అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ గౌరవ ప్రదమైన జీవితం కోసం తప్పనిసరి పరిస్థితులలో సమ్మె చేయాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ముందుగానే ప్రభుత్వానికి నోటీసు ఇచ్చి, 34 రోజుల తర్వాత చివరి ఆయుధంగా సమ్మెకు వెళ్లాం. సమ్మె నిర్ణయం ఇప్పటికిప్పుడు తీసుకుంది కాదని కార్మికులు అంటున్నారు. పెళ్లిళ్ల సీజన్, పరీక్షల షెడ్యూల్, యాత్రలు ఇవన్నీ ప్రభుత్వానికి తెలిసిన సమస్యను సామరస్యంగా పరిష్కరించే చొరవ ప్రభుత్వం నుండి లేదని, హామీల వర్షం కురిపించిన ముఖ్యమంత్రి అణచివేత చర్యలకు, నిర్బంధానికి దిగుతూ పైపెచ్చు 'కార్మికులు బ్లాక్ మెయిలు చేస్తున్నారు' అని మాట్లాడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది 'ఏరు దాటాకా తెప్ప తగలేయడమే' అవుతుంది. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాధినేతే ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా కార్మికులు వ్యాఖ్యానించారు. మే 8న ఎండితో జరిపిన చర్చలు రసాభసాగా ముగిసి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది. పైపెచ్చు ఎస్మా ప్రయోగిస్తామని, కార్మికులపై చర్యలు ఉంటాయని, కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు దిగడం దారుణం.

ఇంతకి వేతన సవరణ విషయంలో ప్రభుత్వం చూపుతున్న సాకు ఆర్‌టిసి నష్టాలలో ఉందని, ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నాయని అంటుంది. ఈ మాట ఇప్పుడే ప్రభుత్వానికి గుర్తుకొచ్చిందా? ఎంఎల్‌ఏలు, మంత్రులు అలవెన్సులు, ఇంటి అద్దెలు ఇబ్బడి ముబ్బడిగా పెంచుకున్నప్పుడు గుర్తులేదా? ప్రమాణ స్వీకారం (సిఎం) వాస్తు, జన్మభూమి, ఉగాది ఉత్సవాలు, విశాఖలో క్యాబినెట్, విజయవాడలో కలెక్టర్ల సమావేశం, విదేశీ పర్యటనలకు ప్రత్యేక విమానాలు తదితర ఖర్చులు చేయడానికి గుర్తుకు రాలేదా? కార్మికుల సమస్యలు పరిష్కార సమయానికి ఆర్థిక ఇబ్బందులు ముందుకొచ్చాయా? అసలు ఆర్‌టిసి నష్టాలకు ప్రభుత్వాల విధానాలే కారణం. ప్రభుత్వాల నుంచి ఆర్‌టిసికి సహకారం ఎప్పుడూ లేదు. లాభనష్టాలతో సంబంధం లేకుండా చూడాల్సిన ఆర్‌టిసిని ఆదాయ వనరుగా చూడడం వలన సంస్థ నష్టాల బాట పట్టింది. ఏటా 50 కోట్ల లీటర్ల డీజిల్‌ను సంస్థ వినియోగిస్తుంది. ఈ డీజిల్‌పై ప్రభుత్వం ఆర్‌టిసి నుండి 30 శాతం వ్యాట్ పన్ను వసూలు చేస్తుంది. ధనిక వర్గాలు తిరిగే విమానాలకు మాత్రం ప్రభుత్వం వ్యాట్ 16 శాతం నుంచి 1 శాతానికి తగ్గించి మరీ 1 శాతం వసూలు చేస్తున్నది. రైల్వేలు వినియోగించే డీజిల్ పై 4 శాతం వ్యాట్‌ను కేంద్రం వసూలు చేస్తుంది. రోడ్ ట్యాక్స్ ఢిల్లీ లాంటి మెట్రో నగరాలలో 1 శాతం ఉంది. మన రాష్ట్రంలో ఆర్‌టిసిలో టికెట్ ఒక్కంటికి 7.5 శాతం రోడ్ ట్యాక్స్ కడుతుంది. ఒక బస్సులో ఎంత మంది ప్రయాణికులు ఉంటే వారందరికి రోడ్ ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది. అదే ప్రైవేట్ బస్సులకు ఆ విధానం లేదు. టికెట్‌కు బదులుగా సీటుకు మాత్రమే వాళ్లు టాక్స్ కడుతున్నారు. ఇది ద్వంద్వ విధానం కాదా?

2013-14 ఆర్థిక సంవత్సరంలో వ్యాట్ రూపంలో రు. 495 కోట్లు, పన్నులు రు. 622 కోట్లు, అప్పులపై వడ్డీల కింద రు. 448 కోట్లు ప్రభుత్వానికి ఆర్‌టిసి చెల్లించింది. ఇవి లేకుండా ఉంటే ఆ ఏడాది సంస్థకు దాదాపు 1000 కోట్ల ఆదాయం మిగిలేది. దేశంలో 1991 నుంచి మొదలైన ప్రపంచీకరణ ప్రభావం సంస్థపై 1995లో పడింది. ఆ సంవత్సరం ప్రత్యేకించి ఆర్‌టిసికి మాత్రమే వర్తించేలా మోటారు వాహనాల పన్నుల చట్టాన్ని అప్పటి ఇదే తెలుగుదేశం ప్రభుత్వం సవరించినది. ఫలితంగా అప్పటిదాకా మిగులులో ఉన్న సంస్థ నష్టాల బాట పట్టింది. సంస్థ నడ్డి విరిగింది. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ప్రభుత్వం జర్నలిస్టులు, వికలాంగులు, వృద్ధులు, విద్యార్థులు లాంటి వివిధ తరగతుల వారికి ఇచ్చిన ప్రయాణ రాయితీలు ప్రభుత్వం చెల్లించకుండా ఆ భారం సంస్థ నెత్తిన రుద్ది ఆర్థికంగా క్రుంగతీసింది. కేవలం తొమ్మిదేళ్ల కాలంలో రు. 16,446 కోట్ల ఆర్‌టిసి ఆదాయానికి ప్రభుత్వాలు గండికొట్టాయి. ప్రభుత్వ సామాజిక బాధ్యతగా గ్రామాలకు 'పల్లెవెలుగు' బస్సులు నడిపిన కారణంగా రు. 4,900 కోట్లు ఆర్‌టిసి నష్టపోయింది. ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణా వల్ల రు. 4,355 కోట్లు నష్టపోయింది. ఇదంతా చూస్తే కర్ణుని చావుకి ఎన్ని కారణాలో సంస్థ నష్టాలకు అన్ని కారణాలున్నాయి. ఇవన్నీ సవరించి సంస్థను లాభాల బాట పట్టించకుండా నష్టాలను బూచిగా చూపిస్తూ సంస్థను ప్రైవేట్‌పరం చేయడానికి పావులు కదుపుతుంది. ఇంత జరుగుతున్న ప్రభుత్వ ఖజానాకు 2013-14 ఆర్థిక సంవత్సరంలో రు.1585,77 కోట్లు చేరాయి. ఇక ప్రభుత్వం ఇస్తున్న వివిధ రాయితీలకు గాను ఆర్‌టిసికి చెల్లించాల్సిన డబ్బును ప్రభుత్వం చెల్లించితే సంస్థకు చేరే మొత్తం రు. 2 వేల కోట్లు దాటడం ఖాయం. తాజాగా కార్మికులు కోరుతున్న 43 శాతం ఫిట్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో ఇస్తే రు. 1800 కోట్లు అదనంగా ఖర్చవుతుందని అంచనా! ఆర్‌టిసి నుంచి వస్తున్న రు. 2 వేల కోట్లతో పోలిస్తే ఈ మొత్తం తక్కువే! ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి. తగు చర్యలు చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలి. ఇక కార్మికుల త్యాగం అపూర్వం.

2001లో 24 రోజులు సమ్మె చేసి పన్నులు కొంతమేరకు తగ్గింపు, రాయితీలతో 50 శాతం చెల్లింపులు సాధించారు. మళ్లీ 2005లో సమ్మెచేసి పన్నులు, మరికొంత రాయితీల చెల్లింపులు సాధించుకున్నారు. కనుకనే ఆర్‌టిసి ఇంకా బతికి ఉంది. లేకుంటే సంస్థ పుట్టి ఈ పాటికి మునిగి పోయేది. కొవ్వొత్తి తాను కరిగిపోతూ లోకానికి వెలుగునిస్తుంది. అలాగే ఆర్‌టిసి కార్మికులు కూడా తాము కరిగిపోతూ సంస్థ ద్వారా ప్రజలకు సేవలందించారు. సంస్థను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. రోజుకు 8-10 గంటల డ్యూటీ చేస్తూ, మోటారు వాహన చట్టం ప్రకారం కండక్టర్ లేకుండా ప్రయాణికుల వాహనం నడపడం నేరం. అలాంటిది డ్రైవర్ టిమ్ ద్వారా కండక్టర్ విధులు కూడా నిర్వహించాలని యాజమాన్యం గట్టిగా కోరింది. ఇది చట్టరీత్యా చెల్లదని హైకోర్టు చివాట్లు పెట్టింది. అయినా ప్రజల క్షేమం కోరని ప్రభుత్వం చట్టాన్నే మార్చాలని నిర్ణయించినది. పొదుపు పేరా సరిపడ మంచి విడి భాగాల సరఫరా లేదు. ఐనా మెకానిక్ సిబ్బంది బస్సుల ఫెయిల్యూర్స్, ప్రమాదాలు తగ్గించేందుకు శ్రమపడుతున్నారు. కాబట్టి కార్మికులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి. లేకుంటే వీరు మెరుగైన జీవనం గడపలేరు. ఆర్‌టిసి వినియోగించే డీజిల్ పై వ్యాట్ పన్ను వినహాయించాలి. సంస్థ కొనుగోలు చేస్తున్న విడిపరికరాలపై 14.5 శాతం వ్యాట్‌ను తగ్గించాలి. అక్రమ రవాణాను అరికట్టాలి. ఆర్‌టిసి ద్వారా సరుకుల రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. టైర్ల తయారీ కేంద్రాన్ని ఆర్‌టిసి స్వయంగా ఏర్పాటు చేసుకోవాలి. గ్రామీణులకు సేవలు అందించే 'తెలుగు-వెలుగు' బస్సులకు మోటారు వాహన పన్ను మినహాయించాలి.

పై చర్యల ద్వారా ఆర్‌టిసిని రక్షించి లాభాల బాట పట్టించాలి. దేశంలోనే అత్యధిక బస్సు సర్వీసులు నడుపుతూ 1999లో గిన్నిస్ బుక్ రికార్డులలోకి ఎక్కిన సంస్థను, ఇంధన పొదుపులోనూ, రోడ్డు భద్రతలోనూ అనేకసార్లు అవార్డులు అందుకున్న ఈ సంస్థ ప్రజలది. కాబట్టి దీని రక్షణకు ప్రజలు పూనుకోవాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంస్థను రక్షించుకోవాలి.

(రచయిత ఉపాధ్యాయుడు) వీ

ఏడాది పాలనలో వ్యవసాయానికి సాయమేది?

***కొత్త రాష్ట్రం ఏర్పడినా రైతాంగం జీవన స్థితిగతుల్లో ఎటువంటి మార్పులు రాలేదనీ, ఏడాది పాలనలో తీసుకున్న విధానాలు రాబోయే కాలంలో పాలన ఎట్లా ఉండబోతుందో రుచి చూపించాయనీ అంటున్నారు* ఆశాలత**

కొత్త రాష్ట్రంలో మొదటి ప్రభుత్వం మొదటి ఏడాదిలో తీసుకున్న కార్యక్రమాలు, విధానాలు రాబోయే నాలుగేళ్ల పాలన ఎట్లా ఉండబోతున్నదో రుచి చూపించాయి. అంతటా భ్రమలు తొలిగి పోతున్నాయి. పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నీరుగారి పోతున్నాయి. పైపైనే మెరుగులు మాత్రమేనా అట్టడుగున ఉన్న వారి సమస్యలు పట్టించుకోదలచుకోలేదా అనే ఆక్రోశం వినిపిస్తోంది. పెట్టుబడిదారులకు ఎర్రతివాచి పరిచే పారిశ్రామిక విధానం, కోట్ల రూపాయల కమిషన్ పందేరాలు, 1000కి పైగా రైతు ఆత్మహత్యలు, పోలీసు ఎన్‌కౌంటర్లు, రాచకొండలను మింగే ఫిలింసిటీలు, హరితహారం పేరుతో ఆదివాసుల పోడు భూములలో పంటలకు బదలు మొక్కలు నాటడం ఇవీ మచ్చుకి ఏడాది పాలనలో ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు.

తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు అనేక వాగ్దానాలు చేసింది. వాటిలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ, రోజుకు ఎనిమిది గంటల ఉచిత విద్యుత్ సరఫరా, భూమిలేని దళిత, ఆదివాసి కుటుంబాలకు మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వడం వంటి వాగ్దానాలు ఆచరణ సాధ్యం కాకపోయినప్పటికీ దుర్భర పరిస్థితులలో ఉన్న రైతులను ఇవి అమితంగా ఆకర్షించాయి. టిఆర్ఎస్ ఎన్నికలలో గెలవడానికి కారణం బలమైన తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు జనాభాలో 60 శాతంగా ఉన్న రైతులు ఓటు వేయడానికి ఇది కూడా ఒక కారణమైంది. పైన పేర్కొన్నవి కాక వ్యవసాయానికి సంబంధించి టిఆర్ఎస్ మేనిఫెస్టో ఇంకా అనేక వాగ్దానాలను చేసింది. ప్రతి రైతు పొలంలో మట్టి పరీక్షలు జరిపి వాటి ఫలితాలకు అనుగుణంగా ఎటువంటి పంటలు వేయాలో సలహాలు ఇస్తామని, తెలంగాణను విత్తన కేంద్రంగా అభివృద్ధి చేసి రకరకాల పంటల సాగు విత్తనోత్పత్తికి దోహదం చేస్తామని, సాగు ఖర్చును తగ్గించి ఆహార భద్రతను కల్పించే సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించి కనుమరుగై పోతున్న త్రుణధాన్యాలు, పప్పు ధాన్యాల సాగుకు సహాయం అందిస్తామని, ప్రస్తుతం ఉన్న కరువు నియమావళిని సవరించి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే రైతులకు సరైన నష్టపరిహారం అందిస్తామని, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఖ్య పెంచుతామని, రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వారు సంక్షోభం నుండి బయటపడే విధంగా ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఇట్లా కొన్ని నిర్మాణాత్మకమైన వాగ్దానాలను చేసింది.

అయితే గత ఏడాది ఆచరణలో ఎటువంటి కార్యక్రమాలు తీసుకున్నదో పరిశీలిస్తే వ్యవసాయరంగానికి జవసత్వాలను ఇచ్చే చర్యలేవి చేపట్టకపోగా ఇందులో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని నిర్లక్ష్యం చేసి మరుగు పరచడానికే ప్రయత్నించిందని అర్థమవుతుంది. రైతుల వ్యవసాయ రుణమాఫీ విషయానికి వస్తే అనేక కసరత్తులు చేసి చివరికి ఏడాది 25 శాతం రుణంమాఫీ చేయడానికి నిర్ణయించింది. 2014లో సెప్టెంబర్ నాటికీ గాని ఈ ప్రక్రియ మొదలుకాలేదు, అప్పటికే పుణ్యకాలం కాస్తా గడచిపోయింది. బ్యాంకుల నుండి రుణాలు రాక రైతులు ఖరీఫ్‌లో అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులను ఆశ్రయించాల్సి వచ్చింది. దీనికి తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు తోడై తెలంగాణలో వరి, మొక్క జొన్న, పత్తి వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కరువు నియమావళిని సవరిస్తామని వాగ్దానం చేసిన టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినప్పటికీ ఇంతవరకు కరువు మండలాలను ప్రకటించలేదు, కేంద్ర ప్రభుత్వానికి కనీసం కరువు పరిస్థితిపై నివేదిక అందించలేదు. కరువు నియమావళిని సవరించే విషయం అటుంచి రైతులకు సాధారణంగా అందే బీమా, నష్టపరిహారం కూడా అందే అవకాశం లేకుండా పోయింది. నవంబర్ నుండి ఏప్రిల్ నెలల మధ్య వచ్చిన అకాల కుండపోత వర్షాలు, వడగండ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతులకు కూడా ఎటువంటి నష్టపరిహారం ప్రకటించలేదు.

తెలంగాణ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన కార్యక్రమాలన్నీ కూడా ఆ తర్వాత ముందుకు సాగకుండా మొండికేస్తున్నాయి. ఉదాహరణకి ఎస్‌సి, ఎస్‌టిలకు మూడు ఎకరాల భూమి ఇవ్వడం దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇస్తామని ప్రకటించి అది కొంతవరకు అమలైంది. రాష్ట్రంలో తొమ్మిది లక్షల దళిత కుటుంబాలు ఉన్నాయి. వారిలో మూడు లక్షల కుటుంబాలకు ఎటువంటి భూమి లేదు. 2014 ఆగస్టులో ప్రారంభించిన భూమి కొనుగోలు పథకంలో ఏప్రిల్ 10 వరకు ఎస్‌సి కార్పొరేషన్ లెక్కల ప్రకారం 841 కుటుంబాలకు 2217 ఎకరాల భూమి పంపిణీ చేశారు. అందులో 1955 ఎకరాలు కొనుగోలు చేసినది, మిగిలినది ప్రభుత్వ భూమి. ఈ మాత్రం భూమిని కొనుగోలు చేయడానికి కూడా అధికారులు పడరాని పాట్లు పడవలసి వచ్చిందని క్షేత్రస్థాయి అధ్యయనంలో తెలుస్తున్నది. ఈ లెక్కన ఏడాదికి వెయ్యి దళిత కుటుంబాలకు భూమి ఇచ్చినప్పటికీ ఐదు ఏళ్లలో కేవలం ఐదు వేల దళిత కుటుంబాలకు మాత్రమే భూమి అందుతుంది, మిగిలిన లక్షలాది భూమిలేని దళిత కుటుంబాలకు భూమి ఎప్పుడు ఎట్లా ఇస్తారనేది జవాబు లేని ప్రశ్న. భూమి కొనుగోలు చేసి ఇవ్వడంకాక భూ సంస్కరణలను కచ్చితంగా అమలు చేసి భూగరిష్ట పరిమితికి మించి ఉన్న మిగులు భూములను గుర్తించి భూమి లేని వారికి పంచి ఇవ్వాలనే డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం పరిశీలించడానికి కూడా సిద్ధంగా లేదు. దళితులకు భూమి పంచి ఇచ్చే సంగతి ఇట్లా ఉంటే ఎస్‌టిలకు మూడు ఎకరాల భూమి గురించి ప్రభుత్వం ఇంత వరకు ప్రస్తావన కూడా తీసుకురాలేదు.

తెలంగాణలో దాదాపు 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారనేది ఒక అంచనా. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు తదితర సేవలు

అందించేందుకు కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు 2011 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధీకృత రైతులదారుల చట్టం (లైసెన్స్‌డ్ కల్టివేటర్ యాక్ట్) తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణ అర్హతకార్డులను అందజేయాలి. ఈ పని గత మూడు సంవత్సరాలుగా నత్తనడక నడుస్తున్నది. కేవలం 50 వేల మంది కౌలు రైతులకు మాత్రమే కార్డులు ఇవ్వగా వారిలో 11 వేలమందికి మాత్రమే బ్యాంకు రుణాలు అందాయి. కౌలు రైతులకు ఈ రుణ అర్హత కార్డులను ఇచ్చే ప్రక్రియ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15 నుండి మే 15 వరకు పూర్తి చేయవలసి ఉంటుంది. అయితే టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ ఇంతవరకు అసలు మొదలు కానే లేదు. అంటే వచ్చే ఖరీఫ్‌లో కౌలు రైతులకు రుణాలు అందే అవకాశమే లేకుండా పోయింది. ఆత్మహత్య చేసుకున్న రైతులలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని వాస్తవాలు తెలియచేస్తుంటే కౌలు రైతులకు రుణాలు తదితర సేవలను అందించడంలో ప్రభుత్వం కనబరుస్తున్న తీవ్ర నిర్లక్ష్యం క్షమించరానిది. రైతు స్వరాజ్య వేదిక సభ్యులు అధికృత కౌలు దారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర స్థాయిలో భూ పరిపాలన కమిషనర్ (ఛీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కు విజ్ఞాపన పత్రం ఇచ్చినప్పుడు అసలు అటువంటి చట్టం ఒకటి ఉందని మాకు తెలియదని కమిషనర్ అన్నారంటే పరిపాలన ఏవిధంగా సాగుతున్నదో అర్థమవుతుంది.

వాస్తవ సాగుదారులైన కౌలు రైతులు, మహిళా రైతులు ఆదివాసి రైతులు, దళిత వ్యవసాయ కూలీలను ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదు. తెలంగాణను విత్తనోత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయడం, సాంప్రదాయక ఆహార పంటలను ప్రోత్సహించడం, ప్రతి రైతు పొలంలో మట్టి పరీక్షలు నిర్వహించడం, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఖ్యను పెంచడం వంటి నిర్మాణాత్మకమైన వాగ్దానాల అమలుకు ఇంతవరకు శ్రీకారం చుట్టనేలేదు.

ఆదివాసి ప్రాంతాలలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, అక్కడి పంటల సరళి, దానికి సంబంధించిన జ్ఞానం వీటన్నిటినీ పరిరక్షించవలసింది పోయి వారిని భూముల నుండి వెళ్లగొట్టడం, వారి భూములలో ఆహార పంటలకు బదులు మొక్కలు నాటడం వంటి విధ్వంసక చర్యలు అమలు జరుగుతున్నాయి. తెలంగాణకు హరిత హారం పేరిట రాష్ట్ర ప్రభుత్వం రాబోయే మూడు సంవత్సరాలలో 230 కోట్ల మొక్కలను నాటాలనే కార్యక్రమాన్ని తీసుకుంది. అందులో 100 మొక్కలను అటవీ ప్రాంతంలో అడవుల పునరుద్ధరణ ద్వారా పెంచాలనీ, 120 కోట్ల మొక్కలను అటవేతర ప్రాంతాలలో నాటాలనీ, మిగిలనవి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెంచాలనేది ప్రణాళిక. అయితే ఖమ్మం, వరంగల్ జిల్లాల అటవీ ప్రాంతాలలో మొక్కల పెంపకం కోసం ఆదివాసుల పోడు భూములలో అప్పుడే గుంతలు తవ్వడం మొదలైంది. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం కాగానే ఆదివాసులు పంటలు వేసుకోకుండా చేసి అక్కడ మొక్కలు నాటడానికి కుట్ర జరుగుతున్నది. ఇది ఆదివాసిల ఆహార సార్వభౌమత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. అన్ని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ఆదివాసులను వారి భూముల నుండి నిర్వాసితులను చేసి పోడు భూములను ఇతర కార్యక్రమాలకు మళ్లించిన విధంగానే (గతంలో ఉమ్మడి అటవీ యాజమాన్య కార్యక్రమం కింద తోటల పెంపకం వంటివి) కొత్త ప్రభుత్వం కూడా అడవులను పెంచడానికి ఆదివాసులు తిండి గింజలను పండించుకునే పోడు భూములనే లక్ష్యంగా పెట్టుకున్నది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌ల లోను కూడా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. 2014 అక్టోబర్‌లో ప్రవేశపెట్టిన లక్ష కోట్ల తొలి బడ్జెట్‌లో వ్యవసాయం ఉద్యానవన శాఖలకు కేటాయించింది రు. 7099.13 కోట్లు. అందులో ప్రణాళికేతర వ్యయం రు. 4772.95 కోట్లు. దానిలో సింహభాగం అంటే 4250 కోట్ల రూపాయలు రుణమాఫీ కోసం కేటాయించారు. ఇక వ్యవసాయానికి కేటాయించిన ప్రణాళికా వ్యయం (నేరుగా రైతులకు అందే పథకాలకు) 1828 కోట్లు మాత్రమే, అందులోనూ రు. 765.55 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినదే. ఈ బడ్జెట్ లో ఉద్యానవన శాఖకు రు. 502.75 కోట్లు కేటాయించి పెద్ద పీట వేశారు. అందులో రు. 250 కోట్లు గ్రీన్ హౌస్ / పాలిహౌస్ సేద్యానికి, మరో రు. 200 కోట్లు బిందు, తుంపర్ల సేద్యానికి ప్రకటించారు. 2015-16 సంవత్సరానికి ప్రవేశపెట్టిన రు. 1,15,689 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయించింది రు. 8432 కోట్లు. ఇది మొత్తం బడ్జెట్‌లో 7.2 శాతం. ఇందులో కూడా 4250 కోట్ల రూపాయలు రుణ మాఫీ కోసం కేటాయించారు. అంటే నిజంగా పథకాల కోసం కేటాయించిన నిధులు చాలా తక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుండి 25 శాతానికి మించి ధాన్యాన్ని లెవీగా సేకరించవద్దని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు ధాన్యాన్ని అమ్ముకోవలసి వస్తుంది. అప్పుడు రైతులకు కనీస మద్దతు ధరలు కూడా లభించవు. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్‌లో జోక్యం చేసుకుని ధాన్యాన్ని సేకరించి రైతులకు కనీస మద్దతు ధరలను అందించవలసి ఉంటుంది. కాని ఈ సంవత్సర బడ్జెట్‌లో మార్కెటింగ్ కోసం కేటాయించిన 411 కోట్ల రూపాయలు అందుకు ఏమాత్రం సరిపోవు. వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడి తగినంత లేకపోవడమనే గత రెండు దశాబ్దాల కేంద్ర ప్రభుత్వాల విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నది. వ్యవసాయాన్ని పండుగ చేస్తాననే మాటలు నీటి మూటలే అయ్యాయి.

తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల మేనిఫెస్టో లో చేసిన వాగ్దానాలను ఆచరణలోకి తేవడానికి ఒక విధాన పరమైన చట్రం రూపొందించ వలసి ఉంది. ఒక సమగ్రమైన వ్యవసాయ విధానం తీసుకురావలసి ఉండింది. కాని అటువంటి ప్రయత్నం ఏమీ జరగలేదు. వ్యవసాయ రంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎటువంటి నిర్మాణాత్మకమైన చర్యలను చేపట్టలేదు. పరిశ్రమలు పెట్టాలనుకునే వారికి భూమితో పాటు అన్నిరకాల రాయితీలను ఇచ్చి 24 గంటల లోపు అనుమతులను మంజూరు చేసే పారిశ్రామిక విధానం అయితే తీసుకువచ్చింది కాని వ్యవసాయ విధానం గురించి ఆలోచన కూడా చేయడం లేదు. తెలంగాణ తొలి ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి ఇవ్వడం లేదని స్పష్టంగా తెలుస్తున్నది. రాష్ట్రం లో కొనసాగుతున్న రైతు ఆత్మహత్యలకు ఇతర వ్యవసాయ సమస్యలన్నిటికీ చెరువులను పునరుద్ధరించే మిషన్ కాకతీయనే సర్వరోగ నివారిణి గా చూపుతున్నది. రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటుగా చేసే విధంగా వారిని ఖర్చు ఎక్కువ పంటల నుండి వర్షాధారిత పంటలకు మళ్లించే ప్రయత్నాలు చేస్తామని వారికి అన్ని రకాల సహాయన్నీ అందిస్తామని మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలను గుర్తించడానికే సిద్ధంగా లేదు. అంటే వ్యవసాయం సంక్షోభాన్నే గుర్తించడం లేదు. ఇక సంక్షోభ పరిష్కారానికి చేపట్టే అవకాశమే లేదు.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్) వీ

రాజ్యం పయనం ఎటు?

రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులు ఉన్నా అవి అమలు పరిచే రాజ్యాంగ వ్యవస్థలు వాటిని అతిక్రమిస్తూ, పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అంటున్నారు ఎ. తిరుపతి

'ఒక వర్గం మీద మరొక వర్గం అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఉపయోగించే యంత్రమే రాజ్యాంగ యంత్రం' – లెనిన్

వర్తమాన కాలంలో భారతదేశంలో రాజ్యం దశదిశ ఎటువైపు వెళ్తుంది? భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటిష్ ఏలుబడిలో బాహ్యంగానే పాలక యంత్రాంగం దోపిడీ, నియంతృత్వ విధానాలను ప్రత్యక్షంగా ప్రజలు అనుభవించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగానే ప్రజలు వివిధ రూపాలలో, మార్గాలలో వివిధ లక్ష్యాలతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఊపిరి సల్పని పోరాటాలు చేశారు. ఈ క్రమంలో ఆలోచనలోపడ్డ బ్రిటిష్ ప్రభుత్వం రెండు కుయుక్తులతో తమ పన్నాగాలను అమలు పరిచింది. 1) బ్రిటిష్ వారిగా మేము ఈ దేశం నుండి పోవడం. 2) మేము వెళ్లిపోయినప్పటికీ మా విధానాలను అమలు పరిచే ఒక పాలక వర్గం ఉండాలని తలచింది. ఇందులో భాగంగానే తమకు పనికివచ్చే ఒక వర్గంతోను మసులుకుంటూ వచ్చింది. ఎవరైతే తమను నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపెట్టిందో వారిని చంపివేసింది. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను ముగ్గురిని ఉరితీయడం జరిగింది. ఇంకా బాహ్య ప్రపంచానికి తెలువని ఎంతో మందిని చంపేసింది. తమ విధానాలకు సాన్నిహిత్యం కలిగిన ఒక వర్గంతోని పరోక్ష సంబంధాలు కూడా నెరిపింది. లాభీ విధానాలను కూడా అనుసరించి చివరికి 1947 ఆగస్టు 15న ఈ దేశం నుండి నిష్క్రమించారు. బ్రిటిష్ వారు పోయిన తర్వాత ఇక్కడి బూర్జువా నాయకత్వాలు దేశ పరిపాలనా పగ్గాలు చేపట్టి దీనికి ఒక రాజ్యాంగాన్ని రూపొందించ తలపెట్టారు. 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల కాలం కూర్చొని భారతదేశానికి రాజ్యాంగాన్ని ఇక్కడి ప్రతినిధుల కమిటీ రచించింది. రాజ్యాంగాన్ని 395 అధికరణలు, 8 షెడ్యూల్లతో రూపొందించారు. బ్రిటిష్ వారు ఇక్కడ ఉన్నప్పుడు రూపొందించిన 1935 చట్టంలోని 270 అధికరణలను మన రాజ్యాంగంలో పొందుపరిచారు. అంటే మన రాజ్యాంగం మీద బ్రిటిష్ వారి ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాజ్యాంగంలో 3వ భాగంలో పేర్కొన్న పలు ప్రాథమిక హక్కులు భారతదేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రతిబింబాలు అని మన రాజకీయ తత్వవేత్తలు, నిపుణులు చెపుతుంటారు. ఎందుకంటే అధికరణం 19 నుండి 22 వరకు పేర్కొన్న అధికరణలు అన్ని కూడా పౌరులకు కల్పించబడిన స్వేచ్ఛా, స్వాతాంత్ర్యపు హక్కులే. 19 (1) అధికరణం ప్రకారం ఐదు హక్కులు లేదా స్వాతంత్ర్యాలు ఉన్నాయి. ఈ ఐదు హక్కుల కలయికే స్వేచ్ఛాహక్కు. అవి ఎ) వాక్ స్వాతంత్ర్యం లేదా భావ ప్రకటనా స్వాతంత్ర్యం. బి) నిరాయుధ శాంతియుత సమావేశపు హక్కు. సి) సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు. డి) భారతదేశమంతటా స్వేచ్ఛగా సంచరించే హక్కు. ఇ) దేశంలో ఎక్కడైన స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే హక్కు. ఎఫ్) ఇష్టమైన వృత్తి, వాణిజ్యం, వ్యాపారం చేసుకునే హక్కు. అధికరణం 20 ప్రకారం ఒక వ్యక్తి ఒకపని చేసినపుడు ఆ పని చట్టరీత్యా నేరమని పేర్కొన్నట్లయితే తప్ప ఆ వ్యక్తిని నేరస్తులుగా శిక్షించకూడదు. అంతేకాదు, నేరం చేసిన సమయంలో ఆ నేరానికి ఎంత శిక్ష విధించదగునో అంతకన్నా ఎక్కువ శిక్ష విధించే వీలులేదు. ఏ ముద్దాయిని కూడా తనకు వ్యతిరేక సాక్ష్మీయ వలసిందిగా బలవంతం చేయరాదు. ఇంకా 20(1) చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భంలో మాత్రమే నేరస్తున్ని శిక్షించవలసి ఉంటుంది. ఏ చట్టం కింద నేరం చేయబడిందో ఆ నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమలులో ఉండి తీరాలి. అంతే కాకుండా ఆ నేరానికి చట్టంలో నిర్దేశించిన దానికన్నా ఎక్కువ శిక్ష విధించరాదు. 20(2) ప్రకారం ఒక నేరానికి ఒకేసారి విచారణ, శిక్ష ఉండాలి. రెండవసారి ఇదే నేరాన్ని మరోసారి విచారించరాదు. 20(3) నేరం ఆరోపించిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం చెప్పవలసిందిగా బలవంతం లేక ఒత్తిడి చేయరాదు. 21వ అధికరణం ప్రకారం వ్యక్తి ప్రాణాన్ని, స్వేచ్ఛనుగాని న్యాయ ప్రక్రియ ద్వారా తప్ప, మరే విధంగాను తొలగించకూడదని పేర్కొన్నారు. 22వ అధికరణం మూడు రక్షణలను కల్పించింది. అవి ఎ) నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తిని సాధ్యమైనంత త్వరగా నిర్బంధించినందుకు గల కారణాలను తెలిజేయాలి. బి) నిందితుడు తన ఇష్టం వచ్చిన న్యాయవాది ద్వారా తన నిర్ధోషిత్వాన్ని రుజువు చేసుకునే అవకాశం ఉన్నది. సి) నిర్బంధించిన వ్యక్తిని ఆ ప్రదేశానికి దగ్గరలో ఉన్న న్యాయ స్థానంలో 24 గంటలలోపుగా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచాలి. ప్రభుత్వం వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకున్న కారణాలను తెలుపవలసి ఉంటుంది.

ప్రాథమిక హక్కులలో మరొక ముఖ్యమైన హక్కు మత హక్కు. ఇది రాజ్యాంగంలోని 25 నుండి 28 అధికరణలలో పొందుపరిచారు. అధికరణం 25 ప్రకారం భారత పౌరునికి తన ఇష్టమైన మతాన్ని అవలంబించడానికి, ప్రచారం చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంది. అధికరణం 26 ప్రకారం అన్ని మతాల వారు ఆస్తిని సమకూర్చుకుని, వినియోగించు కునే హక్కుగలదు. కాని మత నిర్వహణకు వ్యక్తుల నుండి నిర్బంధంగా పన్నులు వసూలు చేయరాదు. అధికరణం 25 ప్రకారం ప్రభుత్వం నిర్వహించే విద్యా సంస్థలలో మత భోదన జరుగరాదు. ప్రతి మతం వారు తమ మతాన్ని ప్రచారం చేసుకోవచ్చు. కాని ఇతర మతాల వారిని బలవంతంగా తమ మతంలోకి చేర్చుకోవడానికి వీల్లేదు.

ఈ విధంగా రాజ్యాంగంలో పేర్కొన్న కొన్ని ప్రాథమిక హక్కులను

పౌరుల ప్రాథమిక హక్కులుగా పొందుపరిచారు. కాని దేశంలో గత దశాబ్దాల నుండి పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన సంఘటనలు కనిపిస్తాయి. వామపక్ష ఉద్యమాలు చెలరేగిన కాలంలో విచ్చలవిడి ఎన్‌కౌంటర్లు జరిగాయి. కుటుంబ సభ్యుల ముందే ఎత్తుకపోయి తెల్లవారే సరికి శవాలై తేలిన సందర్భాలు. మరుసటి రోజు కాల్పులు అని పత్రికల్లో, పత్రిక శీర్షికల్లో వార్తలు రావడం. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. జిహాద్‌ల పేరుతో ముస్లిం యువత కొనసాగించే చర్యలకు ప్రతీకారంగా ఎన్‌కౌంటర్లు జరిగిన సందర్భాలు కూడా మరిచిపోలేని కాలం. గత రెండు సంవత్సరాల క్రితం అమ్మాయిల మీద ఆసిడ్ దాడీ కేసులో అరెస్ట్ అయిన యువకులు రెండు రోజులకే శవాలై కనిపించిన సంఘటన మనందరికి తెలిసిందే. మొన్నటికి మొన్న కోర్టుకు హాజరు కొరకు తీసుకెళ్తున్న వికారుద్దీన్‌తో పాటు అతని అనుచరులు బస్సులోనే ఎన్‌కౌంటర్ అయ్యారు. అదేరోజు తిరుపతి దగ్గరగా 12 కిలోమీటర్ల దూరంలో ఎర్రచందనం కొరకు వచ్చిన కూలీలు 20 మంది ఎన్‌కౌంటరయ్యారు. ఈ సంఘటనల లోతు పాతుల్లోకి పోయి విశ్లేషిస్తే ప్రతి సంఘటన నేపథ్యం కూడా కడుపులో ఆకలి మంటల నుండి ఉబికి వచ్చిన ప్రతిబింబాలే. సమాజంలోని భిన్న సమూహాలు, భిన్న ఆలోచనలతో విభిన్న రూపాలలో తమతమ నిస్సహాయ స్థితులను వెళ్లగక్కారు. మావోయిస్టు ఉద్యమం అనేది సమసమాజ స్థాపనే ధ్యేయంగా నడుపుతున్న ఒక ఉద్యమం. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరు కూడా ఆ ఉద్యమ లక్ష్యాన్ని సాధించడానికి భాగస్వాములయ్యే వారే. కడుపులో ఆకలి మంటలను చల్లార్చాడానికి, భవిష్యత్ తరాలకు మార్గ దర్శకులుగా నిలువడానికి ఎంచుకున్న మార్గంగానే భావిస్తూ సమసమాజ లక్ష్యమే ధ్యేయంగా పనిచేసే వర్గం ఒకటి అయితే, దారి తెన్ను తెలువక అసంతృప్తి జ్వాలల నుండి తమను తాము సంతృప్తి చెందడానికి కొన్ని సమూహాలు అనగా మొన్నటి వికారుద్దీన్ సంఘటన ఒక కోణమయితే, ఎర్రచందనం కూలీలది మరొక కోణం. కూలీపని చేస్తే పూటగడవని కదు పేదరికంలో ఉన్న వారు తప్పని తెలిసిన కడుపు నింపుకోవడానికి తప్పనిసరి చేయాల్సిందే. ఇలాంటి వారిని చంపితే ఎర్రచందనం స్మగ్లింగ్ ఆగిపోతుందా? అనేది రాజ్యం తనకుతాను ప్రశ్నించుకోవాలి. ఎర్ర చందనం స్మగ్లింగ్ వెనుకాల రాజ్యంలో భాగస్వాములైన రాజకీయ నాయకులే తెరవెనుకాల ఉండి నడిపిస్తున్నారు. ఇలాంటి బడా బాబులను పట్టుకోకుండా పూట గడుపుకోవడానికి కూలీ పనికివస్తే పట్టుకుని నిర్దాక్షిణ్యంగా చంపడంలో గల ఉద్దేశం ఏమిటి? రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను గాని, ఆదేశిక సూత్రాలను గాని రాజ్యం ఏ మేరకు అమలు పరిచినట్లు? కూలీపని చేయడమే తప్పా? ఒకవేళ కూలీపని చేయడమే తప్పయితే ప్రత్యామ్నాయంగా వారికి బతకడానికి సరిపోయే వసతులు కల్పించాలి కదా? ఒకవేళ వారిది రాజ్యం దృష్టిలో తప్పయితే నిర్బంధించి మీ చట్టాల ప్రకారమే రుజువు చేసి శిక్షించాలి గాని సభ్య సమాజం నివ్వెరపోయేలా నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్లు కాల్చే హక్కు రాజ్యాంగంలో ఎక్కడ పొందు పరచలేదు. ఇది ఆర్టికల్ 20, 21లను ఉల్లంఘించినట్లు కాదా? అలాంటప్పుడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వారిమీద కోర్టులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఒకవేళ చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే కోర్టులే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వస్తుంది. అదే విధంగా వికారుద్దీన్ సంఘటనను విశ్లేషిస్తే కూడా రాజ్యం స్వభావం ఏమిటో స్పష్టం అవుతుంది. బస్సులో కోర్టుకు హాజరు చేయడానికి సెక్యూరిటీ వాళ్లే తీసుకెళ్తున్నారు. ముద్దాయిలకు బేడీలు వేసి ఉన్నప్పుడు వారు ఏ విధంగా సెక్యూరిటీ వాళ్ల మీద దాడికి తిరగబడతారు? ఇది నమ్మదగే విధంగా ఉందా? నిజంగానే వాళ్లు తిరగబడితే ఘర్షణ జరిగిన ఆనవాల్లు అక్కడ కనిపించాయా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాజ్యమే ఆధారాలతో చెపితే బాగుంటుంది. సంవత్సరం క్రితం వరంగల్‌లో ఒక అమ్మాయి మీద ఆసిడ్ దాడీ జరిగినప్పుడు కూడా ఆ వెంటనే ముద్దాయిలను కాల్చిచంపారు. అయితే ముద్దాయిలలో కూడా వారి నేపథ్యాలు ఒక్కొక్కరివి ఒక రకంగా ఉన్నాయి. వారి సమాజ హితం కాని చర్యలను ఎవరు కూడా సమర్థించరు. కాని పెద్దన్న పాత్ర పోషించాల్సిన ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం నడవాల్సిన రాజ్యాన్ని రక్షించాల్సిన విభాగాలే చట్టాలను, రాజ్యాంగాన్ని అతిక్రమించినప్పుడు ప్రజలకు జవాబుదారి ఎవరు?

రాజ్యాంగాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు ఏవి? ఈ సంఘటనలు అన్ని రాజ్యంలో భాగం కావా? వీటికి రాజ్యం జవాబుదారి కాదా? రాజ్యాంగాన్ని అమలుపర్చే విధానంలోనే రాజ్యం స్వభావం తేలి పోతుంది. రాజ్యాంగాన్ని కాగితాల మీదనే రాసుకోవడానికి పరిమితమైతే ఈ కోర్టులు, చట్టాలు ఎందుకు ఏర్పాటు చేసుకున్నట్లు? రాజ్యంలో జరిగే ప్రతి చర్యకు శిక్షించే అధికారం పాలకుల కనుసన్నలలోనే జరుగుతుందనేది స్పష్టం అవుతుంది. మహారాష్ట్రలో దబోల్కర్‌ను హత్య చేయడం, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. సాయిబాబాను జైల్లో బంధించడం, మా ఖనిజ సంపద మాకే దక్కాలి, మా భూములు మాకే దక్కాలనే ఆదివాసులను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపడం లాంటి సంఘటనలను విశ్లేషించినప్పుడు ఒకదానికొకటి అంతర్గత సంబంధంగా ఉన్నాయి. ఇవన్ని కూడా రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కుల ఆదేశిక సూత్రాల పరిధిలోనివే. ఇందులో ఏ ఒక్కటి కూడా ఈ హక్కుల పరిధిని దాటిలేవు. అంటే రాజ్యాంగం ముసుగులో రాజ్యం తన ఫాసిస్టు స్వభావాన్ని కప్పిపెట్టే ప్రయత్నం చేస్తుంది. అందుకే లెనిన్ రష్యా విప్లవ కాలంలో 'నిర్బంధాన్ని ప్రయోగించనిదే ఒక అత్యల్ప సంఖ్యాక వర్గం అత్యధిక సంఖ్యాక వర్గాన్ని పాలించడానికి వీలుపడేది కాదు. పీడిత వర్గాలు తమ పీడనను వదులగొట్టుకోవడానికి ఎడతెగకుండా చేసిన ప్రయత్నాల దృష్టాంతాలు చరిత్ర నిండా అనేకం కనపడుతూనే ఉన్నాయి. బానిసత్వం నుండి విముక్తి చెందడానికి దశాబ్దాల తరబడి సాగిన యుద్ధాల గురించి బానిస విధానపు చరిత్ర చెపుతుంది' అంటాడు. కాబట్టి భారతీయ సమాజంలో కూడా రోజు రోజుకు పెరిగిపోతున్న అసంతృప్తి జ్వాలలు ఒకవైపు అయితే, మరొక వైపు పెట్టుబడిదారుల కనుసన్నల్లో నడిచే ప్రభుత్వాల యుగం మరోవైపు. ఈ వైరుధ్యంలో గుప్పెడు పెట్టుబడి దారులు భారత పీడిత వర్గాన్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగానే రాజ్యాంగంలోని ప్రవేశిక భారతదేశం ఒక లౌకిక రాజ్యం అని చెపుతుంది. అదే విధంగా అధికరణలు 25 నుండి 28 వరకు మతానికి సంబంధించి చాలా స్పష్టంగా ఉన్నాయి. కాని ఇవేవి సంబంధం లేనట్లుగా అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం భగవద్గీతను ఒక రాజ్యాంగ గ్రంథంగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంది. పాఠ్యాంశాలలో

జర్మనీతో శాంతి కోసం లెనిన్ పోరాటం-2

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే సమయంలో ఏర్పడిన బోల్షివిక్ ప్రభుత్వ నేతగా లెనిన్ జర్మనీతో శాంతి కుదుర్చుకోవడానికి చేసిన ప్రయత్నాలను వివరిస్తున్నారు **ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

(గత సంచిక తరువాయి)

అయితే ట్రాట్స్కీ ద్రోహబుద్ధితో చేసిన పిచ్చిపనిని జర్మనీ వాడుకోదలిచింది. అది మరిన్ని గొంతెమ్మ కోర్కెలుకోరదలచి, వెంటనే సమాధానం ఇవ్వకుండా జాప్యం చేస్తూ, తన దాడుల్ని కొనసాగిస్తూ, పెట్రోగ్రాడ్‌పై దాడి చేయగల సామీప్యానికి చేరుకుంది. జర్మనీ దురాశని చూసి లెనిన్ ఉడికిపోయారు. పెట్రోగ్రాడ్‌కి ప్రమాదం అంటే, రష్యన్ విప్లవానికే ప్రమాదం! అక్కడ కేంద్రీకరించడబడిన కార్మిక వర్గానికి ఇది ఎంతైనా నష్టం కలిగిస్తుంది. కనుక దీన్ని ఎలాగైనా ఆపాలని లెనిన్ కృతనిశ్చయుడయ్యారు. వెంటనే ఆవేశం, ఆందోళన, బాధలతో ప్రజలకూ, సోవియట్లకూ, విప్లవ సంఘాలకూ ఒక విజ్ఞప్తి పూర్వక ఉత్తర్వును జారీ చేశారు. 'సోషలిస్టు పితృదేశం ప్రమాదంలో ఉంది' అంటూ ఆయన చేసిన ప్రకటన, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ పేరుతో విరివిగా పత్రికల్లోనూ, కర పత్రాల రూపంలోనూ ప్రచురించబడింది. జర్మన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా విప్లవాన్ని కాపాడేందుకు పూనుకొమ్మని విప్లవకర జనసామ్యాన్ని ఉద్దేశించి చేసిన ఈ ప్రకటనకు విపరీతమైన స్పందన లభించింది. వెంటనే ప్రజలు తండోపతండాలుగా కదలి వచ్చి, కందకాలనూ, ముళ్లకంచెల్ని నిర్మించారు. రెడ్‌గార్డ్ దళాల్లో వేలాదిగా చేరారు. ఎర్ర సైనిక దళాలు జర్మన్ సైన్యాలతో వీరోచితంగా పోరాడి, వారిని తిప్పికొట్టాయి. నార్వే, ప్స్కోవ్‌ల దగ్గర జరిగిన నిర్ణయాత్మక పోరాటాలలో జర్మన్ సైన్యాలు తిప్పికొట్టబడ్డాయి. ఫలితంగా పెట్రోగ్రాడ్ మీద జర్మన్ దాడి నివారించబడింది. దరిమిలా ఈ ఘటన జరిగిన ఫిబ్రవరి 23ను సోవియట్ సైనిక దినోత్సవంగా ప్రకటించారు. అయితే పెట్రోగ్రాడ్‌కు జర్మన్ల ముప్పు ఎప్పటికైనా ఉంటుందనే ఆలోచనతో లెనిన్ రాజధాని పెట్రోగ్రాడ్ నుండి మాస్కో నగరానికి మర్చేందుకు వెంటనే పూనుకొన్నారు.

పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ప్రత్యర్థులు గడ్డుపరిస్థితుల్ని సృష్టించినప్పుడు, ఆయన ప్రజల్నే నమ్ముకున్నారు. వారికి విజ్ఞప్తి చేయడం ద్వారానే ఆయన తన ప్రత్యర్థుల కుటిల యత్నాలను ఎదుర్కొన్నారు. ఆయన నమ్మకం ఎప్పుడూ వమ్ముకాలేదు. ప్రజలు ఆయన్ని అనుసరించారు. ఆయన ఎప్పుడూ సరైన దారిలోనే పయనిస్తాడని వారికి తెలుసు. అంతే కాదు. ఆయనే తమ నిజమైన రక్షకుడని కూడ వారికి తెలసు. ఈ సారి కూడ అదే జరిగింది!

అయితే తాత్కాలికంగా జర్మన్ సైన్యాలు తిప్పికొట్టబడ్డా, ఆ స్థితి ఎన్నో రోజులు కొనసాగదని లెనిన్‌కు తెలుసు. కనుక జర్మన్లతో సంధి

కషాయికరణను చొప్పించే ప్రయత్నాలు చేస్తుంది. బహిరంగ సభలు, పాఠశాల సమావేశాలలో హిందూ మతోన్మాద నినాదాల హోరు పెరిగిపోతుంది. ఒక గౌరవ ప్రధమైన హోదాలో ఉన్న వ్యక్తి హిందువులు ప్రతి ఒక్కరు నలుగురు సంతానాన్ని కనాలి అనే ఉన్మాదాన్ని రెచ్చగొట్టే వాఖ్యానాలు చేస్తున్నారు. అయితే ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవడంలో తప్పులేదు. కాని మతం పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంలోనే అసలైన ప్రమాదం పొంచి ఉంది. దశాబ్దాల చరిత్రలో జరిగిన చారిత్రక వాస్తవాలు మొదలుకొని నేటి వరకు మతోన్మాద చర్యలతో సంఘటితంగా ఉండే ప్రజలను చీల్చి ఎక్కడికక్కడ మతోన్మాద పాసిజాన్ని రెచ్చగొట్టి సంఘటితం కాకుండా చేస్తున్నారు. అందుకోసమే లెనిన్ అన్నట్లు 'రాజ్యాంగ యంత్రాన్ని, మూల అందమైన ఈ విభజన దృష్ట్యా పరిరక్షించినట్టయితే, నేను వెనుక చెప్పినట్లు మానవ సమాజం వర్గాల కింద విభజింపబడక పూర్వం రాజ్యాంగ యంత్రం కూడా ఉండేది కాదు. కాని వర్గాల కింద సమాజ విభజన పుట్టి వేళ్లూని దృఢంగా పాతుకు పోయేకొద్దీ, వర్గ సమాజం ప్రాదుర్భవిస్తున్న కొద్ది, రాజ్యాంగ యంత్రం కూడా పుట్టి వేళ్లూని దృఢంగా పాతుకు పోనారంభించింది.

కాబట్టి గుప్పెడు మంది చేతిలో అధికార యంత్రాంగం ఉన్నన్ని రోజులు మెజారిటీ ప్రజలను తమ అధీనంలో ఉంచుకోడానికి అనేక రకాలైన నిర్బంధ చర్యలను రాజ్యం అమలుపర్చుతూనే ఉంటుంది. ఈ రకమైన ఫాసిస్టు చర్యలను అమలు పరచడమంటే ప్రజల తిరుగుబాటును అణచడంలో భాగమే. నిర్బంధ రూపాలు పెరుగుతున్న కొద్ది ప్రజా తిరుగుబాటు పెరగడంగానే చూడాలి. మొన్నటి అరబ్ దేశాలలో జరిగిన తిరుగుబాటు గాని, రష్యా, చైనా, వియత్నం చరిత్రలను చూసినట్టయితే రాజ్యం స్వభావం అర్థం అవుతుంది. చివరకు ప్రజల చేతిలో రాజ్యం ఓడిపోక తప్పదు అనేది స్పష్టం అయింది. భారతదేశంలో కూడా రాజ్యం అణచివేత స్వభావాన్ని ఎదుర్కోవడానికి సంఘటిత ఉద్యమాలను నిర్మిస్తూనే బలమైన ప్రజా నాయకత్వాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రొ. సాయిబాబా లాంటి మేధావులను (90 శాతం వికలాంగుడు) అరెస్టు చేసినందుకు గాని, ఈశాన్య రాష్ట్రాలలో జాతి ఉద్యమ కారులను కాల్చి చంపినందుకు గాని, రాజ్యాంగాన్ని చేతిలోకి తీసుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసినప్పుడు గాని దేశ వ్యాప్తంగా సంఘటిత ఉద్యమాలు నిర్మించి రాజ్యం స్వభావాన్ని ఎండగడుతూ మరో నూతన సమాజం కొరకు నడుం కట్టాల్సిన సమయం ఇది.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

కుదుర్చుకోక తప్పదు. అందుకోసం వారి విషమ షరతుల్ని ఒప్పుకోక తప్పదు. జర్మనీ సమాధానం పెట్రోగ్రాడ్‌కి ఫిబ్రవరి 23న ఉదయానికి చేరింది. 48 గంటల్లో సమాధానం ఇవ్వాలని అది డిమాండ్ చేసింది. ఈ సారి అది మరికొన్ని ప్రాంతాలను తమకు స్వాధీనం చేయాలన్న షరతుతో పాటు, 1000 కోట్ల రూబుళ్లని నష్ట పరిహారంగా ఇవ్వమని డిమాండ్ చేసింది.

జర్మన్ల ఈ కొత్త డిమాండ్ల విషయంలో చర్చించేందుకు, అఖిల రష్యా సోవియట్ల కేంద్ర కార్యనిర్వాహక వర్గంలోని బోల్షివిక్, వామపక్ష ఎస్.ఆర్.ల గ్రూపుల సంయుక్త సమావేశం ఫిబ్రవరి 23న సాయంకాలం జరిగింది. ఉద్రిక్త వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో వామపక్ష ఎస్.ఆర్.ల సభ్యులతో పాటు, వామపక్ష కమ్యూనిస్టులు కూడా ఈ సంధి పట్ల తీవ్ర వ్యతిరేకత ప్రకటించినప్పటికీ, లెనిన్ ఈ సంధి మీద సంతకం పెట్టాలని గట్టిగా వాదించాడు. ఈ సమావేశం ఏ నిర్ణయలూ తీసుకోకుండానే ముగిసింది. పై సమావేశం ముగిసిన వెంటనే, అదే రోజు రాత్రి సోవియట్ల కేంద్ర కార్య నిర్వాహక వర్గంలోని బోల్షివిక్ పక్ష సమావేశం ఇదే విషయం మీద చర్చించేందుకు జరిగింది. ఈ విషయంపై అఖిల రష్యా కేంద్ర కార్యనిర్వాహక వర్గంలో వోటింగ్ జరిగేటప్పుడు, తమకు వోటింగ్ స్వేచ్ఛ ఉండాలని 'వామపక్ష కమ్యూనిస్టులు' డిమాండ్ చేశారు గానీ, ఈ డిమాండ్‌ని బోల్షివిక్ పక్షం అంగీకరించలేదు. మెజారిటీ వోటింగ్‌ను బట్టి, శాంతి సంధిమీద సంతకాలు పెట్టాల్సిందేనని ఈ సమావేశం నిర్ణయించింది.

ఆ వెంటనే తెల్లవారు జామున మూడుగంటలకు అఖిల రష్యా కేంద్ర కార్యనిర్వాహక వర్గ సమావేశం మొదలైంది. లెనిన్ శాంతి సంధి కొత్త షరతులపై నివేదికనిచ్చారు. వారి వారి పార్టీ విధానాలకు అనుగుణంగా బోల్షివిక్కేతర పక్షాల సభ్యులంతా కలిసికట్టుగా సంధిని వ్యతిరేకించగా, శాంతి సంధి షరతుల్ని ఆమోదించాలంటూ బోల్షివిక్ సభ్యులు ప్రతిపాదించిన తీర్మానాన్ని 116-85 వోట్ల తేడాతో సమావేశం ఆమోదించింది. 26 మంది వోటు వేయకుండా తటస్థంగా ఉండిపోగా, వామపక్ష కమ్యూనిస్టుల్లో అధిక సంఖ్యాకులు వోటేయకుండా, వాకౌట్ చేశారు.

ఈ విధంగా శాంతి సంధి మీద సంతకాలు పెట్టే విషయంలో పార్టీ ఒక్కో మెట్టునూ అధిగమిస్తూ వచ్చింది. లెనిన్ ఎప్పటికప్పుడు పార్టీ కార్యకర్తల్ని చైతన్యపరుస్తూ ఈ మధ్యకాలంలో పలు వ్యాసాలు పార్టీ పత్రికల్లో రాశారు.

ఇక శాంతి సంధి మీద సంతకాలు సాఫీగా జరిగి పోతాయని అనుకుంటున్న సమయంలో, అందుకు తిరిగి అవాంతరాలు ఏర్పడు తాయేమోనని అనుమానించడానికి దారి తీసే ఒక సంఘటన జరిగింది. అదేమిటంటే, బోల్షివిక్ పార్టీ మాస్కో కమిటీ, కేంద్ర కమిటీపై ఫిబ్రవరి 24న అవిశ్వాసాన్ని ప్రకటించడమే గాక, పార్టీ చీలిపోనున్నదని బెదిరించడం! ఇంతకుముందే వామపక్ష కమ్యూనిస్టులకు కొన్ని శాఖల్లో తాత్కాలిక తోడ్పాటు లభించిందని చెప్పడం జరిగింది కదా! ఆ శాఖల్లో మాస్కో ఒకటి. ఆ తోడ్పాటును పురస్కరించుకుని వామపక్ష కమ్యూనిస్టులు మాస్కో ద్వారా ఇలా పార్టీపై తిరుగుబాటుకు ప్రయత్నించారన్న మాట! సి.సి.లో ఓటమి పొందిన వీరు, ఈ విధంగా అవమానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఆ శాఖల్లో లభించిన తోడ్పాటు తాత్కాలికమేనని వీరికి తెలియదు. అంతేకాదు, మాస్కో బ్యూరో చేసిన తీర్మానమనే ఆయుధాన్ని, లెనిన్ తిరిగి తమ మీదకే తిప్పికొడతాడని కూడ వీరు ఊహించలేదు. 'విడ్డూరం, దారుణం' అంటూ లెనిన్ రాసిన ఒక వ్యాసంలో, మాస్కో బ్యూరో చేసి తీర్మానానికీ, హెచ్చరికకూ చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చాడు.

కేంద్ర కమిటీపై మాస్కో బ్యూరో అవిశ్వాసాన్ని ప్రకటించడంలో గానీ, పార్టీ చీలిపోనున్నదని హెచ్చరించడంలో గానీ ఎలాంటి దారుణం గానీ, విడ్డూరంగానీ లేదని లెనిన్ ఆ వ్యాసంలో చెప్పారు. ఎందుకంటే, కేంద్ర కమిటీతో నిశితంగా విభేదించే కామ్రేడ్స్‌కు, అది న్యాయమైన హక్కేనని ఆయన అన్నాడు. అయితే విడ్డూరమైనదీ, దారుణమైనదీ ఏమంటే, ఆ తీర్మానానికి జత చేయబడిన వివరణలోని కొన్ని మాటలేనని ఆయన చెప్పాడు.

ఆ మాటల్లో రెండు అంశాలున్నాయని పేర్కొంటూ ఆయన, అందులోని మొదటి అంశం 'ప్రపంచ విప్లవ ప్రయోజనాల దృష్ట్యా, సోవియట్ అధికారపు సైనిక ఓటమిని ఒప్పుకోవడం సమంజసం' అనేది కాగా, ఈ సూత్రీకరణ తప్పుగావచ్చు. ఒప్పుకావచ్చు కానీ విడ్డూరమైందని అనేందుకు వీల్లేదన్నాడాయన.

రెండో అంశమైన 'సోవియట్ అధికారం ప్రస్తుతం శుద్ధ నామమాత్రంగా తయారువుతోంది' అనేదీ విడ్డూరమైందే గాక, దారుణమైందని కూడా ఆయన తప్పుపట్టారు.

మొదటి అంశానికి వస్తే, ప్రపంచ విప్లవ ప్రయోజనాల రీత్యా, యుద్ధంలో ఓటమి ఒప్పుకోవాలని తీర్మాన కర్తలు భావించారు గానీ, అలా ఒప్పుకోవడం బూర్జువా వర్గ విజయానికే దారి తీస్తుందనీ, శాంతి షరుతుల్ని ఆమోదించ నిరాకరించడంవల్ల రష్యా ఓడిపోయి, సోవియట్ అధికారం కూలిపోవడానికే దారి తీస్తుందని తీర్మాన కర్తలు పరోక్షంగా అంగీకరించారని ఆయన వివరించాడు.

ఇక రెండో అంశానికి వస్తే, వారి ఉద్దేశంలో 'జర్మన్ సామ్రాజ్యవాదం మనచేత పెద్ద మొత్తంలో నష్టపరిహారం కక్కించబోతున్నది గనుక, సోవియట్ అధికారం శుద్ధ నామమాత్రంగా తయారవుతోందన్నది కావచ్చును గానీ, ఇది పరమ దారుణమైన నిస్పృహ తప్ప, వేరుకాదని ఆయన విమర్శించాడు. ఒకవైపున వారు విప్లవాత్మక యుద్ధానికి పిలుపునిస్తూ, మరో వైపు సోవియట్ అధికారాన్ని కోల్పోయే అవకాశాన్ని గురించి తీర్మానించడం అసంబద్ధమని ఆయన హేళన చేశాడు.

ఈ సందర్భంలో ఆయన 19వ శతాబ్దం మొదట్లో, నెపోలియన్ యుద్ధాల కాలంలో ప్రష్యా మరికొన్ని ఇతర దేశాలూ, 1918లో రష్యా అనుభవిస్తున్న దానికంటే ఎన్నోరెట్లు అధికంగా, విజేతల చేతిలో ఓటమి, ఆక్రమణ, అవమాన పీడన భారాలను భరించిన సంగతిని ఆయన గుర్తు చేశాడు. అయినప్పటికీ, ప్రష్యా ఉత్తమ పుత్రులు నిస్పృహ చెందలేదని, తమ జాతీయ రాజకీయ సంస్థను 'శుద్ధ నామమాత్రమైనదని' అనలేదనీ ఆయన తెలియచెప్పాడు. బ్రెస్ట్ శాంతి సంధి కంటె ఎంతో అవమానకరమైన శాంతి సంధి మీద సంతకాలు పెట్టి కూడ, ఎంతో నిబ్బరంగా శృంఖలాలు భరించి, మళ్లీ పోరాడి, మళ్లీ దాస్య శృంఖలాల్లో చిక్కి, మళ్లీ జుగుప్సాకరమైన శాంతి సంధి మీద సంతకాలు పెట్టి,

మళ్లీ తిరగబడి తమని తాము విముక్తి చేసుకున్నారని ఆయన వివరించాడు. (ఫ్రాన్స్, ప్రష్యాల మధ్య 1807 జూలైలో టిల్సిట్ శాంతి సంధి మీద సంతకాలు జరిగాయి. ఎంతో దుర్భరమైన, అవమానకరమైన ఈ సంధి వల్ల ప్రష్యా పెద్ద భూభాగాన్ని కోల్పోవడమే గాక, 10 కోట్ల నష్ట పరిహారాన్నీ చెల్లించాల్సి వచ్చింది. దీంతో పాటు తన సైన్యాన్ని 40,00కి తగ్గించుకోవడమేగాక, నెపోలియన్‌కు, అదనపు సాయుధ బలగాల్ని సప్లయ్ చేయాల్సి వచ్చింది. పైగా అది ఇంగ్లండ్‌తో వర్తకాన్ని ఆపెయ్యాల్సి వచ్చింది - రచ) కనుక రష్యా దీన్నెందుకు పునరావృతం చేయకూడదు? మొట్టమొదటి శాంతి సంధికే, అది కఠోరమైనప్పటికీ, ఎందుకు జావకారి నిస్పృహ చెందాలి? అని ఆయన ప్రశ్నించాడు. మనం ఇప్పుడు శాంతిని సాధించి, ఆ పై రష్యాను ఒక కొత్తదైన, నికరమైన దేశభక్తి యుద్ధానికి, సోవియట్ అధికారాన్ని పటిష్ఠం చేసే యుద్ధానికి సన్నద్ధం చేద్దామని ఆయన పిలుపునిచ్చాడు.

లెనిన్ పిలుపును పార్టీ శ్రేణులు అందుకుని, ఆయన చుట్టూ సమీకృతం అయ్యాయి. వామపక్ష కమ్యూనిస్టులూ, ట్రాట్స్కీయిస్టులూ ఒంటరి చేయబడ్డారు. అనంతరం సోవియట్ ప్రతినిధులూ, జర్మన్ ప్రతినిధులూ శాంతి సంధి మీద మార్చ్ మూడున సంతకాలు పెట్టారు.

పురోగమించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు నిర్భయంగా, నిశ్చింతగా ఎలా పురోగమించాలో బోల్షివిక్ పార్టీకి అక్టోబర్ విప్లవ కాలంలో లెనిన్ బోధించాడు. శత్రు శక్తులు తమకంటే మిన్నంగా ఉన్నప్పుడు, కొత్త దాడికి తన యావచ్ఛక్తినీ వినియోగించి సన్నాహం చేసుకునేందుకే క్రమ పద్ధతిలో ఎలా తిరోగమించాలో బ్రెస్ట్ - లితోవ్‌స్క్ సంధికాలంలో లెనిన్ పార్టీకి నేర్పాడు. ఆయన మార్గమే సరైందని చరిత్ర రుజువు చేసింది.

అయితే శాంతి సంధి మీద మూడున సంతకాలు జరిగినా, ఆ సంధిని పార్టీ మహాసభ, సోవియట్ల మహా సభ కూడా ధృవీకరించాల్సి ఉంది. అందువల్ల ముందుగా పార్టీ మహాసభలో పార్టీ వైఖరిపై అంతిమ నిర్ణయం తీసుకోవలసి ఉంది. అందుకోసం పార్టీ ఏడవ అత్యవసర మహాసభను మార్చ్ 6-8 తేదీల మధ్య ఏర్పాటు చేశారు. అన్ని పార్టీ మహాసభల్లో లాగానే ఈ మహాసభలో కూడా అన్ని కార్యక్రమాలూ లెనిన్ మార్గదర్శకత్వంలోనే నడిచాయి. ఇందులో ఆయన కేంద్ర కమిటీ తరుపున రాజకీయ నివేదికనిచ్చిన అనంతరం, వామపక్ష కమ్యూనిస్టుల నాయకుడు బుఖారిన్, జర్మనీపై యుద్ధం సాగించాలన్న దుస్సాహసిక డిమాండ్‌ను సమర్థిస్తూ పోటీ నివేదిక నిచ్చాడు. తీవ్ర చర్చల తర్వాత, వామపక్ష కమ్యూనిస్టుల, ట్రాట్స్కీయిస్టుల వాదనల్లో అసంబద్ధతల్ని ఎత్తిచూపిస్తూ, శాంతి సంధి ఆవశ్యకతను, వివరించిన తర్వాత, వామపక్ష కమ్యూనిస్టులలోని పలువురు తమ వైఖరుల్ని మార్చుకుని, కేంద్ర కమిటీ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించడమే గాక, శాంతిసంధిపై లెనిన్ తీర్మానాన్ని 30 అనుకూల, 12 వ్యతిరేక, 4 తటస్థ వోట్లతో ఆమోదించారు.

ఈ మహాసభలోనే లెనిన్, తను ప్రతిపాదించిన తీర్మానంలో, సోవియట్ రష్యాపై సమీప భవిష్యత్తులో, సామ్రాజ్యవాద దేశాలు సైనిక దాడులు చేయడం చారిత్రకంగా అనివార్యం కనుక, అందుకు సన్నద్ధం కోసం వయోజనులైన స్త్రీ పురుషులు యావన్మందీ సైనిక శిక్షణ పొందాలని పేర్కొన్నారు. ఇది ఆయన గొప్ప ముందుచూపునూ, పటిష్ఠమైన సోషలిస్టు దేశాన్ని నిర్మించడంలో ఆయనకు గల కృత నిశ్చయాన్నీ తెలియజేస్తుంది. ఈ మహాసభలోనే పార్టీ, పార్టీ పేరు 'సోషల్ డెమోక్రటిక్ పార్టీ (బోల్షివిక్)' స్థానంలో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) గా మార్చాలని నిర్ణయించారు.

పార్టీ మహాసభ అనంతరం సోవియట్ల అత్యవసర నాలుగొవ అఖిల రష్యా మహాసభను మార్చ్ 14-16 తేదీల మధ్య ఏర్పాటు చేయడం జరిగింది. మొదటి రోజునే లెనిన్ కార్యనిర్వాహకవర్గం తరఫున నివేదికను ఇస్తూ, ఇప్పటి దాకా జైత్రయాత్రలా సాగిన మన విప్లవం, ప్రస్తుతం అంతర్జాతీయ బూర్జువాశక్తుల్ని, దాని సైనిక మహాశక్తినంతటినీ ముఖాముఖీ ఎదుర్కోవలసిరావడం వల్ల పరాజయ దశలో ఉన్నదనీ, అందువల్ల శాంతి సంధి అవసరమనీ చెప్పారు. అయితే కొందరు విప్లవకారులు, ఈ ప్రధానమైన మలుపును చారిత్రక దృక్పథం నుండి గాక, తమ సొంత ఆవేశాల దృక్పథం నుండి చూస్తున్నారని, అందచేతనే తీవ్ర పదజాలంతో దూయబడుతున్నారని చెప్పారు. సైన్యం ఈ పరిస్థితికి కారకులైన రష్యన్ బూర్జువావర్గం కూడా జుగుప్సాకరమైన శాంతి సంధి అంటూ దూయబడుతూ, విప్లవాత్మక యుద్ధం కావాలంటూ గావుకేకలు పెడుతున్నారని, కానీ ఇప్పుడు మన తిరోగమన ఎత్తుగడల ప్రకారం శాంతి సంధి అవసరమనీ, ఈ రష్యన్ టిల్సిట్ సంధి ద్వారా మన పునర్నవం జరుగుతుందనీ, హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు. ప్రతి పక్షాల పోటీ నివేదిక అనంతర, తీవ్రవాద ప్రతివాదాలు జగిగాక, 784-261 వోట్ల మెజారిటీతో మహాసభ శాంతి సంధిని ఆమోదించింది. 115 మంది తటస్థంగా ఉన్నారు. వామపక్ష కమ్యూనిస్టులు వోటింగ్‌లో పాల్గొనకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారు. అయినప్పటికీ లెనిన్, వారిపై క్రమశిక్షణా చర్యల్ని తీసుకోకపోవడమేగాక, పార్టీ ఐక్యతను కాపాడేందుకు ప్రాధాన్యతనిచ్చారు. అందువల్లనే తమ పదవులకు రాజీనామా చేసిన వామపక్ష కమ్యూనిస్టుల్ని, ఆ మహాసభలో కేంద్ర కమిటీకి తిరిగి ఎన్నిక చేయించడమేగాక, వారు కొంతకాలం కమిటీలో చేరకపోయినా, సహనం వహించి, వారిని కమిటీలో చేరాల్సిందిగా పలుమార్లు పార్టీ ద్వారా విజ్ఞప్తి చేశారు. అంతేగాక, ఏ ఒకరైనా కేంద్ర కమిటీ చర్యతో ఏకీభవించకపోతే, ఆ చర్యకు బాధ్యత వహించకుండా ఒక ప్రకటన ద్వారా తిరస్కరించవచ్చుననీ, అంతేగానీ కమిటీని వదలి పెట్టరాదని కూడా ఈ మహా సభలో తీర్మానింపచేశారు. ఇదంతా వారితో గల విభేదాల్ని మిత్ర వైరుధ్యాంగా చూడబట్టేననడం స్పష్టం. ఈ మహాసభ అనంతరం వామపక్ష ఎస్ఆర్‌లు తమ మంత్రి పదవులు వదులుకుని, ప్రభుత్వంతో ఢీ కొట్టడానికి సిద్ధమయ్యారు. అయినప్పటికీ, శాంతి సంధి తీర్మానం అన్ని స్థానిక సోవియట్ల చేతా, శ్రామిక ప్రజల సభల్లోనూ, ప్రజామోదాన్ని పొందింది. తద్వారా రాబోయే యుద్ధాల్లో విజయం కొరకు వ్యవధిని పొందింది. తద్వారా రాబోయే యుద్ధాల్లో విజయం కొరకు వ్యవధిని పొందడానికీ, బలం పెంపొందించుకోవడానికీ అవకాశం చేజిక్కించుకుంది. ఈ విధంగా లెనిన్ మిత్రులతోనే తీవ్రంగా పోరాడి, విజయం సాధించి, రష్యాను విజయ పథంలో నడిపారు.

(అయిపోయింది)

(రచయిత సాహిత్యకారుడు, లెనిన్ జీవిత పరిశోధకులు) వీ

జాతీయ న్యాయ నియామకాల కమిషన్

***న్యాయ వ్యవస్థను తమ అధీనంలో ఉంచుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలూ కలిసి చేస్తున్న ఎత్తుగడలో భాగమే ఈ కొత్త జాతీయ న్యాయ నియామకాల కమిషన్ అని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి) ను బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసింది. దీని ఏర్పాటుపై పార్లమెంట్ ఉభయ సభలలో చర్చ వచ్చినప్పుడు అన్ని రాజకీయ పక్షాలు ఆమోదం తెలిపాయి. ఇది ఆశ్చర్యం కలిగించే విషయం. ఎందుకంటే వివిధ రాజకీయ కారణాలు, విభేదాలు పక్కనపెట్టి, ఈ విషయంలో మాత్రం అన్ని రాజకీయ పక్షాలు ఒకే అభిప్రాయానికి వచ్చాయంటే, దానివల్ల తమకు కలిగే ప్రయోజనం చాలా ఉంటున్నదనేది లెక్క. ఎందుకంటే ఏ రాజకీయ పార్టీ లేదా దాని మిత్రపక్షమో అధికారానికి వచ్చినప్పుడు, వారికి సంబంధించిన వ్యక్తులను లేదా న్యాయవాదులను న్యాయమూర్తులుగా నియమించుకోవచ్చుననేది వారి ఆంతర్యం కాబోలు.

ఈ ఎన్‌జెఎసి ఏర్పాటుతో ఏప్రిల్ 7న జారీచేసిన నోటిఫికేషన్ వలన దాదాపు రెండు దశాబ్దాలుగా ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని 'కొలేజియం' వ్యవస్థ రద్దు అయినట్లు ఉంది.

ఎన్‌జెఎసిలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారు. 1) ప్రధానమంత్రి, 2) ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, 3) కేంద్ర న్యాయశాఖ మంత్రి, 4) భారతదేశ ప్రధాన న్యాయమూర్తి (సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్), 5) న్యాయ నిపుణులు ఇద్దరు, వారు రాజ్యాంగ నిపుణులై ఉండాలి. కానీ ఇక్కడ సభ్యునిగా ఉండడానికి ప్రధాన న్యాయమూర్తి అంగీకరించడం లేదు. ఆయనకు ఎక్కడో ఈ ఎన్‌జెఎసి ఏర్పాటు పట్ల వ్యతిరేకత ఉన్నట్లు అర్థమవుతోంది. అంతేకాకుండా, ఆయన పూర్తిగా దీనిని వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఎందుకంటే, కమీషన్‌లో ఇద్దరు సభ్యుల నియామకం గురించి ప్రధానమంత్రి ఆహ్వానించినప్పుడు, ఆ సమావేశానికి హాజరు కాకపోవడం దీనికి నిదర్శనం. అంతే కాకుండా ప్రధానమంత్రికి ఒక లేఖ కూడా ఆయన రాశారు. తద్వారా ఎన్‌జెఎసి నియామకాన్ని నిలిపి వేయాలనేది ఆయన ఉద్దేశంగా మనకు కనపడుతున్నది. ప్రస్తుతం ఎన్‌జెఎసి ఏర్పాటుపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్‌రికార్డ్ అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ఫాలీ. ఎస్. నారీమన్ వాదిస్తున్నారు. ఎన్‌జెఎసి ఏర్పాటు వలన న్యాయవ్యవస్థ స్వతంత్రత, స్వేచ్ఛ ప్రశ్నార్థకం అవుతుందని నారీమన్ అభిప్రాయ పడ్డారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయానికి తావివ్వకుండా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విఘాతం కలిగించినట్లు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఎన్‌జెఎసి సభ్యులలో ఏదేని సమస్యపై అభిప్రాయ భేదాలు వచ్చి, గందరగోళం ఏర్పడితే అంతిమ నిర్ణయం ఎవరు తీసుకుంటారనేది కూడా స్పష్టపరచలేదు. ఇది మరీ గందరగోళంగా ఉంది.

గతంలో ఏదైనా కొత్తచట్టం ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం తీసుకు రావాలనుకున్నప్పుడు కనీసం ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అభిప్రాయాలు తీసుకోవాలనీ, అందుకు ప్రాధాన్యత ఇవ్వాలనీ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య (మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి) కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కనీసం దానినైనా పాటించాలని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగే విధంగా ఈ ఎన్‌జెఎసి బిల్లు ఉన్నదనేది నిర్వివాదాంశం. అయితే ఇప్పటికీ కూడా న్యాయ వ్యవస్థలో రాజకీయ జోక్యం అనేది ఏదో ఒక మూలన మనకు ఏదో ఒక రూపంలో కనబడుతూ ఉన్నది. ఇప్పుడు అది బయటపడే అవకాశం ఉన్నది. తద్వారా రాజకీయ విపక్షాల వారికి న్యాయ వ్యవస్థలో ఏమైనా ప్రమాదం జరుగవచ్చుననే భావన కూడా ఉన్నది.

న్యాయమూర్తుల నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి) కీ గతంలో కొలేజియం ఏర్పాటుకు ఉండాల్సిన లక్షణాలన్నింటినీ ఆపాదించకుండా కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానాలను రుద్దే ప్రయత్నం చేస్తున్నది. ఈ కేసును విచారించడానికి సుప్రీంకోర్టులో రాజ్యాంగ ధర్మాసనం జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ మదన్ బిలోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్ ఉన్నారు.

గతంలో కూడా ఇదేవిధంగా యుపిఎ ప్రభుత్వం గ్రామీణ న్యాయ స్థానాలను ఏర్పాటు చేసే ప్రక్రియను మొదలు పెట్టాలని తలిచి, మధ్యలోనే వదిలేసింది. కనీసం అదైనా వస్తే, గ్రామీణ (మండల) ప్రాంతాలలో ఉన్న పెండింగ్ కేసులన్నింటినీ పరిష్కరించవచ్చును. ఇప్పటికే ఈ దేశంలో కింది కోర్టులలో 2.64 కోట్ల కేసులు, రాష్ట్ర హైకోర్టులన్నింటిలో కలిపి 42 లక్షల కేసులూ పెండింగ్‌లో ఉన్నాయి. చాలా హైకోర్టులలో అదనపు న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉన్నది. వాటి నియామకాలు జరగవలసి ఉన్నది.

ప్రస్తుతం కొలేజియం వ్యవస్థ రద్దయినది. అయితే ఎన్‌జెఎసి ఏర్పాటు పూర్తిగా జరుగలేదు. ఇది సంక్షోభ సమయంగా భావించవచ్చును. అయితే భారత ప్రధాన న్యాయమూర్తి సహకరించనప్పటికినీ, ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, కేంద్ర న్యాయశాఖ మంత్రి ముగ్గురూ కలిసి కూడా నియామకాలు చేపట్టే అవకాశం కూడా లేకపోలేదు.

ఒకవేళ ప్రధానమంత్రికీ, ప్రధాన న్యాయమూర్తికీ మధ్య సయోధ్య కుదిరితే కేవలం గౌరవ ప్రతిపక్ష నాయకుడు మాత్రమే ఒంటరివాడయ్యే అవకాశం ఉంది. కావున ఆయన మాటను ధిక్కరించి కూడా మిగతా ముగ్గురు సభ్యులు ఎలాగో వారికి అనుకూలంగా వ్యవహరించే వారుగా

మీడియా నినాదాలు - విశ్వసనీయతలు

***పోటీతత్వం పెరిగిపోవడంతో ప్రజల దృష్టిని ఆకర్షించడానికి విషయ ప్రాధాన్యం కన్నా రకరకాల నినాదాలతో మీడియా సంస్థలు ముందుకు వస్తున్నాయనీ, ఆ నినాదాలకు విశ్వసనీయత ఉంటుందా అనేది అనుమానమేననీ అంటున్నారు* టంకశాల అశోక్**

తెలుగు దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లకు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయం ఏమంటే, వాటిలో ఎక్కువ వాటికి ఆ పత్రిక, లేదా ఛానల్ పేరుకింద ఏదో ఒక నినాదం ఉంటుంది. వాటి ప్రచారం కోసం గోడలు, బ్యానర్లపైన రాసేటప్పుడు ఇంకా అనేక నినాదాలు కనిపిస్తుంటాయి. వాటిలో ఎక్కువగా దొర్లే పదాలు అక్షరం, పక్షం, ప్రజలు, ఆయుధం వంటివి.

ఒకప్పుడు ఇవేవీ ఉండేవి కాదు. ఇప్పుడు కొత్తగా వస్తున్నా యథాతథంగా ఆ విషయాన్ని ఎక్కువ పట్టించుకోవలసిన పని ఉండకూడదు. ఎందుకంటే వ్యాపార పోటీలు పెరుగుతున్నాయి. కనుక కొనుగోలుదార్లను, పాఠకులను ఆకర్షించడం కోసం ఒక చిన్న నినాదాన్ని చేర్చితే, సహజ పరిణామ గతిలో అదొక మార్పు అనుకోవచ్చు. నిజానికి పత్రిక, ఛానళ్లు సాధారణ ఉత్పత్తుల వంటివి కాదు గనుక, పాఠకులు విజ్ఞానవంతులు అయినందున, మీడియాలోని అంశాల ప్రామాణికతను బట్టి తమకు అవసరమైంది ఏ పత్రికలో, ఏ ఛానల్‌లో ఉందో గ్రహించగలరు గనుక, అటువంటి నినాదాలతో ప్రత్యేకంగా అవసరం ఉండకూడదు.

అయినప్పటికీ వ్యాపార పోటీని బట్టి అవసరం ఏర్పడితే పరిస్థితులను బట్టి ఫరవాలేదనుకోవచ్చు. అదే విధంగా మరొక విషయం ఉంది. పత్రికలు, ఛానళ్ల పేరులో అనేకానికి వాటి దృక్పథాన్ని, లక్ష్యాన్ని ప్రతిఫలించే లక్షణం ఉంటుంది. అన్నింటికి కాకపోయినా అనేకానికి. ఇది మొదటి నుంచి ఉన్నదే. ఇప్పుడు కొత్తగా వస్తున్న నినాదాలు కూడా అటువంటివే అనగలమా? పేరులో దృక్పథం, లక్ష్యం ప్రతిఫలించడం ఎప్పుడూ ఉన్నదే అయినప్పుడు, నినాద వాక్యాలు ఇపుడు కొత్తగా వచ్చినప్పటికీ వెనుకటి స్థితికి కొంత అదనం మాత్రమేనని, పొడిగింపు మాత్రమేనని భావించగలమా?

అంత మాత్రమే అయితే కూడా పరవాలేని విషయమే. అట్లా అవసరమైనా కాకపోయినా మరికొంత హంగు మాత్రమే అనుకుని ఉపేక్షించవచ్చు. కాని ఎందువల్లనో అట్లా అనిపించడం లేదు. ఎందుకంటే, తెలుగు పత్రికలు, ఛానళ్ల విశ్వసనీయతలు తగ్గడానికి, ఇటువంటి నినాదాలు అవసరమని మీడియా నిర్వాహకులు భావించడానికి ఎక్కడో సంబంధం ఉన్నట్లు తోస్తున్నది. విశ్వనీయతలు దెబ్బతింటున్న స్థితిలో ప్రజల దృష్టిలో విశ్వసనీయతను సృష్టించుకునే, పునరుద్ధరించుకునే ప్రయత్నమేదో ఇందులో కనిపిస్తున్నది.

ఈ పని విషయం తెలిసి ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా, లేక తెలియక పోయినా అచేతనంగానా అన్నది చెప్పలేం. ఒక్కోసారి కొన్ని పరిస్థితులు బలవత్తరంగా ఏర్పడి ఒక వాతావరణాన్ని సృష్టించినపుడు, దాని ప్రభావంతో వ్యక్తులు అచేతనంగానే ఒకే విధంగా వ్యవహరించడం జరుగుతుండేదే. ప్రస్తుత సందర్భంలో ఆపని ఒకే విధంగా జరుగుతున్నది. ఈ ధోరణి మొదలు కావడానికి మీడియా విశ్వసనీయత దెబ్బతినడానికి కాలపరమైన సామీప్యత కనిపిస్తుంది.

మీడియా యాజమాన్యాల ధోరణి మార్పు, పార్టీలకూ లాబీలకూ అనుకూలంగా మారడం, వ్యాపార సంస్థల ప్రభావం పెరగడం, స్వయంగా పార్టీలూ, పార్టీ నాయకులూ మీడియాను నిర్వహించడం, వ్యాపార పోటీల వల్ల కొంతా విలువల పతనం వల్ల కొంతా జర్నలిజం ప్రమాణాలు క్షీణించడం, స్వయంగా జర్నలిస్టులు కూడా నైతిక విలువలను కోల్పోతున్నారనే భావన వ్యాపించడం వంటి రకరకాల కారణాల వల్ల విశ్వసనీయతలు దెబ్బతినడం తెలిసిందే. దీనిపై చర్చ అయితే కొంత కాలంగా సాగుతున్నది. కాని పరిస్థితి మెరుగుపడకపోగా మరింత క్షీణిస్తున్నది. విమర్శలతో మీడియా ఆత్మరక్షణ స్థితిలో ఉంది. అటువంటి స్థితిలో ఈ నినాదాలూ, అక్షరం, పక్షం, ప్రజలు, ఆయుధం వగైరా పద జాలాలూ ప్రజల దృష్టిలో నమ్మకాన్ని తెచ్చుకునేందుకు, అవిశ్వసనీయతను తొలగించుకునేందుకు కానే కాదనగలమా? వ్యాపార పోటీ, ఆకర్షణీయతను పెంచుకోవడం వంటివి ఒకమేరకు ఉన్నప్పటికీ, ఈ కోణం కూడా కనిపిస్తున్నది.

ఇంతకూ ఇది పనిచేస్తున్నదా? ప్రజలలో విశ్వసనీయత పెరుగుతున్నదా? అక్షరం, పక్షం, ప్రజలు, ఆయుధం వగైరా మాటలు జనాన్ని మెప్పిస్తున్నాయా? వాటికి వారు నిజంగా ఏదైనా విలువ ఇస్తున్నారా? అటువంటి నినాదాలేవీ లేని పత్రికలు కొన్నున్నాయి. వాటికి, వీటికి మధ్య తేడా ఏమైనా ఉందని, నినాదాలిచ్చేవి నిజంగా తమ పక్షమని గాని, అవి ఎక్కువ నమ్మదగినవి గాని పాఠకులు భావిస్తున్నారా? లేక అంతా హాస్యాస్పదమని కొట్టివేస్తున్నారా?

(రచయిత సీనియర్ జర్నలిస్ట్) వీ

ఉంటారు కాబట్టి, అధికారంలో ఉన్న ప్రధానమంత్రి మాటనే చెల్లుబాటు అయ్యే అవకాశం ఉంటుంది. కావున ఎన్‌జెఎసి వలన తన సొంత భావజాలాన్ని అంగీకరించేవారిని జడ్జీలుగా ప్రమోట్ చేయాలనే ధోరణి నరేంద్రమోడీలో కనపడుతున్నది. ఎందుకనగా ఇప్పటికీ గుజరాత్‌లో వారి పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా బూటకపు ఎన్‌కౌంటర్ కేసును ఎదుర్కొంటున్నాడు. ఇలాంటి వాటి పరిష్కారం భవిష్యత్తులో సులభతరం చేయవచ్చు.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

బాలికా సంక్షేమ పథకాలు ఎండమావులేనా?

బాలికల సంక్షేమం పేరుతో ఎన్ని పథకాలు, చట్టాలు వచ్చినా ఆచరణలో అమలు జరగడం లేదనడానికి ప్రతిరోజూ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులూ, అత్యాచారాలే నిదర్శనమని అంటున్నారు **కవిని ఆలూరి**

మనిషి జీవితంలో బాల్యం ఎంతో ముఖ్యమైనదే కాకుండా వ్యక్తి వ్యక్తిత్వాన్ని రూపొందిస్తుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. ఐతే, పై విశ్లేషణ బాలికలకు ఎంత వరకూ వర్తిస్తుందో? అన్న విషయాన్ని ఇక్కడ మనం గమనికలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నేటి ఆధునిక యుగంలోనూ సాంఘిక అసమానతలు, వెనుకబాటు తనం మన సమాజాన్ని పట్టి పీడుస్తూనే ఉన్నాయి. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నారని చెపుతున్నప్పటికీ మహిళల పట్ల, బాలికల పట్ల దారుణమైన వివక్ష కొనసాగుతూనే ఉన్నది. ఈ సందర్భంగా బాల, బాలికల హక్కుల గురించి, ప్రభుత్వ పథకాల గురించి ఒక్కసారి సంక్షిప్తంగా విశ్లేషించుకుందాం.

అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక ప్రకారం బాల, బాలికల వయస్సు 0-18 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఇందులో 54 ఆర్టికల్స్‌తో పాటు అంతర్జాతీయంగా బాల, బాలికల పరిస్థితులను మెరుగు పరచడానికి అనేక నిబంధనలు, సూచనలు, చర్యలకు సంబంధించిన పలు అంశాలు ఉన్నాయి. ప్రధానంగా విద్యా, ఆరోగ్యం, భద్రత, ప్రత్యేక రక్షణ వంటి అంశాలను 40 ప్రకరణలలో పొందు పరిచారు. 159 దేశాలలో ఈ ప్రతిపాదనల ఆధారంగా జాతీయ చట్టాలను రూపొందించారు. 1992 డిసెంబర్ 11న భారతదేశం సభ్య దేశంగా పాల్గొని బాలల హక్కుల ఒప్పందాన్ని ఆమోదించింది.

1974 సంవత్సరంలోనే ఏ అసమానతలు లేకుండా బాలల భౌతిక, మానసిక, సామాజిక అభివృద్ధికి సహాయ పడడంతో పాటు వారి పెరుగుదలకు అన్ని విధాలుగా తోడ్పడడం తన జాతీయ విధానంగా భారతదేశం పేర్కొన్నది. భారత రాజ్యాంగంలో బాల, బాలికల హక్కులకు సంబంధించి 23 (1), 24, 39 (ఇ), 39 (ఎఫ్) 45, 46 ప్రకరణలలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రకరణలలో బాల, బాలికలు స్వేచ్ఛాయుతంగా, గౌరవ ప్రదంగా, ఆరోగ్యంగా పెరగడానికి అవకాశాలను కల్పించడం, బాల్యాన్ని పీడనల నుండి, నైతిక, భౌతిక నిర్లక్ష్యాల నుండి రక్షించాలని, ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 2007లో భారత ప్రభుత్వం ప్రతిపాదించిన ఎనిమిది అభివృద్ధి లక్ష్యాలలో ప్రాథమిక విద్యను అందరికి అందించడంతో పాటు, లింగ వివక్షతను పోగొట్టి మహిళా సాధికారతను సాకారం చేయడం, తన ప్రధాన లక్ష్యంగా పేర్కొంటూ శిశు మరణాల నుండి బాలికా సంక్షేమం దాకా పలు అంశాలను ఇందులో పొందుపరిచింది. బాల, బాలికలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (ఆర్‌టిఇ) ను రూపొందించింది. భారత ప్రభుత్వం బాలల చాకిరీని అరికట్టడానికి 1881 సంవత్సరం కర్మాగారాల చట్టం నుండి మొదలు పెడితే 1986లో వచ్చిన బాలల చాకిరీ నిషేధం, నియంత్రణ చట్టం దాకా పలు చట్టాలను రూపొందించింది.

ఇక ప్రత్యేకించి బాలికల విషయానికి వస్తే బాల్య వివాహాన్ని ఒక సామాజిక దురాచారంగా భావిస్తూ 1929 సంవత్సరంలో రూపొందించిన బాల్య వివాహాల నియంత్రణ చట్టం (శారదా చట్టం) మన అందరికీ తెలిసిందే. 15 ఏళ్లలోపు బాలికలకూ, 18 ఏళ్లలోపు బాలురకు వివాహాన్ని ఈ చట్టం రద్దుచేసింది. 2006లో శారదా చట్టంలోని లోపాలను సవరిస్తూ, వాటిని నిరోధించడానికి బాల్య వివాహ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది.

1) కేంద్రం ప్రతిపాదించిన 'సమగ్ర శిశు సంరక్షణ పథకం' 2009 నుండి అమలులోకి వచ్చింది. 2) 11 - 18 సంవత్సరాల కిశోర బాలికల సాధికారతను సాధించడానికి 'కిశోర శక్తి యోజన పథకం' రూపొందించబడింది. 3) కిశోర బాలికల సాధికారతతో పాటు అనుబంధ పోషకారాన్ని అందుకున్న ఉద్దేశంతో 'సబల కిశోర బాలల' పథకాన్ని రూపొందిచారు. 4) 2005లో రూపొందించిన 'బాలిక శిశు సంరక్షణా' పథకం (జిసిపిఎస్) 0-3 సంవత్సరాల బాలికల కోసం అన్ని రంగాల్లో వీరికి ప్రాధాన్యతను ఇస్తూ, విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ఉద్దేశింపబడింది. 5) 2001, 2002లలో 'సర్వశిక్ష అభియాన్' 6-14 సంవత్సరాలలోపు బాల, బాలికలందరినీ పాఠశాలలో చేర్పించి విద్యను అందించాలన్న ఉద్దేశంతో రూపొందించబడింది. 6) 5-15 సంవత్సరాల పాఠశాల విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 'జవహార్ బాలల ఆరోగ్య రక్షణా పథకం' ప్రారంభించబడింది. 7) 2013లో 'బంగారు తల్లి' పథకం ఈ పథకం కింద జననం నుండి డిగ్రీ వరకూ కొంత మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం రాష్ట్రంలోని తెల్ల కార్డు దారులందరికీ వర్తిస్తుంది. 8) ఇక ఈ మధ్యనే మోడీ ప్రభుత్వం 1991 నుంచి జాతీయ స్థాయిలో గణనీయంగా తగ్గిపోతున్న ఆడపిల్లల సంఖ్యను, బాల, బాలికల మధ్య అంతరాన్ని తగ్గించడానికి 'బేటీ బచావ్ - బేటీ పఢావో' అనే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు.

ఈ విధంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం రూపొందించాయి. ఈ పథకాలు ఆచరణలో ఎంత వరకూ సాధ్యమయినాయో? అభివృద్ధిని సాధించాయో? ఒక్కసారి పరిశీలిద్దాం.

2001 జనాభా లెక్కల ప్రకారం ఆరు సంవత్సరాలలోపు వయసున్న బాల, బాలికల్లో ప్రతి వెయ్యి మంది బాలురకు 927 మంది బాలికలు కాగా 2011లో జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది బాలికలుగా నమోదయింది. ఐతే, పంజాబ్, హర్యానాలలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రతి వెయ్యి మంది బాలురకు పంజాబ్‌లో 830 మంది బాలికలు, హర్యానాలో 824 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. మన రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు

సరాసరి 940 మంది స్త్రీలు ఉన్నారు. పదేళ్ల కాలంలో దేశంలో ఆడపిల్లల సంఖ్య 50 లక్షలకు పడిపోవడం, ముంచుకు వస్తున్న ముప్పుకు నిదర్శనమని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నమోదైన లింగ నిష్పత్తిలో ఇదే అత్యల్పమని సామాజిక వేత్తలు అభిప్రాయపడ్డారు.

1998 – 1999 జాతీయ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం భారతదేశంలో 12 మిలియన్ బాలికలు జన్మిస్తే ఒక మిలియన్ బాలికలు తమ మొదటి పుట్టినరోజును చూడకుండానే మరణిస్తున్నారు. మూడు మిలియన్ బాలికలు 15 సంవత్సరాలలోపే మరణిస్తున్నారు. ఈ మరణాలు 1/3 వంతు ప్రసవ సమయంలో జరుగుతున్నవే ఎక్కువ. ప్రతి ఆరవ బాలిక మరణం కేవలం లింగ వివక్షత మూలంగా జరుగుతున్నదే.

ప్రతి పదిమంది మహిళల్లో ఒక మహిళ తమ బాల్యంలో సెక్సువల్ దుర్వినియోగానికి గురవుతున్నారు. ప్రతి నలుగురు మహిళల్లో ఒకరు 4 సంవత్సరాల వయస్సులోనే సెక్సువల్ దుర్వినియోగానికి గురవుతున్నారు. 19 శాతం మంది బాలికలు 4 నుండి 8 సంవత్సరాలలోపు సెక్సువల్ దుర్వినియోగానికి గురయితే 28 శాతం మంది బాలికలు 8 నుండి 12 సంవత్సరాలలోపు, 35 శాతం మంది బాలికలు 12 నుండి 16 సంవత్సరాలలోపు గురవుతున్నారు.

ప్రతి సంవత్సరం దాదాపుగా 27,06,000 మంది బాల, బాలికలు మరణిస్తుంటే, అందులో ఐదు సంవత్సరాలలోపు మరణిస్తున్న బాలికలే అధికం. మూడు లక్షల మంది బాలికలు బాలురకంటే అదనంగా మరణిస్తున్నారు. యుపి, దక్షిణాది రాష్ట్రాలలో ఇప్పటికే జాతీయ సగటు జనాభా రేటు పడిపోయింది. కేవలం హిమచల్‌ప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మిజోరాం, అండమాన్ నికోబార్‌లలో మాత్రమే 2001తో పోలిస్తే కొంత మెరుగైనట్లుగా కనపడుతుంది.

ఇక పాఠశాలల్లో బాలికల నమోదు శాతం బాలురు కంటే తక్కువగా ఉండడమే కాకుండా మధ్యలో చదువు ఆపేసే బాలికలు 71.5 శాతం మంది ఉన్నారు. 18 ఏళ్లలోపే వివాహమైన బాలికలు 74 శాతం ఉన్నారు. బాలికల సరాసరి వివాహ వయస్సు 1961లో 15.5 శాతం ఉంటే, 1997 నాటికి 19.5 శాతం పెరిగింది. ఇప్పటికి 44.5 శాతం బాలికలకు 18 సంవత్సరాలలోపే వివాహం జరుగుతున్నదని అనేక గణాంకాలు చెప్పడం గమనార్హం.

భారతదేశంలో ప్రతిరోజు సగటున ఏడువేల మంది బాలికలు గర్భంలోనే కడతేరిపోతున్నారని ఐక్యరాజ్య సమితి బాలల నిధి (యునిసెఫ్) తన తాజా నివేదికలో తెలిపింది. గతంలో న్యూయార్క్‌లో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలన్నీ కలిసి నిర్వహించిన సమావేశంలో ఆడపిల్లలను పురిట్లోనే చంపివేయడం, పుట్టిన తర్వాత చంపివేయడం వలన ప్రపంచ వ్యాప్తంగా ఉండవలసిన దానికంటే పదికోట్ల మంది మహిళలు తక్కువగా ఉన్నట్లు తేలింది.

వైద్య రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ ఇటీవల కేంద్రం విడుదల చేసిన మాతా, శిశు మరణాల నివేదిక ప్రకారం ప్రతి లక్షమంది గర్భిణిలలో 134 మంది మృత్యువాత పడుతున్నారు. జనన సమయంలో ప్రతి వెయ్యి మంది శిశువులకూ 46 మంది మృత్యువాత పడుతున్నారు. ఏటా దాదాపుగా 2,300 మాతృ మరణాలు కాన్పు సమయంలో జరుగుతున్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

ఆధునిక చికిత్స అందించడం కోసం వచ్చిన అల్ట్రా సౌండ్ యంత్ర పరికారం గర్భస్థ శిశువు పాలిట మృత్యు శకటంలా మారింది. కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలియగానే సంపన్న కుటుంబాలలో సైతం గర్భస్రావాలు చేయించడం పరిపాటి అయింది. లేదా పుట్టిన తరువాత ఏ మురికి కాలువలోనో, చెత్తకుప్పలోనో పడేయడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ఆర్థిక వేత్త అమర్త్యసేన్ 20 ఏళ్ల క్రితమే ప్రభుత్వం కళ్లు తెరవకపోతే ఆడ శిశువులు కోట్ల సంఖ్యలో కన్నుమూసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మనదేశంలో అత్యధికంగా శిశు మరణాలు నమోదవుతున్న రాష్ట్రాలు ఇవి మధ్యప్రదేశ్ – 62 శాతం, ఒడిశా – 61 శాతం, ఉత్తరప్రదేశ్ – 61 శాతం, అస్సాం – 58 శాతం, రాజస్థాన్ – 55 శాతం. రక్షణలేని ప్రసవాలు, సకాలంలో వైద్యం అందకపోవడం వలన కూడా శిశు మరణాల రేటు పెరిగిందని, భ్రూణ హత్యల మూలంగా పురుషునితో పోలిస్తే స్త్రీల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతుందని, ఈనాడు ఏ చట్టాలు సమర్థవంతంగా అమలు కావడం లేదని సామాజిక వేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. 1996లో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, పరీక్షలను నిషేధిస్తూ చట్టం వచ్చినా భ్రూణ హత్యలకూ, శిశు హత్యలకూ వ్యతిరేకంగా చర్యలు చేపట్టినా ఎటువంటి ఫలితాలను ఇవ్వలేదని గతంలో హోంశాఖ కార్యదర్శి జి.కె. పిళ్లై స్వయంగా అంగీకరించారు. దేశ వ్యాప్తంగా 2012లో మృత్యువాత పడిన ఐదు ఏళ్లలోపు చిన్నారుల్లో బాలురకన్నా బాలికలు 74 వేలు అధికంగా ఉన్నారన్నది అతిశయోక్తికాదు.

మనదేశంలో 41 శాతం మంది కౌమర దశలోని బాలికలు ఉండవలసిన బరువుకన్నా తక్కువగా ఉంటే మన రాష్ట్రంలో 40 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కొన్ని వెనుకబడిన ప్రాంతాలలో అయితే దాదాపుగా 80 శాతం దాకా రక్తహీనతతో బాధపడుతున్నారు. విద్య, ఆరోగ్యం, పౌష్టికాహార విషయంలో ఇప్పటికే ఆడపిల్లల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతూనే ఉన్నది. అంతే కాకుండా ప్రపంచంలో అత్యధికంగా బాల్య వివాహాలు నమోదవుతుంది మన దేశంలోనే.

హింస, అత్యాచారాలు, అపహరణల విషయానికి వస్తే ప్రభుత్వ గణాంకాల ప్రకారం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు 2006లో 19,348 నమోదు కాగా, 2009లో 21,397గా నమోదయ్యాయి. హింస 2006లో 36,617 నేరాలు నమోదు కాగా, 2009లో 38,711గా నమోదు అయ్యాయి. 2011 జాతీయ నేరాల నమోదు సంస్థ గణాంకాల ఆధారంగా దేశ వ్యాప్తంగా మహిళలపై నమోదైన నేరాల సంఖ్య 2,28, 650 కాగా అందులో ఆంధ్రప్రదేశ్‌లో 28,246గా నమోదైనది.

కేంద్ర మహిళల, బాలల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధారంగా నివారణకు వచ్చిన అత్యాచారాల సంఖ్య 95,065 కాగా, గృహ హింస – 3,87,690, లైంగిక వేధింపులు – 1,92,860, వరకట్న మరణాలు – 35,805. ఇక కిడ్నాప్‌లు, అపహరణల గురించి చెప్పనవసరం లేదు. గత సంవత్సరం ఢిల్లీ పోలీసులే స్వయంగా దేశ రాజధాని ఢిల్లీలో 6 – 15 సంవత్సరాలలోపు అదృశ్యమైన బాల బాలికల సంఖ్య 6,494 అయితే వీరిలో బాలికలు 53 శాతం అని నివేదికలో వెల్లడించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం భారత్‌లో ఏటా 60 వేల మంది చిన్నారులు అపహరణకు గురవుతున్నారు. ఐతే, కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాత్రం ఆ సంఖ్య 90 వేలకు పైనే ఉంటుందని చెపుతున్నాయి. 2006లో 17,414 కిడ్నాప్ కేసులుంటే, 2009లో 25,741 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. 2008 – 2010 మధ్యలో లక్షా 70 వేల మంది చిన్నారులు అదృశ్యమయ్యారని ఒక స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. 2011లో

రంగనాయకమ్మిజమా, మార్క్సిజమా?

- జి. లింగమూర్తి

హిజ్రాల సమస్య మీద రంగనాయకమ్మ రాసిన సుదీర్ఘ వ్యాసం, దాని మీద జరుగుతున్న చర్చ, మే సంచికలో రంగనాయకమ్మ, కల్పన కన్నబిరాన్ ల ఉత్తరాలు చూసిన తర్వాత నాలుగు ముక్కలు రాయాలనిపిస్తున్నది. ఇదివరకెవరో అన్నట్టు రంగనాయకమ్మకు భయపడి, ఆమె నోట్లో నోరు పెట్టటం ఎందుకని చాలమంది తెలిసినవాళ్లు కూడ మాట్లాడకుండా ఉంటున్నారు. ఆమె తప్పుడు భావాలను, దురుసుతనాన్ని, అర్థరహితమైన వెటకారాన్ని చూసి దుష్టులకు దూరంగా ఉండమన్నట్టుగా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ మౌనం అంగీకారం అని భ్రమపడుతూ ఆమె, ఆమె భక్తులు పొంగిపోతున్నట్టున్నారు.

హిజ్రాల సమస్య

హిజ్రాల సమస్య మీద ఆమె రాసిన పదమూడు పేజీల వ్యాసంలో ఒక బాధిత వర్గం మీద ఉండవలసిన కనీస సానుభూతి లేదు. దోపిడీ, పీడనలతో నిండిన సమాజం ఎవరిని చిన్నచూపు చూస్తున్నదో, ఎవరిమీద రాళ్లు విసురుతున్నదో వారిమీద తానూ ఒకరాయి విసిరి ఆనందించటమే ఆ వ్యాసంలో ఉంది. మనుషుల ప్రవర్తన వారి జన్యుపరమైన, శారీరక కారణాల వల్ల రూపొందుతుందనే తప్పుడు ప్రాతిపదిక పట్టుకుని, కొందరు డాక్టర్లతో మాట్లాడి, వాళ్లు 'ఈ విషయం ఇంకా సైన్సుకు తెలియదు, కచ్చితంగా చెప్పలేం' అన్నప్పటికీ, శారీరక కారణాలు లేవు అనే నిర్ధారణకు వచ్చి, కాబట్టి అది తప్పు అని శాసనం చేయటం రంగనాయకమ్మ వంటి మొరటు ఆలోచనల వాళ్లకు మాత్రమే సాధ్యం. హిట్లర్ నుంచి కులాహంకారుల దాకా, పితృస్వామిక వాదుల నుంచి వర్ణవివక్షావాదుల దాకా ఎంతో మంది పీడకులు తమ పీడనకు, అసమానతకు ఈ జన్యుపరమైన, శారీరక కారణాలనే చూపారు. 'నాట్ ఇన్ అవర్ జీన్స్' అని నిజమైన సైన్స్ ఈ శారీరక కారణాల సాకులను సకారణంగా తోసివేసినా, రంగనాయకమ్మ లాంటి వాళ్లు ఇంకా దాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అలా శారీరక కారణాల మీద పేజీల కొద్దీ అనవసరపు వాదనంతా చేసి, రంగనాయకమ్మ ఆ తర్వాత సాంఘిక కారణాలు కూడ ఉండవచ్చుననే ఒక సన్నాయి నొక్కు నొక్కారు. కాని వెంటనే ఆ సాంఘిక కారణాలను కొట్టివేసి కాబట్టి హిజ్రాలదే తప్పు అని కులపంచాయతీల న్యాయమూర్తి లాగ తీర్పు ప్రకటించారు. హిజ్రాలు ఎందుకు తయారవుతున్నారు అని తేల్చటం, పరిశోధించటం అవసరమే. కాని దానికి ఇవాళ ఖండితంగా చెప్పగల జవాబు లేదు. ఎన్నెన్నో సంక్లిష్టమైన తెలిసిన, తెలియని కారణాలున్నాయి. చరిత్రలో, సమాజంలో, మతాచారాలలో, కుటుంబంలో, వ్యక్తిలో, విలువల చట్రాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్న ఎన్నో కారణాలు వెతకాలి.

భారత ప్రభుత్వం తన సర్వేలో 15 వేల మంది బాలికలు అపహరణకు గురయ్యారని వెల్లడించింది.

ఇంతేకాక దేశంలోని పేదరికం, నిరక్షరాస్యత, తమ బిడ్డల్ని తామే అమ్ముకునే దిగజారిన స్థితికి తల్లిదండ్రులను తీసుకువెళుతుంది. వ్యభిచార నరకకూపంలో మగ్గిపోతున్న చిన్నారుల సంఖ్య తక్కువేమి కాదు. స్వాతంత్ర్యం వచ్చాక ఎన్ని చట్టాలు చేసినా బాలికల, మహిళల అక్రమ రవాణాను నిరోధించడంలో కేంద్ర నిఘా వ్యవస్థ ఎటువంటి అభివృద్ధిని సాధించలేకపోయింది. దేశంలోని ప్రధాన నగరాలలో సాగుతున్న వ్యభిచార నిలయాలకు తరలించే వారిలో 30 శాతం మంది మన రాష్ట్రానికి చెందినవారేనని అనేక గణాంకాలు చెపుతున్నాయి. మన రాష్ట్రంలో మహిళల, బాలికల అక్రమ రవాణా ఆందోళనకరంగా ఉంది. స్త్రీ, శిశు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని అత్యంత ప్రధానమైనదిగా భావించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

స్త్రీలను వ్యాపార వస్తువులుగా మార్చి అందాల పోటీలు జరపడం అన్నది ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇప్పుడు పసిపిల్లలకు చాలీ చాలని బట్టలు కట్టి క్యాట్ వాక్‌లు, డ్యాన్స్ షోలు ప్రదర్శింపచేస్తున్నారు. వారి చిరునవ్వుల్లో బాల్యాన్ని చూడడానికి బదులుగా శృంగారాన్ని చూడాలనుకోవడం ఏ నీచ సంస్కృతికి దారి తీస్తుంది! అందాల ప్రదర్శనలు, అంగాంగ ప్రదర్శనలే స్త్రీ స్వేచ్ఛగా నేటి సంస్కృతి భ్రమింప చేస్తుంది. వాస్తవానికి ఇది వారి వ్యక్తిత్వ వికాసానికి, స్త్రీ విముక్తికే తీరని నష్టాన్ని చేకూరుస్తుంది. పాశ్చాత్య సంస్కృతి, దేశ, విదేశీ వ్యాపార వర్గాల కుటిలత్వానికి అమాయకపు పసిపిల్లలు బలవుతున్నారన్నది కాదనలేని సత్యం. ఈనాడు సమాజం నుండి ఆడపిల్లలను రక్షించుకోవడమన్నది ప్రధాన సమస్యగా మారింది. పసిబిడ్డల నుండి ముసలి అవ్వల దాకా అత్యాచార బాధితుల్లో ఉన్నారన్నది అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం మనదేశం ఎదుర్కొంటున్న అనేక వైరుధ్యాలలో బాలికలపై జరుగుతున్న హింస, వివక్ష ప్రధానమైనది. ఒకపక్క దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పినప్పటికీ మరొకపక్క బాలికల పట్ల వివక్షాత్మక ధోరణి మనదేశ అధోగతిని సూచిస్తుంది. దేశంలో పెరుగుతున్న అనేక నేరాలల్లో అత్యాచారానిదే అగ్రస్థానమనీ, దేశం మొత్తం మీద మహిళలకూ, బాలికలకూ రక్షణ లేదని ప్రభుత్వ గణాంకాలే చెప్పడం చూస్తుంటే మన జాతి యావత్తు తలదించుకోవాల్సిన స్థితి దాపురించిందని అనుకోవాల్సి వస్తుంది.

ఈ మధ్యన భారత ప్రభుత్వం బాలల వయస్సు 18 సంవత్సరాల నుండి 16 సంవత్సరాలకు తగ్గించి, అత్యాచారాలను సాకుగా చూపుతూ ఐతే ఇది ఇంకా పార్లమెంట్‌లో బిల్లుగా రావాల్సి ఉంది. ఇక్కడ మనం అన్ని విషయాలనూ దృష్టిలో ఉంచుకుని, సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం దీనిని రూపొందించడం వెనుక ఉన్న రాజకీయ కోణాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బిల్లు ద్వారా 16 ఏళ్లుగా బాల్యాన్ని ధృవీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముక్కుపచ్చలారని పిల్లలను తీవ్రవాదులుగా, టెర్రరిస్టులుగా ముద్రవేసి ఎన్‌కౌంటర్ రూపంలో, మరో విధంగానో వారిని కడతేర్చే అనుమానం లేకపోతే విజ్ఞులకు, మేధావులకు, సామాజిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయోగించబోయే దమన నీతిలో పసిబిడ్డలు పావులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

(రచయిత లెక్చరర్) వీ

అదంతా చాలకాలం పాటు జరగవలసిన అకడమిక్ చర్చ. కాని తక్షణం జరగవలసిన పని, మన కళ్లముందర హిజ్రాల పట్ల అమలవుతున్న అన్యాయాన్ని, వివక్షను, దుర్మార్గాన్ని ప్రశ్నించటం, అరికట్టటం. రేవతి పుస్తకం చదివితే ఎవరికైనా ఆ పని ఎట్లా చేయాలి అనే మామూలు ప్రశ్న వస్తుంది. మామూలు మనుషులకైతే ఆ ప్రశ్న వస్తుంది గాని రంగనాయకమ్మకు రాదు. రేవతి పుస్తకం చదివి ఎంత దుర్మార్గం, ఇది ఆగేదెట్లా అని ఏడ్చినవాళ్లను ఎందరినో చూశాను. కాని రంగనాయకమ్మకు మాత్రమే రేవతిదీ, రేవతి లాంటి వాళ్లదీ తప్పు అనిపించింది. బాధితుల మీదనే బండలు వేద్దామనిపించింది. తప్పు చేస్తున్నారు కాబట్టి శిక్షించాలి, రాళ్లతో కొట్టి చంపాలి అని పరమపూజ్య న్యాయమూర్తులంగారు ప్రకటించారు. ఆ తీర్పుకు గౌరవనీయత కోసం సైన్స్ అనే ముసుగు తొడిగి, కొందరు డాక్టర్లతో సంభాషణ జరిపి నాలుగు సంచికల పొడవునా వండివార్చారు.

ప్రకృతి శాస్త్రాల సహాయంతో సామాజిక అంతరాలను పరిశీలించటానికి పూనుకోవటం మొరటు సైన్స్ అని, సైన్స్ కాదని ఆమెకు తెలిసినట్టు లేదు. పైగా 'అది మంచిదా, చెడ్డదా? అది సహజమా అసహజమా? అది న్యాయమా, అన్యాయమా? అనే ప్రశ్నలే ముఖ్యం' అని సిద్ధాంతం చేయటానికి ప్రయత్నించారు. అంతరాల సమాజంలో మంచి చెడు, సహజం అసహజం, న్యాయం అన్యాయం సాపేక్షికాలు. వాటిని సాధారణంగా పాలకులు, ఆధిపత్యశక్తులు నిర్ణయిస్తారు. వాటిని లోతుగా పరిశీలించకుండా మంచి వైపు, సహజం వైపు, న్యాయం వైపు ఉంటామంటే ఆధిపత్యశక్తుల వైపు ఉండటమే అవుతుంది.

తనను తాను మార్క్సిస్టుగా భావించుకునే రంగనాయకమ్మ పాలక భావజాలం నిర్ణయించిన మంచినీ, సహజత్వాన్నీ, న్యాయాన్నీ ఆమోదిస్తున్నారా? అందులోనూ మనది పాలక, పాలిత వర్గాల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉన్న సమాజం కాదు. వర్గ అంతరాలను లింగ, వర్ణ, కుల, మత, ప్రాంత, భాషా, వయో అంతరాలు కలగాపులగం చేస్తున్నాయి. ఇక్కడ మంచి చెడు సహజం అసహజం న్యాయం అన్యాయం అనే పరమ ప్రమాణాలు లేవు. వాటిని సమర్థించటం యథాస్థితిని సమర్థించడానికే పనికి వస్తుంది. మొత్తం మీద హిజ్రా సమస్య మీద నిజంగా చర్చించవలసిన అంశాలెన్నో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆ చర్చలు జరుగుతున్నాయి. లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్ జెండర్, క్వీర్ (ఎల్ జి బిటిక్యు) సమూహాన్ని యథాస్థితిని వ్యతిరేకిస్తున్న సమూహంగా, బాధిత సమూహంగా గుర్తించి, వర్గ పోరాటంలో పీడితుల శిబిరంలో భాగంగా చూస్తున్నారు.

చాల దేశాల్లో విప్లవ పార్టీలు, విప్లవకారులు ఆ సమూహంతో కలిసి నడుస్తున్నారు. కనీసం సానుభూతితో చూస్తున్నారు. కాని ప్రపంచానికి కళ్లు మూసుకున్న రంగనాయకమ్మ తన ఇష్టాయిష్టాలనే వీక్షణం పాఠకుల మీద రుద్దదలచుకున్నారు. దానికి మార్క్సిజం అని తనకు అరకొరగా తెలిసిన దినుసుతో పోపు పెట్టి రాసిన వ్యాసంలోని అజ్ఞాన ప్రవచనాల నుంచి పాఠకులను రక్షించాలంటే ప్రతివాక్యాన్నీ ఖండిస్తూ రాయవలసి ఉంటుంది. వీక్షణం పత్రిక అంత అవకాశం ఇస్తుందో లేదో తెలియదు.

గారు – గాడు, ఇంగ్లిష్ – ఇంగ్లీషు

ఇక వీక్షణం మే సంచికలోని రంగనాయకమ్మ ఉత్తరం చూడాలి. ఆమె మూర్ఖత్వాన్ని సంపూర్ణంగా ప్రదర్శించిన ఆ ఉత్తరంలో ఆమె రెండు విషయాలు (గారు, ఇంగ్లిష్) ప్రస్తావించారు. వాటికి వీక్షణం సంపాదకులు ఏ వివరణ ఇస్తారో తెలియదు గాని, పత్రికల గురించి, భాష గురించి కొద్ది పరిజ్ఞానంతో పాఠకుడిగా నేను చెప్పగలిగింది కొంత ఉంది. తనకు తెలిసినది కాక మరొక వాస్తవం, వాదన ఉండవచ్చునని, అవతలి వాదనే సరైనది కావచ్చునని, ఆ విషయంలో తనకు తగిన సమాచారం లేదని అనుకునేవాళ్లకు వినయం ఉంటుంది. అలా కాకుండా 'ఇదే రైటు' 'ఇది ఇంతే' అనే స్వాతిశయానికి అక్షరాలు తొడిగితే ఆ ఉత్తరం తయారయింది. సత్యాన్ని ఊహించి కనుక్కున్నట్టు, ఏదైనా అది ఏమిటో తెలియకపోయినా ఆమె ఊహించి కనుక్కుంటారు. అలా కనుక్కున్న దాని మీద పేజీల కొద్దీ సాగదీసి చర్చ చేస్తారు. వెటకారాలతో భయపెడతారు.

తెలుగు భాషలో ఏకవచనం, బహువచనం కాకుండా అనవసరంగా గౌరవవాచకం ఉంది. అది పేరుకు ముందూ వెనుకా తోకలు తగిలించటంలోనూ, బహువచనంతో గౌరవవాచక క్రియగా వాడటం లోనూ ఉంది. తెలుగు పత్రికలలో శ్రీ, గారులను తొలగించి, క్రియా పదాల్లో గౌరవవాచకాన్ని మాత్రం వాడటం చాలకాలంగా జరుగుతున్నది. అది అచ్చుతప్పు జరిగి 'గారు' 'గాడు' అయిపోతుందనే భయంతో కాదు. ఆ మాటకొస్తే అక్షరమో, ఒత్తో అచ్చుతప్పు పడితే అర్థం మారిపోయే మాటలూ, అశ్లీలమైన అర్థం వచ్చే మాటలూ ఎన్నో ఉన్నాయి. అవన్నీ ఎవరూ తీసేయలేదు. రంగనాయకమ్మ తర్కం ప్రకారం ఆ పదాలన్నీ నిషేధించాలేమో! నాకు తెలిసినంతవరకు పత్రికల్లో అనవసరమైన పదాలు వద్దని, వార్తలలో అన్నిరకాల వ్యక్తులపేర్లు ఉంటాయి గనుక ఎవరికి శ్రీ, గారు పెట్టాలి, ఎవరికి పెట్టగూడదు అనే విలువల సమస్య వస్తుందని, ఎట్లాగూ క్రియాపదాల్లో గౌరవవాచకం ఉన్నప్పుడు గౌరవవాచకం వాడడం అనవసరమని వగైరా కారణాలతో అవి తొలగించారు. అసలు క్రియాపదాల్లో కూడ గౌరవ వాచకం తొలగించి తటస్థ క్రియలు తయారు చేస్తే ఇంకా బాగుంటుంది గాని తెలుగు పత్రికలు ఇంకా ఆ దశకు చేరలేదు. అయినా కొందరికి శ్రీ, గారు వాడితే బాగుంటుందని రచయితలు అనుకోవచ్చు. కాని పత్రికల్లో యూనిఫార్మిటీ కోసం ఉంచితే అందరికీ ఉంచాలి, తీసేస్తే అందరికీ తీసేయాలి. ఇక ఇంగ్లిష్. వంద ఏళ్లు వాడినా, వెయ్యి ఏళ్లు వాడినా, పదుగురాడినా తప్పు ఒప్పయి పోదు. ఇంగ్లిష్ అనేది ఒక భాష పేరు. ఒకరి పేరును మరొకరు 'నా ఇష్టం వచ్చినట్టు పలుకుతాను, నాకిట్లా అలవాటైంది గనుక ఇదే రైటు' అనడం ఎంత అర్థరహితమో ఎవరికైనా అర్థమవుతుంది, రంగనాయకమ్మకు తప్ప.

తెలుగులో అచ్చులు హ్రస్వాలు, దీర్ఘాలుగా పన్నెండు ఉండటం అనే వీలు ఉన్నట్టే, ఇంగ్లిష్‌లో ఐదే అచ్చులు ఉండడం అనే ఇబ్బంది ఉంది. ఆ ఐదూ కూడ హ్రస్వాలే. సంప్రదాయం ద్వారా రూఢ్యమైన ఉచ్చారణ, రెండు అచ్చులను కలపటం, ఉచ్చారణకు అనుగుణంగా ఫొనెటిక్స్‌లో రాయటం వంటి అలవాట్లతో వాళ్లు ఆ ఇబ్బందిని కొంతవరకు అధిగమిస్తున్నారు. ఇంగ్లిష్ ద్వారా ఇతర భాషా పదాలను తెలుగులోకి తెచ్చుకున్నప్పుడు వాటి సరైన రూపాలు తెలియక, మన ఇష్టం వచ్చినట్టుగా పలికిన, రాసిన రోజులు ఉన్నాయి. 'చిన్నప్పుడు పక్కలో ఉచ్చపోశాను, నాకదే అలవాటు, ఇప్పుడూ ఆ పనే చేస్తాను' అని ఎవరైనా అంటే అనవచ్చు. వారికా స్వేచ్ఛ ఉంది. కాని ఇతరులు నవ్విపోతారు. ఇప్పుడు అనేక భాషల మధ్య సంపర్కం పెరిగిన తర్వాత, రేడియో, టెలివిజన్, సినిమా వంటి శ్రవణ సాధనాల ద్వారా సరైన ఉచ్చారణ, కనీసం ఆ భాషా సంప్రదాయం తెలిసినవారి ఉచ్చారణ

ఏమిటో తెలుస్తున్నది. ఇంటర్నెట్ మీద కుప్పలు తెప్పలుగా ఉచ్చారణ నిఘంటువులు దొరుకుతున్నాయి. వాళ్ల ఉచ్చారణ ఇంగ్లిష్. ఇంగ్లీష్ కాదు. అందుకే ఇప్పుడు చాల దినపత్రికల్లో కూడ సరైన వర్ణక్రమం రాస్తున్నారు. ఇక మధ్యలో హ్రస్వాన్ని లేని దీర్ఘంగా ఎందుకు మార్చారు అని అడుగుతుంటే, అది తప్పు అని చూపుతుంటే, చివరి అక్షరం ష్ కాకుండా షు అని మారుస్తున్నాం గనుక, మధ్యలో కూడ మార్చవచ్చు అని కుతర్కానికి దిగడం రంగనాయకమ్మకే సాధ్యం. తెలుగు అజంత భాష గనుక హలంత పదాలను అలా మార్చుకోవడం అలవాటు. అది కూడ తప్పే గాని లక్ష్య భాషా సంప్రదాయం ప్రకారం అలా చేయడానికి కొంతైనా సమర్థన ఉంది. కాని పదం మధ్యలో ఉన్న అక్షరానికి లేని దీర్ఘాన్ని పెట్టడానికి ఏ సమర్థనా లేదు.

అదంతా పోనీండి గాని, అచ్చులు తక్కువ ఉన్న భాషలోని వర్ణక్రమాన్ని బట్టి అచ్చులు ఎక్కువగా ఉన్న భాషలో పొరపాటు ఉచ్చారణ ఒకసారి రాస్తే, ఒకసారి ఆ పొరపాటు చేశాం గనుక ఎల్లకాలానికీ ఆ పొరపాటులోనే ఉండిపోవాలా? అది యావజ్జీవ శిక్షనా? ఎప్పుడో తెలియక టాల్‌స్టాయ్ అని రాస్తే, వారి భాషలో ట లేకపోయినా, ఇంగ్లిష్ అచ్చు ఒ ను తెలుగులో ఒ అనే ఉచ్చరించవలసి ఉన్నా, అప్పుడెప్పుడో జరిగిన పొరపాటే కొనసాగించాలా? బ్రిటిష్ అని రాయవలసినదాన్ని మొదటి ఐ ని హ్రస్వంగా, రెండో ఐ ని దీర్ఘంగా, బ్రిటీష్ అని రాసే తప్పు ఎప్పుడో జరిగితే ఇంకా దాన్ని కొనసాగించ వలసిందేనా? రోకలి తలకు చుట్టుకుంటే అంత బాగుంటుందా? మరో ఉదాహరణ: రంగనాయకమ్మ పేరు ఇంగ్లిష్‌లో రాసినప్పుడు ఇంగ్లిష్ అచ్చు ఎ ఆరుసార్లు వస్తుంది. వాటిలో దేన్ని హ్రస్వం అ గా పలకాలో, దేన్ని దీర్ఘం ఆ గా పలకాలో తెలుగు వాడుక తెలిసినవారికి తప్ప ఇతరులకు తెలియదు. కనుక ఆ ఆరు అ లనూ హ్రస్వాలుగానో, దీర్ఘాలుగానో అటూ ఇటూ గానో పలికి అలాగే రాయవచ్చు. ఇతర భాషల వాళ్లెవరో ఇంగ్లిషులో చదివి, రాంగనయాకమ్మా అని పొరపాటున పలికి, తమ భాషలో అలాగే రాసుకుని ఉంటే, అది సరైనదేనంటారా? అదే వాడా లంటారా? రంగనాయకమ్మకు తర్కం తెలుసునని గతంలో చాలమంది రాస్తే నిజమే కాబోలనిపించేది. అది కూడ తెలియదనిపిస్తున్నది.

వీక్షణంలో రంగనాయకమ్మ

ఇక్కడే రంగనాయకమ్మ రచనలకు వీక్షణంలో దొరుకుతున్న స్థలం గురించి కూడ మాట్లాడాలి. కల్పన కన్నబిరాన్ విమర్శలో కొంత అతివాదం ఉంది గాని, వాస్తవంగానే వీక్షణంలో ఈ హిజ్రాల సమస్య వ్యాసం వచ్చి ఉండవలసింది కాదు. ఎన్నో సంవత్సరాలుగా వీక్షణం చదువుతున్న పాఠకుడిగా, ఈ వ్యాసం వీక్షణం ప్రకటించే విలువలకు వ్యతిరేకమైనదని నాకు కూడ అనిపిస్తున్నది. మరీ ముఖ్యంగా సమాజం చేత హేళనకు, అవమానానికి గురవుతున్న వాళ్ల మీద మరొక దాడి జరగడానికి వీక్షణం వేదిక కావడం బాధాకరం.

అసలు వీక్షణంలో రంగనాయకమ్మ రచనలు ఎక్కువైపోతున్నాయి. అవి కొన్నిసార్లు తప్పుడు వాదనలు చేస్తూ మూర్ఖత్వ చిహ్నాలుగా ఉంటున్నాయి. కొన్నిసార్లు అవసరమైన విషయాలే అయినా ఆ రచనలలో సగమో పావో తగ్గించినా ఆమె చెప్పదలచుకున్నది మిగిలే ఉంటుంది. సాగదీయటం, అనవసరమైన వెటకారం, చెపుతున్న విషయానికి సంబంధంలేని ఇతర అంశాలు, అభూత కల్పనలు, మేరమీరిన ఊహలు ఆమె రచనల్లో ఉంటున్నాయి. మే సంచికలో ఉత్తరాన్ని బట్టి చూస్తే ఆమె టైప్ చేయించి, ప్రూఫులు కూడ చూసి పంపిన రచనలు వేస్తున్నట్టు, ఈసారి కొన్ని అక్షరాలు మార్చినందుకు ఆమెకు కోపం వచ్చినట్టు తెలుస్తున్నది. ఏ పత్రికకైనా ఇది మంచి అలవాటేనా? వీక్షణం వంటి గౌరవనీయమైన పత్రిక ఇలా రచయితల ఇష్టారాజ్యంగా నడవవచ్చునా?

రంగనాయకమ్మది మార్క్సిజమేనా?

ఆమె తనది మార్క్సిజం అనుకుంటున్నారు. ఆమె చెపుతున్నదీ రాస్తున్నదీ మార్క్సిజమేనని అనుకునేవాళ్లు కూడ కొందరున్నారు. ఆమెది మార్క్సిజం అయితే అది వద్దు బాబోయ్ అనుకుని మార్క్సిజానికి దూరం తొలగిపోతున్నవాళ్లూ ఉన్నారు. మార్క్స్, ఎంగెల్స్ పుస్తకాలను ఆమె తిరగరాసి ఉండవచ్చు గాని అలా తిరగరాయటానికీ మార్క్సిస్టు కావటానికీ సంబంధం లేదు. ఈ నూటయాభై ఏళ్లలో ఎంతో మంది మార్క్సిస్టు వ్యతిరేకులు, విద్యావేత్తలు, తమను తాము మార్క్సిస్టులుగా చెప్పుకునేవారు ఎన్నో పుస్తకాలు రాశారు. మార్క్సిజం మీద పుస్తకం రాసినంతమాత్రాన ఎవరూ మార్క్సిస్టు కారు. తన అల్లుడు పాల్ లఫార్గ్‌తో సహా ఫ్రెంచి 'మార్క్సిస్టులు' కొందరు మార్క్సిజం గురించి రాసినవి చదివి, 'ఇది మార్క్సిజమైతే నేను మార్క్సిస్టును కాను' అని స్వయంగా మార్క్స్ అన్నాడు. ఆ తర్వాత కాట్‌స్కీ, బెర్న్‌స్టీన్, ప్లెఖనోవ్, ట్రాట్‌స్కీల నుంచి లీ షావ్ చీ దాకా మార్క్సిజం గురించి వ్యాఖ్యానాలు రాసిన చాలమంది మార్క్సిస్టులేనా అని చర్చ జరుగుతూనే ఉంది. చివరికి రాజ్యాధికారం సంపాదించారు గనుక లెనిన్, స్టాలిన్, మావో లది అధికారిక మార్క్సిజం అయింది గాని వారి రచనల్లో కూడ మార్క్సిస్టేతర భావాలున్నాయని రంగనాయకమ్మతో సహా కొందరు చర్చించారు.

ఈ నేపథ్యంలో రంగనాయకమ్మది మార్క్సిజమేనా నిశితంగా పరిశీలించవలసే ఉంది. అది తప్పకుండా చేయవలసిన పనే గాని చాల పెద్దపని. ప్రస్తుతానికి మాత్రం రంగనాయకమ్మ రచనల్లోని ప్రధాన లక్షణాలు మార్క్సిజానికి ఎంత దూరమైనవో చూస్తే చాలు. వీక్షణంలో మాత్రమే కాదు, ఇతరంగా కూడ ఆమె రచనల్లో మార్క్సిజం ఎక్కడైనా ఉన్నదంటే అది మౌలిక మార్క్సిజంలోని సంపద్వంతమైన సంక్లిష్టతనూ, సంకీర్ణతనూ పోగొట్టుకున్న, పలుచబారిన, తనకు అర్థమైన, తోచిన పద్ధతి వ్యాఖ్యానం మాత్రమే. మార్క్సిజంలోని సారభూతమైన అంశాలు చాలాభాగం ఆమెకు అర్థం కాలేదు. తాను మార్క్సిజం అనుకుంటున్న భావాలతో పాటు ఆమె ఇస్తున్నవి సంకుచితత్వం, మూర్ఖత్వం, కుతర్కం, వెటకారం, అర్థం లేని పరిహాసం, ఇతరుల నోళ్లు మూయించటం, తనకు తెలిసిందే సర్వం అనుకోవటం, సమాజాన్ని యాంత్రికంగా అర్థం చేసుకోవటం. తనకు నచ్చిందంతా మంచి, నచ్చనిదంతా చెడు అనుకునే రంగనాయకమ్మ తనకు నచ్చినదంతా మార్క్సిజం, నచ్చనిదంతా మార్క్సిస్టు వ్యతిరేకత అని నలుపు తెలుపుల్లో ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి, చేయించటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రపంచం నలుపు తెలుపుల్లో ఉండదు. అంతిమ పరిశీలనలో వర్గ సమాజం రెండు శిబిరాలుగా చీలుతుంది గాని, ఈలోగా అనేక రంగుల, ఛాయల సమ్మేళనమే ఉంటుంది తప్ప నలుపు తెలుపులుగా ఉండదు. నిజమైన మార్క్సిజం అలా ఎప్పుడూ అర్థం చేసుకోదు. స్వయంగా మార్క్స్ ప్రతిపాదించిన, అన్వయించి చూపిన మార్క్సిస్టు శాస్త్రీయ విశ్లేషణా, వివరణా చట్రాలలో ఇటువంటి సంకుచితత్వానికి, మూర్ఖత్వానికి, యాంత్రికతకు స్థానం లేదు. రంగనాయకమ్మ రాస్తున్నది ఎక్కువలో ఎక్కువ రంగనాయకమ్మిజమే తప్ప మార్క్సిజమూ కాదు, వాస్తవికత మీద విశ్లేషణా కాదు, మానవత్వమూ కాదు. వీ

(... 4వ పేజీ తరువాయి)

కూడా అసహనం చూపించారు. సమస్యల్లో ఉన్నవాళ్లు తెలిసో తెలియకో తప్పుడు పరిష్కారాలని ఎంచుకుంటారు. వాళ్ల పక్షం వహించే మేధావులనబడేవాళ్లు కూడా వాటికే వత్తాసు పలికితే ఎలా? 'సెక్సువల్ మైనారిటీల జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం, వివక్షారాహిత్య హక్కుల రూపకల్పన' వంటి రాజ్యాంగపు చిలక పలుకులే నిజమైన పరిష్కారాలని అందించవు. మొగవాళ్లని, మొగవాళ్లే, స్త్రీలని స్త్రీలే పెళ్లి చేసుకోవడానికి చట్టపరంగా అంగీకరిస్తే, అలాంటి సమస్యలకి ఆ 'అంగీకారమే' పరిష్కారమా? హిజ్రాలకి ఓటు హక్కు, పేపర్లమీద ఆడా, మొగా అన్నవే కాకుండా ట్రాన్స్ జెండర్ అన్నవి కూడా ఉండాలి, ఎన్నికల్లో నిలబడడానికి హక్కు ఉండాలి. అన్నింటికీ సరే అంటాయి ప్రభుత్వాలు, అనకూడదని కాదు. కానీ వీటిలో ఏవైనా హిజ్రాల సమస్యకి అంతిమ పరిష్కారం చూపుతాయా? అవి ఆయా సమస్యలని అలాగే కొనసాగించడానికి ఉపయోగ పడతాయి. సమస్యల్లో ఉన్నవాళ్ల పట్ల దయా, సానుభూతీ ఉండవచ్చు. కానీ వాటికన్నా, నిజమైన పరిష్కారం సూచిస్తే వాళ్లని ఆ సమస్యల నుంచి సగం బయటపడేసినట్టే.

– వినోద్
ఇమెయిల్ ద్వారా...

కల్పన కన్నబిరాన్ ముగింపు చదవకుండానే విమర్శ చేయడం సరిగా లేదు. ఇదేమి అన్నం కాదు, ఒక మెతుకు చూసి సరిగా లేదు అని చెప్పడానికి. ముగింపు చదివిన తరువాత విమర్శ చేసినా ఓ పద్ధతి ఉండేది. పత్రిక ఈ వ్యాసాన్ని ప్రచురించకుండా ఉండాల్సినది అనడం మరీ అన్యాయం. రంగనాయకమ్మ హిజ్రా సమస్యే లేకుండా పోవడానికి ఏం చేయాలో రాశారు. కల్పన అభిప్రాయం, హిజ్రాల పై సానుభూతి చూపుతూ, ఆ సమస్య అలాగే ఉన్నా ఫరవాలేదు అన్నట్టుగా ఉంది. వాక్‌స్వాతంత్ర్యం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. అది 99 శాతం వ్యతిరేకంగా ఉన్నా ప్రచురించాలి. చర్చ జరగాలి. ఆఖరికి సమాజంలో మంచిదే నిలుస్తుంది.

– హరిప్రసాద్
జి. బళ్లారి

మే వీక్షణం సంచికలో ప్రచురించిన రంగనాయకమ్మ 'హిజ్రా' వ్యాసం పై కల్పన కన్నబిరాన్ ఉత్తరంలో రెండు విషయాలు ఉన్నాయి. మొదటిది రంగనాయకమ్మ వ్యాసంపై ఆమె అభిప్రాయం. రెండోది ఆ వ్యాసాన్ని ప్రచురించిన వీక్షణం సంపాదకవర్గం నిర్ణయాధికారాన్ని ప్రశ్నించడం. ఒక మాటలో చెప్పాలంటే దీన్ని ఎందుకు ప్రచురించారని సూటిగా సంపాదకవర్గాన్ని ప్రశ్నించారు కల్పన కన్నబిరాన్. మొదటి అంశంపై ఇంకా లోతైన చర్చలు జరగాల్సిన అవసరం ఉంది. దానిపై ఎవరి అభిప్రాయాలు తెలియజేసే హక్కు వారికి ఉంటుంది. కానీ రంగనాయకమ్మ వ్యాసాన్ని ప్రచురించిన సంపాదకవర్గాన్ని తప్పుచేసినట్టుగా ఎందుకు వేశారని ప్రశ్నించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. దీనిపై సంపాదకవర్గం కూడా తమ అభిప్రాయాన్ని పత్రికలో ప్రకటించాల్సిన అవసరం ఉంది. వీక్షణంలో వ్యక్తుల పేర్లతో ప్రచురిస్తున్న వ్యాసాలు వారి వ్యక్తిగత అభిప్రాయాలే. 'వీక్షణం' అభిప్రాయాలుగా పరిగణించలేం. 'వీక్షణం' అభిప్రాయాలైనా, నచ్చకపోతే వాటిపై తమ భావాలు వ్యక్తం చేయవచ్చు. అలాగని సంపాదకవర్గం సామాజిక బాధ్యతల నుంచి వైదొలిగి ఈ వ్యాసాన్ని ప్రచురించారని అనుకోవడానికి వీలులేదు. ఇటువంటి ప్రాధాన్యత కలిగిన సమస్యలపై చర్చలకు వేదికగా 'వీక్షణం' పత్రిక ఉందని అర్థం చేసుకోవాలి. సంపాదకవర్గం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉంది.

– మోహన్‌రావు
ఇమెయిల్ ద్వారా...

'హిజ్రా సమస్య' గురించిన రంగనాయకమ్మ వ్యాసం హిజ్రాలను గురించి, హోమోల గురించి తెలియని విషయాలెన్నింటినో తెలియజెప్పింది. హిజ్రాలను గురించి నిజమైన సహానుభూతిని తెలియజేసే వారెవరైనా తాత్కాలిక ఉపశమనాలు గాక, నిజంగా ఆ సమస్యే ఉండని మార్గాలు సూచిస్తారు. రంగనాయకమ్మ నూటికి, నూరుపాళ్లూ ఆ ప్రయత్నమే చేశారు. 'నేను హిజ్రాని' అనే రేవతి ఆత్మకథ చదివాక, రంగనాయకమ్మ మరెన్నో వ్యాసాలు చదివి, నెట్ పరిశోధించి, డాక్టర్ల ద్వారా ఎన్నో విషయాలు చర్చించి వాటన్నిటినీ మన ముందుంచినట్లు తెలుస్తోంది. ఒక 'కొత్త' సమస్య విన్నాక, దాని గురించిన బాధ్యతతో, సహనంతో విషయాలు తెలుసుకొని, విశ్లేషించి పరిష్కార మార్గాలు చూపించడం నిస్సహాయ స్థితిలో ఉన్న కమ్యూనిటీకి మేలు చేస్తుందే గానీ హాని చేయదు. 'హిజ్రాలు – హక్కులు' అనే పోరాటం కన్నా – కావాలని హిజ్రాలుగా మారేవారు; దాని వెనక పేదరికం; అవిద్య; అందుబాటులో లేని వైద్యం; హిజ్రాగా మారకుండా మగవారిగానే ఉండడంలోని ఆత్మగౌరవం; హిజ్రాగానే ఉండక తప్పని శారీరక లోపాలున్న వారిని అన్ని శారీరక లోపాలను చూసినట్లుగానే దీనిని గూడా భావించి, ఆ పిల్లల్ని తల్లితండ్రులు, సమాజం మరింత బాధ్యతగా చూసుకోవాలనడం; – ఇవన్నీ ఎంత మంచి విషయాలు! ఎంత తెలుసుకోవలసిన విషయాలు! 'వీధి గుంపులు' – ఒకరు ఎటు నడిస్తే మిగిలిన వారు ఆలోచన లేకుండా అటుగానే నడుస్తారు దుర్గంధ పూరిత వాతావరణంలోకి. ఒక్కరు (కొందరు) మాత్రం సమస్యకున్న అన్ని కోణాలనూ చర్చిస్తూ సరైన ఆలోచనతో సరైన పరిష్కారాల మార్గంలో నిర్భయంగా నడుస్తారు సుగంధపూరిత వాతావరణంలోకి. కానీ ఆ మంచి మార్గాన్ని చూడడానికి, వినడానికి, చదవడానికి కూడా ఇష్టపడని అసహనం, ఉక్రోషం, నిందాపూర్వక మనస్తత్వం కొందరికుంటుంది.

– వేదన
ఖమ్మం

రెండు మూడు నెలల కింద వీక్షణంలో రాజ్యాంగ నైతికత అనే మాట (బహుశా ఓల్గా వ్యాసంలో) చదివినప్పటి నుంచీ రాద్దామనుకుంటూ ఆలస్యం చేశాను. మళ్లీ ఈ సంచికలో కల్పన కన్నబిరాన్ వ్యాసంలో ఆ మాట వచ్చింది. బైటి పత్రికల్లో కూడా ఆ మాట చూస్తున్నాను. కొత్త మాటలు కనిపెట్టే మోజు గాని, ఎన్జీవోల పరిభాష గాని ఈ మాటకు కారణం కావచ్చు. భారత రాజ్యాంగానికి నైతికత ఉందా? అసలు ఏ వర్గ సమాజంలోనైనా పాలకులు తమ పాలన అందరి పాలన అని బురిడీ కొట్టించడానికి రాసుకునే రాజ్యాంగంలో నైతికత ఉంటుందా? ఒక వర్గం మరొక వర్గం మీద సాగించే దోపిడీ, పీడన, హింసలమీద తటస్థత మేలి ముసుగు కప్పే రాజ్యాంగంలో నైతికత ఉంటుందా? సాధారణంగా రాజ్యాంగాల స్వభావం అలా ఉంచి భారత రాజ్యాంగంలో ప్రవేశికలో, ప్రాథమిక హక్కులలో, ఆదేశిక సూత్రాలలో చాల గొప్ప విషయాలే ఉండవచ్చు. కాని అవి అమలయ్యాయా? సక్రమంగా అమలు కాని అంశాలే రాజ్యాంగ నైతికత అవుతాయా? మరి అదే రాజ్యాంగంలో దురాక్రమణకు, విస్తరణ స్వభావానికి అవకాశం ఇచ్చే అధికరణం, ఎమర్జెన్సీ విధించి ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికరణం, కారణం చెప్పకుండా, విచారణ లేకుండా ప్రభుత్వోద్యోగులను తొలగించే అధికారం, రాష్ట్రాల హక్కులను కాలరాచి రాష్ట్రపతి పాలన విధించే అధికారం వంటి అప్రజాస్వామిక అంశాలెన్నో ఉన్నాయి గదా, అవి రాజ్యాంగ నైతికతే అవుతాయా? అసలు రాజ్యాంగ నైతికత అనే మాటలోనే మోసం లేదా? కొత్త మాటలు వాడడంలో తప్పు లేదు కాని మసిపూసి మారేడుకాయ చేయడానికి, అనవసరమైన గందరగోళం సృష్టించడానికి, పాఠకులను పక్కదారి పట్టించడానికి కొత్త మాటలు సృష్టించడం మంచిది కాదు.

– ఎస్. జనార్దన్
మెదక్

సామాజిక ఉద్యమాల స్ఫూర్తితో, శాస్త్రీయ దృక్పథంతో వస్తున్న వీక్షణం పత్రికను హృదయపూర్వకంగా అభినందిస్తూ, పదికాలాల పాటు కొనసాగాలని కాంక్షిస్తున్నాను.

– చెన్నుపాటి రామకృష్ణ
నందిగామ

ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి తెలుగు అకాడమీ

యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ పరిధిలో ఉన్న తెలుగు అకాడమీని ఉన్నత విద్యాశాఖలోకి చేరుస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఏప్రిల్ 24న ఉత్తర్వు జారీ చేశారు. ఇక నుంచి అకాడమీ కార్యక్రమాలు ఉన్నత విద్యాశాఖ పర్యవేక్షణలో జరుగుతాయి.

సాహితీవేత్త యుఎ నరసింహమూర్తి మృతి

ప్రముఖ సాహితీవేత్త, రచయిత, విమర్శకులు ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి (72) శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ ఏప్రిల్ 27న విజయనగరంలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన 1944 ఫిబ్రవరి 10న విజయనగరం జిల్లా, గణపతినగరం మండలం, లింగాలవలస గ్రామంలో జన్మించారు. తెలుగు భాషాభివృద్ధికి దోహదపడే పలు రచనలు, ఉపన్యాసాలు చేశారు. పరిశోధకునిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా పేరు తెచ్చుకున్నారు.

జనశక్తి నేతల అరెస్టు

కర్నూల్ పట్టణంలోని వెంకటరమణ కాలనీలో ఒక ఇంట్లో సమావేశమైన జనశక్తి నేతలను పోలీసులు మే 5న అరెస్టు చేశారు. వీరిలో జనశక్తి నేత కూర రాజన్నతో పాటు 10 మంది జనశక్తి నేతలు ఉన్నారు. వీరందరినీ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారించిన అనంతరం వీరిని అరెస్టు చేసినట్లు కర్నూల్ జిల్లా ఎస్‌పి రవికృష్ణ తెలిపారు.

ఆర్‌టిసి కార్మికుల సమ్మె

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మే 6 నుంచి 13 వరకు ఆర్‌టిసి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణలో భాగంగా 43 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు. కార్మికుల సమ్మెకు స్పందించి తెలంగాణలో 44 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 43 శాతం ఫిట్‌మెంట్‌ను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రకటించారు.

సాయిబాబా విడుదల కోసం ధర్నా

ఢిల్లీ ప్రొ. జి.ఎన్. సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న కారణంగా అరెస్టు చేసి మే 9కి సంవత్సరం అయింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా విడుదల కమిటీ ఆధ్వర్యంలో ఆయన విడుదల కోసం మే 9న హైదరాబాద్‌లోని ఇందిర పార్క్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వక్తలు 90 శాతం వికలాంగుడిగా ఉన్న ప్రొ. జి.ఎన్. సాయిబాబాను అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి శారీరకంగా, మానసికంగా రాజ్యం హింస్తోందని, ఆయనను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు ప్రొ. కోదండరాం. చుక్కా రామయ్య, విరసం సభ్యులు వరవరరావు, సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి, పిఓడబ్ల్యు సంధ్యలతో పాటు సిపిఎం. సిపిఐ, న్యూడెమోక్రసీ, ఎం.ఎల్. వామపక్ష పార్టీల నాయకులు, దళిత, ఆదివాసి, మైనారిటీ, విప్లవ సంఘాల కార్యకర్తలు హాజరయ్యారు.

108 సర్వీసు కార్మికుల సమ్మె

తెలంగాణలో 108 సర్వీసు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించి, వేతనాలను పెంచాలని, పని గంటలను తగ్గించాలని, తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మే 13 నుంచి 24 వరకు108 సర్వీసులను నిలిపివేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. వారి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో మే 24న సమ్మె విరమించారు.

పర్సా సత్యనారాయణ మృతి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సిపిఎం సీనియర్ నాయకులు పర్సా సత్యనారాయణ (91) మే 22న అనారోగ్యంతో బాధపడుతూ పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరులో చనిపోయారు. ఆయన 1924లో గుంటూరు జిల్లా, కంభపాడులో జన్మించారు. ఆయన రాజకీయ జీవితం 25 ఏళ్లలో కొత్తగూడెం సింగరేణి కార్మిక నాయకునిగా ప్రారంభమైంది. ఆయన 1962లో పాల్వంచ ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. అలాగే విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని తన ఎంఎల్‌ఏ పదవికి రాజీనామా చేశారు.

తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర సదస్సు

తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) ఆధ్వర్యంలో మే 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విమలక్క అధ్యక్షతన టఫ్ రాష్ట్ర సదస్సు జరిగింది. టఫ్ నూతన అధ్యక్షులుగా విమలక్క, ప్రధాన కార్యదర్శి జక్కా రాజేశం ఎన్నికయ్యారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు తెలంగాణ రైతు ఆత్మహత్యలకు పాలకుల విధానాలే కారణమని, ఒక పక్క పేదలకు భూపంపిణీ చేస్తామని చెపుతూ, మరో పక్క కేంద్రం తీసుకొచ్చే భూ సేకరణ బిల్లుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మద్దతు తెలిపారని మాట్లాడారు. ఈ సదస్సులో సామాజిక వేత్త స్వామి అగ్నివేశ్, ప్రొ. జయధీర్ తిరుమలరావు, ప్రొ. కోదండరాం. మానవ హక్కుల వేదిక అధ్యక్షులు జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిలతో పాటు అనేక మంది కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు.

విద్యార్థులపై నాన్ బెయిలబుల్ కేసులు

తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఉస్మానియా యూనివర్సిటీలోని 11 ఎకరాల స్థలాన్ని సేకరించి, ఆ స్థలంలో పేదలకు ఇండ్లు కట్టిస్తానన్నందుకు నిరసనగా మే 21న యూనివర్సిటీ విద్యార్థులు సచివాలయంలోని సి-బ్లాక్ ముట్టడికి ప్రయత్నించారు. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని కొంతమంది విద్యార్థులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టింది.

నవ తెలంగాణ విద్యార్థి జెఎసి సభ

నవ తెలంగాణ విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో మే 24న 'ఉస్మానియా భూములను కాపాడుకుందాం... భావి తరాల విద్యార్థులకు భవిష్యత్తు ఇద్దాం' అనే అంశం మీద ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో బహిరంగ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న వక్తలు పాలకులు విశ్వవిద్యాలయాల సమస్యలను పరిష్కరించకుండా, వాటికి కేటాయించే నిధులలో కోతలు విధిస్తూ, నిర్లక్ష్యం చేస్తూ వాటి స్థలాలను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని, వాటిని రక్షించవలసిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని మాట్లాడారు. ఈ సభలో ప్రొ. కోదండరాం. ఎంఎల్‌సి రాంచంద్రరావు, ఆర్. కృష్ణయ్య, తెలంగాణ ఉద్యమ వేదిక కన్వీనర్ చెరుకు సుధాకర్‌లతో పాటు అనేక మంది విద్యార్థి నాయకులు సభలో పాల్గొన్నారు. అలాగే మే 25న తెలంగాణ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన మూడు ఎకరాల స్థలంలో టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అక్రమంగా నిర్మించిన స్వాగత్ గ్రాండ్ హోటల్‌పై దాడి చేశారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, దానిని యూనివర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీ

దేశ వ్యాప్తంగా అణువిద్యుత్ కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడతో సహా దేశంలోని పది చోట్ల అణు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పడానికి ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని కేంద్ర అణుశక్తి అంతరిక్ష శాఖల మంత్రి జితేంద్రసింగ్ ఏప్రిల్ 29న వెల్లడించారు. ఈ పది గోరఖ్‌పూర్ (హర్యానా), చుట్కా, భీంపూర్ (మధ్యప్రదేశ్), కైగా (కర్ణాటక), మహీ బన్స్వారా (రాజస్థాన్) లలో దేశీయ రియాక్టర్లను నెలకొల్పనున్నామని తెలిపారు. విదేశీ సహకారంతో కూడంకుళం (తమిళనాడు) , జైతపూర్ (మహారాష్ట్ర), ఛయ్యా మితివర్ధిని (గుజరాత్), కొవ్వాడ (ఆంధ్రప్రదేశ్), హరిపూర్ (పశ్చిమబంగ) లలో రియాక్టర్లు రానున్నాయని తెలిపారు.

విజయవంతమైన రవాణా సమ్మె

కేంద్ర ప్రభుత్వ రహదారి రవాణా భద్రత బిల్లుకి వ్యతిరేకంగా ఏప్రిల్ 30న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె విజయవంతమైందని వామపక్షాలు, రవాణా అనుబంధ సంఘాలు తెలిపాయి. జాతీయ స్థాయి రోడ్డు రవాణా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సమ్మె చేశారు. కేంద్ర కార్మిక సంఘాలైన ఎఐటియుసి, సిఐటియు, బిఎంఎస్, ఐఎన్‌టియుసి, ఎచ్ఎంఎస్, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్ లతో పాటు వివిద రాష్ట్ర సంఘాల సభ్యులైన ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన కార్మికులు దీనిలో పాల్గొన్నారు. ఢిల్లీ, బెంగళూరు, తమిళనాడు, పంజాబ్, గుజరాత్, అస్సోం, హర్యానా, కేరళ, పశ్చిమబంగ, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బంద్ ప్రభావం అధికంగా ఉంది.

మహిళా అధికారిణిపై గనుల మాఫియా దాడి

ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లా రాంపూర్ ప్రాంతంలో మే 4న గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన మహిళా ఐఎఫ్ఎస్ అధికారిని బృందంపై దాడి చేశారు. దబ్కా నది పరిసరాల్లో అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి అధికారి కళ్యాణి తన బృందంతో వెళ్లారు. జెసిబితో పాటు అక్కడే ఉన్న మరికొన్ని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్కడే ఉన్న గనుల అక్రమ తవ్వకందారులు అధికారుల చర్యలను అడ్డుకోవడంతో పాటు అధికారులపై దాడి చేశారు.

ఐదుగురు మావోయిస్టుల అరెస్టు

తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలోని కురువత్తంవట్టి వద్ద ఐదుగురు మావోయిస్టులను ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన పోలీసుల బృందం మే 4న అరెస్ట్ చేసింది. మావోయిస్టులు అక్కడున్నట్లు ముందే సమాచారం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు పోలీసులు కురువత్తంవట్టీలో కేరళ మావోయిస్టు నాయకుడు రూపేశ్ ఆయన భార్య షైనా, ఈఫ్వరన్, అనూప్, కణ్ణన్‌లను అదుపులోకి తీసుకున్నారు. కణ్ణన్ తమిళనాడుకు చెందిన వ్యక్తి కాగా మిగతా వారు కేరళకు చెందిన వారు. వారిని కోయంబత్తూరులోని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

వెంటాడుతున్న అంటరానితనం

అంటరానితనాన్ని నిర్మూలించామని చెప్పుకుంటున్నప్పటికీ తమ ఇళ్లలో ఏదో ఒక రూపంలో అంటరాని తనాన్ని పాటిస్తున్నామంటూ ప్రతి నలుగురిలో ఒకరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మే 4న ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో 'భారత మానవ అభివృద్ధి సర్వే (ఐఎచ్‌డిఎస్-2) కు సంబంధించిన ఈ వివరాలను వక్తలు వెల్లడించారు. దీని ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు, ఎస్.సి, ఎస్.టిలు సహా దేశంలోని దాదాపు అన్ని మతాల, కులాల ప్రజలు అంటరాని తనాన్ని పాటిస్తున్నట్లు అంగీకరించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకానమిక్ రీసెర్చ్(ఎన్‌సిఎఇఆర్), అమెరికాకు చెందిన మేరీలాండ్ విశ్వవిద్యాలయం జరిపిన ఈ సర్వే పూర్తి వివరాలను ఈ ఏడాదే వెల్లడించింది.

ప్రొ. సాయిబాబా విడుదల కోరుతూ ధర్నా

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. సాయిబాబాను అరెస్టు చేసి ఏడాది గడుస్తున్న సందర్భంగా ఆయన్ను విడుదల చేయాలని మే 9న ఢిల్లీ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద నిరాహార దీక్ష నిర్వహించారు. ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ, ఇంద్రప్రస్త యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలు ఈ ధర్నాను నిర్వహించారు. ప్రొఫెసర్ సాయిబాబాను తక్షణం విడుదల చేయాలని ప్రముఖ రచయిత్రి అరుందతీరాయ్ డిమాండ్ చేశారు. ఏడాది గడుస్తున్నా ఆయనపై విచారణ ప్రారంభం కాలేదని, బెయిల్ ఇవ్వడం లేదని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు.

మరో సాల్వా జుడుం

సాల్వాజుడుం వ్యవస్థాపకుడైన మహేంద్ర కర్మ కుమారుడు చవీంద్ర కర్మ, ఇతర నేతలు కలిసి బస్తర్‌లో మే 25 నుంచి మావోయిస్టు వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టనున్నారు. చవీంద్ర వర్మ, సాల్వాజుడుం నాయకుడు చైత్రం అత్తాయి, సుఖ్‌దేవ్ తాతి తదితరులు వికాస్ సంఘర్ష్ సమితి (వీఎస్ఎస్)ని ఏర్పాటు చేశారు. మావోయిస్టులపై పోరాడుతూ, బస్తర్ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. మహేంద్ర కర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా మే 25 నుంచి ప్రచార కార్యక్రమాలు ప్రారంభిస్తామని చవీంద్ర మే 10న తెలిపారు.

ఎన్ఎచ్ఆర్‌సి చైర్మన్‌గా జోసెఫ్

జాతీయ మానవ హక్కుల సంఘం తాత్కాలిక చైర్మన్‌గా జస్టిస్ సిరియన్ జోసెఫ్ మే 13న బాధ్యతలు స్వీకరించారు. పదవి విరమణ చేసిన కె.జి. బాలకృష్ణన్ స్థానంలో తాత్కాలిక చైర్మన్‌గా జస్టిస్ జోసెఫ్‌ను నియమించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ జోసెఫ్ 2013 మేలో ఎన్ఎచ్ఆర్‌సి సభ్యులుగా నియమించబడ్డారు.

ఉత్తర, తూర్పు భారతంలో భూకంపం

దేశంలోని ఉత్తర, తూర్పు రాష్ట్రాలలో ఏప్రిల్ 25-26 వరకు సంభవించిన భూకంపం వల్ల చనిపోయిన వారి సంఖ్య 69కి చేరింది. ఒక్క బిహార్‌లోనే 51 మంది చనిపోయారు. భూకంప లేఖినిపై 6.7 తీవ్రతతో నేపాల్‌లో రెండోసారి వచ్చిన భూకంపం కారణంగా ఢిల్లీ, పశ్చిమబెంగాల్, బిహార్, అస్సోం, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గడ్, త్రిపుర, రాజస్థాన్ తదితర చోట్ల 30 సెకన్లపాటు భూమి కంపించింది.

మావోయిస్టుగా ఉండడం తప్పుకాదు: హైకోర్టు

ఎవరైనా వ్యక్తి మావోయిస్టు కావడం తప్పు కాదని, ఆ వ్యక్తి మావోయిస్టు అనే ఒకే ఒక్క కారణంతో పోలీసులు నిర్బంధించకూడదని కేరళ హైకోర్టు మే 22న తీర్పునిచ్చింది. 'మావోయిస్టు కావడం నేరం కాదు. మావోయిస్టు రాజకీయ సిద్ధాంతం రాజ్యాంగంతో ఏకీభవించక పోయినప్పటికీ, మానవ ఆకాంక్షల ప్రకారం ప్రతి వ్యక్తి సొంతంగా ఆలోచించుకునే హక్కు ఉంటుంది' అని పేర్కొంది. అయితే, వ్యక్తులు కానీ, సంస్థలు కానీ హింసకు పాల్పడినట్లు తేలితేనే చర్యలు తీసుకోవచ్చు అని జస్టిస్ ఎ. మహ్మద్ ముస్తాక్ పేర్కొన్నారు.

తమిళనాడు సిఎంగా మళ్లీ జయలలిత

అవినీతి ఆరోపణల నుంచి బయటపడిన జయలలిత తమిళనాడు ముఖ్యమంత్రిగా ఐదోసారి మే 22న ప్రమాణ స్వీకారం చేశారు. మద్రాస్ యూనివర్సిటీలోని సెంటినరీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కొణిజేటి రోశయ్య, జయలలితతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమెతో పాటు 28 మంది ఎంఎల్ఎలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అక్రమాస్తుల కేసులో గత ఏడాది సెప్టెంబర్ 27న జయలలితను ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చి నాలుగేళ్ల శిక్ష విధించడంతో ఆమె సిఎం పదవికి రాజీనామా చేశారు. కర్ణాటక హైకోర్టు ఈ నెల 11న ఆమెను నిర్దోషిగా ప్రకటించింది.

ఢిల్లీకి గవర్నరే సర్వాధికారి

ఢిల్లీకి లెఫ్టినెంట్ గవర్నర్ సర్వాధికారి అని కేంద్రం తేల్చింది. ఈ మేరకు హోంశాఖ మే 22న 'రాజముద్ర' (గజిట్ నోటిఫికేషన్ జారీ) వేసింది. ఢిల్లీలో సేవలు, శాంతిభద్రతలు, పోలీసు, భూభాగ వ్యవహారాలన్నీ గవర్నర్ అధికార పరిధిలోనివేనని వివరించింది. అవసరమనుకుంటే తన విచక్షణ మేరకు సిఎంను ఆయన సంప్రదించవచ్చునని పేర్కొంది. నగరంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వోద్యోగులు, అధికారులమీద అవినీతి ఆరోపణలపై విచారణాధికారం ఢిల్లీ ప్రభుత్వ అవినీతి నిరోధక విభాగానికి (ఎసిబి) లేదని కూడా పేర్కొంది. దీనిపై ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ మండిపడ్డారు. వీ

నేపాల్ భూకంపం

ఏప్రిల్ 25న వచ్చిన భూకంపం నుంచి నేపాల్ క్రమంగా తేరుకుంటోంది. గత నెల రోజులుగా భూమి స్వల్పంగా కంపిస్తూనే ఉంది. దీంతో శిథిలమైన భవనాలు, ఇళ్లు నేలమట్ట మయ్యాయి. మే 12న మరోసారి భూకంపం వచ్చింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.3గా నమోదయింది. ఈ ప్రకంపనల ధాటికి నలభై మందికి పైగా మరణించారు. కాగా ఇప్పటివరకు భూకంపం వల్ల ఎనిమిది వేలకు పైగా మరణించారు. పదిహేను వేల మందికి పైగా గాయపడ్డారు. రెండున్నర లక్షలకు పైగా ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో రెండు లక్షలకు పైగా ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ భూకంపం వల్ల నేపాల్‌కు పది బిలియన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగినట్లు నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది.

బ్రిటన్‌లో కామెరాన్ విజయం

బ్రిటన్‌లో డేవిడ్ కామెరాన్ మరోసారి విజయం సాధించారు. దీంతో మరో ఐదేళ్ల పాటు ఆయన బ్రిటన్ ప్రధానిగా కొనసాగనున్నారు. బ్రిటన్ పార్లమెంట్‌లోని మొత్తం 650 సీట్లకు మే 7న ఎన్నికలు నిర్వహించారు. మే 8న ఫలితాలు వెల్లడించారు. ఈ ఫలితాల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ డేవిడ్ కామెరాన్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ పార్టీ 330 స్థానాలలో విజయం సాధించింది. ప్రతిపక్ష లేబర్ పార్టీకి 232 సీట్లు వచ్చాయి. స్కాటిష్ నేషనల్ పార్టీ 56 చోట్ల గెలవడంతో లేబర్ పార్టీ అవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ విజయంతో డేవిడ్ కామెరాన్ బ్రిటన్ ప్రధాని పీఠాన్ని మరోసారి అధిరోహించారు. మే 27న కొత్త పార్లమెంట్ కొలువుదీరనుంది.

పాకిస్తాన్‌లో దుర్ఘటనలు

పాకిస్తాన్‌లో మే 8న జరిగిన ఒక హెలికాప్టర్ దుర్ఘటనలో ఫిలిప్పీన్స్, నార్వే రాయబారులతో సహా ఆరుగురు మరణించారు. ప్రధాని నవాజ్ షరీఫ్ గిలిగిట్ - బాల్తిస్తాన్ ప్రాంతంలో ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తుండడంతో దానికి హాజరయ్యేందుకు మూడు హెలికాప్టర్‌లలో విదేశీ రాయబారులు, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్నారు. రెండు హెలికాప్టర్‌లు సురక్షితంగానే ల్యాండయినా, మూడోది గిలిగాట్ బాలిస్తాన్ ప్రాంతంలో కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో నార్వే రాయబారి లీఫ్‌హెయ్ లార్సెన్, ఫిలిప్పిన్స్ రాయబారి డోమింగో డి లుసెనారియో జూనియర్, మలేషియా, ఇండోనేషియా రాయబారుల భార్యలు మరణించారు. మే 13న జరిగిన దాడిలో కరాచీలో బస్సులో ప్రయాణిస్తున్న వారిపై ముగ్గురు ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి నలభై ఐదు మందిని హతమార్చారు.

మనీలా రబ్బర్ ఫ్యాక్టరీలో ప్రమాదం

ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలోని ఓ రబ్బర్ ఫ్యాక్టరీలో మే 13న సంభవించిన అగ్ని ప్రమాదంలో 72 మంది మరణించారు. వెల్డింగ్ యంత్రం నుంచి వచ్చిన నిప్పు రవ్వలు సమీపంలోని రసాయన పదార్థాల్లోకి వెళ్లి పేలుడు సంభవించి, మంటలు చెలరేగి ఈ దుర్ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఫ్యాక్టరీ ప్రధాన ద్వారానికి సమీపంలో పేలుడు సంభవించి, మంటలు క్రమంగా విస్తరించి పెద్ద ప్రమాదానికి దారి తీసిందని పోలీసులు తెలిపారు.

అమెరికా ఫ్రీడమ్ యాక్ట్‌కు ఆమోదం

అమెరికా ప్రజల వ్యక్తిగత అంశాలకు సంబంధించిన సమాచారాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తున్న 'పేట్రియాట్ యాక్ట్'కు కొన్ని కీలక మార్పులు చేస్తూ తెచ్చిన 'ఫ్రీడమ్ యాక్ట్'కు అమెరికా ప్రతినిధుల సభ మే 13న ఆమోదం తెలిపింది. నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఏ) నిర్వహించే నిఘా కార్యక్రమానికి కొన్ని పరిమితులు, నియంత్రణలు ఏర్పరుస్తూ కొత్త చట్టంలో మార్పు చేశారు. యుఎస్ఏ ఫ్రీడమ్ యాక్ట్‌కు ప్రతినిధుల సభలో 338 అంగీకారం తెలపగా, 88 మంది వ్యతిరేకించారు. అమెరికా ప్రభుత్వ నిఘా సంస్థల రహస్య ఆగడాలు, పోగు చేస్తున్న రహస్య సమాచారాన్ని, ప్రజల టెలిఫోన్ సంభాషణల రికార్డులను ఇష్టానురీతిగా పొందడాన్ని, టెలిఫోన్ డాటాపై కంపెనీలను ఆదేశించడాన్ని ఈ కొత్త చట్టం నియంత్రిస్తుందని అంచనా.

మహ్మద్ మోర్సీకి మరణశిక్ష

ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ మోర్సీకి కైరోలోని న్యాయస్థానం మే 16న మరణశిక్ష విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి షాబెన్-ఎల్-షామి తీర్పును వెలువరించారు. హోస్నీ ముబారక్ ఈజిప్ట్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో మోర్సీ మూడు జైళ్లను పడగొట్టిన కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో బ్రదర్‌హుడ్ ఉద్యమ ముఖ్యనేతలతో మరో 105 మంది నిందితులను కోర్టు దోషులుగా తేల్చింది. వారిపై 2011 జనవరిలో ఈజిప్ట్ జైలుపై దాడి చేసి జైలు భవనాన్ని ధ్వంసం చేసి నిప్పంటించి, జైలులో ఉన్న ఆయుధాలను ఎత్తుకెళ్లారు. జైలు అధికారులపై హత్యాయత్నం చేశారన్న అభియోగాలు ఉన్నాయి. ఈ దాడిలో కొంత మందిని చంపేశారని తెలిపింది. ఈ సంఘటనతో ఈజిప్ట్ జైలు నుంచి ఇరవై వేల మంది ఖైదీలు తప్పించుకుని, మాజీ అధ్యక్షుడు హోస్నీ ముబారక్‌ను అధ్యక్ష పీఠం నుంచి దించేందుకు కుట్ర పన్నారనీ, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడ్డారనీ అభియోగం మోపారు. ఈ ఘటనలో మోర్సీ దోషిగా తేలడంతో కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. కోర్టు తీర్పు అమలైతే ఉరికంభాన్ని ఎక్కిన తొలి ఈజిప్టు అధ్యక్షుడిగా మోర్సి పేరు నిలుస్తుంది. ఈ తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే రాజధాని కైరోలోని సినాయ్ ప్రాంతంలో న్యాయమూర్తుల వాహనాలపై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు న్యాయమూర్తులు మరణించారు.

సిరియాలో దాడులు

సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదుల దాడులలో వందలాది ప్రజల ప్రాణాలు పోతున్నాయి. పురాతన నగరమైన పామిరా ప్రాంతంలో రెండు వందలకు పైగా ప్రజలను వివిధ చోట్ల నుంచి తీసుకొచ్చి చంపేశారని సిరియా మానవ హక్కుల పర్యవేక్షణ బృందం ఆందోళన వ్యక్తం చేసింది. వీరిలో 67 మంది సాధారణ పౌరులు, 150 మంది సైనికులు ఉన్నారు. ఇందులో పిల్లలూ, మహిళలూ ఉన్నారు.

నైజీరియాలో బొకోహరమ్ దాడులు

నైజీరియాలో బొకోహరమ్ దళాల దాడులు తీవ్రం అవుతున్నాయి. క్రమంగా నైజీరియాలోని ప్రధాన పట్టణాలపై బొకోహరమ్ దళాల పట్టు బిగుస్తోంది. తాజాగా బోర్నో స్టేట్‌లోని గుబియో పట్టణంపై దాడి చేసి నాశనం చేశారు. బోర్నో స్టేట్ రాజధాని మైదుగురికి 95 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాదాపు సగానికి పైగా పట్టణాన్ని తగులబెట్టారు. ఇళ్లు ధ్వంసం చేశారు. దొరికిన వారిని దొరికినట్లు చంపేస్తున్నారు. అక్కడి ప్రభుత్వం వారిని ఏమాత్రం కట్టడి చేయలేకపోతోంది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30, 2015 వరకు తెలంగాణలోని 5 జిల్లాలు (702), ఆంధ్రప్రదేశ్‌లోని 5 జిల్లాలలో (490) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1192)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	2	-	14	16	5	7	6	2	2	3	2	1	2	26	32	-	-	-	3	6
మెదక్	12	4	4	9	8	12	6	4	-	12	18	19	19	14	16	13	-	4	-	6	8
కరీంనగర్																					
ఖమ్మం	-	-	-	4	12	3	9	-	-	-	-	4	3	7	15	20	-	-	-	-	12
మహబూబ్‌నగర్	-	8	2	15	24	12	10	5	6	8	10	12	16	15	56	8	-	-	-	-	3
రంగారెడ్డి																					
నిజామాబాద్	-	-	-	4	12	3	2	-	4	7	3	2	4	3	24	17	-	-	-	-	-
హైదరాబాద్																					
తెలంగాణ	**13**	**14**	**6**	**46**	**72**	**35**	**34**	**15**	**12**	**29**	**34**	**39**	**43**	**41**	**137**	**90**	**-**	**4**	**-**	**9**	**29**
అనంతపురం																					
చిత్తూరు	-	2	-	5	7	-	-	-	-	-	3	9	14	6	34	-	-	-	-	-	7
కడప	-	-	-	1	7	-	-	-	-	-	-	4	-	1	15	-	-	-	-	-	2
కర్నూలు	-	2	-	13	8	9	12	17	9	5	5	7	14	6	40	40	-	-	-	-	8
తూర్పు గోదావరి	-	1	-	3	5	6	1	-	-	1	-	2	1	2	40	18	-	2	-	-	-
ప్రకాశం																					
శ్రీకాకుళం																					
విశాఖపట్నం	-	-	-	8	16	2	-	-	2	1	5	1	8	2	26	11	-	-	-	9	5
ఆంధ్రప్రదేశ్	**-**	**5**	**-**	**30**	**43**	**17**	**13**	**17**	**11**	**7**	**13**	**23**	**37**	**17**	**155**	**69**	**-**	**2**	**-**	**9**	**22**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100
విధ్వంసకల అభివృద్ధి	డివిఎస్‌యు	180
భారతదేశంలో ఉత్పత్తి విధానం- ఉత్పత్తి సంబంధాలు	విరసం	20

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
తెలంగాణ జైత్రయాత్ర	ఘంటా చక్రపాణి	200
తెలంగాణ కాలజ్ఞాని ప్రొ. జయశంకర్	ఘంటా చక్రపాణి	20

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందువునెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70
రియాలిటీ చెక్	పూడూరి రాజిరెడ్డి	250
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75
దారులేసిన అక్షరాలు	భారతీయ మహిళల రచనలు	400

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	రు. 100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
24 గంటలు	కె.జి. కన్నబిరాన్	200
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం	125
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్దాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు ఆమరులు	విరసం ప్రచురణ	30
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220

కథ - నవల

దండకారణ్య కథలు(2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీదేవి ప్రేమ్‌చంద్	120
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
ఒండ్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 167 - June 2015 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/5/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16



Date of Posting : 29th, 30th
Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao